ఈనాడు

విజయవాడ 5-7-2025 శనివారం సిటీ సంపుటి 51 . సంచిక 326

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 24

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru





ఆషాడం వచ్చింది! ఆనందం తెచ్చింది!
1 కాదు, 2 కాదు లక్షల వెరైటీలు
అతితక్కువ ధరలకే
SUPER AASHADAM
K9 sale
అన్ని రకాల వస్త్రాల పై
Upto 70% OFF
తూకం పద్ధతిలో
చీరల అమ్మకం
ఈ ఆషాడంలో అతి తక్కువ ధరలకే
PER KG ₹400 PURE GEORGETTE SAREES
PER KG ₹500 PAVITRA SILK SAREES
PER KG ₹600 PATIYALA SILK SAREES
PER KG ₹800 ANIKA PATTU / NEELAM SILK SAREES
PER KG ₹950 JK PATDLA SILK SAREES
PER KG ₹1000 IKKAT SILK SAREES
PER KG ₹1100 ARMANI / SALONI SILK SAREES
PER KG ₹1200 ANU SILVER SILK SAREES
PER KG ₹1800 RM SILK SAREES
SUPER AASHADAM K9 sale
AASHADAM SPECIAL PATTU SAREES
PER KG ₹1500 VASTRAKALA PATTU SAREES
PER KG ₹2300 PACIDI/LEPAKSHI PATTU SAREES
PER KG ₹2700 EKKATH PATTU SAREES
DESIGNER SAREES
1150 ₹345 DESIGNER SAREE COLLECTION
1250 ₹375 DESIGNER SAREE COLLECTION
1350 ₹405 DESIGNER SAREE COLLECTION
1450 ₹435 DESIGNER SAREE COLLECTION
1650 ₹495 DESIGNER SAREE COLLECTION
DESIGNER SAREE COLLECTION 70% OFF KOLKATA WORK SAREES
LADIES WESTERN WEAR & LEISURE WEAR
Buy 4 ₹500 NIGHTY
Buy 2 ₹999 COTTON DRESS MATERIAL
Buy 3 ₹1499 PATIYALA SUIT SET
Buy 3 ₹1599 PLAZZO SUIT SET
Buy 2 ₹1999 LEHANGAS
Buy 1 ₹245 GIRLS COTTON FROCKS
Buy 3 ₹695 GIRLS COTTON FROCKS
Buy 1 ₹445 GIRLS NIGHT WEAR
Buy 2 ₹795 GIRLS NIGHT WEAR
Buy 4 ₹450 BOYS SHORTS
Buy 5 ₹500 GIRLS T-SHIRTS
BOYS WEAR
Buy 1 ₹295 Buy 3 ₹745 BOYS T-SHIRT-NICKER
Buy 1 ₹445 Buy 2 ₹795 BOYS NIGHT WEAR
₹600 BOYS SHORTS
Buy 4 ₹550 BOYS SHORTS
895 ₹448 BOYS CAPRI
Buy 4 ₹600 BOYS 3/4 PAJAMA
695 ₹348 BOYS SHIRTS 645 ₹323
1295 ₹648 BOYS PANTS 1195 ₹598
GIRLS WEAR
Buy 4 ₹550 GIRLS T-SHIRTS
Buy 3 ₹550 GIRLS SHORTS
Buy 4 ₹595 BOYS T-SHIRTS
Buy 4 ₹600 GIRLS SHORTS
Buy 4 ₹650 GIRLS 3/4 PYJAMA
50% OFF GIRLS SKIRTS
MENS WEAR
PETER ENGLAND Buy 1 25% OFF
celio* Buy 1 30% OFF
COOLCOLORS FLAT 50% OFF
Arrow Allen Solly Levi's Buy 3 Get 3FREE
Louis Philippe U.S. POLO ASSN. Buy 3 Get 2FREE
Buy 1 40% OFF
VAN HEUSEN FLAT 40% OFF
benetton Buy 3 40% OFF
PAN AMERICA OXEMBERG Get Duffle Bag worth ₹1299 @ RS.199 on shopping Value of ₹2499
ADAM PARKER CLASSIC POLO Buy 2 Get 1FREE
Celebrity WHITE HOUSE ROCKSTAR JEANS RARE RABBIT EXPRESSIONS e-mail FLYING MACHINE OPTIONS INDIAN TERRAIN ADAM PARKER 20% OFF
BLACKBERRYS Buy 2 Get 2 FREE
Buy 1 @695 Buy 3@1800 DENIM, COTTON, CASUAL SHIRTS & TROUSERS
COMBO OFFER
Buy 1 @595 Buy 3@1500 DENIM, COTTON, CASUAL SHIRTS & TROUSERS
Buy 1 @795 Buy 3@2000
DIGJAM Arvind GIZA HOUSE LINEN CLUB Raymond OCM SIYARAMS
SUITING & SHIRTING 50% OFF
కంచి పట్టు చీరలు
కంచి సొసైటీ ధరలకే అమ్మకం
ధర్మవరం, ఆరణి, కంచి, ఉప్పాడ, పైతాని, పోచంపల్లి, పటోళ, రాజ్‌కోట్,
జైపూర్, కోల్‌కత్తా, బెనారస్, ఫ్యాన్సీ, డిజైనర్ శారీస్, క్యాట్‌లాగ్ శారీస్.
మెన్స్ ఎత్నిక్ వేర్ & కిడ్స్‌వేర్ పై అద్భుతమైన ఆఫర్లు.
R.S. Brothers™
బీసెంట్ రోడ్ క్రాస్, ఏలూరు రోడ్ విజయవాడ
బందర్ రోడ్ విజయవాడ
TOLL FREE 1800 570 1999
Email : info@rsbrothers.net | Shop us @ www.rsbrothers.net Follow us on : RSBrothersIndia rsbrothersindia

ఈనాడు

విజయవాడ 5-7-2025 శనివారం సిటీ సంపుటి 51 . సంచిక 326 | THE LARGEST CIRCULATED TELUGU DAILY | రూ. 6-50 పేజీలు 24 | www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru


JOS ALUKKAS
A TRADITION OF FINE JEWELLERY
ఫ్లాట్
50%
తగ్గింపు
బంగారు ఆభరణాల తరుగు ఛార్జీలపై
*షరతులు వర్తిస్తాయి
JOS ALUKKAS
Mega Discount Festival
వజ్రాలపై
25%
వరకు
తగ్గింపు
త్వరపడండి! ఈ ఆఫర్ జులై 13 వరకు మాత్రమే.
OPP: RADIO STATION, M.G. ROAD, VIJAYAWADA. PH: 0866-2475916
ROAD NO.4/9, BRODIPET, GUNTUR. PH: 0863-2241916
MINI BYPASS ROAD, NELLORE. PH: 0861 – 2353916
జోస్ ఆలుక్కాస్
A TRADITION OF FINE JEWELLERY
josalukkasonline.comలో షాపింగ్ చేయండి



ఈనాడు



విజయవాడ 5-7-2025 శనివారం సిటీ సంపుటి 51 . సంచిక 326
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 24
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



రియర్ అడ్మిరల్ జనక్ బెవ్లీ చేతుల మీదుగా 'వింగ్స్ ఆఫ్ గోల్డ్' పురస్కారం అందుకుంటున్న ఆస్థా పూనియా

నౌకాదళంలో మహిళా ఫైటర్ల శకం ఆరంభం

తొలి ఫైటర్ పైలట్‌గా ఆస్థా పూనియా

విశాఖపట్నం(సింధియా), న్యూస్‌టుడే: నౌకాదళంలో మహిళా ఫైటర్ పైలట్ల చేరికతో కొత్త శకం ఆరంభమైందని.. అసిస్టెంట్ చీఫ్ ఆఫ్ నేవల్ స్టాఫ్ రియర్ అడ్మిరల్ జనక్ బెవ్లీ అన్నారు. నేవీ ఏవియేషన్‌లో ఆస్థా పూనియా దేశంలోనే తొలి మహిళా ఫైటర్ పైలట్‌గా నిలిచారని ప్రశంసించారు. ఆమె భవిష్యత్తులో మిగ్-29కె లేదా నౌకాదళ రఫేల్ యుద్ధ విమానాలను నడిపే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దానికి ముందు ఆమె యుద్ధ విమానాలు నడపడంలో శిక్షణ (మిగతా 6లో)

కేంద్ర కొలువులపై ఎందుకీ అనాసక్తి?

- ఏటా వెలువడుతున్న నోటిఫికేషన్లు.. ఆకర్షణీయ జీతాలు
- అయినా.. మొగ్గుచూపని తెలుగు రాష్ట్రాల యువత
- ఉద్యోగ నియామక పరీక్షల్లో తెలుగులోనూ ప్రశ్నలు
- సద్వినియోగం చేసుకుంటే మేలు



ఈనాడు, అమరావతి: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల సాధనపై తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు పెద్దగా దృష్టి పెట్టడం లేదు. స్టాఫ్ సెలక్షన్ కమిషన్, కంబైన్డ్ హయ్యర్ సెకండరీ లెవల్, కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్, మల్టీ టాస్కింగ్ స్టాఫ్ తదితర ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్లకు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్దగా దరఖాస్తు చేయడం లేదు. డిగ్రీ, ఇంటర్, పదో తరగతి విద్యార్హతలతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు పొందే వీలున్నా.. స్పందన తక్కువగానే ఉంటోంది. విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించేందుకు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేసేందుకు దేశం దాటి వెళ్తున్నారు. చిన్నా, చితకా ఉద్యోగాలు వెతుక్కుంటూ గల్ఫ్ దేశాల బాటా పడుతున్నారు. రాష్ట్రస్థాయి పబ్లిక్ సర్వీస్ కమిషన్ల నుంచి వెలువడే ఉద్యోగ ప్రకటనలకు భారీగా దరఖాస్తు చేస్తున్నారు. అయితే.. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల విషయంలో మాత్రం తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు పెద్దగా ఆసక్తి కనబర్చకపోవడం చర్చనీయాంశంగా మారింది. దరఖాస్తు చేసిన వారిలోనూ పరీక్షలు రాసే వారు తక్కువగా ఉంటున్నారు. దీనివల్ల ఆయా ఉద్యోగాలకు ఎంపికవుతున్న వారి జాబితాల్లో తెలుగు అభ్యర్థులు 3% నుంచి 5% లోపే ఉంటున్నారు. డిగ్రీ అర్హతతో గ్రూప్-2 కేటగిరిలో రాష్ట్రంలో 897 పోస్టుల భర్తీకి 2023లో నోటిఫికేషన్ వెలువడగా 4.83 లక్షల మంది దరఖాస్తు చేశారు. ఈ స్థాయిలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు మాత్రం ఆసక్తి చూపడం లేదు. దక్షిణాదిన తమిళనాడుకు చెందిన అభ్యర్థులు కేంద్రం కొలువులను దక్కించుకోవడంలో ముందుంటున్నారు. (మిగతా 6లో)



రెవెన్యూశాఖపై సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రి సత్యప్రసాద్, అధికారులు

ఆగస్టుకల్లా కొత్త పాస్ పుస్తకాలు

- రీసర్వే పూర్తయిన గ్రామాల్లో అందించాలి
- సచివాలయాల్లో వారసత్వ భూముల భాగస్వామ్య రిజిస్ట్రేషన్లు
- పేదలకు ఇళ్లు, జర్నలిస్టుల స్థలాల కోసం మంత్రులతో కమిటీ
- రెవెన్యూ శాఖపై సమీక్షలో సీఎం

ఈనాడు, అమరావతి: "వారసత్వ భూముల సంక్రమణ భాగస్వామ్య (సక్సెషన్) రిజిస్ట్రేషన్లను రూ.100 రుసుముతో గ్రామ/ వార్డు సచివాలయాల్లోనే పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలి. సదరు ఆస్తి విలువ రూ.10 లక్షలు దాటితే రూ.1,000 ఫీజు తీసుకోవాలి. యజమాని మరణించాక జరిగే వారసత్వ సంక్రమణ భాగస్వామ్య రిజిస్ట్రేషన్లే సచివాలయాల్లో చేయాలి. ఈ మేరకు గ్రామ/వార్డు సచివాలయాల సిబ్బందికి అధికారాలు ఇవ్వాలి" అని రెవెన్యూ అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో భూయజమానులకు ఆగస్టు నాటికి కొత్త పట్టాదారు పాసు పుస్తకాలను అందించాలని సూచించారు. "రాష్ట్రంలో అర్హులైన పేదలకు ఇంటిస్థలాల పంపిణీ రెండేళ్లలో జరగాలి. మరో రెండేళ్లలో ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి. దీని ప్రకారం రానున్న నాలుగేళ్లలో ప్రతి ఒక్కరికీ ఇల్లు లక్ష్యాన్ని చేరుకోవాలి. పేదలకు ఇళ్లు, జర్నలిస్టులకు ఇంటి (మిగతా 6లో)

కుత్తుకలు కోస్తామంటే బెదిరిపోం

ప్రజల్ని భయపెట్టడం వల్లే వైకాపాకు 11 సీట్లు

2029 ఎన్నికల్లో మళ్లీ ఎలా గెలుస్తారో మేమూ చూస్తాం..

మార్కాపురం సభలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

రూ.1,290 కోట్లతో జలజీవన్ పనులకు శంకుస్థాపన



ప్రకాశం జిల్లా మార్కాపురం సభలో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

ఈనాడు, ఒంగోలు: రౌడీయిజం చేస్తాం.. గూండాగిరీ చేస్తామంటూ వైకాపా నాయకులు బెదిరింపులకు దిగుతున్నారని, వారి తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదని ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ స్పష్టంచేశారు. అధికారంలో ఉన్నప్పుడు అందరినీ ఇలా భయభ్రాంతులకు గురి చేయడం వల్లే గత ఎన్నికల్లో ఆ పార్టీ 11 సీట్లకు పరిమితమైందని ఎద్దేవా చేశారు. కుత్తుకలు కోస్తాం.. మళ్లీ అధికారంలోకి వస్తాం.. అనే భావనలో ఉన్నారని, వారెలా అధికారంలోకి వస్తారో తామూ చూస్తామని పవన్ సవాల్ చేశారు. ఇలాంటి (మిగతా 6లో)

చావనైనా చస్తాంగానీ.. భూములివ్వం

- ఇండోసోల్‌కు భూసేకరణపై రైతుల ఆందోళన
- నెల్లూరు జిల్లా కరేడులో రసాభాసగా గ్రామసభ



ఇండోసోల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న రైతులు, గ్రామస్థులు

ఈనాడు, నెల్లూరు: కందుకూరు పట్టణం, ఉలవపాడు, న్యూస్‌టుడే: ఇండోసోల్ కంపెనీకి భూసేకరణ నిమిత్తం శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని కరేడు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభ రసాభాసగా మారింది. భూములు ఇచ్చేది లేదని రైతులు తెగేసి చెప్పారు. సభను మధ్యలోనే అడ్డుకున్నారు. తమకు మాట మాత్రమైనా చెప్పకుండా ఇండోసోల్ పరిశ్రమకు భూముల కేటాయింపునకు నిర్ణయం తీసుకుని, ఇప్పుడు తీరికగా గ్రామసభలు పెట్టడమేంటని అధికారులను నిలదీశారు. తమ అనుమతి లేకుండా పరిశ్రమకు ఒక్క ఎకరమూ కేటాయించేందుకు వీల్లేదని స్పష్టంచేశారు. కందుకూరు సబ్‌కలెక్టర్ శ్రీపూజ ఆధ్వర్యంలో (మిగతా 6లో)



ముగ్గురితో పోరాడాం

నేరుగా యుద్ధం చేసింది పాకిస్థానే కానీ..

హాని చేయాలని చూసింది చైనా.. తుర్కియేదీ కీలక పాత్రే

81 శాతం పాక్ సైనిక పరికరాలు డ్రాగన్‌వే

'ఆపరేషన్ సిందూర్'పై సైనిక ఉప ప్రధానాధికారి రాహుల్

దిల్లీ: 'ఆపరేషన్ సిందూర్' సమయంలో భారత్‌ను దెబ్బతీయడానికి పాకిస్థాన్‌ను చైనా పూర్తిగా వినియోగించుకుందని సైనిక ఉప ప్రధానాధికారి లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ ఆర్.సింగ్ పేర్కొన్నారు. శుక్రవారం ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఫిక్కీ) నిర్వహించిన 'న్యూ ఏజ్ మిలిటరీ టెక్నాలజీస్' సదస్సులో ఆయన 'ఆపరేషన్ సిందూర్' సమయంలో నెలకొన్న పరిణామాలపై మాట్లాడారు. ముఖ్యంగా చైనా పాత్రను తీవ్రంగా విమర్శించారు. భారత్-పాక్ ఘర్షణను బీజింగ్ తన ఆయుధ వ్యవస్థలను పరీక్షించుకోవడానికి ఓ ప్రయోగశాలగా వాడుకుందని అన్నారు. భారత్‌కు హాని చేసేందుకు పాకిస్థాన్‌కు అవసరమైన సహాయ సహకారాలను చైనా అందచేసిందని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ నుంచి భారత్ నేర్చుకోవాల్సిన పాఠాలు కూడా ఉన్నాయని తెలిపారు. "మనకు సరిహద్దు (మిగతా 6లో)




youthpage@eenadu.in

ఈతరం

ఈనాడు విజయవాడ, శనివారం జులై 5, 2025 1

బీట్ కొట్టు.. సంతోషం పట్టు!




మ్యూజిక్ అంటే కేవలం బీట్ కాదు బ్రో.. అది మన హృదయాన్ని నేరుగా తాకే వైబ్. ముఖ్యంగా కుర్రాళ్లకి! కాలేజీ ఫెస్ట్‌లో డీజే అయినా, అర్ధరాత్రుళ్లు ఇయర్‌ఫోన్స్ పెట్టుకొని సోల్‌ఫుల్ మెలోడీలు వినడమైనా.. సంగీతం అంటేనే చాలామందికి ప్రాణం. వీటితో పాటు ఇంకొన్ని మీకు తెలియని సంగతులూ ఉన్నాయండోయ్..

- మనసు బాధగా ఉంటే.. మూడ్ అసలే బాగా లేకపోతే ఒక్కసారి మీకు నచ్చిన సంగీతం వినండి. దెబ్బకి మీ మూడ్ మారిపోవడం ఖాయం. ఎందుకంటే మ్యూజిక్ వింటుంటే.. శరీరంలో హ్యాపీ కెమికల్ 'డోపమిన్' అధికంగా విడుదల అవుతుందని సైన్స్ చెబుతోంది.
- అమ్మాయిలు, అబ్బాయిలందరూ మాటకారులు కారుగా. కొందరు తమ మనసులోని భావాల్ని సరిగ్గా వ్యక్తం చేయలేరు. అలాంటివారు తమ గుండెలోని మాటల్ని పాటల్లో వెతుక్కుంటారు. హృదయం పగిలిపోవడం, చిన్ననాటి జ్ఞాపకాలు, ఆనందం.. ఈ భావోద్వేగాలని అంతర్ముఖులూ బాగా ఆస్వాదిస్తారు.
- చదువన్నా, పని చేయడమన్నా చాలామందికి బోర్. అరగంట కూర్చోగానే అసౌకర్యంగా ఫీలవుతారు. ఏకాగ్రత కుదరదు. ఇలాంటివాళ్లు మంద్రమైన సంగీతం వింటుంటే.. ఏకాగ్రతకు భంగం కలిగించే ఇతర వ్యాపకాలకు లోను కారు. అందుకేగా.. కాఫీ షాపులు, రెస్టరంట్లలో లిరిక్స్‌లేని సంగీతం ఎప్పుడూ వినిపిస్తూనే ఉంటుంది.
- మ్యూజిక్ ఒక మ్యాజిక్ థెరపీలా పని చేయడమే కాదు.. మనసుల్నీ కలుపుతుంది. స్నేహాల్ని పెంచుతుంది. ఒకే కళాకారుడు, మ్యూజిషియన్‌ని ఇష్టపడే ఇద్దరి మధ్య సహజంగానే అనుబంధం పెరుగుతుంది.

మిసైల్‌పై.. మనసై!

'ఆపరేషన్ సిందూర్' తర్వాత మన సత్తా ఏంటో ప్రపంచానికి తెలిసింది... ఆ ఘటనలో ఉగ్ర స్థావరాలు నేలమట్టం చేయడంలో, శత్రు దేశ వైమానిక స్థావరాల్ని దెబ్బ తీయడంలో మన క్షిపణులు కీలక పాత్ర పోషించాయి. వీటిని సొంతం చేసుకోవడానికి పలు దేశాలు ఆసక్తి చూపిస్తున్నాయి... ఈ మిసైళ్ల తయారీలో మన తెలుగు యువ శాస్త్రవేత్త వీరగోని సందీప్ పాత్ర ఉండటం విశేషం. పేద కుటుంబంలో పుట్టినా.. దేశం గర్వించదగ్గ పనిలో నిమగ్నమైన అతడి ప్రయాణం యువతకు స్ఫూర్తిదాయకం.



ఏ రోజు పని చేస్తే, ఆ రోజు గడిచేంత పేద కుటుంబం సందీప్‌ది. సొంతూరు వరంగల్ జిల్లా గీసుకొండ. పది వరకూ ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువు. ఇంటర్‌లో జిల్లాలోనే మొదటి ర్యాంకు సాధించాడు. తనకిష్టమైన ఏరోనాటికల్ ఇంజినీరింగ్‌ని చెన్నైలో అన్నా యూనివర్సిటీలో చేయాలి అనుకున్నాడు. చదువులో మేటి అయినా ఫీజులు, ఖర్చులు, వసతి.. అంటే మాటలు కాదుగా. ఆ సమయంలో దాతలే ఆదుకున్నారు. తోచినంత ఆర్థిక సాయం చేశారు. ఆ దాతృత్వానికి విలువ ఉండాలనే ఉద్దేశంతో కష్టపడి చదివాడు. మంచి మార్కులతో ఇంజినీరింగ్ పూర్తి చేశాడు.

30వేల మందితో పోటీ



ముందునుంచీ అతడి లక్ష్యం ఆకాశాన్ని అందుకోవడం. శత్రు దేశాల గుండెల్లో క్షిపణులు దించడం. ఈ విషయంలో అబ్దుల్ కలామే అతడికి స్ఫూర్తి. ఆ అవకాశం తొందరగానే వచ్చింది. సందీప్ బీటెక్ పూర్తైన సమయంలోనే హైదరాబాద్‌లోని భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో)లో రెండు శాస్త్రవేత్తల ఉద్యోగాల భర్తీకి ప్రకటన వెలువడింది. కానీ దాదాపు 30 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. పోటీ తీవ్రంగా ఉన్నా తనకున్న ప్రతిభ, ప్యాషన్ కారణంగా ఆ కొలువుకు ఎంపికయ్యాడు సందీప్. 'బి' గ్రేడ్ శాస్త్రవేత్త అయ్యాడు. ఈ పదేళ్లలో అనేక రకాల క్షిపణుల తయారీలో భాగస్వామిగా ఉంటూ రెండుసార్లు పదోన్నతి పొందాడు.

> "డీఆర్‌డీవో అంటే మహామహులు అనదగ్గ శాస్త్రవేత్తలు పని చేసిన ప్రతిష్ఠాత్మక సంస్థ. ఇక్కడ పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో అధునాతనమైన టెక్నాలజీతో పెద్ద ఎత్తున క్షిపణులను తయారు చేస్తున్నాం. తయారైన మిసైళ్లు విదేశాలకు సైతం ఎగుమతి అవుతున్నాయి. ఇలాంటి కీలకమైన పని చేయడం, దేశ రక్షణలో పాలుపంచుకోవడాన్ని గర్వంగా భావిస్తున్నా'.




కీలక క్షిపణి తయారీలో..

గతేడాది నవంబరు 16న భారత్ మొదటిసారి లాంగ్ రేంజ్ యాంటీ షిప్ మిసైల్ (ఎల్ఆర్ఏఎస్‌హెచ్ఎం)ని విజయవంతంగా పరీక్షించింది. ఇది హైపర్‌సోనిక్ గ్లైడ్ వెపన్. శబ్దవేగానికి ఐదురెట్ల వేగంతో, 1,500 కిలోమీటర్లకుపైగా లక్ష్యాల్ని సైతం అవలీలగా ఛేదిస్తుంది. ఇంతకుముందు ఈ టెక్నాలజీ అమెరికా, రష్యా, చైనాల దగ్గర మాత్రమే ఉండేది. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో 10 మంది భారత శాస్త్రవేత్తలు దీన్ని తయారు చేశారు. ఆ బృందంలో సందీప్ ఒకడు. ఈ ప్రతిష్ఠాత్మక మిసైల్‌ని విజయవంతంగా ప్రయోగించడంతో దేశ రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ శాస్త్రవేత్తలందరినీ ప్రత్యేకంగా అభినందించి, పురస్కారం అందజేశారు. 'ఆపరేషన్ సిందూర్' పాక్ ఉగ్ర స్థావరాలను నేలమట్టం చేసిన ఆకాశ్ క్షిపణి తయారీలోనూ పాలుపంచుకున్నట్టు సందీప్ తెలిపాడు. స్వల్పశ్రేణి లక్ష్యాలను ఛేదించగలిగే క్విక్ రియాక్షన్ సర్ఫేస్ టు ఎయిర్ మిసైల్ (క్యూఆర్ఎస్ఏఎం) రూపకల్పనలోనూ అతడి పాత్ర ఉంది.

- కోల కృష్ణమూర్తి గౌడ్, గీసుకొండ

కొంటె కొటేషన్



- చేజిక్కిన సూర్యుడు... బంతాట ఇక షురూ!
  - వల్లూరి గీత, సత్తెనపల్లి
- నింగిలోని సూరీడు... చేతికి చిక్కెను చూడు!
  - ఇసికేల సావిత్రి, తాడిపత్రి
- సూర్యుడితో వద్దు ఆట... వేడితో తీస్తాడు నీ తాట!
  - అభిరామ్, దూసి
- ఆకాశాన భాస్కరుడు... నా చేతికి అందేను చూడు!
  - చిట్టంపల్లి అంజలి, హైదరాబాద్
- బంతిలా కనిపించిన భానుడు... భ్రాంతిలా చూపించిన బాలుడు!
  - ఆరే రాకేశ్, మారంపల్లి
- చూడు బాస్ నా టాలెంట్... సూర్యుడైనా నా చేతిలో కంటెంట్!
  - వెంకట నిఖిత, తిరుపతి
- సుప్రభాత సూరీడు... కుర్రాడి చంకనెక్కాడు!
  - ఓ.నివాస్, తిరుపతి



ఈ ఫొటోకి మీ సరదా వ్యాఖ్యలు రాసి పంపండి. బాగున్నవి ప్రచురిస్తాం.

పరుగెత్తించే యాప్..

వద్దు వద్దంటూనే రీల్స్ తెగ చూస్తుంటాం. కాదూ కూడదనుకుంటూనే సామాజిక మాధ్యమాల్లో మునిగిపోతాం. గంటలకొద్దీ ఫోన్‌తో గడిపేస్తుంటాం. ఇలా చేస్తే ఏమవుతుంది? చదువు అటకెక్కుతుంది. పని మూలన పడుతుంది. సమయం హరించుకుపోతుంది. కళ్లకీ అపాయమే. 'ఇలా చేయొద్దు' అనుకుంటూనే, చేసేవాళ్లు ఎంతోమంది. తమని తాము నియంత్రించుకోలేనివాళ్లు దీన్ని ఆపేదెలా? సింపుల్.. 'స్టెప్పిన్' అనే యాప్‌ని ఫోన్‌లో నిక్షిప్తం చేసుకుంటే చాలు. ఇది మిమ్మల్ని అదుపులో పెట్టేస్తుంది. నడక, పరుగు, వ్యాయామం.. ఇలాంటి టాస్కులు పూర్తి చేస్తేగానీ ఫోన్‌లో



యాప్‌లు తెరుచుకోవు. వ్యాయామంతో ఒంట్లో కరిగిన కేలరీలను లెక్కేశాకే.. ఇన్‌స్టా, వాట్సప్, నెట్‌ఫ్లిక్స్‌లాంటివి కొంతసేపు వాడుకునేలా అనుమతినిస్తుంది. ఫోన్ వాడకంలో స్వీయ నియంత్రణ లేనివాళ్లు, యాప్‌ని డౌన్‌లోడ్ చేసుకొని.. ఫోన్, బ్లూటూత్‌లతో అనుసంధానించుకుంటే చాలు. మీ శరీరాన్ని, అది మానిటర్ చేస్తూనే ఉంటుంది.

తెలివైన హెల్మెట్..

షాపింగ్‌కి, సామాజిక మాధ్యమాలకీ, సాంకేతికతకీ.. ఇప్పుడు అన్నింటికీ ఎడాపెడా కృత్రిమ మేధ(ఏఐ)నే వాడేస్తున్నాం. మరి బైకర్ల ప్రాణం కాపాడే శిరస్త్రాణానికీ ఈ టెక్నాలజీ లేకపోతే ఎలా? ఇలాగే అనుకుంది ఇంటెలిజెంట్ క్రేనియం అనే కంపెనీ. దాని ఫలితమే.. ప్రపంచంలోనే మొట్టమొదటి స్మార్ట్ హెల్మెట్. సాధారణంగా మనం హెల్మెట్ పెట్టుకుంటే ముందువైపు మాత్రమే చూడగలం. కానీ దీని ప్రత్యేకత ఏంటంటే.. పనోరమిక్ యాక్షన్ కెమెరా సాయంతో 300 డిగ్రీల కోణంలో కూడా చూడొచ్చు. అంటే ముందు, ఇరుపక్కలతోపాటు దాదాపు వెనకవైపు కూడా ఏమున్నాయో తెలిసిపోతుంది. దీంతో బ్లైండ్ స్పాట్‌లలో తరచూ జరిగే ప్రమాదాలను నివారించవచ్చు. రైడర్‌లో 15 సెకన్లపాటు ఎలాంటి చలనం లేకపోతే ఆటోమేటిగ్గా అత్యవసర నెంబర్లకు కూడా ఫోన్ వెళ్లిపోతుంది. ప్రాక్సిమిటీ అలర్ట్, లేన్ డిపార్చర్ అలారమ్ ఉండటంతో.. ఎప్పుడైనా లేన్ దాటుతున్నా, తప్పుడు మలుపులు తీసుకుంటున్నా సెన్సర్లు పసిగట్టి హెచ్చరిస్తాయి.



73 లక్షల కోట్లు..

భారత్‌లో 35 ఏళ్లలోపు యువత ఖర్చు పెట్టే మొత్తం ఇది! చాలా ఎక్కువ కదూ!! అందులోనూ కుర్రకారు 47శాతం ఫ్యాషన్, లైఫ్‌స్టైల్ మీదే వెచ్చిస్తున్నారట. మరో పదేళ్లలో ఇది మూడింతలు అయ్యే అవకాశం ఉందని 'ఫైబర్2 ఫ్యాషన్' అనే సంస్థ అధ్యయనంలో తేలింది.

ఆమె కలలకు.. రెక్కలు తొడగాలి!

మనసులో మాట



విశాఖపట్నంలో బీచ్ పక్కనే మా కాలేజీ. ఓ సాయంత్రం నేను, లక్ష్మి క్యాంటీన్‌లో కూర్చొని కబుర్లు చెప్పుకొంటున్నాం. మేమిద్దరం బీటెక్ మెకానికల్ థర్డియర్. సముద్రపు గాలి మా మేనితో సయ్యాటలాడుతోంది. మా ఎదురుగా టేబుల్‌పై కాగితాలు, స్కెచ్‌లు, పెన్సిళ్లు.. వాటితోపాటు మా హృదయాల్లో దాగిన కలలు చిందరవందరగా పడి ఉన్నాయి. లక్ష్మి మా క్లాస్‌లో టాపర్. తన కళ్లలో ఎప్పుడూ ఓ మెరుపు ఉంటుంది. అది తన మార్కుల కంటే ఎక్కువే చెబుతుంటుంది. ఆ కళ్లలో ఒక కల, ఒక ఆశ, లక్ష్యం చేరాలనే తపన ఎప్పుడూ కనిపిస్తుంటాయి.

'కిరణ్.. మనం నిజంగానే ఈ డ్రోన్ తయారు చేయగలమని నమ్ముతున్నావా?' అంది ఆకాశంవైపు చూస్తూ. నేను ఒక్క క్షణం ఆలోచించి 'లక్ష్మీ.. ఈ క్యాంపస్‌లోనే నేను కలలు కనడం నేర్చుకున్నాను. నువ్వు నా పక్కనుంటే అవి తప్పకుండా నిజం అవుతాయనే నమ్మకం ఉంది' అన్నాను నవ్వుతూ. ప్రాజెక్ట్ వర్క్ కోసం మేమిద్దరం కలిసి ఒక డ్రోన్ తయారు చేస్తున్నాం. దాన్ని ఒక జాతీయస్థాయి పోటీలో ప్రదర్శించాలనేది మా ప్లాన్. ఈ ప్రాజెక్టు కారణంగానే లక్ష్మితో నా సాన్నిహిత్యం పెరిగింది.

లక్ష్మి జీవితంలో ఒక బరువైన కథ ఉంది. ఆమె నాన్న ఒక సాధారణ రైతు. పొలం గట్టుపై కూతురిని పక్కనే కూర్చోబెట్టుకొని ఆకాశంలో ఎగిరే పక్షుల గురించి చెప్పేవారట ఆయన. 'తల్లీ.. నువ్వు పెద్దయ్యాక ఆ పక్షుల్లాగే ఎగిరే యంత్రాలు తయారు చేయాలి' అనేవారట. కానీ విధి క్రూరమైంది. లక్ష్మి కాలేజీలో చేరేలోపే ఈ లోకాన్ని విడిచి వెళ్లిపోయారు. క్యాంటీన్‌లో అదే విషయం చెబుతూ.. 'కిరణ్, ఈ డ్రోన్ మా నాన్న కల కూడా. ఆయన నాకు ఆకాశం చూపించారు. నేను దాన్ని తాకాలి అనుకుంటున్నాను' అంది. ఆ మాటలు నా గుండెని తడిమాయి. ఆ రోజే ఆమె కల నా లక్ష్యమైంది. తను లెక్కల్లో నన్ను గైడ్ చేసేది. నేను ఆమెకు డిజైన్‌లో కొత్త ఐడియాలు చెప్పేవాడిని. మా మాటలు చాలాసార్లు సబ్జెక్టుపైనే ఉండేవి. కొన్నిసార్లు జోక్స్ వేసుకొని హాయిగా నవ్వుకునేవాళ్లం. క్యాంటీన్‌లో కాఫీ కప్పులతో, లైబ్రరీలో బుక్స్ మధ్య, వర్క్‌షాప్‌లో పనిముట్లతో.. ఒకరి కలలను ఇంకొకరం బలపరుచుకునేవాళ్లం. ఒకరి బలహీనతలను మరొకరం భర్తీ చేసేవాళ్లం.

పోటీ రోజు రానే వచ్చింది. మా డ్రోన్ ఆకాశంలో ఎగిరింది. ఆ క్షణం మా కలలకు రెక్కలు తొడిగినట్టు అనిపించింది. నాలుగైదు నెలల కష్టం ఫలించినట్టే అనిపించింది. కానీ.. ఒక టెక్నికల్ గ్లిచ్‌తో కొద్దిదూరం ఎగిరిన డ్రోన్ నేలకూలిపోయింది. మా ఆశలూ నేలకూలినంత బాధేసింది. నాకు కన్నీళ్లాగలేదు. బాధతో లక్ష్మివైపు చూశాను. ఆమె కళ్లలో ఓటమి బాధే లేదు. 'కిరణ్.. మన డ్రోన్ దారి తప్పిందేమోగానీ.. మా నాన్న కల ఇప్పటికీ సజీవంగానే ఉంది. మనం మరోసారి ప్రయత్నిద్దాం.. తప్పకుండా గెలుస్తాం..' అంది, నా భుజంపై చేయేస్తూ. పరీక్షలో తప్పి, వెక్కివెక్కి ఏడుస్తున్న పిల్లాడిని ఓదార్చుతున్నట్టుగా ఉందా మాట. తన భరోసాతో నేను ధైర్యం తెచ్చుకున్నా.

ఆ సాయంత్రం ఇద్దరం ఆర్కే బీచ్‌కి వెళ్లాం. ఇసుకలో కూర్చుని, మా కలల గురించి చర్చించుకుంటున్నాం. అప్పుడప్పుడూ మమ్మల్ని మెచ్చుకుంటున్నట్టుగా అలలు వచ్చి, మా పాదాలను తాకుతున్నాయి. 'మళ్లీ డ్రోన్ తయారు చేద్దాం లక్ష్మీ.. ఈసారి అది ఆకాశం దాటి ఎగురుతుంది' అన్నాన్నేను. 'పక్కా కిరణ్.. అందులో సందేహమే లేదు' అంది. ఈ సారి మా డ్రోన్ ఎగిరాక.. 'ఆకాశాన్ని గెలిచాను.. నీ మనసునూ గెలిచే అవకాశం ఇవ్వవూ' అని అడుగుతాను.

- కిరణ్

పంచాయత్ రింకీ.. పదనిసలు



'పంచాయత్' వెబ్‌సిరీస్ అమ్మడు రింకీ ఇప్పుడు బాగా పాపులర్! ఎంతగా అంటే.. బాలీవుడ్ కింగ్ ఖాన్ షారూక్ ఖాన్‌ని మించిపోయేంత. ఆన్‌లైన్ డేటాబేస్ సంస్థ ఐడీఎంబీ అదే చెబుతోంది మరి. నటనలో అదరగొడుతూ, సింప్లిసిటీతో అందరి మనసులు గెల్చుకుంటున్న రింకీ కబుర్లు ఇవి.

- 'పంచాయత్' రింకీగా అందరికీ దగ్గరైన తన అసలు పేరు పూజా సింగ్. తెరపై మాత్రం శాన్వికా. బాలీవుడ్‌లో పూజా పేరుతో చాలామంది ఉండటంతో తనే మార్చుకుంది. పుట్టిపెరిగింది మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో.
- పల్లెటూరి పిల్లలా, పక్కింటి అమ్మాయిలా.. అందరి మనసులు గెల్చుకున్న శాన్వికకి నలుగురు అక్కలు. దిగువ మధ్యతరగతి కుటుంబమే అయినా ఐదుగురు ఆడపిల్లలకూ స్వేచ్ఛనిచ్చారు కన్నవాళ్లు. శాన్విక 'నటనని కెరియర్‌గా ఎంచుకుంటాను' అన్నప్పుడూ అడ్డు చెప్పలేదు.
- 'ది వైరల్ ఫీవర్' నిర్మాణసంస్థ 'పంచాయత్' వెబ్‌సిరీస్‌తో తన జాతకమే మారిపోయింది. మొదటిది సూపర్‌డూపర్ హిట్ కావడంతో తర్వాత రెండు సీజన్లలోనూ తనే హీరోయిన్. అంతకు ముందు 'లఖాన్ లీలా భార్గవ', 'హజమత్' అనే వెబ్‌సిరీస్‌లు కూడా తనకి మంచి పేరు తీసుకొచ్చాయి. ఈమధ్యే 'పాపులర్ ఛాయిస్ యాక్టర్ గ్లోబల్ ఎక్సలెన్స్ అవార్డు' అందుకుంది.
- చూడ్డానికి సూపర్ కూల్‌గా కనిపిస్తున్నా.. 'నేను చాలా బోల్డ్ అండ్ డేరింగ్' అంటోంది శాన్విక. తన స్నేహితుల్లో అమ్మాయిలకన్నా అబ్బాయిలే ఎక్కువ. బీటెక్ ఎలక్ట్రానిక్స్ పూర్తి చేసింది.
- చదువైపోగానే నోయిడాలో ఉద్యోగం వచ్చింది.. కానీ మనసంతా సినిమాలేనాయె. ఉద్యోగాన్ని వదులుకొని ముంబయి రైలెక్కేసింది. రాగానే ఎర్రతివాచీ పరచడానికి సినిమా నేపథ్యం ఉన్న కుటుంబం కాదుగా! నిలదొక్కుకోవడానికి చాలా కష్టాలు పడింది.
- సహాయ దర్శకురాలిగా పని చేస్తూనే ఆడిషన్లకు వెళ్లేది. చాలాచోట్ల 'నో' అనే సమాధానం వచ్చినా పట్టు విడవలేదు. ఆఖరికి ఒక వాణిజ్య ప్రకటనలో నటించే ఛాన్స్ దక్కింది. అలా దాదాపు పదివరకు యాడ్స్‌లో నటించింది.
- అన్నట్టు తనకి 34 ఏళ్లు వచ్చినా.. ప్రేమ, పెళ్లి వివరాలేవీ తెలియవు. ఎంత ఎదిగినా తనది ఒదిగి ఉండే మనస్తత్వం. అభిమానులతో ప్రేమగా ఉండటమే కాదు.. పేద ఆడపిల్లల కోసం ఓ ఎన్జీవోతో కలిసి పని చేస్తోంది.



పంచుకుందాం!

ఇంద్రధనస్సులా
వచ్చావు
రంగులు వెలిసిన
నా జీవితంలోకి!

ప్రేమలో ఓటమిని
పాఠం అనుకున్నా...
పరాభవం
అనుకోలేదు!

నా ప్రపంచంలోని వ్యక్తులు
వాళ్లతో ఉన్న అనుబంధాలు మారాయి
ఒక్క నీ జ్ఞాపకాలు తప్ప!

నీకు ఇంద్రజాలం తెలుసేమో
నా కష్టాలు మాయం చేసి..
సంతోషాలు రెట్టింపు చేశావ్!

– ఆకాంక్ష

జీలకర్ర-బెల్లంలా..

వెరైటీ ప్రేమలేఖ

సుగంధాల సుహాసినీ...

నువ్వు చందనం చీరలో అందంగా నడిచి వస్తుంటే.. నిన్ను చూసి నా హృదయం తేనెలూరింది. నీ పసుపు, మిసిమి చర్మ సౌందర్యం.. మాటల్లోని మాధుర్యానికి నా మనసు కర్పూరంలా కరిగిపోయింది. నువ్వు నాపై కోప్పడితే మాత్రం ఎండుమిరపలా నా గుండెలో మంట పుడుతోంది. నువ్వు ఏడిస్తే మాత్రం.. వెన్నపూసలా నా గుండె కరిగిపోతోంది. నిన్ను చికాకు పెడుతున్నానని చిరాకుతో నన్ను తిడుతున్నా.. ఆ మాటలు మసాలా రుచిలా ఉంటున్నాయే తప్ప నాలో ఎలాంటి చలనం లేదు. నువ్వు నవ్వుతున్నప్పుడైతే పంచదార బొమ్మలాగే కనిపిస్తున్నావు. నీపై నా ప్రేమ నిజం. నన్ను నీ జీవితంలోకి ఆహ్వానిస్తే పులిహోరలో కరివేపాకులా, పాయసంలో యాలకుల్లా, బిర్యానీలో బిర్యానీ ఆకులా నీతో అనుబంధం పెనవేసుకుంటా. కాదంటే మాత్రం నా జీవితం ఉప్పులేని పప్పులా, తీపి లేని పాయసంలా రుచీపచీ లేకుండా పోతుంది. నేను నీకోసం ఎప్పుడూ ఒంటికొమ్ము శొంఠిలా సిద్ధంగా ఉంటాను. ఇప్పటికైనా నన్ను అర్థం చేసుకో. జీడిపప్పులా రుచిగా, బాదంలా బలంగా, తమలపాకులో వక్కలా, కొబ్బరికాయలా భక్తిగా నీకు సేవ చేస్తాను. ఇకనైనా మనం జీలకర్ర-బెల్లంలా కలిసిపోయే అవకాశం ఇస్తావని ఆశిస్తున్నాను. ఇట్లు నీ సోగ్గాడు సోమేష్.

- నల్లపాటి సురేంద్ర, అనకాపల్లి

కళ్లు.. కాళ్లు.. అన్నింటికీ జ్యువెల్లరీనే!









మెడలో చైన్.. వేలికి రింగ్.. నడుముకి వడ్డాణం.. కాళ్లకి పట్టీలు.. ముంజేతికి బ్రేస్‌లెట్.. నగలంటే మోజు ఉండే అమ్మాయిలు, అబ్బాయిలు ఇలా ధరించడం మామూలే. కానీ కాళ్లకు వేసుకునే షూలు, కళ్లకు పెట్టుకునే సన్‌గ్లాసెస్‌కీ ఆభరణాలు వేసుకోవడం విడ్డూరంగా ఉండదూ! అయినా ఇది తాజా ఫ్యాషన్ ట్రెండ్ బాస్. నచ్చినవాళ్లకు నచ్చినట్టుగా ఫ్యాషన్లు పరుగులు పెట్టిస్తున్నారు. పాదరక్షలకు ధరించే నగలు, మెరుగులని 'షూ చార్మ్స్', 'జిబ్బిట్జ్' అంటున్నారు. ప్రముఖ ఫ్యాషన్ బ్రాండ్ వెస్ట్‌సైడ్ దుకాణాల్లో ఇలాంటి చార్మ్స్ బోలెడు డిజైన్లు ఉన్నాయి. ఖరీదైన పాదరక్షల బ్రాండ్ క్రాక్స్ సైతం తమ క్లాగ్స్ రకం పాదరక్షలకి ముస్తాబు చేసేలా జిబ్బిట్జ్, చార్మ్స్‌ని ప్రత్యేకంగా రూపొందించి అమ్మకానికి పెడుతోంది.


కూల్ కూల్‌గా..

షూల సంగతి అలా ఉంచితే.. సన్‌గ్లాసెస్‌కి కుందన్లు, ముత్యాలు, వజ్రపురాళ్లు.. అలంకరించుకునే ధోరణీ పెరుగుతోంది. Aulerth, Prerto అనే సన్‌గ్లాసెస్ కంపెనీలు కళ్లద్దాల ఫ్రేమ్‌లకు ఈ రకం నగలు అమర్చి అమ్ముతోంది. ఇంక స్నీకర్లకు బ్రేస్‌లెట్లు, షూలేస్‌లకు ముత్యాలతో అల్లిన స్ట్రింగ్‌లు కూడా ధరించడం కుర్రకారుకి పరిపాటిగా మారింది. అత్యాధునికంగా కనిపించాలనుకునే అమ్మాయిలైతే తమ జీన్స్‌కి రంగురంగుల బ్లింగాస్టిక్ స్టోన్స్‌ని ధరించి మురిసిపోతున్నారు.









విజయవాడ 5-7-2025 శనివారం సిటీ సంపుటి 51 . సంచిక 326

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 24 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

వెంటాడుతున్న వైకా'పాపం'!

నాడు తప్పుల తడకగా హౌస్‌హోల్డ్ మ్యాపింగ్

పథకాలకు దూరమై.. లక్షల కుటుంబాల అవస్థలు

కూటమి ప్రభుత్వంలో సరిచేయాలంటూ వేడుకోలు

'సుపరిపాలనలో తొలి అడుగు'లో నేతలకు వినతులు

ఈనాడు - అమరావతి

హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ సమస్యలు రాష్ట్రంలో లక్షల కుటుంబాలకు తీవ్ర మనోవేదన కలిగిస్తున్నాయి. వైకాపా ప్రభుత్వ హయాంలో చేసిన పాపాల ఫలితమిది. పూట గడవని పేద కుటుంబాల పాలిట శాపమైంది. తప్పులు సరిచేయాలంటూ అప్పట్లో అధికారులకు, నేతలకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వంలో అయినా వాటన్నిటినీ సరిదిద్ది న్యాయం చేయాలంటూ 'సుపరిపాలనలో తొలి అడుగు 4.1'లో ఇళ్లకు వస్తున్న నేతల వద్ద వాపోతున్నారు. ఆనాటి తప్పుల వల్ల కొత్త రేషన్ కార్డులు రావడం లేదు, పింఛన్లు పొందలేకపోతున్నాం, ఉచిత సిలిండర్ రావడం లేదు, తల్లికి వందనం అందుకోలేకపోతున్నామని మొరపెట్టుకుంటున్నారు.

తగుదునమ్మా అంటూ మళ్లీ తయారు!

వైకాపా ప్రభుత్వ హయాంలో 2020, 2021 సంవత్సరాల్లో వాలంటీర్ల ద్వారా అడ్డదిడ్డంగా హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ చేశారు. ఏ ఇంట్లోని సభ్యులకు వారి ఆధార్ నంబర్లనే అనుసంధానించాల్సి ఉండగా.. అన్నీ తప్పుల తడకగా చేశారు. ఇప్పుడు అదే వైకాపా నేతలు మళ్లీ తగుదునమ్మా అంటూ ఇంటింటికి వస్తుండటంపై పథకాలకు దూరమైన పేద కుటుంబాల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది.

ఇప్పటికీ అదే ప్రామాణికమా..

■ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటింది. అయినా ఇప్పటికీ వైకాపా హయాంలోని హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌నే ప్రామాణికంగా తీసుకుని పథకాలు అమలు చేస్తున్నారు.

■ ప్రకాశం జిల్లాలో రైతు ఆధార్ నంబరుకు.. మరో రైతు పొలాన్ని జత చేశారు. దీంతో అసలు పొలమే లేని రైతుకు గ్యాస్ సిలిండర్, తల్లికి వందనం, ఇతర పథకాలు దక్కడం లేదు.

■ వైఎస్సార్ కడప జిల్లా ముద్దనూరు మండలానికి చెందిన ఒక కుటుంబంలో మూడేళ్ల బుడతడికి 25 ఏళ్లుగా, మగపిల్లాడిని ఆడబిడ్డగా పేర్కొన్నారు. సంబంధం లేని మరో వ్యక్తి ఆధార్‌ను ఈ కుటుంబానికి జత చేశారు. ఒకే కుటుంబంలో మూడు తప్పులు. సంబంధం లేని వ్యక్తిని తొలగించమంటే కుదరదంటున్నారు. పిల్లాడి వయసు తేడా కావడంతో తల్లికి వందనం రాలేదు.

■ విజయవాడ గుణదలలోని ఒక కుటుంబానికి.. మరో వ్యక్తి ఇంటి విద్యుత్తు కనెక్షన్‌ను అనుసంధానించడంతో బిల్లు పెరిగింది. ఒకటికి మూడు కనెక్షన్లు చూపిస్తున్నాయి. రేషన్‌కార్డుకు దరఖాస్తు చేయలేకపోతున్నారు. విద్యుత్తు కనెక్షన్ డీలింక్ చేయించి నెల దాటినా ప్రభుత్వ రికార్డుల్లో అప్‌డేట్ కావడం లేదు.

■ అనంతపురం పట్టణంలో ఒక కుటుంబానికి చెందిన వారిని పక్క కుటుంబంతో జోడించారు. స్థితిమంతులైన వారితో పేద కుటుంబాన్ని అనుసంధానించడంతో.. ఈ కుటుంబం ప్రభుత్వ ప్రయోజనాల్ని కోల్పోయింది.

■ విజయవాడకు చెందిన ఒకరికి 2017 సంవత్సరంలో సొంత కారు ఉండేది. కొవిడ్ సమయంలో అమ్ముకున్నారు. అయినా ఇప్పటికీ ఆ కుటుంబానికి సొంత కారు ఉందంటూ చూపిస్తోంది. రేషన్ కార్డుకు దరఖాస్తు చేయలేకపోతున్నారు. తల్లికి వందనమూ రాలేదు.

■ వయసు తప్పుగా నమోదు చేయడంతో చాలా మంది వృద్ధాప్య పింఛన్లకు దూరమయ్యారు.

ప్రకాశం జిల్లా మర్రిపూడి మండలం గుండ్లసముద్రానికి చెందిన చిరుపల్లి వెంకటేశ్వర్లు కుటుంబమిది. 2019 వరకు విద్యుత్తు రాయితీ సహా ఇతర పథకాలను పొందారు వీరు. వైకాపా ప్రభుత్వ హయాంలో హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ అంటూ ఈయన ఆధార్‌ను అదే గ్రామంలోని ఒక ప్రభుత్వోద్యోగికి అనుసంధానించి, ఆయన విద్యుత్తు బిల్లు జోడించారు. దీంతో పేదవాడైన వెంకటేశ్వర్లు రికార్డుల్లో ప్రభుత్వోద్యోగిగా కనిపిస్తున్నారు. దీంతో ఎస్సీలకిచ్చే విద్యుత్తు రాయితీ ఎత్తేశారు. ఇతర పథకాలూ దక్కడం లేదు. అప్పట్లో వైకాపా నాయకులను, అధికారులను కలిసి మొత్తుకున్నా పరిస్థితి మారలేదు. రూ.22 వేలకు పైగా కరెంటు బిల్లు పెండింగ్ ఉన్నట్లు చూపిస్తుండడంతో ఆయన ఆందోళన చెందుతున్నారు.



'రియల్‌టైమ్'తో సరిచేయలేరా?

రియల్‌టైమ్ సాంకేతికత ఆధారంగా హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో సవరణలు చేయవచ్చు. కుటుంబ సభ్యుల జోడింపు లేదా తొలగింపు చేయవచ్చు. సంబంధిత సభ్యుడి వేలిముద్ర ఆధారంగా అక్కడికక్కడే సవరణలు చేసుకునే సాంకేతికత అందుబాటులో ఉంది. అయినా అధికారులు మాత్రం దీనికి అనుగుణంగా చర్యలు తీసుకోవడం లేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు జోక్యం చేసుకుని. ఈ సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని పేద కుటుంబాలు కోరుతున్నాయి.

తూనిక యంత్రాల పరిశీలన, స్టాంపింగ్ రుసుముల పెంపు

ఈనాడు, అమరావతి: తూనిక యంత్రాల పరిశీలన, స్టాంపింగ్‌కు సంబంధించిన రుసుములను స్వల్పంగా పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. 5-50 కిలోల వరకు ఉండే తూకం (ఇనుముతో చేసిన) వస్తువులకు ప్రస్తుత రుసుము రూ.20 నుంచి రూ.30 ఉండగా, ఇకపై రూ.30 చొప్పున వసూలు చేస్తారు. సిలిండర్ రూపంలో ఉండే వాటికి కిలో నుంచి 20 కిలోల వరకు రూ.20 చొప్పున తీసుకుంటారు. సర్వేయింగ్ చైన్లు, టేపులు, బీమ్ స్కేల్, కిచెన్ స్కేల్, పిల్లల తూకం స్కేలుకు గతంలో ఉన్న ధరలను సవరించారు. 10 టన్నులు పైపడిన తూకం యంత్రాలకు గతంలో రుసుము రూ.3 వేలు ఉండగా, ప్రస్తుతం రూ.4,500 చొప్పున నిర్ణయించారు. వీటిపై అభ్యంతరాలను 15 రోజుల్లోగా పౌరసరఫరాల శాఖ అధికారులకు తెలియజేయాలని ఎక్స్‌అఫీషియో కార్యదర్శి సౌరభ్‌గౌర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



శ్రీశైలంలో ఉచిత స్పర్శ దర్శనానికి ఆన్‌లైన్ టోకెన్లు

ఒకరోజు ముందే తీసుకునేందుకు అవకాశం

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల శ్రీమల్లికార్జునస్వామి ఉచిత స్పర్శ దర్శనానికి ఇక నుంచి ఆన్‌లైన్ ద్వారా టోకెన్లు జారీ చేస్తున్నట్లు దేవస్థానం ఈవో ఎం.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఈ నెల 1 నుంచి పునః ప్రారంభించిన ఉచిత స్పర్శ దర్శనం అమలుపై దేవస్థానం విభాగాధిపతులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. మంగళవారం నుంచి శుక్రవారం వరకు మధ్యాహ్నం 1.45 గంటల నుంచి 3.45 గంటల వరకు ఈ ఉచిత స్పర్శ దర్శనం ఉంటుందని చెప్పారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా.. పారదర్శకంగా ఉండేందుకు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే టోకెన్లు జారీ చేయనున్నట్లు స్పష్టం చేశారు. www.srisailadevasthanam.org, www.aptemples. ap.gov.in వెబ్‌సైట్ల ద్వారా పేరు, చిరునామా, ఆధార్ నంబరు నమోదు చేసి టోకెన్లు పొందాల్సి ఉంటుందని, ఒకరోజు ముందుగానే (సోమవారం నుంచి) వీటిని తీసుకోవచ్చని పేర్కొన్నారు.

శ్రావణ మాసంలో పేదల గృహప్రవేశాలు

- 3 లక్షల ఇళ్లు అప్పగించనున్న ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: వచ్చే శ్రావణ మాసంలో పేదలతో గృహప్రవేశాలు చేయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించనున్నారు. అప్పటిలోగా 3 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని అధికారులకు ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పేదల ఇళ్ల నిర్మాణంపై దృష్టిసారించింది. ఇసుకను ఉచితంగా అందుబాటులో ఉంచింది. లేఅవుట్లలో సమస్యలనూ పరిష్కరించింది. గత 13 నెలల కాలంలో 2.30 లక్షల గృహనిర్మాణాలు పూర్తయ్యాయి. రూఫ్ స్థాయిలో 87,000 గృహాలున్నాయి. మరో 1.2 లక్షల ఇళ్లు లింటెల్



స్థాయిలో, 50,000 ఇళ్లు బేస్‌మెంట్ స్థాయిలో ఉన్నాయి. మిగతా వాటికి పునాది కూడా పడలేదు. వాటిని కూడా పూర్తి చేయించడానికి అధికారులు ప్రణాళిక రూపొందించారు.

అదనపు సాయం మంజూరు చేసినా నత్తనడకే..

పేదల ఇళ్ల నిర్మాణానికి ఒక్కో ఇంటికి కేంద్రం రూ.1.50 లక్షల చొప్పున అందిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం కింద మరో రూ.30 వేలు ఇస్తోంది. పట్టణ ప్రాంతాల్లోని వారికి రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ.30 వేలు చెల్లిస్తోంది. ఇదికాకుండా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ఎస్సీ లబ్ధిదారులకు రూ.50 వేలు, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, ఆదివాసీ గిరిజనులకు రూ.లక్ష అదనపు సాయం అందిస్తోంది. ఇప్పటికే దాదాపుగా లక్ష మంది లబ్ధిదారులకు రూ.300 కోట్ల వరకు మంజూరు చేసింది. వీరిలో 50 వేల మంది ఇళ్ల నిర్మాణాలు పునఃప్రారంభించినట్లు అధికారులు గుర్తించారు. మిగతావారు రాష్ట్ర ప్రభుత్వం అదనపు సాయం అందించినా ఎందుకు నిర్మాణాలు చేపట్టలేదనే దానిపై క్షేత్రస్థాయి నుంచి సమాచారం తెప్పించుకుంటున్నారు.

మద్యం కుంభకోణం కేసులో నిందితుడిగా పురుషోత్తం వరుణ్‌కుమార్

ఏ-40గా చేరుస్తూ మెమో దాఖలు చేసిన సిట్

రాజ్ కెసిరెడ్డికి ప్రధాన అనుచరుడు

ఇప్పటికే విదేశాలకు పారిపోయిన వరుణ్



ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాజ్ కెసిరెడ్డి ప్రధాన అనుచరుడు, దోపిడీలో పాత్రధారైన పురుషోత్తం వరుణ్ కుమార్‌ను 40వ నిందితుడిగా చేరుస్తూ సిట్ అధికారులు విజయవాడలోని ఏసీబీ న్యాయస్థానంలో శుక్రవారం మెమో దాఖలు చేశారు. గతేడాది జులై, ఆగస్టు నెలల్లోనే వరుణ్ విదేశాలకు పారిపోయాడు. ప్రస్తుతం అమెరికాలో ఉన్నట్లు సిట్ అధికారులు గుర్తించారు. ఇప్పటికే అతనిపై లుకౌట్ నోటీసులూ జారీ అయ్యాయి. సికింద్రాబాద్‌కు చెందిన వరుణ్ కుమార్ ఇంజినీరింగ్ చదివాడు. హైదరాబాద్‌లోని ఓ కాఫీ షాపులో నెలకు రూ.32 వేల వేతనంతో పనిచేస్తున్న వరుణ్‌కుమార్‌ను.. ప్రవాసాంధ్రుడైన ఓ వైద్యుడి ద్వారా రాజ్ కెసిరెడ్డి బృందం మద్యం కుంభకోణం ఉచ్చులోకి దించింది. పుదుచ్చేరిలోని లీలా డిస్టిలరీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి వరుణ్‌కుమార్‌ను ఏపీ ఆపరేషన్స్ హెడ్‌గా నియమించి, అతని పేరిట రూ.వందల కోట్లు కొల్లగొట్టింది. దర్యాప్తులో దీనికి సంబంధించిన పక్కా ఆధారాలు లభించటంతో సిట్ అధికారులు వరుణ్‌ను నిందితుడిగా చేర్చారు.

డైరెక్టర్లను బెదిరించి.. లీలా డిస్టిలరీస్‌ను గుప్పిట్లో పెట్టుకుని: తమిళనాడులోని ఎస్ఎన్‌జే షుగర్స్ అండ్ ప్రొడక్ట్స్ సంస్థకు సంబంధించిన డైరెక్టర్లు, ఎగ్జిక్యూటివ్‌లను రాజ్ కెసిరెడ్డి బెదిరించి.. వారి అనుబంధ సంస్థ అయిన లీలా డిస్టిలరీస్‌ను తన గుప్పిట్లో పెట్టుకున్నారు. లీలా డిస్టిలరీస్‌తో ఆథరైజేషన్ ఇప్పించి.. వరుణ్‌కుమార్‌ను ఆ కంపెనీకి ఏపీ ఆపరేషన్స్ హెడ్‌గా నియమించారు. అతని పేరిట బ్యాంకు ఖాతా తెరిపించి, రూ.10 కోట్ల వరకూ చెక్ పవర్ కల్పించారు. సొంతంగా మద్యం తయారు చేసే కనీస మౌలిక సదుపాయాలు లేని లీలా డిస్టిలరీస్‌కు ఏపీఎస్‌బీసీఎల్ నుంచి భారీగా మద్యం సరఫరా ఆర్డర్లు కట్టబెట్టారు. 2020 జూన్ నుంచి 2024 మార్చి మధ్య 21 నెలల్లో ఏపీఎస్‌బీసీఎల్ ఈ సంస్థ ఖాతాలో ఏకంగా రూ.459 కోట్లు జమ చేసింది. ఈ వ్యాపార పరిమాణం అసాధారణంగా ఉన్నట్లు సిట్ దర్యాప్తులో తేలింది. అంతేకాదు ఈ డబ్బంతా వెనువెంటనే వేర్వేరు ఖాతాల్లోకి మళ్లిపోయింది. వాటిని విశ్లేషించిన సిట్ అధికారులు.. అందులో అత్యధిక శాతం కల్పిత కంపెనీలతో నిర్వహించిన అనుమానాస్పద లావాదేవీలేనని గుర్తించారు. ఈ నేపథ్యంలోనే వరుణ్‌కుమార్‌ను నిందితుడిగా చేర్చారు. అతన్ని విదేశాల నుంచి తీసుకొచ్చి, గుట్టు బయటకు తీయనున్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవించిన వారికి 'ఎన్టీఆర్ బేబీ కిట్లు'

- ఏపీఎంఎస్ఐడీసీకి టెండర్ల బాధ్యత

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన వారికి ఉచితంగా 'ఎన్టీఆర్ బేబీ కిట్లు' అందించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. శిశు ఆరోగ్య సంరక్షణ కోసం 2016లో తెదేపా ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టగా.. ఆ తర్వాత వచ్చిన జగన్ సర్కారు కొన్నాళ్లు అమలు చేసి నిలిపేసింది. తాజాగా 'ఎన్టీఆర్ బేబీ కిట్లు' పేరుతో ఆ పథకాన్ని పునఃప్రారంభించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ కిట్‌లో దోమ తెరతో కూడిన పరుపు, వాటర్ ప్రూఫ్ షీటు, దుస్తులు, నాప్కిన్లు, తువ్వాలు, సబ్బు, సబ్బు పెట్టె, పౌడర్, ఆయిల్, షాంపూ, బొమ్మ వంటి 11 వస్తువులు ఉంటాయి. 26 జిల్లాల్లోని డీఎంహెచ్‌వోలు, డీసీహెచ్‌ఎస్‌లు, జీజీహెచ్‌లకు రెండేళ్ల పాటు 'రేట్ కాంట్రాక్ట్' పద్ధతిలో కిట్లు సరఫరా చేసేలా టెండర్లు పిలిచారు. ఆ బాధ్యతను ఆంధ్రప్రదేశ్ వైద్య సేవలు-మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (ఏపీఎంఎస్ఐడీసీ)కు ప్రభుత్వం అప్పగించింది. అర్హత కలిగిన తయారీదారులు, అధికారిక డిస్ట్రిబ్యూటర్లు ఈ-ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో బిడ్లు సమర్పించాలని పేర్కొంది. గతంలో నాణ్యత లోపం గుర్తించిన, బ్లాక్‌లిస్టులో ఉన్న సంస్థలకు పాల్గొనే అవకాశం లేదని చెప్పింది. నాణ్యతా ప్రమాణాలు పాటించని వారిని, సరఫరా సామర్థ్యం లేని వారిని తొలగించేలా సాంకేతిక స్క్రీనింగ్ ప్రక్రియ ఉంటుందని తెలిపింది. కిట్లు సరఫరా చేసిన నెల తర్వాత పెర్ఫార్మెన్స్ ట్రయల్ ఆధారంగా చెల్లింపు జరుగుతుందని టెండరు నిబంధనల్లో పేర్కొంది. ఈ నెల 21న టెక్నికల్ బిడ్లు డౌన్‌లోడ్ చేయనున్నారు. ఆ తర్వాత అర్హత కలిగిన వారి ఫైనాన్షియల్ బిడ్లు ఓపెన్ చేస్తారు.



మెగా డీఎస్సీలో భాగంగా జూన్ 29 నుంచి జులై 2 వరకు నిర్వహించిన పరీక్షల ప్రాథమిక 'కీ', రెస్పాన్స్ షీట్లను శనివారం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నట్లు మెగా డీఎస్సీ కన్వీనర్ వెంకట కృష్ణారెడ్డి తెలిపారు.

గ్రహం అనుగ్రహం

5-7-2025 శనివారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; గ్రీష్మ రుతువు, ఆషాఢ మాసం, శుక్లపక్షం
దశమి: సా. 6-20 తదుపరి ఏకాదశి
స్వాతి: రా. 8-05 తదుపరి విశాఖ
వర్జ్యం: రా. 2-17 నుంచి 4-03 వరకు
అమృత ఘడియలు: ఉ. 10-20 నుంచి 12-06 వరకు
దుర్ముహూర్తం: ఉ. 5-32 నుంచి 7-17 వరకు
రాహుకాలం: ఉ. 9-00 నుంచి 10-30 వరకు
సూర్యోదయం: ఉ.5.33; సూర్యాస్తమయం: సా.6.35

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
తిరుపతి	39.0	27.9
నెల్లూరు	38.6	28.0
రాజమహేంద్రవరం	38.0	25.5
విజయవాడ	36.8	26.0
ఒంగోలు	36.2	27.4
కడప	36.0	27.0
నరసాపురం	35.7	28.0
తాడేపల్లిగూడెం	35.4	27.1
అనంతపురం	33.7	24.2
విశాఖపట్నం	33.4	26.2
కర్నూలు	33.4	25.0
ఖమ్మం	33.2	24.4
గుంటూరు	33.0	28.0
విజయనగరం	32.0	25.0
హైదరాబాద్	31.4	23.1
మహబూబ్‌నగర్	29.1	24.0
శ్రీకాకుళం	29.0	26.0

ఇదీ సంగతి!



సారీ.. మీతో కుదరదు..
నాదారి నేను చూసుకుంటా!

కొణిజేటి రోశయ్య సేవలు మరువలేనివి

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే
- రోశయ్య జయంతి సందర్భంగా హైదరాబాద్‌లో విగ్రహావిష్కరణ
- రవీంద్రభారతిలో ఘనంగా జయంతి సభ



రోశయ్య విగ్రహావిష్కరణ కార్యక్రమంలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క, టీజీ వెంకటేశ్, శివసుబ్బారావు, మహేశ్‌కుమార్‌గౌడ్, మల్లికార్జున ఖర్గే, శ్రీధర్‌బాబు తదితరులు

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు దివంగత ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య అందించిన సేవలు మరువలేనివని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. శుక్రవారం రోశయ్య జయంతిని ఆ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని లక్డీకాపూల్ ద్వారకా కూడలిలో దాదాపు రూ.50 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన 9 అడుగుల రోశయ్య కాంస్య విగ్రహాన్ని రేవంత్‌రెడ్డి, ఖర్గే ఆవిష్కరించి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు. అనంతరం రవీంద్రభారతిలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, రోశయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రోశయ్య 92వ జయంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ.. అసెంబ్లీలో రోశయ్య చేసిన ప్రసంగాలు స్ఫూర్తిదాయకమని, యువ రాజకీయ నాయకులు వాటిని అనుసరించాలని సూచించారు. రోశయ్య ఎంతో ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ ఉమ్మడి రాష్ట్రం అప్పుల పాలుకాకుండా జాగ్రత్తలు తీసుకున్నారన్నారు. శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కొత్తగా ఎన్నికైన శాసనసభ్యులకు రోశయ్య ప్రసంగాలు పవిత్ర పుస్తకం లాంటివని పేర్కొన్నారు. మంత్రులు పొన్నం, శ్రీధర్‌బాబు, జూపల్లి, అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ.. ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్‌లో ఎవరు సీఎం అయినా ఆ తర్వాతి స్థానంలో రోశయ్య ఉండాలని కోరుకునేవారన్నారు. ప్రతి ప్రజా ప్రతినిధి ఆయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత కేవీపీ రామచంద్రరావు రోశయ్యతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రముఖ ప్రవచన కర్త, ఏపీ ప్రభుత్వ నైతిక విలువల సలహాదారు చాగంటి కోటేశ్వరరావుని ఘనంగా సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో రాజ్యసభ సభ్యులు అనిల్ యాదవ్, టీజీ వెంకటేశ్, ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా, రోశయ్య కుమారులు శివసుబ్బారావు, మూర్తి, ఇతర కుటుంబసభ్యులు, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ కాల్వ సుజాత, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



రోశయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, కేవీపీ రామచంద్రరావు

పీవోకేను వెనక్కి తీసుకునే అవకాశం వదులుకున్నారు



- కేంద్రానికి సత్తా ఉంటే దేశ ముఖచిత్రం మారిపోయేది
- సామాజిక న్యాయ సమరభేరిలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

ఈనాడు, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వానికి సత్తా ఉంటే.. దేశ ముఖచిత్రం మారిపోయేదని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తెలిపారు. పహల్గాం ఘటన అనంతరం పాకిస్థాన్‌పై చర్యలను మధ్యలో వదిలేయడంతో పీవోకేను వెనక్కి తీసుకునే అవకాశాన్ని వదులుకుందని విమర్శించారు. పహల్గాం ఘటన జరిగినప్పుడు ప్రధాని మోదీ ప్రతిపక్షాలను పిలిచి మాట్లాడలేదని, ఆయనకు ప్రతిపక్షాలంటే భయమని విమర్శించారు. మోదీ విదేశీ విధానం సరిగా లేదని, దీంతో దేశానికి అన్నివైపులా శత్రువులు తయారయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. నేపాల్ కూడా భారత్‌కు దూరమవుతోందన్నారు. శత్రువులందరూ దేశాన్ని చుట్టుముడుతుంటే ప్రధాని విదేశాల్లో తిరుగుతున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ కార్యకర్తలు, యువత, రైతులు ఒక్కటైతే దిల్లీ నుంచి మోదీ, అమిత్‌షా పారిపోతారని, అక్కడా కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుందని పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సామాజిక న్యాయ సమరభేరి సభలో ఖర్గే ప్రసంగించారు. 'దేశంలో మోదీ మన్‌కీ బాత్ అంటుంటే.. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు దిల్‌కీ బాత్ చెబుతోంది. కామ్‌కీ బాత్ పేరిట పనులు చేస్తోంది. ప్రధాని మోదీ.. గత 11 ఏళ్లలో దేశ ఆర్థిక స్థితిని, చట్టాలను నాశనం చేశారు. పెద్ద పెద్ద మాటలు చెప్పడం తప్ప చేతలు లేవు. రాహుల్ గాంధీతో కలిసి కార్యకర్తలంతా పోరాడి దేశాన్ని రక్షిస్తాం. ప్రధాని మోదీ, అమిత్‌షా చెప్పే అబద్ధాలపై అప్రమత్తంగా ఉంటూ కాంగ్రెస్‌ను కార్యకర్తలు మరింత బలోపేతం చేయాలి.

తెలంగాణ కులసర్వే దేశానికి ఆదర్శం

తెలంగాణలో బీసీల రిజర్వేషన్ల కోసం చేపట్టిన కులసర్వేను రాహుల్ గాంధీ మెచ్చుకున్నారు. ఇది దేశానికి ఆదర్శంగా, నమూనాగా నిలిచింది. దేశంలో ఏ ప్రభుత్వమూ చేయనిది మేం చేసి చూపించాం. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించేవరకు కాంగ్రెస్ పోరాడుతుంది. కులవివక్షను ఎదుర్కొనేలా కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో రోహిత్ వేముల చట్టాన్ని తీసుకొస్తాం' అని ఖర్గే అన్నారు.

'వసతిగృహాల్లోని వంట గదులను తనిఖీ చేయాలి'

ఈనాడు, అమరావతి: వేసవి సెలవుల తర్వాత వసతిగృహాలు పునఃప్రారంభమైన నేపథ్యంలో వాటిల్లోని వంట గదులు, సరకు నిల్వ గదులను తనిఖీ చేయాలని బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టరేట్‌లోని జేడీల నుంచి జిల్లా స్థాయిలోని అసిస్టెంట్ బీసీ సంక్షేమ శాఖ అధికారి వరకు అన్ని స్థాయిల అధికారులు తనిఖీలు చేపట్టాలని సూచించారు. ప్రతి వసతి గృహంలోనూ పరిశుభ్రత ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఆరోపణలు చేసింది వైకాపా నేత అనుచరులు

కేసు పెట్టేందుకు సిద్ధమవుతున్న తితిదే

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి ఆలయం వద్ద గురువారం తితిదేపై ఆరోపణలు చేసిన వ్యక్తులు వైకాపా నేత అనుచరులుగా వెల్లడైంది. వారిని పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు చెందిన వైకాపా ప్రముఖ నేత అనుచరులుగా తితిదే భద్రతా విభాగం గుర్తించింది. కూటమి ప్రభుత్వంలో తితిదే ప్రక్షాళన చేపట్టి భక్తులకు మెరుగైన సదుపాయాలు, వసతులు కల్పించడంతోపాటు గత వైకాపా ప్రభుత్వంలో చోటుచేసుకున్న అవినీతిపై చట్టప్రకారం ముందుకు సాగుతుండడంతో కొందరు పనిగట్టుకుని అసత్య ప్రచారానికి తెరతీసినట్లు అధికారులు భావిస్తున్నారు. గతంలోనూ ఓ వైకాపా నాయకుడు సర్వదర్శనం క్యూలైన్‌లో భక్తులను ఉసిగొలిపి ఆందోళన చేయించిన విషయం తెలిసిందే. కొందరు రాజకీయ కారణాలతో అసత్య ఆరోపణలకు పాల్పడుతుండటంతో తితిదే చర్యలకు ఉపక్రమించింది. అసత్య ఆరోపణలు చేసిన వారిపై కేసు పెట్టేందుకు సిద్ధమవుతోంది.

చెవిరెడ్డి బాధ్యతలు సాంబశివారెడ్డికి

ఈనాడు, అమరావతి: అనంతపురం జిల్లాకు చెందిన ఆలూరు సాంబశివారెడ్డిని వైకాపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం రాత్రి ప్రకటించింది. చెవిరెడ్డి భాస్కరరెడ్డి మద్యం కేసులో జైల్లో రిమాండ్‌లో ఉన్న నేపథ్యంలో.. ఆయన ఇప్పటివరకూ చూస్తున్న పార్టీ అనుబంధ విభాగాల బాధ్యతను కూడా సాంబశివారెడ్డికి తాత్కాలికంగా అప్పగించినట్లు తెలిపింది.

పులివెందుల డీఎస్పీని కలిసిన సునీత దంపతులు

పులివెందుల, న్యూస్‌టుడే: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె సునీత, ఆమె భర్త రాజశేఖరరెడ్డిలు శుక్రవారం పులివెందుల డీఎస్పీ మురళీనాయక్‌ను కలిశారు. పులివెందులలో ఇటీవల జరుగుతున్న పరిణామాలపై సుమారు రెండుగంటల పాటు డీఎస్పీతో చర్చించినట్లు సమాచారం. అయితే సింహాద్రిపురం మండలం రావులకొలను వద్ద ఉన్న తమ పొలాల్లో పలువురు పశువులను తోలి ఇబ్బందులకు గురిచేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని సునీత దంపతులు కోరినట్లు డీఎస్పీ మురళీనాయక్ తెలిపారు.



మెరుగైన ప్రపంచానికి నిర్మాతలు ఎవరంటే..

తల్లిదండ్రులు తమ పిల్లలకు నేర్పించే విలువలు ఇంటి నాలుగ్గోడల మధ్యే ఆగిపోవు. అవి తరగతి గదుల్లోనూ, పని ప్రదేశాల్లోనూ, సమాజంలోనూ ప్రతిధ్వనిస్తాయి. అవే మెరుగైన ప్రపంచాన్ని నిర్మిస్తాయి. తల్లిదండ్రులు ఆ బృహత్తర బాధ్యతను విస్మరించకూడదు.

– రాజ్ శమానీ, పాడ్‌కాస్టర్

ప్రగతి కారిడార్లుగా నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలు

- అల్లూరి ఆశయ సాధన దిశగా కేంద్రం అడుగులు
- మన్యం వీరుడి జయంత్యుత్సవాల్లో రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

ఈనాడు, హైదరాబాద్‌– మాదాపూర్, న్యూస్‌టుడే: గిరిజనుల హక్కుల కోసం పోరాడిన అల్లూరి సీతారామరాజు ఆశయాల సాధన దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ స్పష్టంచేశారు. అందులో భాగంగానే ఒకప్పటి నక్సల్ ప్రభావిత ప్రాంతాలను గ్రోత్ కారిడార్లుగా, ఎడ్యుకేషన్ హబ్‌లుగా అభివృద్ధి చేస్తోందన్నారు. శుక్రవారం హైదరాబాద్ శిల్పకళావేదికలో క్షత్రియ సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన అల్లూరి జయంత్యుత్సవాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అల్లూరి జన్మస్థలంలో నిర్మించిన స్మారక మందిరాన్ని వర్చువల్‌గా ప్రారంభించారు. అల్లూరి పేరిట సేవా కార్యక్రమాలు చేస్తున్న క్షత్రియ సేవా సమితిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... “బ్రిటిషర్ల కబంధ హస్తాల నుంచి దేశాన్ని విముక్తం చేయడానికి అల్లూరి, చంద్రశేఖర్ ఆజాద్ వంటి వీరులు పిన్న వయసులోనే ప్రాణాలర్పించారు. అల్లూరి 26 ఏళ్ల వయసులోనే గెరిల్లా యుద్ధంతో బ్రిటిష్ సైన్యాన్ని ఉక్కిరిబిక్కిరి చేశారు. ఆయన నడయాడిన ప్రాంతాలను అభివృద్ధి చేస్తాం. చింతపల్లి ఠాణాను జాతీయ వారసత్వ కట్టడంగా మారుస్తున్నాం. గిరిజన ప్రాంతాల్లో పాఠశాలలు, హాస్టళ్లు నిర్మించాం. నైపుణ్య కేంద్రాలనూ ఏర్పాటు చేస్తాం. మొబైల్ నెట్‌వర్క్ కోసం 10 వేలకుపైగా టవర్లను ఏర్పాటు చేస్తున్నాం. అడవులను కాపాడుతూ 50 వేలకుపైగా ఫారెస్ట్ వెల్త్ గ్రూపులను ఏర్పాటుచేసి, 4వేలకుపైగా డెవలప్‌మెంట్ సెంటర్ల ద్వారా అటవీ ఉత్పత్తులకు బ్రాండ్ కల్పించి గిరిజనులకు ఉపాధి కల్పించాం” అని వివరించారు. అనంతరం తెలుగు రాష్ట్రాల చట్టసభల్లో ప్రాతినిధ్యం వహిస్తున్న క్షత్రియ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను రాజ్‌నాథ్‌సింగ్ సన్మానించారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా అల్లూరి జయంత్యుత్సవాలను నిర్వహించే అవకాశం తనకు దక్కడం అదృష్టంగా భావిస్తున్నట్లు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. అల్లూరితో కలిసి పోరాడిన కుటుంబాల వారి కోసం ఇళ్లను నిర్మించడానికి క్షత్రియ సేవా సమితి, ఎన్‌సీసీ లిమిటెడ్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.



హైదరాబాద్ శిల్పకళావేదికలో అల్లూరి జయంత్యుత్సవాలను ప్రారంభిస్తున్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్. చిత్రంలో కేంద్ర మంత్రులు శ్రీనివాసవర్మ, గజేంద్రసింగ్ శెకావత్ ★ అల్లూరి జయంత్యుత్సవాల్లో తనకు బహూకరించిన విల్లును ఎక్కుపెట్టిన రాజ్‌నాథ్‌సింగ్. చిత్రంలో వ్యాపారవేత్త అల్లూరి సీతారామరాజు, ఎస్‌ఎల్‌జీ ఆసుపత్రి ఛైర్మన్ దండు శివరామరాజు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎన్‌సీసీ డైరెక్టర్ ఏఎస్ఎన్ రాజు

ఆయన గొప్ప క్షత్రియుడు: పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసిన ఏపీలోని అల్లూరి జిల్లా కొయ్యూరు మండలంలోని మంపా చెరువును కేంద్ర సాంస్కృతిక, పర్యాటకశాఖ మంత్రి గజేంద్రసింగ్ శెకావత్ వర్చువల్‌గా ఆవిష్కరించారు. తన కోసం కాకుండా తనవారి కోసం పోరాడిన అల్లూరి గొప్ప క్షత్రియుడన్నారు. కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, కేంద్ర భారీ పరిశ్రమలశాఖ సహాయమంత్రి శ్రీనివాస్‌వర్మ, కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు, పారిశ్రామికవేత్త అల్లూరి సీతారామరాజు, కర్ణాటక సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి సుభాష్‌చంద్రబోస్‌రాజు, ఎన్‌సీసీ లిమిటెడ్ డైరెక్టర్ ఏఎస్ఎన్ రాజు, క్షత్రియ సేవా సమితి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల అధ్యక్షులు భూపతిరాజు, సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతంగా అల్లూరి స్మారక మందిరం

- సీతారామరాజు జయంత్యుత్సవంలో మంత్రులు, ఎంపీలు

ఈనాడు డిజిటల్, అనకాపల్లి–కృష్ణదేవిపేట, న్యూస్‌టుడే: ఆదివాసీల హక్కులు, దేశ స్వాతంత్ర్యం కోసం వీరోచితంగా పోరాడిన అల్లూరి సీతారామరాజును.. నేటి తరం ఆదర్శంగా తీసుకుని సమాజాభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేశ్ పిలుపునిచ్చారు. శుక్రవారం అల్లూరి జయంత్యుత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా కృష్ణదేవిపేటలోని నందనవనంలో నిర్వహించారు. సీతారామరాజు, ఆయన అనుచరుడు గంటం దొర సమాధుల వద్ద మంత్రులు కొల్లు రవీంద్ర, వంగలపూడి అనిత, శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు, అనకాపల్లి, విజయనగరం ఎంపీలు సీఎం రమేశ్, కలిశెట్టి అప్పలనాయుడితో కలిసి ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేశ్ మాట్లాడుతూ.. అల్లూరి స్మారక మందిరం, నందనవనాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. అనకాపల్లి జిల్లాలోని పుణ్యక్షేత్రాలు, సందర్శనీయ ప్రదేశాలను కలిపి నందనవనాన్ని సర్క్యూట్‌గా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. అల్లూరి స్మారక స్థలం, పార్కుకు ఎంపీ నిధుల నుంచి రూ.30 లక్షలు కేటాయిస్తున్నట్లు సీఎం రమేశ్ ప్రకటించగా.. తాను సొంతంగా రూ.5 లక్షలు ఇస్తానని హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. అంతకుముందు నర్సీపట్నంలో 30 అడుగుల అల్లూరి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్‌సిన్హా తదితరులు పాల్గొన్నారు.



నర్సీపట్నంలో అల్లూరి సీతారామరాజు కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన అప్పలనాయుడు, సీఎం రమేశ్, కందుల దుర్గేశ్, అయ్యన్నపాత్రుడు, కొల్లు రవీంద్ర

స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తి అల్లూరి

ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, అమరావతి: భారత స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తి తెలుగువీరుడు అల్లూరి సీతారామరాజు అని సీఎం చంద్రబాబు కొనియాడారు. శుక్రవారం అల్లూరి జయంతి సందర్భంగా ఉండవల్లి నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవల్ని గుర్తుచేసుకొన్నారు. ‘మన్యం ప్రజల రక్షణ కోసం తెల్లదొరలను ఎదిరించి తన ప్రాణాలనే అర్పించిన త్యాగమూర్తి అల్లూరి. ఆ వీరుని దేశభక్తిని, ప్రజాపోరాటాన్ని స్మరించుకుందాం” అని పిలుపునిచ్చారు.

విజయవాడ పశ్చిమ బైపాస్‌కు వంగవీటి రంగా పేరు పెట్టండి: షర్మిల

విజయవాడ(గవర్నర్‌పేట), న్యూస్‌టుడే: విజయవాడ పశ్చిమ బైపాస్‌కు వంగవీటి మోహనరంగా పేరు పెట్టాలని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల విజ్ఞప్తి చేశారు. శుక్రవారం రంగా జయంతి సందర్భంగా ఆమె నివాళులర్పించారు. పేదల పక్షపాతిగా, వారి అభ్యున్నతే ధ్యేయంగా తుదిశ్వాస వరకు పోరాడిన గొప్ప నేత అని కొనియాడారు.

పైలా దిలీప్ బెయిల్ పిటిషన్ కొట్టివేత

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన రాజ్ కెసిరెడ్డి అనుచరుడు పైలా దిలీప్ (ఏ-30) బెయిల్ పిటిషన్‌ను విజయవాడ ఏసీబీ కోర్టు కొట్టేసింది. అతనికి బెయిల్ నిరాకరిస్తూ న్యాయాధికారి భాస్కర్‌రావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఏపీలో పెట్టుబడులకు ఇదే సరైన సమయం

ప్రవాసాంధ్రులకు వసంత కృష్ణప్రసాద్, మన్నవ సుబ్బారావు సూచన



వేడుకల్లో భాగంగా కేకు కోస్తున్న వసంత కృష్ణప్రసాద్, మన్నవ సుబ్బారావు, ప్రవాసాంధ్రులు

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టడానికి ఇదే సరైన సమయమని ప్రవాసాంధ్రులకు మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, గుంటూరు మిర్చియార్డు మాజీ ఛైర్మన్ మన్నవ సుబ్బారావు సూచించారు. పరిశ్రమలు, కంపెనీలు ఏర్పాటు చేయడం ద్వారా రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది, ఎన్టీఆర్ సినీరంగ ప్రవేశం చేసి 75 వసంతాలు పూర్తయిన సందర్భాల్ని పురస్కరించుకొని అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రం జాక్సన్ విల్లే నగరంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ‘వైకాపా ప్రభుత్వం కొత్త పరిశ్రమలు తీసుకురాకపోగా.. ఉన్నవాటినీ తరిమేసింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులకు భరోసా కల్పించేలా పాలసీలు రూపొందించింది. జగన్ భూతాన్ని చూసి భయపడాల్సిన పనిలేదు’ అని కృష్ణప్రసాద్ చెప్పారు. పేదరిక నిర్మూలన కోసం చంద్రబాబు ప్రకటించిన పీ4లో ప్రవాసాంధ్రులు కూడా భాగస్వాములు కావాలని మన్నవ సుబ్బారావు కోరారు. కార్యక్రమంలో సుమంత్ ఈదర, ఆనంద్ తోటకూర, అనిల్ యార్లగడ్డ, ఆనంద్ వక్కలగడ్డ, హరీశ్‌కుమార్ వీరవల్లి, రాజేశ్, గోపాల్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు

మాదక మహమ్మారిపై ఉమ్మడి పోరు

మాదకద్రవ్యాల అక్రమ రవాణాదారులు ఎంతోమంది అమాయకుల చావులకు కారణమవుతున్నారు... సమాజంపై వాటి వినాశకర ప్రభావం చూపుతున్నారని సుప్రీంకోర్టు 2021లోనే ఆందోళన వ్యక్తపరిచింది. ఈ నాలుగేళ్లలో పరిస్థితి మరీ భయంకరంగా తయారైంది. మొన్నామధ్య తిరుపతిలో నాలుగో తరగతి పిల్లాడి బ్యాగులో గంజాయి పొట్లాలు కనపడటంతో కుటుంబసభ్యులు గుండెలు జారిపోయాయి. వరంగల్‌కు చెందిన ఓ కుర్రాడు బీటెక్ చేసి, పోటీపరీక్షలకు సన్నద్ధం కావడానికి హైదరాబాద్‌కు వచ్చాడు. నగరంలో అతను గంజాయికి బానిసై, కన్నవారికి కన్నీళ్లు మిగిల్చాడు. అలాగే, ఎంటెక్ చదివి ఐటీ కంపెనీలో పనిచేస్తున్న ఓ యువకుడు డ్రగ్స్ తీసుకుంటూ పోలీసులకు దొరికిపోయాడు. అభంశుభం తెలియని బడి పిల్లలు మొదలు ఉన్నత విద్యావంతులు వృత్తి నిపుణుల దాకా చాలామంది మత్తుకు అలవాటుపడుతున్నారు. రకరకాల రూపాల్లో ఎక్కడ పడితే అక్కడ లభిస్తున్న మాదకద్రవ్యాలు- నవతరాన్ని నాశనం చేస్తున్నాయి. కుటుంబానికే దేశానికే వెన్నుదన్నుగా కావాల్సిన వారిని ఆత్మహత్యలూ హత్యలూ దొంగతనాల వైపు పురిగొల్పుతున్నాయి. సామాజిక విధ్వంసానికి కారణమవుతున్న మాదకద్రవ్యాల వ్యాప్తిని కట్టడి చేయకపోతే- ప్రజారోగ్యం పాటే శాంతిభద్రతలు కరవై జాతి సౌభాగ్యమే దిగనాసిల్లిపోతుంది!

మత్తుపదార్థాల వినియోగం అనేది ఇప్పుడు మహానగరాలకు మాత్రమే పరిమితమైన జాడ్యం కాదు. ద్వితీయశ్రేణి పట్టణాలను దాటేసి మారుమూల గ్రామాలకు కూడా మాదక రక్కసి కబంధ హస్తాలు విస్తరిస్తున్నాయి. దాదాపు నూరుశాతం అక్షరాస్యతతో సామాజిక ప్రగతిలో ముందంజలో ఉన్న కేరళలో సైతం డ్రగ్స్ ముఠాలు స్వైరవిహారం చేస్తున్నాయి. 2022లో ఆ రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో కనీసం అయిదు వందల డ్రగ్స్ కేసులు నమోదయ్యాయి. మొన్న ఏప్రిల్‌లో ఖమ్మంలో సుమారు ఆరు కేజీల గంజాయి చాక్లెట్లు పట్టుబడ్డాయి. తాజాగా విజయవాడ, తెనాలి రైల్వేస్టేషన్లలోనూ ఆ మత్తు చాక్లెట్లు దొరికాయి. ఇలాంటి వాటితో పాఠశాల విద్యార్థులపై వల విసురుతున్న మాదకాసురులు- పాత స్నేహాలూ సామాజిక మాధ్యమాల ద్వారా హెరాయిన్, కొకైన్, ఎండీఎంఏ తదితరాలను ఎరవేస్తూ యువతను డ్రగ్స్ రొంపిలోకి దింపుతున్నారు. సంబంధిత ముఠానేతలకు ఎక్కువగా సంకెళ్లు పడకపోవడం, నమోదవుతున్న కేసుల్లోనూ శిక్షల వరకు వస్తున్నవి చాలా తక్కువగా ఉండటంతో మాదకద్రవ్యాల నెత్తుటి వ్యాపారం విశృంఖలంగా కొనసాగుతోంది!

ఇతరుల కంటే కూడా మత్తు పదార్థాలకు అలవాటుపడినవారు ఆత్మహత్యలకు పాల్పడే అవకాశాలు 14రెట్లు అధికమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. 15-44 ఏళ్ల వయసులోని సాధారణ వ్యక్తులతో పోలిస్తే, డ్రగ్స్ వినియోగదారులు గుండెపోటుకు గురయ్యే ప్రమాదం ఆరున్నర రెట్లు ఎక్కువగా ఉంటుంది. క్యాన్సర్, హెపటైటిస్ నుంచి నరాల సంబంధిత వ్యాధుల వరకు అన్నింటికీ మోసుకొచ్చే మత్తు పదార్థాలు- మానసిక ఆరోగ్యాన్ని పూర్తిగా కబళిస్తాయి. దీనిపై విద్యార్థులను అప్రమత్తం చేస్తూ- క్యాంపస్‌లు, హాస్టళ్లలో డ్రగ్స్ వాడకాన్ని గుర్తించి అరికట్టేందుకు ఉన్నపాటి వర్సిటీ, జేఎన్‌టీయూలు ప్రత్యేక నిఘా బృందాల ఏర్పాటుకు నిశ్చయించాయి. తెలంగాణ, ఏపీలలోని అన్ని విద్యాసంస్థల్లోనూ ఇలాంటి వాటిని ఏర్పరచాలి. మాదకద్రవ్యాల దందాలను ఉపేక్షించేది లేదన్న రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల హెచ్చరికలకు అనుగుణంగా ఆయా ముఠాల పీచమణచడంలో పోలీసులు అత్యంత కఠినంగా వ్యవహరించాలి. మాదక మహమ్మారి నుంచి సమాజానికి విముక్తి లభించాలంటే- ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, విద్యాలయాల యాజమాన్యాలు, తల్లిదండ్రులు అందరూ కలిసి పోరాడక తప్పదు!




పిల్లలకు వాళ్లకు నచ్చింది చదివే స్వేచ్ఛనిస్తే వాళ్లు తప్పకుండా రాణిస్తారని తల్లిదండ్రులు అర్థం చేసుకోవాలి. ఎంతసేపూ చదువూ చదువూ అనకూడదు. నేనైతే ఉద్యోగార్థుల బయోడేటాలో కో కరిక్యులర్ యాక్టివిటీస్‌కే ప్రాధాన్యమిస్తాను.

– నితిన్ దేశాయ్, ఆర్థికవేత్త

జ్ఞానకాంతి

గదిలోని గాలి శుభ్రంగా ఉందనుకుంటాం. నిజానికి దాన్నిండా ధూళికణాలు నిండి ఉంటాయి. ఏ కిటికీలోంచో సూర్యకిరణాలు గదిలో సోకినప్పుడు కళ్లకు అవి స్పష్టంగా కనిపిస్తాయి. మనిషి జీవితమూ అంతే! జ్ఞానరశ్మి ప్రసరించేంతవరకు తనలో ఎంతటి అజ్ఞానం దాగి ఉందో అర్థం కాదు. తానెంత అపసవ్య మార్గంలో ప్రయాణిస్తున్నాడో స్పష్టం కాదు. మూసిన గదికి సూర్యరశ్మి ఎలాంటిదో, మసిబట్టిన మనిషి ఆలోచనలకు జ్ఞానకాంతి అలాంటిది. అయితే కిటికీ తెరిస్తేనే గదిలోకి కాంతికిరణాలు ప్రసరించినట్లు, అహంకారమనే తెర తొలగించినప్పుడే మనలో జ్ఞానకాంతి వెలిగేది! ఆ భావనతోనే త్యాగరాజస్వామి 'తెరతీయగ రాదా! నాలోని...' అని తిరుమల ఆనందనిలయాన అమితమైన ఆర్తితో వేడుకున్నాడు.



అంతర్యామి

అహంభావికి జ్ఞానార్జన అసాధ్యం. ఆర్జించినా అది అసమగ్రం. సద్గురు సేవ, సత్సంగం, సత్ గ్రంథ పఠనం, సత్పురుష సహవాసం జ్ఞానార్జన మార్గాలు. సమస్త కల్యాణగుణాలు జ్ఞానంతోనే సంప్రాప్తిస్తాయి. ఆ ప్రభావంతో మానవుడు పులుకడిగిన ముత్యంలా పాపరాశిని దగ్ధం చేసుకుని పునీతుడవుతాడు. శ్రీకృష్ణభగవానుడు భగవద్గీతలో జ్ఞానాన్ని తపస్సుతో, అగ్నితో పోల్చాడు. కర్మకు జ్ఞానం ఆధారమైనప్పుడు అది నిష్కామకర్మగా పరిణమిస్తుందని స్పష్టం చేశాడు. జ్ఞానయోగ సాధనతో మనిషిలో నిత్యానిత్య వివేకం ఉదయిస్తుంది. జ్ఞానోదయంతో కర్మయోగిగా కర్తవ్యాలను నిర్వర్తించిన రాజర్షి జనక మహారాజు. అందుకే శుక మహర్షి వంటి తపోధనులు కూడా ఆధ్యాత్మికోన్నతి కోసం ఆ మహీపతిని ఆశ్రయించారు. పరిపూర్ణ జ్ఞానంతో మనిషి అంతర్ముఖుడవుతాడు. ఆత్మాన్వేషణలో నిమగ్నమవుతాడు. కోర్కెలు తగ్గుముఖం పడతాయి. పూర్ణజ్ఞానులు సదా సంతుష్టులు. స్థితప్రజ్ఞులు. సాగరంలా మహాగంభీరులు. అందుకే 'జ్ఞానులు అంతరంగంలో భగవత్ చైతన్యాన్ని అనుభవిస్తూ ఉంటారు. వారికి ఈ ప్రపంచం ఓ కలలాంటిది. కష్టసుఖాలను సాక్షీభావంతో వీక్షిస్తూ ఉంటారు. దేనికీ ప్రభావితులు కారు' అనేవారు రామకృష్ణ పరమహంస.

అజ్ఞానమే మానవుడి సమస్త దుఃఖాలకు కారణమంటోంది సనాతనధర్మం. వయసు మీరుతున్నా మనిషి దుఃఖాతీత స్థితికి చేరుకోలేకపోవటానికి అదే ప్రతిబంధకం. కంచి పరమాచార్య చంద్రశేఖరేంద్ర సరస్వతి మహాస్వామి 'కడవ నీటిలో మునిగి ఉన్నంతసేపు దాని భారం తెలియదు. బయటికి లాగగానే కడవ బరువవుతుంది. అదేవిధంగా మనకు కలిగే ప్రాపంచిక కష్టాల భారాన్ని జ్ఞానమనే జలంలో ముంచితే దుఃఖం దూరమవుతుంది. అన్ని క్లేశాలకు ఔషధం జ్ఞానయోగమే' అని బోధించారు. నిరంతరం దేహభావంలో తాదాత్మ్యత చెందటం అజ్ఞాని లక్షణం. జ్ఞానిది వసుధైక కుటుంబం. చేప వలను ఛేదించుకుని జలాశయంలోకి దూకేసినట్లు, లౌకికబంధాలనే జాలాన్ని ఛేదించుకుని పరమాత్మలో లయమైపోతాడు.

– బి. సైదులు

అమ్మాయిలు... అధిగమించారు!



'బాలికల విద్య- ఆవశ్యకత'... కొన్ని దశాబ్దాల క్రితం వరకూ వ్యాసరచన, వక్తృత్వ పోటీలకు తప్పనిసరి అంశం ఇది. ఇప్పుడిక బాలుర విద్య ఆవశ్యకత గురించి చర్చించాల్సి వచ్చేలా ఉంది పరిస్థితి. ఉన్నత విద్యాసంస్థల్లో చేరుతున్నవారిలో అధిక శాతం అమ్మాయిలే మరి!

దాదాపు వందేళ్ల క్రితం... కమల సాహ్నీ బొంబాయి యూనివర్సిటీ నుంచి బీఎస్సీ పొందారు. తండ్రిలాగే ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో చేరి పరిశోధన చేయాలనుకున్నారు. ఉత్సాహంగా దరఖాస్తు చేశారు. ఆ సంస్థ డైరెక్టర్, నోబెల్ విజేత అయిన ప్రొఫెసర్ సీవీ రామన్ ఆ దరఖాస్తును తిరస్కరించారు. పరిశోధన చేయగల సామర్థ్యం స్త్రీలకు ఉండదన్నది ఆయన అభిప్రాయం. కమల ఊరుకోలేదు. 'నా శక్తి సామర్థ్యాలను పరీక్షించకుండానే తీర్పు ఎలా చెబుతారు' అని ప్రశ్నిస్తూ ఆయన ఆఫీసు గది ముందే సత్యాగ్రహం చేసింది. దాంతో తప్పనిసరై కొన్ని షరతులతో ఆమెకు ప్రవేశం కల్పించారు. ఏడాది పాటు ప్రొబేషన్‌లో ఉండాలని, పురుష విద్యార్థుల ఏకాగ్రతకు భంగం కలిగించకుండా మసులుకోవాలని, ఆమె పరిశోధన ప్రమాణాల పట్ల సంతృప్తి చెందితేనే గుర్తింపునిస్తామనీ... ఇలా ఉన్నాయి ఆ షరతులు. అంతటి అవమానాన్నీ దిగమింగి పరిశోధనలో కొనసాగింది కమల. మొక్కల్లో చెరువులకు సంబంధించి సరికొత్త డిస్కవరీలు చేసి ఎమ్మెస్సీ పట్టా పుచ్చుకుంది. ఆమె ప్రతిభను గుర్తించిన సీవీ రామన్ తన నిర్ణయాన్ని మార్చుకుని ఐఐఎస్సీలో మహిళలను స్వాగతించారు. కమల సాహ్నీ పీహెచ్‌డీ చేసిన తొలి భారతీయురాలు. తరవాత మరో మూడు దశాబ్దాలకు ఇప్పటి ఇంజినీరింగ్‌లో చేరిన సుధ(మూర్తి) కూడా అవమానాలను భరించారు. ప్రతిభకు వివక్షను ప్రశ్నించి మరీ టెల్కోలో తొలి మహిళా ఇంజినీరుగా చేరారు. ఇలాంటి ఎందరో మహిళలు, సుజనలు తొలి విద్యార్థినులుగా ఆయా ఉన్నత విద్యాసంస్థల్లో ప్రవేశానికి పోరాటాలు చేశారు. తరగతి గదుల్లో ఒంటరిగా కూర్చున్నారు. అంతెందుకు... ముప్ఫయ్యేళ్ల క్రితం కేరళలోని కోజికోడ్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ప్రారంభించినప్పుడు తొలి బ్యాచ్‌లో 42 మంది విద్యార్థులకు ఒకే ఒక్క విద్యార్థిని చేరింది. అదే సంస్థ ఈ ఏడాది 55 శాతం యువతులను చేర్చుకుని చరిత్ర సృష్టించింది. విద్యార్థుల కన్నా విద్యార్థినుల సంఖ్య ఎక్కువగా ఉండటం సంస్థ చరిత్రలో ఇది నాలుగోసారి.

ఫలిస్తున్న ప్రత్యేక చర్యలు

పదో తరగతి, ఇంటర్ పరీక్షా ఫలితాల్లో తరచూ అమ్మాయిలదే పైచేయిగా ఉంటోంది. ఉత్తీర్ణతలోనూ ర్యాంకుల్లోనూ ముందువరసలో ఉంటున్న అమ్మాయిలు ఉన్నత విద్యావకాశాలను అందిపుచ్చుకోవడంలో ఇన్నాళ్లూ వెనకే ఉన్నారని చెబుతున్నాయి గణాంకాలు. 2021-22లో మొదటిసారి 2.07 కోట్ల మంది విద్యార్థినులు (48శాతం) ఉన్నతవిద్యలో చేరి రికార్డు సృష్టించారంటూ ఆలిండియా సర్వే ఆన్ హయ్యర్ ఎడ్యుకేషన్ నివేదిక ప్రకటించింది. అంతకు పదేళ్ల క్రితంతో పోలిస్తే డిగ్రీ కోర్సుల్లో 46శాతం, పీజీలో 55శాతం పెరుగుదల నమోదైంది. ఉన్నత విద్యలో చేరుతున్న విద్యార్థినుల సంఖ్య వేగంగా పెరుగుతూ వచ్చింది. అయితే అదే సమయంలో ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరుతున్న విద్యార్థినుల సంఖ్య తగ్గడం గమనార్హం. టెక్నాలజీ కోర్సులకన్నా మెడిసిన్, నాచురల్ సైన్సెస్ వైపు అమ్మాయిలు మొగ్గుచూపుతున్నారని గణాంకాలు పేర్కొంటున్నాయి. మెడిసిన్‌లో 2014-15 నుంచీ అబ్బాయిల కన్నా అమ్మాయిల చేరికలు చాలా ఎక్కువగా ఉంటున్నాయి. ఇటీవల తెలంగాణలోని ఉద్యాన విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో మొత్తం పదమూడు బంగారు పతకాల్లో 12 అమ్మాయిలే గెలుచుకున్నారు. బీఎస్సీలో ఉన్న ఎనిమిదీ వాళ్లే సాధించారు. కోర్సులు ఏవైనప్పటికీ మొత్తానికి ఉన్నత విద్యలో అమ్మాయిల హవా పెరగడం సంతోషించదగ్గ పరిణామం. స్త్రీవిద్యకు సమాజంలో పెరుగుతున్న ప్రాధాన్యంతో పాటు ప్రభుత్వ, విద్యాసంస్థల ప్రోత్సాహకాలూ అందుకు దోహదం చేస్తున్నాయి. కోజికోడ్ ఐఐఎం పుష్కరకాలంగా ప్రత్యేక చర్యలు తీసుకుంది. 'విమెన్ ఇన్ లీడర్‌షిప్' పేరుతో రకరకాల ప్రోగ్రామ్‌లను చేపట్టింది. స్ఫూర్తినిచ్చే ప్రసంగాలు, శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటుచేసింది. కేవలం గణాంకాల్లో ప్రగతి చూపడం మా ఉద్దేశం కాదు, సమాజానికి అవసరమైన భవిష్యత్ నాయకత్వాన్ని తీర్చిదిద్దడానికే ఈ చర్యలు... అంటోంది సంస్థ. మరికొన్ని ఐఐఎంలలోనూ ఇదే ట్రెండ్ కనిపిస్తోంది. సంబల్‌పూర్ ఐఐఎం గతేడాది ఏకంగా 76శాతం విద్యార్థినులను చేర్చుకుంది. విశాఖపట్నంలోనూ ఈసారి 51శాతం అమ్మాయిలు ఉన్నారు. అయితే అహ్మదాబాద్, బెంగళూరులాంటి పాత ఐఐఎంలు ఈ విషయంలో వెనకబడే ఉన్నాయి.

ప్రపంచవ్యాప్త ట్రెండ్

అంతర్జాతీయంగా కూడా ఉన్నత విద్యాసంస్థల్లో అమ్మాయిల సంఖ్య పెరుగుతోంది. 2023లో టూలేన్ యూనివర్సిటీలో 64శాతం మహిళలు ఉన్నారని న్యూయార్క్ టైమ్స్ పేర్కొంది. యూనివర్సిటీ ఆఫ్ అరిజోనా- ఫీనిక్స్‌లో అయితే 68 శాతం విద్యార్థినులే. ప్రపంచవ్యాప్తంగా పలు ప్రముఖ విశ్వవిద్యాలయాల్లో విద్యార్థినుల శాతాలే ఎక్కువగా ఉంటున్నాయి. ఆక్స్‌ఫర్డ్‌లో 51శాతం, హార్వర్డ్, యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా బెర్కెలీ, కార్నెల్‌లు 52, యేల్ 53, యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియా, జాన్ హాప్కిన్స్‌లు 55, యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా లాస్ ఏంజెలిస్ 56, లిబర్టీ యూనివర్సిటీ 59శాతం అమ్మాయిలతో కళకళలాడుతున్నాయి. అమెరికాలో 1982లో మొట్టమొదటిసారి అబ్బాయిలకన్నా అమ్మాయిలు ఎక్కువ మంది డిగ్రీ పట్టా పొందారు. అప్పటినుంచి ఈ ట్రెండ్ కొనసాగుతూ వచ్చింది. సమానత్వ సాధనకు ఆరోగ్యం, విద్య, ఆర్థిక భాగస్వామ్యం, రాజకీయాలు అనే నాలుగు పారామీటర్లను కొలుస్తారు. ఈ పరిణామాల ఫలితంగా ఆరోగ్యం తరవాత విద్యా రంగం కూడా అంతరాలను అధిగమించడంలో 95 శాతాన్ని దాటింది. ఉన్నత విద్యాసంస్థల్లో చేరడం, మంచి మార్కులతో పట్టాలు పుచ్చుకోవడం వరకూ బాగానే ఉంది కానీ ఆ తరవాతే వస్తోంది అసలు ప్రశ్న. ఆర్థిక భాగస్వామ్యంలోనూ అంతరాలను ఛేదించాలంటే చదువుకున్నవారంతా ఉద్యోగ వ్యాపారాల్లోకి రావాలి. కానీ పెళ్లి, కుటుంబం వారినలా రానివ్వడం లేదు. భర్త కెరీర్‌కే ఎక్కువ ప్రాధాన్యమిస్తూ, పిల్లల బాధ్యత తల్లికి మాత్రమే అంటగట్టే సమాజ ధోరణిలో మార్పు రావాలి. అన్నిరంగాల్లోనూ మహిళలు పనిచేసేందుకు వీలుగా సపోర్ట్ సిస్టమ్ ఏర్పాటులో ప్రభుత్వాలు చొరవ చూపాలి. అప్పుడే సమానత్వ స్వప్నం చేరువవుతుంది!

– డి.పద్మశ్రీ



హద్దులు తెలుసా?

కరణ్ ఒక కార్పొరేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు, మంచివాడు. ఎవరైనా తెలిసిన వాళ్లు డబ్బు సాయం అడిగితే కారణం అడక్కుండా, కాదనకుండా ఇచ్చేస్తాడు. ప్రతిసారీ అది మంచిది కాదని చెప్పినా వినడు. చాలామంది తిరిగి ఇవ్వరు, అతడూ అడగడు. దాంతో నెలాఖర్లో నానాతంటాలు పడుతుంటాడు.

సుధకి మొహమాటం ఎక్కువ. ఇంటర్వ్యూకి వెళ్తూ కంగారులో తీసుకెళ్లాల్సిన డాక్యుమెంట్ జిరాక్స్ ఒకటి మర్చిపోయింది. ఆఫీసుకు వెళ్లాక చూసుకుంది. అక్కడి వాళ్లను అడిగి ప్రింట్ తీసుకునే అవకాశం ఉన్నా ఏమనుకుంటారోనని మొహమాటపడింది. ఫలితం... మంచి ఉద్యోగావకాశాన్ని పోగొట్టుకుంది. పవన్‌కి భార్య అంటే చాలా ఇష్టం. అతడి దృష్టిలో అది ప్రేమే కానీ ప్రదర్శించేది మాత్రం పొసెసివ్‌నెస్. ఆమెను తన ఆస్తిలా పరిగణిస్తాడు. అన్నీ తన ఇష్టప్రకారమే చేయాలంటాడు. తను వేసుకోమన్న దుస్తులే వేసుకోవాలి, వెళ్లమన్న చోటికే వెళ్లాలి, మాట్లాడమన్న వాళ్లతోనే మాట్లాడాలి. తనకు నచ్చిన ఉద్యోగమే చేయాలి. అంతేకానీ ఆమెకూ ఇష్టాయిష్టాలు ఉంటాయన్న విషయమే పట్టించుకోడు. తన ఇష్టాలను భార్య మీద రుద్దడం వల్ల ఆమె ఎంత ఇబ్బంది పడుతోందో గమనించడు. దాంతో భర్త మీద ప్రేమ స్థానంలో ఆమెకి విసుగు, కోపం పెరిగిపోయాయి. చివరికి అతడితో తాను కాపురం చేయలేనంటూ పుట్టింటికి వెళ్లిపోయింది.

సిరి, రాహుల్ ప్రేమించుకున్నారు. పెద్దల అనుమతితోనే పెళ్లి చేసుకోవాలనుకున్నారు. ఇంతలో ఏదో విషయంలో ఇద్దరి మధ్యా చిన్న అభిప్రాయ భేదాలొచ్చాయి. మాట్లాడుకోవడం మానేశారు. కొన్నాళ్లకు రాహుల్ ఒకరోజున చాలా సార్లు ఫోన్ చేశాడు. సిరి స్పందించలేదు. బెట్టు చేయాలనుకుంది. కానీ ఆమె బెట్టు చాలించి రాహుల్‌ని కలుద్దామనుకునేసరికి అతడీ లోకంలోనే లేడు. పెద్ద యాక్సిడెంట్ అయ్యి మరణం అంచున ఉండి ఫోన్‌చేస్తే తాను తియ్యలేదని తెలిసినప్పటినుంచి సిరి తనను తాను క్షమించుకోలేకపోతోంది.

వీళ్లంతా ఎందుకిలా చిన్న విషయాలను తెగేదాకా లాగుతున్నారు? మన జీవితంలో ప్రతిదానికీ ఒక హద్దు అనేది ఉంటుంది. సాయానికీ, మొహమాటానికీ, మాట్లాడటానికీ, మాట్లాడకుండా ఉండటానికీ, ఒక మనిషి మీద శ్రద్ధ చూపడానికీ.. ఇలా ప్రతి సందర్భానికీ సరిహద్దు అనేది ఒకటి ఉంటుంది.. ఉండాలి కూడా. 'ఎక్కడ నెగ్గాలో కాదు.. ఎక్కడ తగ్గాలో తెలియాలి' అని సినిమాలో చెప్పినట్లు... ఎక్కడ, దేనికి, ఎంతవరకు సర్దుకుపోవాలో, ఎక్కడ మొహమాటం వదిలి మన హక్కులను నిలబెట్టుకోవాలో తెలుసుకోవాలి. స్నేహితులైనా, భార్యాభర్తలైనా.. పరస్పరం గౌరవించుకోవాలి. అప్పుడే అందరి జీవితాలు సంతోషంగా సాగుతాయి. లేదంటే.. సాయం మితిమీరితే కరణ్‌లా మనశ్శాంతి, మొహమాటం ఎక్కువైతే సుధలా ఉద్యోగం చేజారిపోవచ్చు. అతిగా జోక్యం చేసుకుని పవన్, పట్టించుకోవాల్సిన సమయంలోనూ పట్టించుకోకుండా సిరి.. భాగస్వాముల్ని దూరం చేసుకున్నట్లు అవుతుంది. అందుకే పట్టువిడుపులు ముఖ్యమన్నది గుర్తుంచుకోవాలి!

– అవధూత హరిప్రియ

చవకైన మార్గం

తక్కువ ఖర్చుతోనే భారీ మొత్తంలో సరకులను తరలించడానికి, ప్రజారవాణాకు జలమార్గాలు బాగా ఉపయోగపడతాయి. దేశీయంగా దాదాపు అన్ని ప్రాంతాల్లో నదులు, కాలువలు ప్రవహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వీలైనన్ని చోట్ల జాతీయ జలమార్గాలను(ఎన్‌డబ్ల్యూ) కేంద్రం అభివృద్ధి చేస్తోంది. 2014-15లో దేశవ్యాప్తంగా అలాంటి మార్గాలు మొత్తం కలిపి 2,716 కిలోమీటర్ల మేర అందుబాటులో ఉండేవి. 2023-24 నాటికి వాటి పొడవు 4,894 కిలోమీటర్లకు చేరింది. దేశీయంగా 2023-24లో వినియోగంలో ఉన్న ఆయా ఎన్‌డబ్ల్యూల పొడవు... (కిలోమీటర్లలో)

ఎన్‌డబ్ల్యూ-1 (గంగా-బాగీరథి-హుగ్లి నదీవ్యవస్థ- యూపీ, బిహార్, ఝార్ఖండ్, పశ్చిమ్ బెంగాల్)	1,620
ఎన్‌డబ్ల్యూ-2 (బ్రహ్మపుత్ర-అస్సాం)	891
ఎన్‌డబ్ల్యూ-100 (తాపి-గుజరాత్)	436
ఎన్‌డబ్ల్యూ-5 (ఒడిశాలోని కాలువ, నదీవ్యవస్థ)	233
ఎన్‌డబ్ల్యూ-73 (నర్మద-గుజరాత్)	226
ఎన్‌డబ్ల్యూ-3 (వెస్ట్ కోస్ట్ కాలువ-కేరళ)	205
ఎన్‌డబ్ల్యూ-97 (సుందర్బన్స్-ప.బెంగాల్)	172
ఎన్‌డబ్ల్యూ-94 (సోన్ నది-బిహార్)	141
ఎన్‌డబ్ల్యూ-16 (బరాక్ నది-అస్సాం)	121
ఎన్‌డబ్ల్యూ-31 (ధనసిరి/చాథే నది-అస్సాం)	114
ఎన్‌డబ్ల్యూ-64 (మహానది-ఒడిశా)	98
ఎన్‌డబ్ల్యూ-4 (కృష్ణా, గోదావరి-ఏపీ)	82

(ఆధారం: లోక్‌సభలో కేంద్రం వెల్లడించిన వివరాలు)

రుసుముల భారం... సామాన్యులకు దూరం!

బ్యాంకులు విధిస్తున్న అపరాధ రుసుములు సామాన్యుల నడ్డి విరుస్తున్నాయి. దాంతో అవి ఖాతాదారుల విశ్వాసాన్ని కోల్పోతున్నాయి. ఈ క్రమంలో బ్యాంకింగ్ వ్యవస్థ సామాన్య ప్రజలపై భారం తగ్గించే దిశగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

మన దేశంలో బ్యాంకింగ్ వ్యవస్థలోనే లోపాలు ఉన్నాయని, వాటివల్ల మధ్యతరగతి ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని తెలంగాణ హైకోర్టు ఇటీవల వ్యాఖ్యానించింది. హైదరాబాద్‌లోని ఓ భారతీయ స్టేట్ బ్యాంకు శాఖ నుంచి ఒక ప్రైవేట్ కంపెనీ తమ ఆస్తులను తాకట్టు పెట్టి రుణం తీసుకుంది. కాలపరిమితిలోపే మొత్తం రుణాన్ని వడ్డీతోపాటు తీర్చివేసింది. గడువుకన్నా ముందే అప్పు తీర్చడం నిబంధనలకు విరుద్ధమంటూ బ్యాంకు కోటి పదహారు లక్షల రూపాయల అపరాధ రుసుము వసూలు చేసింది. దీనిపై కంపెనీ హైకోర్టులో దాఖలు చేసిన వ్యాజ్యంపై విచారణ సందర్భంగా న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది.




అదనపు బాదుళ్లెన్నో...

మధ్యతరగతి ప్రజలు తమ సేవింగ్స్ ఖాతాలో జమ చేసుకున్న డబ్బుల నుంచి అవసరాల కోసం ఏటీఎం ద్వారా విత్‌డ్రా చేసుకోవడానికి చాలా బ్యాంకులు నెలవ్యవధిలో పరిమిత సంఖ్యలోనే ఉచిత అవకాశం కల్పిస్తున్నాయి. ఆ తరవాత చేసే ఉపసంహరణలపై అపరాధ రుసుము విధిస్తున్నారు. ఖాతాలోని పొదుపు డబ్బులను వెనక్కి తీసుకునే స్వేచ్ఛ కూడా ఖాతాదారులకు ఉండదా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఒకవైపు సేవింగ్స్ ఖాతాకు ఇచ్చే వడ్డీరేట్లు అత్యంత స్వల్పంగా ఉంటుండగా- నగదు బదిలీ, ఉపసంహరణ, మినిమం బ్యాలెన్స్ వంటి వాటికి మాత్రం రుసుములు విధిస్తున్నారనే విమర్శలున్నాయి. కాలపరిమితి డిపాజిట్లను ముందుగానే ముగించినా వడ్డీలో ఎంతోకొంత కోత పడుతోంది. నగదు బదిలీ, చెక్కుల ద్వారా చెల్లింపులు, జమలు, జారీ చేసిన చెక్కు ఏ కారణంగా తిరస్కరణకు గురైనా అపరాధ సుంకం విధిస్తున్నారు. ఇళ్లు, వాహనాల కొనుగోళ్లకు సంబంధించి ఎలాంటి రుణాలైనా రిజర్వు బ్యాంకు రుణ విధానాన్ని అనుసరించే వడ్డీరేట్లు ఉంటాయి. వడ్డీ లేదా వాయిదా కట్టలేకపోయిన సందర్భాల్లో చక్రవడ్డీ వసూలు చేయడం కూడా బ్యాంకుల వ్యాపార విధానమే. రుణం తీసుకునేందుకు వసూలు చేసే ప్రాసెసింగ్ రుసుము, తాకట్టు పెట్టే ఆస్తుల తనిఖీ నిమిత్తం తీసుకునే రుసుము, న్యాయ సలహా కోసం బ్యాంకు న్యాయవాది ఫీజు తదితరాలన్నీ అదనపు భారాలే. అప్పు ముందుగానే పూర్తిగా చెల్లించేందుకు అపరాధ రుసుములు విధించడాన్ని చూస్తే, రుణవిముక్తిని సైతం అపరాధంగా భావిస్తున్నట్లు అర్థమవుతోంది.

దేశంలో బ్యాంకింగ్ వ్యవస్థ అభివృద్ధికి రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్ నరసింహన్ అనేక సంస్కరణలు ప్రవేశపెట్టారు. బ్యాంకింగ్ రంగం సామాన్యులకు సైతం అందుబాటులో ఉండేలా ఎన్నో సంస్కరణలను సూచించినా, అవి పూర్తిస్థాయిలో అమలు కాలేదు. ప్రభుత్వరంగ బ్యాంకుల మూలధనంలో సర్కారు వాటా కనీసం 51శాతం ఉంటుంది. అవి ప్రభుత్వ యాజమాన్యంలోనే పని చేస్తాయి. ప్రైవేటు తదితర బ్యాంకులు లాభాలపై ఆశతో తమ ఖాతాదారుల నుంచి అధిక రుసుములు వసూలు చేసినా, ప్రభుత్వ రంగానికి చెందిన బ్యాంకులైనా సామాన్య, మధ్య తరగతి ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకోవాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వరంగ బ్యాంకులు సైతం జరిమానాలు విధించడం, అపరాధ రుసుములు వసూళ్లకు పోటీ పడుతుండటం దురదృష్టకరం.

ప్రజలకు చేరువైతేనే...

బ్యాంకులు సులభతరమైన రుణ సౌకర్యాలు కల్పిస్తూ, నిర్వహణ వ్యయం, ఆర్థిక పరిపుష్టి కోసం తగినన్ని లాభాలను ఆర్జించాలనుకోవడం ఆమోదయోగ్యమే. అయితే, అపరాధ రుసుములు, అనవసరమైన జరిమానాలు, సామాన్యులను భయపెట్టే నిబంధనలు, తీవ్ర జాప్యానికి దారితీసే నియమాలు వంటి అంశాలన్నీ మధ్యతరగతి ఖాతాదారులను బ్యాంకింగ్ వ్యవస్థకు మరింత దూరం చేస్తాయి. ఇదే సమయంలో కొన్ని ప్రైవేటు ఆర్థిక సంస్థలు సామాన్యుల్ని మభ్యపెట్టి, ఆకర్షించి ఆర్థికంగా దండుకుంటున్నాయి. ఈ క్రమంలో బ్యాంకులు ఆరోగ్యకరమైన విధానాలను అమలు చేయడం మేలు. సామాన్య ప్రజలకు పొదుపు పథకాలపై అవగాహన కలిగించడం, సరైన వడ్డీరేట్లు నిర్ణయించడం ద్వారా మరిన్ని డిపాజిట్లు సేకరించవచ్చు. బ్యాంకు ప్రాంగణంలో ఆహ్లాదకరమైన, సానుకూల వాతావరణాన్ని కల్పించాలి. ఖాతాదారులతో సమావేశాలు, ఫిర్యాదులపై తక్షణ చర్యలు, సులభతరమైన నిబంధనలు, అనవసర రుసుముల రద్దు, మెరుగైన సేవలు అందించడం వంటి వాటి ద్వారా బ్యాంకులు ప్రజలకు మరింతగా చేరువవ్వాలి. తద్వారా బ్యాంకింగ్ వ్యవస్థ ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలి. అప్పుడే వికసిత్ భారత్ సుసాధ్యమవుతుంది.



రావులపాటి వెంకట రామారావు

విశ్రాంత ఆచార్యులు, స్టేట్ బ్యాంక్ ట్రెయినింగ్ సెంటర్ ఫర్ రీజనల్ రూరల్ బ్యాంక్స్

హాయ్! బుజ్జీ!!

స్నేహితులు!

ఈ ఏడాది తరుణ్ కొత్త స్కూల్లో చేరాడు. ఆ ఊరు కూడా కొత్తదే. తెలిసిన స్నేహితులెవరూ లేరు. పైగా తనకు మొహమాటం ఎక్కువ. తనంతట తానుగా అస్సలు మాట్లాడలేడు. రోజూ ఒక్కడే కూర్చుంటుంటే ఏం చేయాలో తోచట్లేదు తరుణ్‌కి. స్కూల్లో కూడా ఎవరైనా పలకరిస్తే అంత వరకే జవాబు చెప్పి ఊరుకునేవాడు. తను కాస్త పొట్టిగా ఉంటాడు.. పొడుగ్గా ఉన్నవాళ్లు తనని ఏడిపిస్తారేమో అని భయపడేవాడు. బాగా చదివే వాళ్లు తక్కువగా



చూస్తారేమోనని ఆలోచించేవాడు. ఎక్కువగా అల్లరి చేసే పిల్లలతో కలిస్తే టీచర్లు కోప్పడతారేమోనని దూరంగా ఉండేవాడు. కానీ అందరిలా తనకంటూ కొంతమంది స్నేహితులు ఉంటే బాగుండని అనుకునేవాడు. ఇలా ప్రతి విషయాన్నీ తనలో తనే ఎక్కువగా ఊహించేసుకుని ఇబ్బంది పడేవాడు తరుణ్.

తను ఎప్పటిలాగే ఒకరోజు సైకిల్ మీద స్కూల్‌కి వెళ్తున్నాడు. దారిలో క్లాస్‌మేట్ శివ రోడ్డు మీద పడిపోయి కనిపించాడు. బ్యాగ్‌లోని బుక్స్ అన్నీ చెల్లాచెదురుగా పడ్డాయి. వెంటనే తరుణ్ పరిగెత్తుకుంటూ వెళ్లి శివకు సాయం చేశాడు. తరవాత ఇద్దరూ కలిసి స్కూల్‌కి వెళ్లిపోయారు. అప్పటి నుంచి తరుణ్, శివ మంచి స్నేహితులయ్యారు. క్లాస్‌లో మిగతా వాళ్లని కూడా పరిచయం చేశాడు శివ. అందరూ తనతో చాలా బాగా మాట్లాడారు. రోజూ కలిసి ఆడుకుంటున్నారు కూడా! 'నన్ను వెక్కిరిస్తారని, ఇంకేదో అంటారేమోనని ఏవేవో ఊహించుకుని అనవసరంగా బాధపడ్డాను. కానీ అందరూ నాతో బాగుంటున్నారు. ఇంకెప్పుడూ అలా ఆలోచించకూడదు' అనుకున్నాడు తరుణ్.

– డాక్టర్ హరిక చెరుకుపల్లి




DMart®
Daily Discounts Daily Savings
మీ కాలేజీ చదువును స్టైల్‌గా ప్రారంభించండి
DMart ready
షాప్ ఆన్‌లైన్
GET IT ON Google Play
Download on the App Store
కాలేజీ మర్చండైజ్
ఎంఆర్‌పిపై 15%-35% తగ్గింపు బ్రాండెడ్ లాంగ్‌బుక్ మరియు నోట్‌బుక్‌లు
₹275* మాత్రమే జెకె కాపీయర్ పేపర్ ఎ4 (21 సెం.మీ x 29.7 సెం.మీ) 70 జిఎస్ఎమ్ 500 షీట్లు ఎంఆర్‌పి ₹355
కనీసం 20% ఎంఆర్‌పిపై తగ్గింపు పెన్నులు
₹299*# నుంచి కాలేజ్ బ్యాగు
₹399*# నుంచి ల్యాప్‌టాప్ బ్యాగు
₹199*# మాత్రమే ఎగ్జిక్యూటివ్ ఫోల్డర్ 12 పాకెట్ ఫైల్ ఎంఆర్‌పి ₹290
₹49*# నుంచి పర్సులు
₹249*# నుంచి బాస్కెట్‌బాల్
₹129*# మాత్రమే స్టెల్లో ఫ్యూరో స్పోర్ట్ బాటిల్ 720 ఎమ్‌ఎల్ ఎంఆర్‌పి ₹205
₹149*# నుంచి స్టీల్ బాటిల్
₹399*# మాత్రమే జిబ్రానిక్స్ హెడ్ ఫోన్స్ ఎంఆర్‌పి ₹799
₹359*# నుంచి ట్రిమ్మర్
₹399*# నుంచి హెయిర్ డ్రైయర్
₹149*# నుంచి బెల్ట్
₹99*# నుంచి సన్ గ్లాసెస్
₹379*# మాత్రమే ఫుట్‌బాల్ ఎంఆర్‌పి ₹470
మాన్సూన్ స్పెషల్
₹349*# నుంచి గొడుగు
₹449*# నుంచి జీల్ రెయిన్ సూట్
₹149*# మాత్రమే పోంచో ఎంఆర్‌పి ₹199
₹799*# నుంచి స్పిన్ మాప్
₹49*# నుంచి క్లాత్ క్లిప్ 12 పీసెస్
₹229*# నుంచి పురుషుల షూస్
₹359*# నుంచి బాటా లేడీస్ బెల్లీ షూస్
డైలీ ఎసెన్షియల్స్ అండ్ గ్రోసరీ
కొనండి 1 పొందండి 1 ఉచితంగా ఫాగ్ నెపోలియన్ డియో స్ప్రే 150 మి.లీ ఎంఆర్‌పి ₹275*
₹199* మాత్రమే ఫాగ్ సెంట్ ఇంప్రెసియో యా డి మెన్ పెర్ఫ్యూమ్ 75 మి.లీ ఎంఆర్‌పి ₹499
కొనండి 1 పొందండి 1 ఉచితంగా నివియా మెన్ డీప్ ఇంప్యాక్ట్ ఫ్రెష్‌నెస్/ పియర్ల్ అండ్ బ్యూటీ రోల్-ఆన్ 50 మి.లీ ఎంఆర్‌పి ₹249*
కొనండి 1 పొందండి 1 ఉచితంగా మీరా స్ట్రాంగ్ అండ్ హెల్తీ షాంపూ 340 మి.లీ ఎంఆర్‌పి ₹447*
₹227* మాత్రమే గోద్రేజ్ సింథాల్ ఒరిజినల్ సబ్బు 4x150 గ్రాములు ప్రతి ఎంఆర్‌పి ₹282
₹210* మాత్రమే స్టేఫ్రీ సెక్యూర్ కాటన్ ఎక్స్‌ట్రా లార్జ్ 40 ప్యాడ్ ఎంఆర్‌పి ₹275
₹355* మాత్రమే కెల్లాగ్స్ మ్యూస్లీ ఫ్రూట్ అండ్ నట్ 750 గ్రాములు ఎంఆర్‌పి ₹525
కొనండి 1 పొందండి 1 ఉచితంగా సన్‌ఫీస్ట్ డార్క్ ఫాంటసీ ఛోకో ఫిల్స్ 471.5 గ్రాములు ఎంఆర్‌పి ₹350*
₹20* మాత్రమే బ్రిటానియా గోబుల్స్ ఫ్రూట్ ఫన్ / ఛోకో చిల్ కేక్ 100 గ్రాములు ఎంఆర్‌పి ₹30
₹79* మాత్రమే సన్‌ఫీస్ట్ యిప్పీ మ్యాజిక్ మసాలా నూడుల్స్ 480 గ్రాములు ఎంఆర్‌పి ₹120
₹899* మాత్రమే కల్పవి జంబో ప్యాక్ కాజు 1 కేజీ ఎంఆర్‌పి ₹1,299
₹389* మాత్రమే డాబర్ హనీ 1.3 కేజీ ఎంఆర్‌పి ₹635
₹490* మాత్రమే బ్రూ ఇన్‌స్టంట్ కాఫీ 200 గ్రాములు ఎంఆర్‌పి ₹740
₹549* మాత్రమే రెడ్ బుల్ ఎనర్జీ డ్రింక్ బాక్స్ 6x250 మి.లీ ప్రతి ఎంఆర్‌పి ₹700
₹43* మాత్రమే లూస్ చక్కెర 1 కిలో
₹44* మాత్రమే లూస్ సోనా మసూరి కర్నూల్ రైస్ 1 కిలో
₹33* మాత్రమే లూస్ గోధుమ పిండి 1 కిలో
₹101* మాత్రమే లూస్ తాండూర్ కంది పప్పు 1 కిలో
₹75* మాత్రమే లూస్ శనగపిండి 1 కిలో
₹51* మాత్రమే లూస్ అటుకులు 1 కిలో
₹120* మాత్రమే లూస్ వేరుశనగ 1 కిలో
₹59* మాత్రమే లూజ రౌండ్ జాగరీ 1 కిలో
₹419* మాత్రమే బాదంపప్పు 500 గ్రాములు ఎంఆర్‌పి ₹621
₹459* మాత్రమే కాజు 500 గ్రాములు ఎంఆర్‌పి ₹704
దుస్తులు
₹199*# నుంచి లేడీస్ క్యాజువల్ టాప్‌లు
₹199*# నుంచి లేడీస్ ఎత్నిక్ షార్ట్/లాంగ్ కుర్తా
₹499*# నుంచి లేడీస్ డ్రెసెస్
₹249*# నుంచి లేడీస్ సాండిల్స్
₹279*# నుంచి లేడీస్ షూస్
₹199*# నుంచి లేడీస్ క్యాజువల్ షర్ట్
₹349*# నుంచి లేడీస్ జెగ్గింగ్
₹199*# నుంచి లేడీస్ క్యాజువల్ లోయర్
₹449*# నుంచి పురుషుల కాటన్ చినోస్
₹199*# నుంచి పురుషుల క్యాజువల్ షూస్
₹99*# నుంచి పురుషుల ఫ్యాన్సీ టీ-షర్ట్
₹199*# నుంచి పురుషుల క్యాజువల్ ఫార్మల్ షర్ట్
₹349*# నుంచి పురుషుల ఫార్మల్ ట్రౌజర్/జీన్స్
₹149*# నుంచి పురుషుల ఫ్యాషన్ షార్ట్స్
ఎంఆర్‌పిపై కనీసం 25% తగ్గింపు అన్ని బ్రాండెడ్ పురుషుల అండర్ గార్మెంట్స్
ట్రెండింగ్ వార్డ్‌రోబ్ లుక్స్
పురుషుల క్యారెక్టర్ టీ-షర్ట్‌లు @ ₹299*# నుంచి
పురుషుల క్యాజువల్ షర్ట్‌లు @ ₹499*# నుంచి
పురుషుల ఫ్యాషన్ జీన్స్ @ ₹799*# నుంచి
లేడీస్ ఫ్యాషన్ టీ-షర్ట్‌లు టాప్‌లు @ ₹199*# నుంచి
లేడీస్ క్యాజువల్ బాటమ్ వేర్ @ ₹299*# నుంచి
లేడీస్ డెనిమ్ @ ₹349*# నుంచి
లేడీస్ కుర్తా సెట్ @ ₹599*# నుంచి
కనీసం 6% డిస్కౌంట్
విజయవాడ: 0866-2434671 • విజయవాడ - 2 ఎయిర్‌పోర్ట్ రోడ్: 0866-2841026 • బెంజ్ సర్కిల్: 0866-2473752 • గొల్లపూడి: 0866-2410021 • నున్న క్రష్: 0866-2411080 • మచిలీపట్నం: 0867-2254001 • గుడివాడ: 9989903522 • కుంచనపల్లి గుంటూరు డీమార్ట్: 7794946598
నాజ్ సెంటర్ గుంటూరు: 0863-2228329 • గుంటూరు రింగ్ రోడ్డు: 0863-2335002 • మధురవాడ (వైజాగ్ 1): 0891-2524270/275 • మర్రిపాలెం: 0891-2976630 • గాజువాక: 0891-2744230 • సూర్యబాగ్: 0871-2625188 • అగ్రహారం విజయనగరం ఏపి డిమార్ట్: 8922294861 • కాకినాడ: 0884-2371630
ఏలూరు (గోదావరి): 08812-242993 • రాజమండ్రి (పాలకుంపేట): 7416271451 • రామచంద్రపేట: 0883-2475777 • తుని-వైజాగ్: 8985251174/9440552385 • భీమవరం: 8121206325 • ధణుకు: 08819-295903 • టురంగి, కాకినాడ: 088-2944895 • కర్నూలు: 08518-256670 • అనంతపూర్: 0855-4249980
కంచరపాలెం, వైజాగ్: 9154837509 • జోహరాపురం కర్నూలు-2: 8333998757 • అనకాపల్లి: 9063793582 • ఖమ్మం (తెలంగాణ): 08742-220003 • ఒంగోలు: 0859-2234057 • గోపాలపట్నం వైజాగ్: 8125038242 • గంగూరు: 0866-2580018 • నరసరావుపేట: 0864-7231077 • షీలా నగర్: 7075449530
తాడేపల్లిగూడెం: 8712402565 • నూజివీడు: 8712402562
**విజయవాడ మరియు విశాఖపట్నంలో మాత్రమే లభిస్తోంది
చిత్రాలు ప్రాతినిధ్య ప్రయోజనాల కోసం మాత్రమే • ఉత్పత్తి ఆఫర్లు స్టాక్‌లు ఉండే వరకు చెల్లుబాటు అవుతాయి • స్థానాలను బట్టి ధరలు మరియు ఆఫర్లు మారవచ్చు
ప్రదర్శించబడే బ్రాండ్‌లు సంబంధిత బ్రాండ్ యజమానుల స్వంతం • ^నిర్వహణ తన అభీష్టానుసారం ధరలను మార్చడానికి మరియు ఉత్పత్తులను విక్రయించే హక్కును కలిగి ఉంది. • నియమ నిబంధనలు వర్తిస్తాయి • *రిటైల్ విక్రయ ధర • #
1 ఎన్
Impulse/07/25


కరేడు గ్రామసభలో పాల్గొన్న సబ్ కలెక్టర్ శ్రీపూజ, చిత్రంలో వైకాపా ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు, భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ రాజశేఖర్


భూములు ఇవ్వబోమంటూ అధికారులకు తెగేసి చెబుతున్న గ్రామస్థులు

చావనైనా చస్తాంగానీ.. భూములివ్వం

(మొదటి పేజీ తరువాయి)

మధ్యాహ్నం 3.30కు మొదలైన గ్రామసభ కాసేపటికే రైతుల నినాదాలు, అధికారులతో వాగ్వాదంతో మార్మోగింది. పోలీసుల జోక్యంతో రైతులు ఆందోళన విరమించినా.. భూములిచ్చేది మాత్రం లేదని ముక్తకంఠంతో చెప్పారు. 'ఇండోసోల్ వద్దు.. సేవ్ కరేడు' అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఓ వ్యక్తి లేచి మాట్లాడుతూ, 'ఎకరా భూమికి ఎంత పరిహారం ఇస్తారు. భూసేకరణకు సంబంధించి ఎలాంటి పత్రాలు అందించాలి' అని అధికారులను అడగడంతో.. రైతులంతా ఒక్కసారిగా అతనిపై విరుచుకు పడ్డారు. అసలు ఆ వ్యక్తి తమ గ్రామానికి చెందినవాడు కాదని, బయటి నుంచి వచ్చి ఇక్కడ ఎలా మాట్లాడతారంటూ అతనిపై దాడికి దిగారు. పోలీసులు అడ్డుకుని, రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా ఆందోళన విరమించలేదు. అతన్ని తమకు అప్పగించాలంటూ నినాదాలు చేశారు. చివరకు గ్రామపెద్దల జోక్యంతో వివాదం సద్దుమణిగింది.

భూములిచ్చేసి మేం కూలి పనులకు వెళ్లాలా?

గ్రామసభలో మొదట డిప్యూటీ కలెక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ.. అభివృద్ధి కావాలంటే పరిశ్రమలు రావాలని, కొందరు రైతులు భూములు త్యాగం చేయాలని చెప్పడంతో వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. 'భూమి మా జీవనాధారం. మా భూముల్ని అమ్ముకోం. అభివృద్ధి పేరుతో ఇండోసోల్ కంపెనీకి మా సాగు భూముల్ని అప్పగించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇది మా భవిష్యత్తుకు ముప్పు. ఇప్పటికే వ్యవసాయం, పాడి రంగాల్లో అభివృద్ధి చెందిన మా ప్రాంతాన్ని పరిశ్రమల పేరుతో నాశనం చేస్తామంటే అంగీకరించేది లేదు. వ్యవసాయం తప్ప మరో వృత్తి తెలియని మేమంతా.. మా భూములిచ్చేస్తే పక్క గ్రామాల్లో కూలి పనులకు పోవాలి. చావడానికైనా సిద్ధపడతాం తప్ప ఎట్టి పరిస్థితుల్లోనూ భూములివ్వం' అని రైతులు కుండబద్దలు కొట్టారు.

సబ్ కలెక్టర్ నచ్చజెప్పేందుకు యత్నించినా..

రైతులు, గ్రామస్థులకు నచ్చజెప్పేందుకు సబ్‌కలెక్టర్ ప్రయత్నించారు. పరిశ్రమలతో ఉపాధి వస్తుందని, రైతుల్లో భయాలు, అపోహలు తొలగించేందుకే తాము వచ్చామని తెలిపారు. పరిశ్రమకు భూమి కేటాయింపు ప్రక్రియ ప్రాథమిక దశలోనే ఉందని, ఇంకా నిర్ణయం తీసుకోలేదని వివరించారు. దీనిపై రైతులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. 'మాకు ఎలాంటి అపోహలు, భయాలు లేవు. పరిశ్రమలకు భూమి ఇచ్చే ప్రసక్తే లేదు. మాకు తెలియకుండా భూములు కేటాయిస్తే ఊరుకోం' అని స్పష్టంచేశారు. చివరకు రైతుల అభిప్రాయాల్ని సబ్ కలెక్టర్ రాతపూర్వకంగా స్వీకరించారు. వాటిని ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. రైతు సంఘాలు, పొరాటకమిటీ సంఘాలు రైతులకు మద్దతు పలికాయి. వైకాపా ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు రైతులకు మద్దతుగా గ్రామసభలో పాల్గొన్నారు. కరేడు ప్రాంతంలో సౌర విద్యుత్ ప్యానెళ్ల తయారీతోపాటు, విద్యుదుత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ఇండోసోల్ కంపెనీ ముందుకొచ్చింది. దీనికి 8,234 ఎకరాలు అవసరమని ప్రభుత్వం గుర్తించింది. తొలి విడతలో 4,912 ఎకరాలు సేకరించేందుకు జూన్ 21న ముసాయిదా నోటిఫికేషన్ జారీ చేసింది. కరేడుతో పాటు 16 చిన్నాపెద్దా గ్రామాలకు చెందిన భూములు సేకరించాలన్నది ప్రతిపాదన.

ముగ్గురితో పోరాడాం

(మొదటి పేజీ తరువాయి)

ఒకటే. శత్రువులిద్దరు. వాస్తవంగా చూస్తే ముగ్గురు. ఎదురుగా పాకిస్థాన్ ఉంది. ఆ దేశానికి చైనా పూర్తి సహకారం అందించింది. పాకిస్థాన్ దగ్గర ఉన్న 81 శాతం సైనిక పరికరాలు బీజింగ్‌వే. తన ఆయుధాలను చైనా ఈ ఘర్షణలో పరీక్షించుకుంది. తుర్కియే కూడా కీలక పాత్ర పోషించింది. డీజీఎంవో స్థాయి చర్చలు జరిగినపుడు మనకు సంబంధించిన ముఖ్యమైన నిఘా సమాచారాన్ని ఎప్పటికప్పుడు పాకిస్థాన్‌కు చైనా అందించింది. మనకు పటిష్ఠమైన గగనతల రక్షణ వ్యవస్థ అవసరం ఎంతైనా ఉంది" అని రాహుల్ సింగ్ తెలిపారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్ నాయకత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు అందాయని, పక్కా డేటా ఆధారంగా పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని లక్ష్యాలను ఎంపిక చేసుకున్నామని చెప్పారు.

నౌకాదళంలో మహిళా ఫైటర్ల శకం ఆరంభం


వింగ్స్ ఆఫ్ గోల్డ్ పురస్కారం అందుకుంటున్న లెఫ్టినెంట్ అతుల్‌కుమార్ దుల్

(మొదటి పేజీ తరువాయి)

పొందుతారు. ఈస్టర్న్ నేవల్ కమాండ్‌కు చెందిన నేవల్ ఎయిర్‌స్టేషన్ 'ఐఎన్ఎస్ డేగా'లో శుక్రవారం జరిగిన రెండో ప్రాథమిక 'హాక్ కన్వర్షన్ కోర్సు' ముగింపు వేడుకల్లో 'వింగ్స్ ఆఫ్ గోల్డ్' పురస్కారాలు ప్రదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జనక్ బెవ్లీ మాట్లాడుతూ.. భారత నౌకాదళంలో ఇప్పటికే మహిళా అధికారులు పైలట్లుగా సముద్ర నిఘావిమానాలు, హెలికాప్టర్లలో విధులు నిర్వర్తిస్తున్నారని, అయితే నౌకాదళ యుద్ధ విమానాలు నడపనున్న తొలి మహిళగా ఆస్తా పూనియా చరిత్ర సృష్టిస్తున్నారని చెప్పారు. అనంతరం హాక్ కన్వర్షన్ కోర్సులో ప్రతిభ చూపిన లెఫ్టినెంట్ అతుల్‌కుమార్ దుల్, సబ్ లెఫ్టినెంట్ ఆస్తా పూనియాలకు ప్రతిష్ఠాత్మక 'వింగ్స్ ఆఫ్ గోల్డ్' పురస్కారాలు అందజేశారు.



పని మొదలుపెట్టండి.. అదే అన్నీ నేర్పిస్తుంది

పనిని వాయిదా వేసే మనస్తత్వం ఉన్నవారు తమకు ఆ దురలవాటు ఉన్నట్లు అంగీకరించలేరు. అందుకే తాము అన్ని విధాలా సిద్ధమయ్యాకే పని మొదలు పెడతామని చెబుతుంటారు. అలాంటి వారు చేయాల్సింది ఒక్కటే.. తక్షణం పని మొదలుపెట్టడం. ఆ తర్వాత పనే అన్నీ నేర్పిస్తుంది. సవాళ్లు విసిరి సామర్థ్యాలను పెంచుకొనేలా చేస్తుంది. ఎదురుదెబ్బలతో వ్యూహాలను మెరుగుపరుచుకొనేలా చేస్తుంది. ఆత్మవిశ్వాసం పెంపొందించి విజయతీరాలకు చేరుస్తుంది.

– అమీ పెచాసెక్, లీడర్షిప్ ఎక్స్‌పర్ట్

బంగారు కుటుంబాలకు పథకాల్లో కోత ఉండదు

- వారికి ఆర్థిక చేయూత అందించేందుకే పీ4 కార్యక్రమం
- ఫౌండేషన్ కమిటీ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు



సచివాలయం నుంచి పీ-4పై మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లతో 'జూమ్'లో సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో సీఎస్ విజయానంద్ ● సీఎం ఖరారు చేసిన పీ-4 లోగో

ఈనాడు, అమరావతి: బంగారు కుటుంబాలుగా ఎంపికైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో కోత ఉండబోదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టీకరించారు. 'సంక్షేమ పథకాలకు.. పీ4కి సంబంధం లేదు. ఈ విషయం ప్రజలకు అర్థమయ్యేలా చెప్పండి. సంక్షేమం కొనసాగిస్తూనే బంగారు కుటుంబాలకు ఆర్థిక చేయూత అందిస్తాం' అని చెప్పారు. పీ4 అమలుకు స్వర్ణాంధ్ర పీ4 ఫౌండేషన్ కమిటీ సాధారణ సమావేశం సీఎం చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం సచివాలయంలో జరిగింది. ఈ సందర్భంగా జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌కు ప్రజాప్రతినిధులు, జిల్లా, మండలస్థాయి అధికారులు హాజరయ్యారు. పీ4 సమర్థ అమలుకు రాష్ట్రస్థాయిలో ఎగ్జిక్యూటివ్ కమిటీ, అడ్వైజర్ కమిటీలు, జిల్లా, నియోజకవర్గ స్థాయిలో పీ4 చాప్టర్లు ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. పీ4 స్ఫూర్తిని చాటేలా రూపొందించిన లోగోను చంద్రబాబు ఖరారు చేశారు. దీన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు.

నియోజకవర్గానికి మేలుచేసే అవకాశం

ఎమ్మెల్యేలు సేవ చేసేందుకు పీ4 కార్యక్రమం మంచి అవకాశమని.. నమ్ముకున్న నియోజకవర్గానికి ఎంతో మేలు చేయొచ్చని చంద్రబాబు సూచించారు. 'ప్రతి నియోజకవర్గంలో 6-10వేల బంగారు కుటుంబాలు ఎంపిక కాబోతున్నాయి. దీన్ని సద్వినియోగం చేసుకోవాలి. పేదలకు సాయం చేసేందుకు చాలామంది ముందుకొస్తున్నారు. పీ4 అమలుపై ఎమ్మెల్యేలు, అధికారుల మధ్య పోటీ రావాలి. స్థానికంగా ఏ నియోజకవర్గంలో పరిశ్రమలు ఉంటే.. వారు అక్కడి బంగారు కుటుంబాలను దత్తత తీసుకునే విధానం అమలుచేస్తాం. ధనవంతులు పెద్దగా ఉండని ఏజెన్సీ ప్రాంతాల్లో.. బంగారు కుటుంబాలకు మార్గదర్శకులను అనుసంధానించడంపై ప్రభుత్వం శ్రద్ధ పెడుతోంది' అని పేర్కొన్నారు.

కుత్తుకలు కోస్తామంటే బెదిరిపోం



మార్కాపురంలో వెలిగొండ పథకం శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్. చిత్రంలో బాలినేని శ్రీనివాసరెడ్డి, మహీధర్ రెడ్డి (మన్నెం?) శ్రీనివాసరెడ్డి, షేక్ రియాజ్, దామచర్ల జనార్దనరావు, విజయకుమార్, కందుల నారాయణరెడ్డి, డీవీ స్వామి, ఆనం రామనారాయణరెడ్డి, మాగుంట శ్రీనివాసులరెడ్డి, బాలాజీ తదితరులు ● సభకు వచ్చిన జనం

(మొదటి పేజీ తరువాయి)

డైలాగులు సినిమాలో చెప్పడానికే ఇబ్బందిగా ఉంటుందని, వాళ్లు కోస్తామంటే తామేమీ సిద్ధంగా లేమని అన్నారు. ప్రకాశం జిల్లా మార్కాపురంలో రూ.1,290 కోట్ల విలువైన జలజీవన్ మిషన్ పనులకు శుక్రవారం ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. ప్రకాశం జిల్లా దేశంలోనే తీవ్ర కరవుతో ఉన్న ప్రాంతమని, తాము కనిగిరిలో ఉన్నప్పుడు ఇక్కడ ఫ్లోరైడ్ నీటితో కాళ్లు, నడుం వంగిపోయాయని చెప్పడంతో ఆరు నెలల్లో వేరే ప్రాంతానికి వెళ్లిపోవాల్సి వచ్చిందన్నారు. నాలుగు దశాబ్దాల కిందటే ఈ సమస్యను గుర్తించిన తాను మొదటి ప్రాధాన్యంగా ప్రకాశం ప్రాంతానికి జలజీవన్ మిషన్ నిధులు ఖర్చుపెట్టాలని వెల్లడిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో 10 లక్షల మందికి తాగునీరందనుందని తెలిపారు. ఈ పథకాన్ని ఏడాదిన్నరలో పూర్తిచేస్తామని చెప్పారు.

జలజీవన్‌కు ప్రాణం పోశాం..

2019-24 మధ్య కాలంలో జలజీవన్ పథకం కింద రాష్ట్రానికి రూ.26,000 కోట్లు కేటాయిస్తే, రాష్ట్ర మ్యాచింగ్ గ్రాంటు ఇవ్వకపోవడంతో నిధులు మురిగిపోయాయని పవన్ తెలిపారు. కేవలం రూ.4,000 కోట్లు ఖర్చు చేశారని, అవి కూడా కేవలం పైపులు వేసి వదిలేశారన్నారు. కనీసం నీళ్లు ఎక్కడ నుంచి వస్తాయనే ఆలోచన కూడా చేయలేదని ఆరోపించారు. తాను అధికారంలోకి వచ్చిన తరువాత కేంద్ర ప్రభుత్వాన్ని అడిగితే జలజీవన్ నిధులను ఆపేశారు. దీంతో తాను, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెళ్లి జలశక్తి మంత్రిని కలిసి విన్నవించామన్నారు. ప్రకాశంతో పాటు అనంతపురం, పల్నాడు, శ్రీకాకుళం ప్రాంతాలకు నీరందించేందుకు రూ.86,000 కోట్లు అవసరమవుతాయని వివరించామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వంపై నమ్మకంతో భారీ ఎత్తున నిధులు ఇస్తున్నారన్నారు. పార్లమెంట్ సభ్యులను పెద్దసంఖ్యలో గెలిపించడంతోనే ఇదంతా జరుగుతోందని వివరించారు. మార్కాపురంలోని చెన్నకేశవస్వామి దేవస్థానం భూముల ఆక్రమణల గురించి ప్రస్తావిస్తూ.. వైకాపా నాయకులు దేవాదాయ శాఖ భూములను పెద్దఎత్తున ఆక్రమించారని వాటిపై చర్యలు తీసుకోవాలని వేదికపై ఉన్న దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కోరారు.


మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆత్మీయ ఆలింగనం

కూటమిలో ఒకరికొకరం గౌరవించుకోవాలి..

కూటమి ప్రభుత్వంలో తెదేపా, జనసేన, భాజపా నాయకులు ఒకరికొకరు గౌరవం ఇచ్చి పుచ్చుకోవాలని పవన్ కల్యాణ్ నాయకులకు హితవు పలికారు. ఒకరు ఎక్కువ, మరొకరు తక్కువ కాదన్నారు. తిట్టించుకుని తిట్టుకుంటూ లేస్తే.. పిల్లలు కొట్టుకుంటూ లేస్తారని, గ్రామస్థాయిలో నాయకుల మధ్య కొన్ని ఇబ్బందులున్నా అంతా కలిసికట్టుగా ముందుకెళ్లాలని సూచించారు. 'బాజాపా లేకుంటే జలజీవన్ నిధులు ఇన్ని రావని తెలిపారు. చంద్రబాబు పాలనలో అపార అనుభవం ఉంది.. నాకు పోరాడే శక్తి ఉంది.. అనుభవం లేదు.' అని పవన్ అన్నారు. గత పాలకులు రెచ్చగొట్టినా రెచ్చిపోవద్దని హితవు పలికారు. కూటమి ప్రభుత్వం దిన్ని ముక్కున ఉంటుంది, 15 ఏళ్ల స్థిరత్వం ఉన్నే తప్ప అభివృద్ధి సాధ్యం కాదన్నారు. అందుకే పదిహేనేళ్లు కలిసి ఉంటామని చెబుతున్నానన్నారు. తనకు పార్టీ కంటే, కూటమి ప్రభుత్వం కంటే ప్రజల సంక్షేమమే ముఖ్యమని ఆయన పేర్కొన్నారు.

అందుకే బాలినేనిని తీసుకున్నాం

మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి మార్కాపురం సభావేదికపై ప్రత్యేక చర్చనీయాంశమైంది. ప్రసంగం చివర్లో పవన్ కల్యాణ్ ఆయన గురించి మాట్లాడుతూ బాలినేని రాజకీయం ఎలా చేయాలో తెలిసిన వ్యక్తి అని, సమస్యలపై బలంగా మాట్లాడతారన్నారు. తనకు అన్నివిధాల సాయంగా నిలిచారని తెలిపారు. కష్ట సాధింపుల పాల్పడే వ్యక్తి కాదని పేర్కొన్నారు. కుటుంబంలోకి కొత్త సభ్యులు వచ్చినప్పుడు కొన్ని ఇబ్బందులుంటాయని సర్దుకుపోవాలని వివరించారు. అంతా కలిసి ప్రకాశం జిల్లా అభివృద్ధికి కృషి చేయాలన్నారు. సభలో మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, అధికారులు పాల్గొన్నారు.

ఆగస్టుకల్లా కొత్త పాస్ పుస్తకాలు

(మొదటి పేజీ తరువాయి)

స్థలాలు ఇచ్చేందుకు రెవెన్యూ, గృహ నిర్మాణ, మున్సిపల్ శాఖల మంత్రులతో కమిటీని ఏర్పాటుచేయాలి. రాష్ట్రంలో ఇప్పటివరకు 99,390 మంది ఇంటిస్థలాల కోసం దరఖాస్తు చేయగా 2,051 ఎకరాలను సేకరించాలి. గతంతో పోల్చుకుంటే రెవెన్యూశాఖ పనితీరు కొంత మెరుగుపడింది. పూర్తి స్థాయి సంతృప్తి సాధించేందుకు మరింత కష్టపడాలి" అని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో రెవెన్యూ శాఖ పనితీరుపై శుక్రవారం సీఎం సమీక్షించారు.

2027 డిసెంబరు నాటికి రీసర్వే పూర్తిచేయాలి

"ప్రతి పట్టాదారు పాసు పుస్తకంపై క్యూఆర్ కోడ్‌తో పాటు ఆధార్ నంబరు ఆధారంగా ప్రతి యజమాని తమ సొంత భూమి వివరాలు తెలుసుకునే వెసులుబాటు కల్పించాలి. ప్రభుత్వం తెచ్చిన కొత్త జీవోలు, విధానాలపై కొత్త రెవెన్యూ మాన్యువల్ ఆగస్టు నాటికి తేవాలి. భూముల రీసర్వే 2027 డిసెంబరు నాటికి పూర్తికావాలి. నాలా చట్టం రద్దుకు కసరత్తు పూర్తిచేసి మంత్రివర్గ సమావేశం ముందుకు తీసుకురావాలి" అని సీఎం స్పష్టంచేశారు.

ప్రొటోకాల్ విధుల నుంచి మినహాయింపు

"రెవెన్యూ అధికారులను ప్రొటోకాల్ డ్యూటీల నుంచి మినహాయించాలి. మంత్రులు జిల్లాలకు వెళ్లినప్పుడు వాళ్ల శాఖ అధికారులు వెళ్తే చాలు. డిప్యూటీ కలెక్టర్ అనేది పనిష్మెంట్ పోస్టు కాదు. వారికి సదుపాయాలు కల్పించి, వారితో పని చేయించుకోవాలి. వాట్సప్ గవర్నెన్స్‌లో వాడుకలో లేని సర్వీసులను తొలగించాలి. వచ్చే అక్టోబరు నాటికి ప్రతి ఒక్కరికీ శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాల పంపిణీ పూర్తిచేయాలి" అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

భూ వివరాలు కనిపించేలా పోర్టల్

రెవెన్యూ శాఖ కొత్త పోర్టల్ గురించి సీఎం చంద్రబాబుకు ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి, సీసీఎల్ఏ అదనపు కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి వివరించారు. "రాష్ట్రంలోనూ భూముల స్వరూపాన్ని, ఇతర వివరాలను పోర్టల్ ద్వారా చూడొచ్చు. భూమిని గుర్తించగానే దాని యజమాని, ఇతర వివరాలు కనిపిస్తాయి. ఆ ప్రాంతంలో ఉన్న అడవులు, ప్రభుత్వ భూములు, రోడ్లు, నీటి ప్రాంతాలు, చెరువులు, ఆక్రమణల్లో ఉన్న స్థలాలు, వివాదాల్లో ఉన్న స్థలాల వివరాలు కూడా స్క్రీన్‌పై కనిపిస్తాయి. క్రయ విక్రయాల సమయంలో సులువుగా ఉంటుంది" అని అధికారులు సీఎంకు తెలియజేశారు. ఈ పోర్టల్‌ను సమగ్రంగా తీసుకురావాలని, మంచి పేరు పెట్టాలని అధికారులకు సీఎం సూచించారు. 'కూటమి ప్రభుత్వ వచ్చాక నిర్వహించిన 17,600 రెవెన్యూ సదస్సుల్లో 1.85 లక్షల దరఖాస్తులు అందాయి. వీటిలో 668 మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. రెవెన్యూ శాఖకు సంబంధించి 4,50,603 విజ్ఞప్తులు రాగా, 3,99,645 పరిష్కరించాం. ఆటో మ్యుటేషన్ కింద 1.93 లక్షలు దరఖాస్తులు వస్తే.. వాటిలో 1.77 లక్షలు పరిష్కరించాం. అధికారుల స్థాయిలో పరిష్కరించలేని సమస్యలు, న్యాయపరమైన చిక్కులు ఉంటే అర్జీదారులకు వివరిస్తున్నాం' అని అధికారులు సీఎంకు తెలిపారు.

ఫ్రీహోల్డ్ భూములపై డిసెంబరు నాటికి తుది నివేదిక

- భూ వినియోగ మార్పిడికి 4% డెవలప్‌మెంట్ ఫీజు ఉండాలని ప్రతిపాదన
- మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడి



ఈనాడు, అమరావతి: నిషిద్ధ జాబితా నుంచి తప్పించిన ఫ్రీహోల్డ్ భూముల విషయంలో తీసుకోవాల్సిన చర్యలపై తుది నివేదికను అక్టోబరు 2 నాటికి ప్రభుత్వానికి మంత్రివర్గ ఉపసంఘం అందజేస్తుందని రెవెన్యూమంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. రెవెన్యూ శాఖపై శుక్రవారం సీఎం చంద్రబాబు సమీక్ష సమావేశం ముగిసిన అనంతరం సచివాలయంలో మంత్రి విలేకర్లతో మాట్లాడారు. 'నాలా రద్దుపై మంత్రుల ఉపసంఘం సుదీర్ఘంగా చర్చించింది. దీనిపై మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం జరుగుతుంది. భూ వినియోగ మార్పిడికి 4% డెవలప్‌మెంట్ ఛార్జీ ఉండాలని ఉపసంఘం అభిప్రాయపడింది. జర్నలిస్టులకు ప్రభుత్వం స్థలాలు ఇవ్వడంలో చట్టపరమైన ఇబ్బందులు ఉన్నాయి. రిజిస్ట్రేషన్ల శాఖ మార్కెట్ విలువను అనుసరించి స్థలాలు ఇవ్వొచ్చని నేను సూచించా. దీనిపై మంత్రుల కమిటీ నిర్ణయం తీసుకుంటుంది.

గ్రామ సచివాలయాల్లో సర్వేయర్ పోస్టుల కొనసాగింపు: రీసర్వే పూర్తయ్యే వరకూ గ్రామ సచివాలయాల్లో సర్వేయర్ల పోస్టులను హేతుబద్ధీకరించకుండా యథావిధిగా కొనసాగించేందుకు సీఎం ఆమోదం తెలిపారు. గ్రామ సచివాలయాల్లోని వీఆర్వోల పోస్టులను హేతుబద్ధీకరించొద్దని ప్రభుత్వాన్ని కోరాను. సర్వే, రిజిస్ట్రేషన్, రెవెన్యూ శాఖలను బ్లాక్‌చైన్ టెక్నాలజీ ద్వారా అనుసంధానం చేయబోతున్నాం. 40 వేల మంది రైతులు పట్టాదారు పాసు పుస్తకాలు లేకున్నా బ్యాంకుల నుంచి రుణాలు పొందారు. ఎస్టీలు ఉన్న 363 ఆవాసాల్లో మూడు దశల్లో శ్మశానవాటికల నిర్మాణానికి రూ.137 కోట్ల మంజూరుకు సీఎం ఆమోదం తెలిపారు. రెవెన్యూ శాఖ పనితీరు చాలా బాగుందని ప్రజాభిప్రాయ సేకరణలో తేలింది. సదస్సులలో వచ్చిన అర్జీల పరిష్కారంపై సేకరించిన అభిప్రాయంలో 2.5 మార్కులతో ప్రథమస్థానంలో ఉన్నాం. పీజీఆర్ఎస్‌లో రెవెన్యూ శాఖకు ఐదో స్థానం లభించింది. రెవెన్యూ శాఖ పనితీరు బాగుందని సీఎం చంద్రబాబు అభినందించారు' అని అనగాని వివరించారు. విలేకర్ల సమావేశంలో రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి, సీసీఎల్ఏ అదనపు కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కేంద్ర కొలువులపై ఎందుకీ అనాసక్తి?

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుతం స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నుంచి సీహెచ్ఎస్ఎల్-2025 నోటిఫికేషన్ వెలువడింది. ఇంటర్ విద్యార్హతతో ఎల్‌డీసీ, సెక్రటేరియట్ అసిస్టెంట్/డేటా ఎంట్రీ ఆపరేటర్ విభాగాల్లో 3,131 ఖాళీల భర్తీ చేయనున్నారు. ● డిగ్రీ విద్యార్హతతో యూపీఎస్సీ నిర్వహించే పరీక్షల తరువాత ఎస్ఎస్‌సీ సీజీఎల్ ఎగ్జామ్ ముఖ్యమైంది. దీని ద్వారా కేంద్ర విభాగాల్లో గ్రూప్-బీ, సీ కేటగిరిల ఉద్యోగాలను భర్తీ చేస్తారు. ప్రస్తుతానికి 14,582 పోస్టులకు నోటిఫికేషన్ వెలువడింది. ● మల్టీ టాస్కింగ్ స్టాఫ్ (ఎంటీఎస్) 1,075 పోస్టుల (హవల్దార్-అటెండర్) భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశారు. దీనికి పదో తరగతి విద్యార్హత.

ప్రణాళికతో సన్నద్ధమైతే..: ఉద్యోగ స్థాయిని అనుసరించి.. జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్, జనరల్ అవేర్‌నెస్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, ఇంగ్లిష్ కాంప్రహెన్షన్ విభాగాల్లో ప్రశ్నలు ఇస్తున్నారు. "లక్ష్యాన్ని నిర్దేశించుకుని పక్కా ప్రణాళికతో సన్నద్ధమైతే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు దక్కించుకోవడం కష్టమేమీ కాదు. డిగ్రీ చదివే సమయంలోనే సాధనపై దృష్టి పెట్టాలి" అని పోటీ పరీక్షల రంగ శిక్షణ నిపుణుడు సుధీర్ చక్రవర్తి వెల్లడించారు.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో తెలుగు వారి ఎంపిక ఇలా..

పరీక్ష పేరు	పోస్టులు	2022		2023		2024	
		జాతీయస్థాయిలో ఎంపికైన వారు	తెలుగు అభ్యర్థులు	జాతీయస్థాయిలో ఎంపికైన వారు	తెలుగు అభ్యర్థులు	జాతీయస్థాయిలో ఎంపికైన వారు	తెలుగు అభ్యర్థులు
సీజీఎల్	అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్/ అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్	1,462	44				
	ఇన్‌కంటాక్స్ ఇన్‌స్పెక్టర్, కస్టమ్స్ ఇన్‌స్పెక్టర్, ఇతర	34,522	1,056	7,849	162	17,909	375
సీహెచ్ ఎస్ఎల్	ఎల్‌డీసీ, సెక్రటేరియట్ అసిస్టెంట్ తదితర ఉద్యోగాలు	3,242	66	1,205	12	3,419	64
ఎంటీఎస్	ప్యూన్, చౌకీదార్	10,871	177	1,346	11	8,049	148
	సెక్యూరిటీ	192	2	383	4	3,422	80
జీడీ	కానిస్టేబుల్ (మహిళలు)	4,988	239	4,818	209		
	(పురుషులు)	40,229	1,924	38,603	1,523		

శ్రీశైలం తెదేపాలో భగ్గుమన్న వర్గ విభేదాలు

- మాజీ మంత్రి ఏరాసుపై ఎమ్మెల్యే రాజశేఖరరెడ్డి వర్గీయుల దాడి
- ఎంపీ బైరెడ్డి శబరి పర్యటనలో ఉద్రిక్తత


డీఎస్పీ వాహనంలో ఏరాసు ప్రతాపరెడ్డి

ఈనాడు- అమరావతి, న్యూస్‌టుడే- ఆత్మకూరు, ఆత్మకూరు పట్టణం: నంద్యాల జిల్లా శ్రీశైలం నియోజకవర్గ తెదేపాలో వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. ఆత్మకూరులో మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డిపై శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అనుచరులు శుక్రవారం దాడి చేయడంతోపాటు రాళ్లతో ఆయన ఇంటి అద్దాలు పగలగొట్టారు. దివ్యాంగుల సహాయ పరికరాల పంపిణీకి దరఖాస్తులు స్వీకరించేందుకు ఎంపీ బైరెడ్డి శబరి శుక్రవారం ఉదయం ఆత్మకూరు వచ్చారు. కార్యక్రమానికి ఇంకా సమయం ఉండటంతో మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి ఇంట్లో అల్పాహారానికి వెళ్లారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా ప్రతాపరెడ్డి ఇంటి పక్కనే ఉన్నవారిని కలిసేందుకు ఎంపీ వెళ్లారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి అనుచరులు ఎంపీని అడ్డుకున్నారు. స్థానికంగా తమకు సమాచారం ఇవ్వకుండా.. ప్రొటోకాల్ ప్రకారం ఎమ్మెల్యే పాల్గొనకుండా నియోజకవర్గంలో ఎలా పర్యటిస్తారంటూ ఆమెను నిలదీశారు. ఎమ్మెల్యే అనుచరులకు, ఎంపీకి మాటామాటా పెరిగింది. దీంతో ఆమె కారులో తన కార్యాలయానికి వెళ్లిపోయారు. దీనంతటికీ ఏరాసు ప్రతాపరెడ్డే కారణమని భావించిన బుడ్డా వర్గీయులు పెద్దసంఖ్యలో ఆయన ఇంట్లోకి చొరబడ్డారు. ఏరాసుపై చేయి చేసుకున్నారు. పోలీసులు తెదేపా కార్యకర్తలను వెళ్లగొట్టారు. ఏరాసుకు డీఎస్పీ నచ్చజెప్పి తన కారులో ఆత్మకూరు పొలిమేర దాటించారు.


ఏరాసు ఇంటిపై దాడి చేస్తున్న ఎమ్మెల్యే బుడ్డా వర్గీయులు

ఎంపీడీవో కార్యాలయం వద్దకు చేరుకుని..


ఎంపీ శబరి ఆత్మకూరు ఎంపీడీవో కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన శిబిరానికి వస్తారని ఎమ్మెల్యే వర్గీయులు అక్కడికి చేరుకున్నారు. విషయం తెలిసి శబరి 2 గంటలపాటు తన కార్యాలయంలోనే ఉండిపోయారు. డీఎస్పీ ఎంపీడీవో కార్యాలయం వద్దకు వచ్చి ఎంపీ శిబిరం వద్దకు రారని చెప్పడంతో కార్యకర్తలు వెళ్లిపోయారు. మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీ ఆత్మకూరు నుంచి వెనుదిరిగారు.

ఎంపీ, ఎమ్మెల్యేలను వివరణ కోరిన అధిష్ఠానం

ఈ వివాదంపై పార్టీ అధిష్ఠానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎంపీ, ఎమ్మెల్యేలను క్రమశిక్షణ కమిటీ ముందు హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశించినట్లు సమాచారం. ప్రతాపరెడ్డినీ పిలిపించి మాట్లాడనున్నారు.


విజయ్ సేల్స్
నమ్మకం ముఖ్యం
www.vijaysales.com
విజయ్ సేల్స్
ఓపెన్ బాక్స్ సేల్
ఓపెన్ బాక్స్ స్టాక్ క్లియరెన్స్ మరియు మరెన్నో
డిస్‌ప్లే • ఆఖరి పీస్
చివరి 2 రోజులు
60%* వరకు తగ్గింపు
SAVINGS 63% OFF VISE TELEVISION 32 (80 cm) Google TV
PRICE ₹34,000 OFFER PRICE ₹12,490
ZERO DOWN PAYMENT | EMI ₹1,562 X 8 MONTH*
ALSO AVAILABLE
SAVINGS 54% OFF 43 (108 CM) 4K UHD LLOYD TELEVISION
PRICE ₹49,990 CASHBACK UPTO ₹2,000 OFFER PRICE ₹22,990
ZERO DOWN PAYMENT | EMI ₹2,874 X 8 MONTH*
SAVINGS 62% OFF 75 (189 CM) 4K UHD TCL TELEVISION
PRICE ₹2,00,990 CASHBACK UPTO ₹5,000 OFFER PRICE ₹74,990
DOWN PAYMENT ₹24,997 | EMI ₹6,249 X 8 MONTH*
SAVINGS 25% OFF SONY 5.1 CH SOUNDBAR HT-S20R
PRICE ₹23,990 OFFER PRICE ₹17,990
SAVINGS 38% OFF BLUE STAR NORMAL AND COLD WATER DISPENSER
PRICE ₹14,600 OFFER PRICE ₹8,990
UPTO 59% OFF AIR CONDITIONER
1.5T 3 STAR INVERTER STARTING AT ₹28,990
1.5T 5 STAR INVERTER STARTING AT ₹33,990
LG Godrej LLOYD VOLTAS HITACHI
SAVINGS 33% OFF LG FROST FREE REFRIGERATOR 272 Litres CASHBACK ₹2,500
PRICE ₹41,899 OFFER PRICE ₹27,990*
SAVINGS 50% OFF BAJAJ WATER HEATER 10 Litres
PRICE ₹16,780 OFFER PRICE ₹8,349
UPTO 60% OFF IT & MOBILE ACCESSORIES
boAt Marshall noise PORTRONICS BOSE JBL
UPTO 50% OFF CHIMNEY & COOKTOP
elica FABER KAFF BOSCH HÄFELE
SAVINGS 43% OFF EUREKA FORBES WATER PURIFIER
PRICE ₹30,000 OFFER PRICE ₹16,999
UPTO 30% OFF MICROWAVE OVEN
Haier LG IFB SAMSUNG Godrej
SAVINGS 25% OFF IFB WASHING MACHINE 8 Kg
CASHBACK UPTO ₹2,000 PRICE ₹47,080 OFFER PRICE ₹35,499
మళ్ళీ స్కూల్‌కి
మొబైల్ | ల్యాప్‌టాప్ | యాక్సెసరీస్
iPhone 16 (128 GB)
10% OFF* DISCOUNT ₹8,700* CASHBACK ₹4,000*
PRICE ₹79,900
EMI Starting at ₹2,967
MacBook Air
Sky high performance with
M4 Starting from ₹79,900*
M2 Starting from ₹67,300*
STUDENT GET UPTO 10% OFF*
Upto ₹10,000* Instant cashback & No Cost EMI on credit cards of SBI card | ICICI Bank | kotak + Exchange bonus Up to ₹10,000* Available at stores only.*
OnePlus 13R
From ₹42,999*
Available now
ICICI Bank ₹3,000 Instant Discount On ICICI Bank Credit Cards & EMI | *T&C Apply
oppo Reno14 Series 5G AI Portrait Camera Pre-Book Now
Starting from ₹37,999
Powered by ColorOS
Redmi Note 14 5G Series
Super Camera. Super AI.
Starting at ₹16,999*
Available Now
vivo V50e
Portrait So Pro
Starting at ₹30,999
hp
PAVILION, VICTUS, SPECTRE, OMEN, ENVY
• Cashback Upto Rs. 15000/-*
• Fossil Watch @ Rs. 999/-*
• 1st Year ADP @ Rs. 999/-*
Lenovo
LENOVO GAMING YOGA SERIES SLIM 5 & FLEX 5, LOQ
• Cashback / Exchange Bonus Upto Rs. 10000/-*
• 2 Year Warranty + 2 Year Premium Care + 1 Year ADP @ Rs. 1999/-*
• Upto 24 Months EMI Option
DELL Technologies
INSPIRON, INSPIRON GAMING, ALIENWARE, XPS
• Cashback Upto Rs. 10000/-*
• Dell Stereo Headset @ Rs. 999/-*
• Canon Printer @ Rs. 1999/-*
acer
ASPIRE, SWIFT, SPIN, NITRO PREDATOR
• Cashback upto Rs. 5000/-*
• Free Gaming Monitor
• 2 Year Gaming Warranty @ Rs. 1999/-*
ASUS
ROG, STRIX, ZENBOOK, TUF GAMING, ZEPHYRUS DUO
• Cashback upto Rs. 3000/-*
• Gaming Warranty Srarting @ Rs. 999/-*
• Asus Wireless Mouse @ Rs. 99/-*
For special discounts on corporate and builder enquiries, please email us at b2b@vijaysales.com
UPTO ₹10,000/- INSTANT DISCOUNT & CASHBACK ON CREDIT CARD / DEBIT CARD & PAPER FINANCE ON
HDFC BANK | AMERICAN EXPRESS | ONECARD | IDFC FIRST BANK
YES BANK | DBS BANK | VISA CANARA
విజయ్ సేల్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్
ఆంధ్ర ప్రదేశ్ | హైదరాబాద్ | వరంగల్ | ముంబయి | పూణే | అహ్మదాబాద్ | సూరత్ | వడోదర | ఢిల్లీ | గురుగ్రామ్ | నోయిడా | ఇందిరాపురం | ఫరీదాబాద్ | ఘజియాబాద్
SCAN FOR STORES
విజయవాడ - ఎం జి రోడ్ రజనీ కుమార్ - 96665 03755 ప్రసన్న - 70362 15153
విజయవాడ - ఎన్‌టీఆర్ సర్కిల్ ఈశ్వర్ - 88866 53042 చక్రపాణి - 91333 16947
రాజమండ్రి - జె ఎల్ ఎన్ రోడ్ గౌతం - 91549 03693 కిరణ్ - 87120 32657
రాజమండ్రి - ఇన్నీస్‌పేట్ సతీష్ - 88866 74548 నారాయణ - 73373 76253
తిరుపతి - ఎం ఆర పల్లి కిరణ్ - 99482 28111 విజయ్ కుమార్ - 87126 35822
తిరుపతి - లీలా మహల్ వేణు - 73373 76215 వెంకటేష్ - 91543 85029
కాకినాడ - అపోలో హాస్పిటల్ ప్రక్కన శివ గంగాధర్ - 91543 16627 నాగశ్రీ - 73373 76220
వైజాగ్ - దొండపర్తి రమేష్ - 99482 41112 కిరణ్ కుమార్ - 91549 03528
Scan to Shop Online www.vijaysales.com
*Conditions apply. This offer includes all other discounts also. No other offer can be clubbed with this offer. Images shown are for illustrative purpose only. Offer till stocks last. Finance offer applicable at the sole discretion of Financier. #Processing Fees and other charges is applicable as per Financier Bank. For Paper Finance: Please bring Aadhaar Card, Pan Card, Electric Bill & Cancelled Cheque. Offer is based on minimum transactions slabs defined by Finance company. Kindly speak to our store sales staff for the "Terms and Conditions" of all the bank offers, and for the respective Instant Discount/Cashback amounts applicable on each Bank. Upto 60% off on select brands and models only. *Cashback Applicable Select Banks & Cards

హరహర మహాదేవ



అమర్‌నాథ్ గుహాలయంలో శుక్రవారం దర్శనమిచ్చిన హిమలింగం. జమ్మూలోని భగవతీ నగర్ బేస్ క్యాంప్ నుంచి తాజాగా మూడో విడతలో 6,400 మంది యాత్రికులు మహాశివుడి దర్శనానికి బయలుదేరారు

కుడి ఎడమైతే కుంగుబాటే

జ్ఞాన నేత్రం

దిల్లీ: ఎడమ చేతి వాటం సృజనాత్మకతను సూచిస్తుందనే నమ్మకానికి శాస్త్రీయ ఆధారాలు లేవని కార్నెల్ విశ్వవిద్యాలయం(అమెరికా), చైనీస్ విశ్వవిద్యాలయ (హాంకాంగ్) పరిశోధకులు తేల్చారు. వారు 1900 సంవత్సరం నుంచి జరిగిన వివిధ అధ్యయనాలను పరిశీలించి ఈ నిర్ధారణకు వచ్చారు. ఎడమ చేతి వాటం వ్యక్తులు ప్రపంచ జనాభాలో 10 శాతం ఉంటారు. అయితే ఎడమ చేతి వాటం వారు.. కళాకారులు, సంగీతకారుల్లో ఎక్కువగా కనిపించడం వల్ల పై భావన బలపడింది. కానీ ఈ తరహా వ్యక్తుల్లో మానసిక కుంగుబాటు, స్కిజోఫ్రెనియా వ్యాధులూ ఎక్కువేనని పరిశోధకులు హెచ్చరించారు. ఎడమ చేతి వాటం కన్నా కుడి చేతి వాటం మనుషుల్లోనే సమస్యా పరిష్కార శక్తి అధికమని అధ్యయనంలో తేలింది.

జడ్జీల్లో కాదు.. న్యాయంలో దేవుడిని చూడండి

- సుప్రీంకోర్టు ధర్మాసనం వ్యాఖ్య

దిల్లీ: న్యాయవాదులు దేవుడిని జడ్జీల్లో కాకుండా న్యాయంలో చూడాలని సుప్రీంకోర్టు ధర్మాసనం హితవు పలికింది. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ఓ దేవాలయం కేసులో విచారణ సందర్భంగా జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్, జస్టిస్ కె.వి.వినోద్ చంద్రన్ ధర్మాసనం శుక్రవారం ఈ వ్యాఖ్యలు చేసింది. క్లయింట్ తన మాట వినడం లేదని, పైగా జడ్జీలు న్యాయవాదుల ద్వారా పనులను చక్కబెట్టుకుంటున్నారని ఆరోపిస్తున్నారని, ఇది తనకు ఆవేదన కలిగించిందని ఓ న్యాయవాది తెలిపారు. ఏదైనా మోసం జరుగుతుందని తెలిస్తే కేసులను వదులుకుంటామని, జడ్జీల్లో దేవుడిని చూసుకుంటామని ఆ న్యాయవాది పేర్కొన్నారు. దీనికి జస్టిస్ సుందరేశ్ స్పందిస్తూ.. 'జడ్జీల్లో కాదు..న్యాయంలో దేవుడిని చూడండి' అని తెలిపారు.

మత విశ్వాసాల్లో ఎవరి పక్షానా నిలబడం

దలైలామా వారసుడిపై భారత్

దిల్లీ, బీజింగ్: మత విశ్వాసాలకు సంబంధించిన అంశంలో భారత్ ఎవరి పక్షానా నిలబడదని విదేశీ వ్యవహారాలశాఖ స్పష్టం చేసింది. దేశంలో ప్రతి ఒక్కరి మత స్వేచ్ఛను ప్రభుత్వం ఎల్లప్పుడూ సమర్థిస్తుందని, అలాగే కొనసాగిస్తుందని విదేశీ వ్యవహారాలశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ శుక్రవారం వెల్లడించారు. "తన వారసత్వం కొనసాగుతుందని దలైలామా ప్రకటించిన వార్తలను మనం చూశాం. మేము, విశ్వాసానికి సంబంధించిన అంశాల్లో భారత ప్రభుత్వం ఎవరి పక్షానా నిలబడదు" అని జైశ్వాల్ ప్రకటించారు.

ఆచితూచి నిర్ణయం తీసుకోండి

వారసుడి ఎంపికపై నిర్ణయం తీసుకునే హక్కు టిబెట్ ఆధ్యాత్మిక గురువు దలైలామాకే ఉందని కేంద్రమంత్రి కిరణ్ రిజిజు చేసిన వ్యాఖ్యలపై చైనా తీవ్రంగా స్పందించింది. టిబెట్‌కు సంబంధించిన విషయాల్లో భారత్ జోక్యం తగదని, ఇది తమ అంతర్గత వ్యవహారమని తెలిపింది. ఇరుదేశాల మధ్య సంబంధాలు దెబ్బతినకుండా తన మాటల్లో, చేతల్లో భారత్ జాగ్రత్త వహించాలని కోరింది.

నవ భారత్‌కు ఆకాశమూ హద్దు కాదు

- అభివృద్ధి ఫలాలు ఆపన్నులకు అందుతున్నాయ్: మోదీ
- ట్రినిడాడ్ అండ్ టొబాగోలో భారత సంతతి ప్రజలతో ఆత్మీయ భేటీ
- ప్రధానికి ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారం



ప్రధాని మోదీకి 'ది ఆర్డర్ ఆఫ్ ది రిపబ్లిక్ ఆఫ్ ట్రినిడాడ్ అండ్ టొబాగో' పురస్కారాన్ని అందిస్తున్న ఆ దేశాధ్యక్షురాలు క్రిస్టీన్ కర్లా

పోర్ట్ ఆఫ్ స్పెయిన్: ప్రపంచంలోకెల్లా మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా త్వరలోనే భారత్ అవతరిస్తుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ధీమాగా చెప్పారు. కృత్రిమ మేధ (ఏఐ), సెమీకండక్టర్లు, క్వాంటమ్ కంప్యూటింగ్ రంగాల్లో చేపడుతున్న మిషన్లు దేశానికి కొత్త వృద్ధి ఇంజిన్లుగా మారుతున్నాయని పేర్కొన్నారు. నవ భారత్ ప్రగతికి ఆకాశం కూడా హద్దు కాదని వ్యాఖ్యానించారు. కరీబియన్ దేశమైన ట్రినిడాడ్ అండ్ టొబాగోలో తాజాగా పర్యటించిన మోదీ.. ఆ దేశంలోని భారత సంతతి ప్రజలతో ఆత్మీయ సమావేశంలో ప్రసంగించారు. భారత్‌ను అవకాశాల గనిగా అభివర్ణించారు. దేశాభివృద్ధి ఫలాలు ప్రస్తుతం ఆపన్నులకు అందుతున్నాయని పేర్కొన్నారు. ట్రినిడాడ్ అండ్ టొబాగోలోని భారత సంతతి వ్యక్తులపై ప్రశంసల వర్షం కురిపించారు. వారంతా భారత నేలను విడిచిపెట్టారు తప్ప ఆత్మను వదల్లేదని అన్నారు. గంగా, యమునలను వదిలివచ్చినా.. రామాయణాన్ని మాత్రం తమ గుండెల్లోనే దాచుకున్నారని పేర్కొన్నారు. వారు కేవలం వలసదారులు కాదని, సనాతన నాగరికతకు దూతలని వ్యాఖ్యానించారు. వారి సేవలు ట్రినిడాడ్ అండ్ టొబాగోకు సాంస్కృతికంగా, ఆర్థికంగా, ఆధ్యాత్మికంగా లబ్ధి చేకూర్చాయన్నారు. ట్రినిడాడ్ అండ్ టొబాగో పార్లమెంటు సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి కూడా మోదీ ప్రసంగించారు. ఉగ్రవాదం మానవాళికి శత్రువని పేర్కొన్నారు. దానికి ఆశ్రయం నిరాకరించే అంతర్జాతీయ సమాజం ఒక్కటిగా నిలవాలన్నారు. మరోవైపు- తమ దేశ అత్యున్నత పౌర పురస్కారమైన 'ది ఆర్డర్ ఆఫ్ ది రిపబ్లిక్ ఆఫ్ ట్రినిడాడ్ అండ్ టొబాగో'ను ఆ దేశ అధ్యక్షురాలు క్రిస్టీన్ కర్లా కంగలూ ప్రధాని మోదీకి ప్రదానం చేశారు. ఈ పురస్కారాన్ని దక్కించుకున్న తొలి విదేశీ నేత మోదీయే కావడం విశేషం. ఆయన అందుకున్న 25వ అంతర్జాతీయ అవార్డు ఇది. సృజనాత్మక, శక్తిమంతమైన యువత సహాయంతో దేశం వేగంగా పురోగమిస్తోందని భారత సంతతి ప్రజలతో సమావేశంలో మోదీ పేర్కొన్నారు. యూపీఐ చెల్లింపుల విధానాన్ని అమలు చేస్తున్నందుకు ట్రినిడాడ్ అండ్ టొబాగోను మోదీ అభినందించారు. వెస్టిండీస్ క్రికెటర్ల బౌలింగ్ కంటే వేగంగా యూపీఐ లావాదేవీలు జరుగుతున్నాయంటూ చమత్కరించారు.

జడ్జీల ఎంపికలో అన్ని వర్గాలకూ ప్రాతినిధ్యం

- సీజేఐ జస్టిస్ గవాయ్ వెల్లడి



ముంబయి: జడ్జీల నియామకాన్ని చేపట్టే కొలీజియం విధానంలో పూర్తి పారదర్శకత తీసుకొస్తామని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ బి.ఆర్. గవాయ్ పేర్కొన్నారు. అభ్యర్థుల ప్రతిభా పాటవాల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని, సమాజంలోని అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం కల్పిస్తామని ఆయన వెల్లడించారు. శుక్రవారం బాంబే బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాంబే హైకోర్టులో జరిగిన సన్మాన కార్యక్రమంలో సీజేఐ ఈ వ్యాఖ్యలు చేశారు. తనకు పూర్వం ప్రధాన న్యాయమూర్తిగా పని చేసిన జస్టిస్ సంజీవ్ ఖన్నా పదవీ కాలంలో కొలీజియం పనితీరులో మరింత పారదర్శకత తెచ్చే ప్రయత్నం జరిగిందని జస్టిస్ గవాయ్ తెలిపారు. కొలీజియం వ్యవహారాల్లో కొందరు జోక్యం చేసుకునేందుకు యత్నిస్తున్నారంటూ సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ దీపాంకర్ దత్తా ఇటీవల నాగ్‌పుర్‌లో పేర్కొన్న విషయాన్ని ఆయన ప్రస్తావించారు. 2019లో తనకు సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి కల్పించాలని సిఫార్సు చేసినప్పుడు ఒక జడ్జి అందుకు సమ్మతించలేదని జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు. ఆ జడ్జి ఎవరన్నది వెల్లడించడానికి ఆయన నిరాకరించారు. "నాకు పదోన్నతి కల్పిస్తే ముంబయిలోని కొందరు సీనియర్ లాయర్లు ఆందోళన చెందుతారని ఆ జడ్జి భావించారు. తదనంతరం ముంబయికి చెందిన పలువురు న్యాయవాదులు నన్ను కలిసి ఆ భావన అపోహ మాత్రమే అని చెప్పారు" అని ప్రధాన న్యాయమూర్తి తెలిపారు.

సొరంగాలు, వంతెనలు ఉండే మార్గాల్లో టోల్ ఫీజు తగ్గింపు!

దిల్లీ: టోల్ ఛార్జీల లెక్కింపు నిబంధనల్లో కేంద్ర ప్రభుత్వం చేసిన మార్పు సొరంగ మార్గాలు, వంతెనలు, ఫ్లైఓవర్లు ఉన్న రహదారుల్లో టోల్ ఫీజు సగానికి తగ్గేందుకు అవకాశం ఉంది. ఇది వాహనదారుల ప్రయాణ ఖర్చులను తగ్గించనుంది. 2008 నాటి జాతీయ రహదారుల ఫీజు నిబంధనల కింద టోల్ ప్లాజాల్లో యూజర్ ఛార్జీలు నిర్ణయించారు. ఈ నిబంధనల్ని కేంద్రం సవరించింది. తాజా నిబంధనల ప్రకారం సొరంగాలు, వంతెనలు వగైరా నిర్మాణాలు ఉన్న జాతీయ రహదారిలో టోల్ ఫీజు లెక్క వేయడానికి కొత్త పద్ధతిని సూచించారు. సవరించిన నిబంధన ప్రకారం రహదారిపై ఉన్న నిర్మాణ పొడవును పదితో హెచ్చించి దాన్ని జాతీయ రహదారి సెక్షన్ పొడవుతో కలుపుతారు. అందులోంచి నిర్మాణ పొడవును తీసివేస్తారు. అలాగే జాతీయ రహదారి సెక్షన్ పొడవును ఐదుతో హెచ్చిస్తారు. ఈ రెండు సమీకరణాల ద్వారా లభించిన సమాధానాల్లో ఏది సంఖ్యాపరంగా తక్కువైతే దాని ప్రాతిపదికన టోల్ ఫీజు లెక్కిస్తారని ఈ నెల 2న ప్రకటించిన ఒక నోటిఫికేషన్ వెల్లడించింది. ఈ కొత్త పద్ధతి కారణంగా టోల్ ఫీజు ఆయా మార్గాల్లో గణనీయంగా తగ్గిపోతుందని జాతీయ రహదారుల విభాగం అధికారి ఒకరు తెలిపారు.

తక్షణ ఫలితాలను ఆశిస్తే భంగపాటే..



మీరు ఈరోజు గంట సేపు వ్యాయామం చేస్తే, రేపటికి మీ బరువులో తగ్గుదల కనిపించదు. ఈ పూట మీరు తినే పౌష్టికాహారం రాత్రికిరాత్రే మీ ఆరోగ్యాన్ని మెరుగుపరచదు. ఒక్క ప్రయత్నంతో మీ లక్ష్యం నెరవేరదు. తక్షణ ఫలితాలను ఆశించకుండా ప్రయత్నాలను స్థిరంగా కొనసాగిస్తేనే మీ కలలను నిజం చేసుకోగలుగుతారు.

– మాట్ మొగ్లె, ఫిట్‌నెస్ కోచ్

ఇదో విచిత్రమైన ఈడీ కేసు..

- నేషనల్ హెరాల్డ్ వివాదంలో సోనియా తరఫున వాదనలు

దిల్లీ: నేషనల్ హెరాల్డ్ పత్రికను ప్రచురించే అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్)కు చెందిన రూ.2వేల కోట్ల ఆస్తులను అక్రమంగా దక్కించుకునేందుకు భారీ కుట్ర జరిగిందన్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అభియోగాలను కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియా గాంధీ తోసిపుచ్చారు. ఈడీ మోపిన నగదు అక్రమ చలామణి (మనీలాండరింగ్) కేసు చాలా విచిత్రమైనదని, ఇది వరకెన్నడూ ఇలాంటి కేసు లేదని తెలిపారు. మనీలాండరింగ్‌తో ముడిపడిన నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీ అభియోగాలపై సోనియా గాంధీ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ శుక్రవారం దిల్లీ కోర్టులో వాదనలు వినిపించారు. ఈ కేసులో ఈడీ తరఫున సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు వాదనలు గురువారం ముగిశాయి. ఈడీ అభియోగాలను సింఘ్వీ తోసిపుచ్చుతూ.. 'ఈ కేసులో అంగుళం ఆస్తి కూడా ఏజేఎల్ నుంచి 'యంగ్ ఇండియన్' కంపెనీకి వెళ్లలేదు. అసలు ఆస్తి ప్రస్తావనేలేదు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఏ నేతకూ ఆస్తి కానీ పైసా డబ్బు కానీ వెళ్లలేదు. అయినప్పటికీ దీనిని నగదు అక్రమ చలామణి కేసుగా ఈడీ చెబుతుండడం వింతగా ఉంది' అని అన్నారు. సోనియా, రాహుల్, మరికొందరు కాంగ్రెస్ సీనియర్ నేతలు భాగస్వాములైన 'యంగ్ ఇండియన్' లాభాపేక్ష రహిత కంపెనీ అని తెలిపారు. జడ్జి జోక్యం చేసుకుంటూ.... 'ఏజేఎల్ రుణాల రద్దుకు కాంగ్రెస్ పార్టీకి హక్కు ఉందా?' అని ప్రశ్నించారు. అప్పును స్వాధీనం చేసుకోవడం ద్వారా నిరర్థక ఆస్తులను తొలగించాలని చట్టం చెబుతోందని న్యాయవాది బదులిచ్చారు. శనివారం రాహుల్ గాంధీ తరఫున కోర్టులో వాదనలు కొనసాగనున్నాయి.

గోడ కాదు ఇది.. ఐదంతస్తుల 'మేడ'



బిహార్‌లోని ఖగాడియా జిల్లాలో అతి తక్కువ వెడల్పుతో అయిదు అంతస్తుల్లో కట్టిన భవనమిది! అసలు ఇందులో మనుషులు ఎలా నివసిస్తారు? అని ఓ నెటిజను ఆశ్చర్యం వ్యక్తం చేయగా.. బాబూ ఇది బిహార్.. ఇక్కడ ఏదైనా సాధ్యమే అని మరొకరు బదులిచ్చారు.

కేరళలో 'నిఫా' కలకలం

- 38 ఏళ్ల మహిళకు సోకిన వైరస్

తిరువనంతపురం: కేరళలో మరోసారి నిఫా వైరస్ కలకలం సృష్టిస్తోంది. పాలక్కాడ్ జిల్లాలోని 38 ఏళ్ల మహిళకు శుక్రవారం నిఫా పాజిటివ్‌గా నిర్ధరణ అయ్యింది. ప్రస్తుతం ఆమె ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సాధారణ వైద్య పరీక్షల సమయంలో ఆమెలో నిఫా వైరస్ లక్షణాలు కనిపించడంతో, సంబంధిత నమూనాలను పుణె ప్రయోగశాలకు పంపించారు. అక్కడి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ వీటిని పరీక్షించి నిఫా వైరస్ సోకినట్లు నిర్ధారించింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా వైద్యాధికారులను రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి వీణా జార్జ్ అప్రమత్తం చేశారు. వైరస్ వ్యాప్తిపై నిఘాను మరింత పెంచాలని సూచించారు. మరోవైపు కేరళలోని కోజికోడ్ జిల్లా, మలప్పురంలోని 18 ఏళ్ల అమ్మాయి ఈనెల 1న నిఫా వైరస్ సోకి మరణించింది.

రెవెన్యూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

సీఎం చంద్రబాబుకు ఏపీ సివిల్ సర్వీస్ (ఎగ్జిక్యూటివ్ బ్రాంచ్) సంఘం వినతి

ఈనాడు, అమరావతి: రెవెన్యూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబును ఏపీ సివిల్ సర్వీస్ (ఎగ్జిక్యూటివ్ బ్రాంచ్) సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.విశ్వేశ్వరనాయుడు, టి.మోహన్‌రావు కోరారు. ఈ మేరకు శుక్రవారం సచివాలయంలో చంద్రబాబును కలిసి వినతిపత్రం సమర్పించారు. పట్టణాలు, పట్టణ పరిసరాలు, అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లోని విలువైన ప్రభుత్వ భూముల పరిరక్షణలో ఎదురవుతున్న వివిధ రకాల సవాళ్లను ఆయనకు వివరించారు. "అర్హత కలిగిన డిప్యూటీ కలెక్టర్లకు సెలక్షన్ గ్రేడ్ మంజూరు చేయాలి. రాజధానిలో డిప్యూటీ కలెక్టర్లు, రెవెన్యూ గెజిటెడ్ అధికారులకు నామమాత్రపు ధరకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి. అసోసియేషన్ భవన నిర్మాణానికి రెండు ఎకరాల స్థలం ఇవ్వాలి" అని అభ్యర్థించారు.

ఏపీ ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని విజయవాడ గాంధీనగర్‌లోని ఏపీఎన్జీవో భవన్‌లో శుక్రవారం ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా వి.సముద్ర, ఉపాధ్యక్షుడిగా జి.రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా తోరం రాజు, కోశాధికారిగా ఎస్.శ్రీనివాసరావు, కార్యదర్శిగా బి.వి.రమణ, సహాయ కార్యదర్శిగా కొల్లి రాంగోపాల్, కార్యనిర్వాహక కార్యదర్శిగా అల్లూరి నాగేశ్వరరావు, ఈసీ సభ్యులుగా టి.చైతన్య, కాపుగంటి రాజేంద్ర, వి.శ్రీనివాసులరెడ్డి, కె.పుల్లారావు, పి.దొరైరాజు, యాదవ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సముద్ర మాట్లాడుతూ. . త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి ఏపీలో చిత్ర పరిశ్రమ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, ఇతర సమస్యలపై వినతిపత్రం సమర్పిస్తామని చెప్పారు.

2027లో జమిలి ఎన్నికలు.. వచ్చేది జగన్ ప్రభుత్వమే

వైకాపా నేత, ఎమ్మెల్సీ బొత్స

పెదవేగి, న్యూస్‌టుడే: 'రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం 2029 వరకు అధికారంలో ఉండదు.. 2027 అక్టోబరులో జమిలి ఎన్నికలు వస్తాయి.. అప్పుడు వచ్చేది జగనన్న ప్రభుత్వమే' అని వైకాపా నేత, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించారు. బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారంటీ పేరుతో విడుదల చేసిన మేనిఫెస్టో ద్వారా ప్రజలను మభ్యపెట్టి, అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేసిందేమీ లేదని విమర్శించారు. ఏలూరు జిల్లా పెదవేగి మండలం కొండలరావుపాలెంలో శుక్రవారం వైకాపా జిల్లా కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు వైకాపా అధ్యక్షుడు జగన్ 'చంద్రబాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ' పేరిట క్యూఆర్ కోడ్ తీసుకొచ్చారని చెప్పారు.

వర్సిటీలు క్వాంటమ్ సాంకేతికతపై దృష్టి సారించాలి

- డిజిటల్ పాలనలో అమరావతి దేశంలోనే నమూనా రాజధానిగా మారనుంది
- జేఎన్‌టీయూకే స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్



కాకినాడ జేఎన్‌టీయూ స్నాతకోత్సవంలో పాల్గొన్న గవర్నర్, కులపతి అబ్దుల్ నజీర్, వీసీ డాక్టర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్, గౌరవ డాక్టరేట్ అందుకున్న బోస్టన్ గ్రూప్ ఛైర్మన్ కోట సుబ్రహ్మణ్యం, ఓఎస్డీ కోటేశ్వరరావు, రెక్టార్ కేవీ రమణ, గవర్నర్ సెక్రటరీ ఎం.హరి జవహర్‌లాల్, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్

ఈనాడు, కాకినాడ, న్యూస్‌టుడే–గాంధీనగర్: విశ్వవిద్యాలయాల్లో బోధనా పద్ధతులను ఎప్పటికప్పుడు ఆధునికీకరించుకోవాలని గవర్నర్ అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు. భవిష్యత్తు అంతా క్వాంటమ్ కంప్యూటింగ్ టెక్నాలజీదేనని.. కృత్రిమ మేధ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ), ఈ-మొబిలిటీ, రెన్యువబుల్ ఎనర్జీ, లాజిస్టిక్స్, రోబోటిక్స్, బయో, నానో టెక్నాలజీ ఆవిష్కరణలు.. అభ్యసనాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కాకినాడ జేఎన్‌టీయూలో ఉప కులపతి సీఎస్ఆర్‌కే ప్రసాద్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన 11వ స్నాతకోత్సవంలో గవర్నర్ ప్రసంగించారు. 'ఉన్నత విద్యాసంస్థలు సమాజం ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించే పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వాలి. గ్రాడ్యుయేషన్ పూర్తిచేయడం విద్యకు ముగింపు కాకూడదు. రోజూ కొత్త జ్ఞానం, నైపుణ్యాలను నేర్చుకోవడం ద్వారానే విద్యార్థులు ఉన్నతస్థితికి ఎదుగుతారు. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ స్థాపించడం ద్వారా దేశంలోనే ఈ రంగంలో మొట్టమొదట చొరవ తీసుకున్న రాష్ట్రంగా గుర్తింపు పొందాం. ఈ ప్రాజెక్టుతో కొత్తతరం ఆవిష్కరణలు, ఉన్నతస్థాయి ఉపాధి అవకాశాలు పెంపొందనున్నాయి. కృత్రిమ మేధ, సెమీ కండక్టర్ పరిశోధన, రక్షణ ఆవిష్కరణలన్నీ ఏకీకృతం కానున్నాయి. వీటితో ఆసియాలోనే క్వాంటమ్ కంప్యూటింగ్‌లో సాంకేతిక పురోగతి సాధించే రాష్ట్రంగా ఏపీ ముందంజలో నిలవనుంది. సౌర, పవన, జలశక్తి వనరులను సమర్థంగా ఉపయోగించి పునరుత్పాదక శక్తితో నడిచే మొదటి నగరంగా అమరావతిని మార్చాలనే లక్ష్యంతో క్వాంటమ్ వ్యాలీ ప్రాజెక్టును ప్రభుత్వం ముందుకు తీసుకువెళ్తోంది' అని వివరించారు.

బోస్టన్ గ్రూప్ ఛైర్మన్‌కు గౌరవ డాక్టరేట్

విజయవాడకు చెందిన ప్రవాసాంధ్రుడు కోట సుబ్రహ్మణ్యం 60 ఏళ్ల క్రితం జేఎన్‌టీయూకేలో చదువుకుని.. ఖరగ్‌పుర్ ఐఐటీలో మాస్టర్ డిగ్రీ చేసి, అమెరికాలో స్థిరపడ్డారు. అక్కడ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ మేనేజరుగా చేరి.. అంచెలంచెలుగా ఎదిగి బోస్టన్ గ్రూప్‌నకు ఛైర్మన్ అయ్యారు. కోట ఫౌండేషన్ స్థాపించి, విద్యార్థులు స్టార్టప్‌లు నెలకొల్పే దిశగా ప్రోత్సహిస్తున్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా స్నాతకోత్సవంలో గవర్నర్ చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. అనంతరం 2023-24లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు డిగ్రీలు, పీహెచ్‌డీలు, ప్రతిభావంతులైన 40 మందికి బంగారు పతకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ షాన్‌మోహన్, రెక్టార్ కేవీ రమణ, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, ఓఎస్డీ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం కోసం అమెరికా వెళ్లి.. 50 కంపెనీలు స్థాపించా

- యువత ఆలోచనలను ఆచరణలో పెట్టాలి
- 'ఈనాడు'తో బోస్టన్ గ్రూప్ ఛైర్మన్ కోట సుబ్రహ్మణ్యం



కోట సుబ్రహ్మణ్యం

ఈనాడు, కాకినాడ: నేటి యువతలో మంచి ఆలోచనలు ఉన్నాయని, వాటిని ఆచరణలోకి తెచ్చి.. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు తోడ్పాటు అందిస్తామని ప్రవాసాంధ్రుడు, బోస్టన్ గ్రూప్ ఛైర్మన్ కోట సుబ్రహ్మణ్యం (సుబు కోట) అన్నారు. కాకినాడ జేఎన్‌టీయూ స్నాతకోత్సవంలో గౌరవ డాక్టరేట్ స్వీకరణకు వచ్చిన ఆయన 'ఈనాడు'తో మాట్లాడారు. "నేను ఆరు దశాబ్దాల క్రితం జేఎన్‌టీయూలోనే ఇంజినీరింగ్ చదివా. ఉద్యోగం కోసం అమెరికా వెళ్లిన సమయానికి నా చేతిలో ఎనిమిది డాలర్లే ఉన్నాయి. ఎలా బతకగలనని భయపడలేదు. ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ప్రోగ్రామర్‌గా చేరి, తర్వాత సొంతంగా బోస్టన్ కంపెనీ పెట్టా. వేర్వేరు వ్యాపారాలూ చేశా. దాదాపు 50 కంపెనీలు స్థాపించా. ప్రస్తుతం మా వద్ద 2,500 మంది హెచ్1 వీసాలతో ఉపాధి పొందుతున్నారు. ఆదాయంలో సేవా కార్యక్రమాలకు కూడా ఖర్చు చేస్తున్నాం. అంకుర సంస్థలు ఎదగడానికి సైతం సాయం అందించేలా ముందుకెళ్తున్నాం. ఇంజినీరింగ్, ఇతర డిగ్రీ కోర్సులు చేస్తూనే కొత్త ఆలోచనలతో వచ్చే వారి కోసం జేఎన్‌టీయూలోనే ఇంక్యుబేషన్ కేంద్రం ఏర్పాటు చేశాం. ఏటా 150 మందిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. యువతలో సృజనాత్మక శక్తి ఉంది. వారికి మార్గదర్శకత్వం చేసి, ఆర్థికంగా తోడు నిలవగలిగితే కొత్త ఆవిష్కరణలు వెలుగు చూస్తాయి" అని వివరించారు.

జస్టిస్ శ్రీనివాసరెడ్డిని ట్రోల్ చేయడాన్ని ఖండిస్తున్నాం

- హైకోర్టు న్యాయవాదుల సంఘం

ఈనాడు, అమరావతి: సామాజిక మాధ్యమాల వేదికగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డిని ట్రోల్ చేయడాన్ని ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం (ఏపీహెచ్‌సీఏఏ) ఖండించింది. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. అందులో.. 'ఓ కేసులో ఉత్తర్వులు వెల్లడించిన తర్వాత జస్టిస్ శ్రీనివాసరెడ్డిని సోషల్ మీడియాలో దురుద్దేశపూర్వకంగా ట్రోల్ చేస్తున్న విషయం మా దృష్టికి వచ్చింది. ఆయనను లక్ష్యంగా చేసుకొని తప్పుడు ప్రచారం చేయడం తగదు. ఇలాంటి చర్యలు న్యాయమూర్తుల ప్రతిష్ఠను దిగజార్చడమే కాకుండా న్యాయవ్యవస్థ, చట్టబద్ధ పాలన పునాదులను కదిలిస్తాయి. న్యాయమూర్తులు భయం, పక్షపాతం లేకుండా రాజ్యాంగబద్ధ విధులను నిర్వహిస్తారని భావిస్తాం. అలాంటివారిని అపఖ్యాతి పాల్జేయడం ఆమోదయోగ్యం కాదు. ఇలాంటి చర్యలను న్యాయవ్యవస్థ స్వతంత్రతపై ప్రత్యక్ష దాడిగా భావించాలి. తీర్పుపై అభ్యంతరం ఉంటే చట్టపరమైన మార్గాలను అనుసరించి పరిష్కరించుకోవాలి తప్ప, పరువుకు నష్టం కలిగేలా బహిరంగంగా వ్యాఖ్యలు చేయకూడదు. జస్టిస్ శ్రీనివాసరెడ్డిపై సోషల్ మీడియా వేదికగా అభ్యంతరకర సమాచార వ్యాప్తికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలి. న్యాయసమాజం, మీడియా, సాధారణ ప్రజానీకం బాధ్యతాయుతంగా వ్యవహరించి న్యాయవిచారణ ప్రక్రియ పవిత్రతను, గౌరవాన్ని కాపాడాలి' అని విజ్ఞప్తి చేశారు. ఏపీహెచ్‌సీఏఏ అధ్యక్షుడు కె.చిదంబరం, ఉపాధ్యక్షుడు కేవీ రఘువీర్, ప్రధాన కార్యదర్శి సి.సుబోధ్ శుక్రవారం ఈ ప్రకటన విడుదల చేశారు.

చంపారు.. పది రోజుల తర్వాత చెప్పారు!

- చెల్లితో చనువుగా మాట్లాడుతున్నాడని యువకుడి ప్రాణాలు తీసిన నిందితులు
- వారే స్వయంగా వెల్లడించడంతో వెలుగులోకి దారుణం



మృతదేహాన్ని వెలికితీయిస్తున్న అధికారులు



కిరణ్ కార్తీక్

సామర్లకోట గ్రామీణం, న్యూస్‌టుడే: తన చెల్లితో చనువుగా మాట్లాడుతున్నాడన్న అక్కసుతో ఓ యువకుడిని ఆ బాలిక సోదరుడు మరొకరితో కలిసి గొంతు నులిమి హత్యచేసిన ఘటన కాకినాడ జిల్లా సామర్లకోట మండలంలోని బ్రహ్మానందపురంలో చోటుచేసుకుంది. మండలంలోని పి.వేమవరం గ్రామానికి చెందిన నొక్కు కిరణ్ కార్తీక్(19) గతనెల 27న అదృశ్యమయ్యాడని అతని తండ్రి వీరవెంకటరమణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కూలీలకు ఎక్కువ డబ్బులిచ్చాడని తాను మందలించడంతో ఇంటి నుంచి ఎటో వెళ్లిపోయాడని అందులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు అతడి మొబైల్ నంబరు ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. మరోవైపు, గ్రామానికి చెందిన నులకతట్టు కృష్ణప్రసాద్ తల్లిదండ్రులతో కలిసి హైదరాబాద్‌లో ఉంటూ 20 రోజుల క్రితమే గ్రామానికి వచ్చాడు. తన చెల్లితో కిరణ్ కార్తీక్ ఫోన్‌లో ఎక్కువగా మాట్లాడుతుండడంతో వద్దని వారించాడు. ఆ క్రమంలో ఇద్దరికీ వాగ్వాదం జరిగింది. గత నెల 24న కృష్ణప్రసాద్, అతని స్నేహితుడు దూళ్లపల్లి వినోద్ పార్టీ ఇస్తానని నమ్మించి కిరణ్ కార్తీక్‌ను బ్రహ్మానందపురం జగనన్న లేఔట్‌లోకి తీసుకువెళ్లారు. అక్కడ కార్తీక్ తలను నేలకు కొట్టి, గొంతు నులిమి హత్యచేశారు. మృతదేహాన్ని మట్టి దిబ్బలో పూడ్చేసి రెండు రోజుల తరువాత కృష్ణప్రసాద్ హైదరాబాద్ వెళ్లిపోయాడు. విషయం బయటకు పొక్కుతుందన్న భయంతో తిరిగి శుక్రవారం ఉదయం సామర్లకోటకు చేరుకుని గ్రామంలోని వినోద్‌ను తీసుకుని వీఆర్వో వద్దకు వెళ్లి తామే హత్య చేసినట్లు నేరం అంగీకరించి లొంగిపోయారు. వీఆర్వో ఫిర్యాదుతో అదృశ్యం కేసును పోలీసులు హత్య కేసుగా మార్చారు. తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో కార్తీక్ మృతదేహాన్ని వెలికితీశారు. హత్య జరిగి 10 రోజులు కావడంతో మృతదేహం కుళ్లిపోయింది. దాంతో అక్కడే పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. తమ కుమారుడి హత్యకు కారకులైన వారందరినీ శిక్షించాలని తండ్రి వీర వెంకటరమణ, తల్లి స్వరూప కన్నీరుమున్నీరుగా విలపిస్తూ డిమాండ్ చేశారు.

బడికెళ్లిన తొలిరోజే.. మృత్యువు కబళించింది

పాఠశాల బస్సు కింద పడి చిన్నారి మృతి



హరిప్రియ

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: మొదటి రోజు పాప బడికెళ్లడంతో ఆ తల్లిదండ్రులు ఎంతో సంతోషించారు. ఇంకొన్ని క్షణాల్లో ఇంటికొస్తుందని ఎదురుచూస్తున్నారు. అంతలోనే బస్సు రూపంలో వచ్చిన మృత్యువు ఆ చిన్నారిని కబళించింది. ఈ విషాద ఘటన నంద్యాల జిల్లాలో చోటుచేసుకుంది. ఆళ్లగడ్డలోని ఎంవీ నగర్‌లో నివాసముంటున్న శ్రీధర్, వనజ దంపతులు తమ కుమార్తె హరిప్రియ(5)ను కోవెలకుంట్ల రోడ్డులోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చేర్పించారు. ఆ చిన్నారి శుక్రవారం పాఠశాలలో తొలి రోజు పూర్తి చేసుకుని పాఠశాలకు చెందిన బస్సులో ఎంవీ నగర్‌లోని ఇంటి వద్ద దిగింది. అనంతరం బస్సు ముందు నుంచి ఇంటికి వెళ్లబోయింది. ఇంతలోనే డ్రైవరు బస్సును కదలించడంతో దాని చక్రాల కింద పడి హరిప్రియ అక్కడికక్కడే మృతి చెందింది. భుజానికి తగిలించుకున్న పుస్తకాల సంచీతోనే చిన్నారి ప్రాణాలు కోల్పోయి ఉండటం అక్కడి వారిని కంటతడి పెట్టించింది. ఒక్క క్షణం బస్సు ఆగి ఉంటే చిన్నారి క్షేమంగా ఇంటికి చేరుకునేదని ఆవేదన వ్యక్తం చేశారు. సాధారణంగా బస్సులో డ్రైవరు, క్లీనర్ విధుల్లో ఉండాలి. ప్రమాదానికి కారణమైన బస్సులో డ్రైవరు మాత్రమే విధుల్లో ఉన్నారు. పాఠశాల యాజమాన్య నిర్లక్ష్యమే చిన్నారి మృతికి కారణమని చిన్నారి బంధువులు ఆరోపిస్తున్నారు.

రోజుకోసారి గ్రీన్ కాఫీ..!



వేడి వేడి కాఫీ గొంతులోకి వెళుతుంటే ఆ కిక్కేవేరు కదా! అందుకే మన రోజు మొదలయ్యేది కూడా దానితోనే. అప్పటి వరకూ ఉన్న నిస్సత్తువ పోయి ఎక్కడలేని హుషారు వచ్చేస్తుంది. బ్రెయిన్ యాక్టివ్‌గా పనిచేస్తుంది. కానీ, గ్రీన్ కాఫీతో మరెన్నో ప్రయోజనాలున్నాయట.

గ్రీన్ కాఫీ... సాధారణంగా కాఫీ గింజల్ని నిర్ణీత ఉష్ణోగ్రతల వద్ద వేయిస్తే గ్రీన్ కాఫీ కోసం వాటిని పచ్చిగానే ఉంచుతారు. పచ్చి కాఫీ గింజల్లో ఎక్కువ మొత్తంలో క్లోరోజెనిక్ ఆమ్లం ఉంటుంది. ఇది శరీరంలో ఉండే అధిక కొవ్వులను కరిగిస్తుంది. అంతేకాదు, రక్తంలోని చక్కెర స్థాయులను నియంత్రిస్తుంది. ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరుస్తుంది. టైప్ 2 డయాబెటీస్‌ను అదుపులో ఉంచుతుంది. జీవక్రియను పెంచుతుంది. రోజుకోసారి గ్రీన్ కాఫీ తాగితే రక్తనాళాల్లో ఆక్సిజన్ సరఫరా బాగా జరుగుతుంది. ఒత్తిడి తగ్గుతుంది. రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు వృద్ధాప్య ఛాయల్ని తగ్గిస్తాయి. అంతేకాదు, అల్జీమర్స్‌ను నిరోధిస్తుంది. వీటిని వేయించకుండా తీసుకుంటాం కాబట్టి రాత్రంతా నానబెట్టాలి. మరుసటి రోజు పావుగంట వాటిని మరిగించి వడకట్టి తీసుకుంటే సరి. ఎంత ఆరోగ్యకరమైనది అయినా నిపుణుల సలహా మేరకు రోజుకి ఒకటిరెండు కప్పులు మాత్రమే తీసుకోవాలట.

మంచివా... కావా.. చెప్పేస్తాయివి!



కుటుంబ ఆరోగ్యాన్ని కాపాడటానికి ఎన్నెన్ని చేస్తుంటామో! ఉదయం లేచిన దగ్గరన్నుంచీ... మళ్లీ నిద్రపోయే వరకూ వాడే ప్రతి వస్తువూ... రసాయన రహితంగా ఉండాలని కోరుకుంటున్నారు ఆరోగ్యాభిలాషులు. ఇందుకు అందరి ఎంపిక ఆర్గానిక్ వస్తువులే. అయితే మనం కొంటోన్న వస్తువులు నిజంగా ఆర్గానిక్‌వేనా? తెలియాలంటే ఈ యాప్‌లను ప్రయత్నించండి.

ట్రూత్ఇన్...

ఫుడ్ ఐటెం మీదున్న బార్‌కోడ్‌ని స్కాన్ చేస్తే... అది ఆర్గానిక్‌దా కాదా చెబుతుందీ అప్లికేషన్. మనం తినే చిప్స్ నుంచీ ఇంట్లో టూత్ బ్రష్ వరకూ ప్రతిదానికీ రేటింగ్ ఇస్తుందీ అప్లికేషన్. ఒకవేళ ఆర్గానిక్‌దే అయినా దీనివల్ల వచ్చే పోషక విలువలు ఏ స్థాయిలో ఉన్నాయి... శరీరానికి హాని చేసే పదార్థాలు ఏ స్థాయిలో ఉన్నాయి అన్నదీ చెబుతుంది. అంతేకాదు, మంచి పోషకాలున్న ఆహారాన్ని కూడా సిఫార్సు చేస్తుంది.

ఫుడ్ స్కాన్ జీనియస్...

ఇప్పుడు వస్తోన్న ఉత్పత్తులు అన్నింటి మీదా మల్టీగ్రెయిన్స్, మిల్లెట్స్ అని ఉండటం సాధారణమైంది. అయితే వాటిలో మిళితం చేసే ఇతర పదార్థాల్ని మాత్రం చిన్న అక్షరాల్లో లిస్ట్‌గా ఇస్తున్నారు. ఫుడ్ స్కాన్ జీనియస్‌తో స్కాన్ చేయడం వల్ల సంబంధిత ఉత్పత్తిలో మిక్స్ అయిన ఇతర పదార్థాల్ని కూడా చూపిస్తుంది. ఇవి తినడం వల్ల శరీరానికి వచ్చే అలర్జీల గురించి కూడా చెబుతుంది. ఒకవేళ మనకు ముందునుంచే అలాంటి అలర్జీలు ఏవైనా ఉంటే ఆ ఉత్పత్తిని వదిలేసి... మంచివాటిని ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుంది.

ఫ్యాక్ట్‌స్కాన్...

ఇదీ ఈ కోవకు చెందినదే... డైట్ పేరుతో అమ్ముడవుతోన్న ఉత్పత్తుల్లో... సర్టిఫైడ్‌దా కాదా... ప్రొటీన్లు, కొలెస్ట్రాల్, క్యాలరీలు ఎంత ఉన్నాయి.. అవి మన శరీరానికి తగినవా కాదా వంటివి చెబుతుంది ఈ అప్లికేషన్.

ఇవే కాదు... ఎంపవరింగ్ కన్స్యూమర్, ట్రస్టిఫైడ్ లాంటి మరికొన్ని అప్లికేషన్లూ అందుబాటులో ఉన్నాయి. అవసరం అనుకుంటే ప్రయత్నించేయండి!

మీకు తెలుసా?



మొదటిసారి అమ్మానాన్నలైన వారు బిడ్డకు రెండేళ్లు వచ్చేసరికి సుమారు 6నెలల నిద్రా సమయాన్ని కోల్పోతారని పరిశోధనలు చెబుతున్నాయి. అంతేకాదు, తిరిగి ఇదివరకులా గాఢనిద్ర పట్టడానికీ, ప్రశాంతంగా నిద్రపోవటానికీ ఆరేళ్ల సమయం పడుతుందట.

ద్రుత ఉత్కటాసన



పాదాలను సాధ్యమైనంత దగ్గరగా ఉంచి నిటారుగా నిల్చోండి. ఇబ్బంది ఉంటే, కాళ్ల మధ్యలో కాస్త గ్యాప్ ఉంచుకోవచ్చు. ఇప్పుడు గాలి తీసుకుంటూ రెండు చేతుల్ని తలపైకి ఎత్తి సాగదీస్తూ నమస్కారం పెట్టి అలాగే ఉండండి. తర్వాత గాలి వదులుతూ శరీరాన్ని నెమ్మదిగా మోకాళ్ల వంచుతూ (గుంజీలు తీస్తున్నట్టు) కిందకి దింపండి. ఇలా మొదటి దశలో 30సెం.మీ. ఎత్తులో శరీరాన్ని 5 సెకన్లపాటు ప్రశాంతంగా నిలపండి. మళ్లీ పైకి లేచి యథాస్థానానికి రండి. 30 సెకన్లు ఆగాక ఆసనాన్ని పునరావృతం చేస్తూ శరీరాన్ని ఇంకాస్త కిందకు దించి కూర్చోండి. మరోసారి గాలి తీసుకుంటూ నిటారుగా నిల్చోండి. చివరగా గాలి వదులుతూ పిరుదులు నేలకు ఆనే వరకూ శరీరాన్ని కిందకు తీసుకురండి. 5 సెకన్లు ఉండి మళ్లీ గాలి తీసుకొంటూ యథాస్థానంలోకి రండి. తర్వాత అటూ, ఇటూ నడుస్తూ విశ్రాంతి తీసుకోండి.

జాగ్రత్తలు: మోకాళ్ల నొప్పి ఉన్నవాళ్లు, తుంటి, మోకాళ్ల సర్జరీలు అయినవారు, గర్భిణులు... దీన్ని చేయకూడదు.

ఉపయోగాలు: కాళ్లు, తుంటి, వెన్ను కండరాలకు బలాన్ని చేకూరుస్తుంది. వీపు కండరాలను సాగదీస్తూ బలాన్ని ఇస్తుంది. ఆకలి పెరుగుదలకు తోడ్పడుతుంది. అజీర్ణ సమస్యను పరిష్కరిస్తుంది. మలబద్ధకాన్ని తగ్గించడంలో మందుగా ఈ ఆసనం పనిచేస్తుంది. బలాన్ని పెంచడంలో తోడ్పడుతుంది.

ఆహారం: గుడ్లు, సోయాబీన్స్, టోఫు, చిలగడ దుంపలు, బాదం, వాల్‌నట్స్, ఓట్స్... రోజూ ఆహారంలో చేర్చుకోవాలి.

కోపాన్ని తగ్గించే పంకజ ముద్ర



పద్మాసనం/వజ్రాసనం/సుఖాసనంలో కూర్చొన్నాక... రెండు చేతుల్ని హృదయం దగ్గర నమస్కార ముద్రలో ఉంచండి. ఇప్పుడు సున్నితంగా రెండు అరచేతులను ఒకదాని ఎదురుగా ఒకటి తెరచి.. రెండు చేతుల బొటనవేళ్లను, చిటికెన వేళ్లను... ఒకదాంతో ఒకటి కలిపి ఉంచి మిగిలిన వేళ్లను కమలం మాదిరిగా తెరిచి ఉంచాలి. ఇలా ముద్ర వేసిన తర్వాత కళ్లను మూసి ఉంచి శ్వాసమీద ధ్యాస ఉంచండి. ఇలా 30 నిమిషాల వరకూ ఉండే ప్రయత్నం చేయండి. తర్వాత ప్రశాంతంగా చేతులు దించి రెండు అర చేతులను మోకాళ్లపై తెరిచి ఉంచి విశ్రాంతి తీసుకోండి.

సూచనలు: సానుకూల ఆలోచనలతోనే ముద్రను సాధన చేయాలి.

ఉపయోగాలు: ముఖాన్ని కాంతిమంతంగా చేస్తుంది. భావోద్వేగాల నియంత్రణకు సాయపడుతుంది. ప్రశాంతతను పెంచుతుంది.

ఆహారం: కోపాన్ని తగ్గించడానికి మెగ్నీషియం, ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు ఉన్న ఆహారం తీసుకోవాలి. ఆకుకూరలు, గింజలు, అరటిపండ్లు, బాదం, ప్రో బయాటిక్స్ లభ్యమయ్యే పులియబెట్టిన ఆహారాలను ఎక్కువగా తీసుకోండి.

- శిరీష, యోగ గురు

వసుంధర

vasundhara@eenadu.in



తెలివితేటలు, ప్రతిభ, వినూత్న ఆలోచనలు ఉన్న మహిళలు ఎంతోమంది. అయితే, సరైన మార్గనిర్దేశం లేక వెనకడుగు వేసే వాళ్లు, అనుకున్న లక్ష్యాల్ని చేరుకోలేకపోతోన్న వాళ్లూ అధికమే. అలాంటి వారందరినీ ఒక చోటుకి చేర్చి విజయం దిశగా నడిపించాలనుకున్నారు డా. నీలిమా వేములు. అందుకోసం తాజాగా 'దేవి' (డైనమిక్ ఆంత్రప్రెన్యూర్స్ అండ్ విమెన్ ఇన్నొవేటర్స్) ప్లాట్‌ఫామ్‌ను ఆవిష్కరించారు. ఆ విశేషాలను 'వసుంధర'తో పంచుకున్నారిలా...

'దేవి'... మహిళా షార్క్‌ట్యాంక్!



నీలిమ

'దేవి'... మహిళలు తమ కలలు నెరవేర్చుకోవడానికి సాయపడే ఓ శక్తి. ఒక్క వ్యాపారపరంగానే కాదు, అన్ని విధాలుగా వాళ్లు అభివృద్ధి చెందేలా (హోలిస్టిక్ డెవలప్‌మెంట్) చేయటమే ఈ సంస్థ ఉద్దేశం. నేను పుట్టి పెరిగింది హైదరాబాద్‌లోనే. చిన్నప్పటి నుంచీ అన్నింటిలోనూ చురుగ్గా ఉండేదాన్ని. దాంతో అమ్మానాన్నలూ ప్రోత్సహించేవారు. కూచిపూడి నాట్యమూ నేర్చుకున్నా. ఫిజియోథెరపీ చేశా. పూర్తయిన వెంటనే పెళ్లయ్యింది. తరవాత ప్రాక్టీస్ చేయలేదు. అత్తమ్మవాళ్లది వ్యాపార కుటుంబం కావటంతో నేనూ అటువైపు అడుగులు వేశా. ఆ సమయంలో నన్ను చాలామంది మహిళలు మీలాగా మేమూ వ్యాపారవేత్తలం కావాలంటే ఏం చేయాలి? అని అడుగుతుండేవారు. అప్పుడు వాళ్లను మాటలతో గైడ్ చేసేదాన్ని తప్ప, పూర్తి సహకారం అందించలేకపోయేదాన్ని. కొన్నాళ్లకు నా వ్యాపారాన్ని బీటూబీ (బిజినెస్ టు బిజినెస్)గా మార్చుకున్నా. దాంతో నాకు సమయం దొరికింది. 'ఇతరులకు సాయపడినప్పుడే జీవితానికి సార్థకత' అనిపించింది. అప్పుడే 'దేవి' ఆలోచన వచ్చింది. నా బాల్య స్నేహితురాలు పల్లవి నాగళ్ల నా విజన్‌కు సపోర్ట్ చేసింది. తనూ, మరో మిత్రురాలు కల్యాణీ గుడుగుంట్ల కో-ఫౌండర్లుగా ఈ ప్లాట్‌ఫామ్ ప్రారంభించా.

అన్ని విధాలుగా ఎదగాలని...

కొంతమంది ఆడవాళ్లకి నలుగురి ముందూ మాట్లాడాలంటే భయం. మరికొందరికి వ్యాపార ఆలోచనలు వస్తాయి కానీ వాటిని ఎలా ముందుకు తీసుకెళ్లాలో తెలియదు. అలాంటివాళ్లకు వర్క్‌షాప్‌లు నిర్వహించి వారిలోని ప్రతిభను బయటకు తీయాలన్నదే మా ఉద్దేశం. ఈ ప్లాట్‌ఫామ్ కేవలం వ్యాపారం చేసే వారికోసం కాదు, మహిళలందరి కోసం సృష్టించింది. ఇందులో చేరేందుకు వయసు నిబంధనా లేదు. మహిళల సర్వతోముఖాభివృద్ధి కోసం హెల్త్, లీగల్... వంటి భిన్న రకాల విభాగాలను ఏర్పాటుచేసి గైనిక్, మానసిక, న్యాయపరమైన సమస్యలకు పరిష్కారాలనూ సూచిస్తాం. మిస్, అండ్ మిసెస్ దేవి పాజెంట్‌లు, మమా అండ్ మీ క్యాలెండర్, వింటర్ కార్నివాల్ వంటి కార్యక్రమాలు ఏడాదిపాటూ ఏర్పాటుచేస్తాం. ప్రతినెలా రెండో మంగళవారం సమావేశమై ఇందుకు సంబంధించిన వర్క్‌షాప్‌లు నిర్వహిస్తాం.

పెట్టుబడులు అందిస్తాం...

మహిళల వ్యాపార ఆలోచనలకు ఫండింగ్ ఓ ప్రధాన సమస్య. ఇందుకోసం మా 'దేవి కుబేరాస్' విభాగం పనిచేస్తోంది. ఇది మరో షార్క్‌ట్యాంక్! దీన్లో ఉన్న జడ్జిలు మన ఐడియా నచ్చితే ఫండింగ్ ఇస్తారు. కేవలం స్ట్రాటజీ ప్లానింగ్ కావాలంటే అదీ ఇస్తాం. అలానే, మహిళా బైక్, క్యాబ్ డ్రైవర్లనూ తీసుకురావాలనే సంకల్పంతో ఓలా, ర్యాపిడో, వోల్టా సంస్థలతో కలిసి పనిచేస్తున్నాం. వేర్వేరు వృత్తులకు సంబంధించి కొలాబరేషన్లూ, టైఅప్‌లూ ఏర్పాటుచేస్తాం. ఓ వైపు వ్యాపారం చూసుకుంటూనే ఇవన్నీ చేయగలుగుతున్నానంటే అందుకు కారణం కుటుంబం మద్దతే. మనల్ని మనం నమ్మితే చాలు. కలలు వాటంతట అవే సాకారమవుతాయి.

బంగారం - వెండి



4న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	99,920	90,900	1,10,825
విజయవాడ	97,060	90,500	1,10,700
ప్రొద్దుటూరు	97,400	89,610	1,08,300
రాజమహేంద్రవరం	98,730	90,500	1,20,000
విశాఖపట్నం	98,430	90,550	1,12,000
తమిళనాడు	------	90,550	1,20,000



శ్రామిక వర్గంలో మహిళల శాతం పెరుగుతుండటం గొప్ప విషయమే. అయితే, అదే పెద్ద విజయం అనుకోకూడదు. లింగ సమానత్వం అంటే ఉద్యోగుల్లో మహిళల సంఖ్య పెరగడమే కాదు కెరియర్‌లో పురుషులతో సమానమైన అవకాశాలు, నాయకత్వ బాధ్యతలు దక్కాలి. వేగవంతమైన ఆర్థిక వృద్ధి లక్ష్యంగా వెళ్తోన్న భారత్‌కు ఇదెంతో కీలకం. అప్పుడే కార్పొరేట్ వాతావరణం మరింత క్రియాశీలకంగా ఉంటుంది.

- నందిని పిరామల్, ఛైర్‌పర్సన్, పిరామల్ ఫార్మా

మా నాట్యం.. శివుడి కోసం

వృత్తిరీత్యా సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని. హాబీలు మాత్రం చాలానే. దేశ సంస్కృతినీ ధర్మాన్నీ ప్రచారం చేయడానికి కళలే సాధనాలని నమ్మారు. అందుకు నృత్యాన్ని సాధనంగా చేసుకున్నారు డా. ప్రియాంక బరిడే.





ప్రియాంక

'నాట్యమంటే కేవలం సంగీతానికి అనుగుణంగా శరీరాన్ని కదపడం కాదు. శివుడికి మన మనసును నివేదించడం' అంటారు ప్రియాంక. ఈమెది హైదరాబాద్. చిన్నప్పట్నుంచే చదువు, నాట్యంపై సమాన శ్రద్ధ చూపించారు. పెయింటర్, రచయిత కూడా. ఐటీ సంస్థలో ఉద్యోగం చేస్తున్నారు. 'ది సైన్స్ అండ్ స్పిరిచ్యువాలిటీ ఆఫ్ శివతత్వ ఇన్ కూచిపూడి డ్యాన్స్' అనే అంశంపై పరిశోధన చేసి తాజాగా డాక్టరేట్‌నీ అందుకున్నారు. విద్యార్థి దశనుంచి ఎన్నో ప్రదర్శనలిచ్చి బహుమతులూ గెలుచుకున్నారు. ఏకం అర్ధనారీశ్వరం, ఏకం కృష్ణ, ఏకం చతుర్ముఖం వంటివి ప్రదర్శించి మన్ననలు అందుకున్నారు. ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాల్లోనూ నృత్య ప్రదర్శనలిచ్చారు. గవర్నర్‌సహా ప్రముఖుల ప్రశంసలూ అందుకున్నారు. తన నృత్యాలు ధర్మాన్ని ప్రతిబింబించడం, భారత సంస్కృతిని వివరించడంపైనే కేంద్రీకరించి ఉంటాయి. వీటిద్వారా విదేశీయులకు భారత నృత్య కళల గొప్పదనాన్ని తెలియజెబుతున్నారు. సికింద్రాబాద్‌లో 'శ్రీ హిరణ్మయి నృత్యాలయ'ను ప్రారంభించి గురువుగానూ మారారు ప్రియాంక. బేసిక్స్ నుంచి సర్టిఫికెట్ డిప్లొమా కోర్సుల వరకూ అందిస్తున్నారు. ఆమె విద్యార్థులు తెలుగు రాష్ట్రాల్లోనే కాదు, విదేశాల్లోనూ ఉన్నారు. 'ప్రపంచానికి భారతీయ సంస్కృతిని తెలియజేయడమే నా లక్ష్యం. భవిష్యత్తులోనూ నా దృష్టంతా కూచిపూడి మీదే. నా దృష్టిలో నాట్య సాధన, భక్తి రెండూ వేరువేరు కాదు. అందుకే నాట్యంతో అందరికీ ధర్మ విషయాలనూ తెలియజేస్తున్నా'నంటారు ప్రియాంక.

- బందారం శివరామకృష్ణ ప్రసాద్, ఈటీవీ, హైదరాబాద్

కొల్హాపురి... మెచ్చేస్తున్నారు!





కొల్హాపురి చెప్పులు... మిలాన్ ఫ్యాషన్ వీక్‌లో మెరిసినప్పట్నుంచీ ఈ పేరు బాగా వినిపిస్తోంది కదూ! భారతీయ సంప్రదాయ పాదరక్షల్లో వీటికీ గుర్తింపు ఎక్కువే. పైగా 13వ శతాబ్దం నుంచీ అందుబాటులో ఉన్నాయి. ఎంత పురాతనమైనా ఫ్యాషన్ ప్రపంచంలో వీటికున్న పేరేంటో తెలుసా... 'టైమ్‌లెస్ స్టైల్' అనే! కాలానికి తగ్గట్టుగా ఆధునికతను సంతరించుకుంటూ వస్తున్నాయి మరి. కాబట్టే, ప్రపంచవ్యాప్తంగా గుర్తింపూ ఎక్కువే. తాజా సంఘటనతో వీటి గురించి వెతికేస్తున్న అమ్మాయిలు పెరిగారు. కాబట్టే, సోషల్‌మీడియాలో 'నా కొల్హాపురి చెప్పులు' అంటూ పోస్టులు పెట్టి మరీ మురిసిపోతున్నారు. ఏమిటబ్బా వీటిలో అంత ప్రత్యేకం అనిపిస్తోందా? ఎంత మోడరన్ ఆలోచనలున్న అమ్మాయైనా సంప్రదాయ వస్త్రధారణను మెచ్చకుండా ఉండదంటే ఔననాల్సిందే కదూ! కానీ చెప్పుల మాటేంటి? ఏది నచ్చితే అది వేసుకుంటాం అవునా? దేశీ ఫ్యాషన్‌కి మరింత అందాన్ని పెంచుతూ కాళ్లకీ చక్కగా అమరాలంటే కొల్హాపురికి మించినవి లేవంటారు ఫ్యాషనిస్టులు. అలాగని దుస్తులను డామినేట్ చేయవు. కాబట్టే, బాలీవుడ్ దివాల వార్డ్‌రోబ్‌లో వీటికి తప్పక చోటుంటుంది. అలాగని సంప్రదాయ వస్త్రధారణ మీదకే నప్పుతాయన్న నిర్ణయానికీ వచ్చేయొద్దు. దేశీలుక్‌తో స్టైలిష్ వెస్ట్రన్ దుస్తులకు తగ్గవీ వస్తున్నాయి. క్యాజువల్, ఎత్నిక్, ఫ్లిప్‌ఫ్లాప్, హీల్స్, షూ... ఒకటా రెండా మెప్పించే రకాలూ బోలెడు. రోజువారీ, ఆఫీస్, పార్టీ... ఎక్కడికైనా వేసుకోవడమే. ఇన్ని వెరైటీలు ఊరిస్తుంటే మనసు పారేసుకోకుండా ఉంటారా? కాబట్టే సోషల్‌మీడియాలో కొల్హాపురి ట్రెండ్ తెగ నడుస్తోంది. మరి మీ సంగతేంటి? మీరూ వీటికి వార్డ్‌రోబ్‌లో చోటిచ్చేస్తారా? అయితే ఒక్క మాటండోయ్... కంఫర్ట్, ఫ్యాషన్ లుక్ ఇచ్చే ఈ చెప్పులు వర్షకాలానికి మాత్రం అంత అనువు కాదు. వేసుకునేప్పుడు దాన్ని గమనించుకోండి మరి!



మూగ జీవాల గొంతు ఆమె..!





గౌరి

ప్రకృతి వైపరీత్యాలు, ఏదైనా అనుకోని ఆపదలు వచ్చినప్పుడు మనుషుల్ని కాపాడటానికి ప్రభుత్వాలు, రక్షణ బృందాలున్నాయి. మరి మూగ జీవాలను రక్షించడానికో? వాటివి ప్రాణాలు కావా! అందుకే వాటి హక్కుల కోసం గొంతెత్తింది గౌరీ మౌలేఖి. ఆమె గురించి తెలియాలంటే...

లఖ్‌నవూలోని ఓ వ్యాపార కుటుంబంలో పుట్టి పెరిగారు గౌరీ మౌలేఖి. బీఎస్సీ పూర్తిచేసి.. టీచర్, రేడియో జాకీ, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గానూ పనిచేశారు. చిన్నప్పటి నుంచీ గౌరి జంతు ప్రేమికురాలు. అందుకే చదువు అవ్వగానే 'పీపుల్ ఫర్ యానిమల్స్'లో వాలంటీర్‌గా చేరారు. దీని ద్వారా వీధి కుక్కల పునరావాస కేంద్రాల ఏర్పాటుకు నిధులు సమకూర్చడం మొదలుపెట్టారు. 2004-08 వరకు నోయిడాలోని 'సొసైటీ ఫర్ ప్రివెన్షన్ ఆఫ్ క్రూయెల్టీ టు యానిమల్స్' (ఎస్‌పీసీఏ)తో కలిసి పనిచేశారీమె. మేనకా గాంధీ నేతృత్వంలో మొదలైన 'పీపుల్ ఫర్ యానిమాల్స్'లో సభ్యురాలిగా అనేక సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 2012లో 'పీపుల్ ఫర్ యానిమల్స్-ఉత్తరాఖండ్' (మూగజీవాలను కాపాడేందుకు) స్థాపించి ట్రస్టీగానూ మారారు. అయితే దీన్ని మొదలుపెట్టడానికి బలమైన కారణమే ఉందంటున్నారు గౌరి. 'ఓసారి చార్‌ధామ్ యాత్రకు వెళ్లాను. అక్కడి ఆలయాలకు వేలల్లో భక్తులు వస్తుంటారు. కొంతమంది కాలినడకన వస్తే, నడవలేనివారు డోలీపై, గుర్రపు బళ్లు ఎక్కి కొండపైకి వెళ్తారు. అప్పుడే దేహ్రాదూన్ సమీపంలో యాత్రికుల బండిని మోస్తూ రెండు గుర్రాలు అలసటతో కుప్పకూలిపోయాయి. యజమాని వాటికి విశ్రాంతిని వ్వాల్సింది పోయి కొట్టడం మొదలుపెట్టాడు. అది నన్నెంతో బాధించింది. కొన్ని పుణ్యక్షేత్రాల్లో ఇలాంటి మూగ జీవులు లక్షల్లో ఉన్నాయి. వాటన్నింటికీ విముక్తి కల్పించాలనుకున్నా' అనే గౌరి దీనికోసం ఎన్నో ప్రయత్నాలు చేశారు. న్యాయశాఖను ఆశ్రయించి వాటికి సంరక్షణా కేంద్రాలను ఏర్పాటుచేశారు. అంతేకాదు, గాయపడి, జబ్బుపడి, వయసైపోయిన మూగజీవాలకు రక్షణ కల్పిస్తున్నారు.

అప్పుడే ప్రణాళికలు...

'ఇదంతా ఒక ఎత్తైతే... ఏటా చాలా ప్రాంతాల్లో సంప్రదాయాల పేరిట లక్షల్లో మూగజీవాలను బలిస్తున్నారు. ఈ హింసను ఆపాలనుకున్నా. వాటి సంక్షేమం కోసం రాష్ట్రపతికి లేఖ రాశాను. సుప్రీం కోర్టుతో మాట్లాడి వన్యప్రాణులకు రక్షణ, జనన నియంత్రణా కేంద్రాల ఏర్పాటుకు కృషి చేశా. క్షేత్రస్థాయిలో దీన్ని అమలుచేయడం కోసం స్థానిక అధికారులతో కలిసి పనిచేశాం. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూహెచ్ఓ) ద్వారా జంతు జనన నియంత్రణ (ఏబీసీ) కార్యక్రమాన్ని నిర్వహించాం కూడా. స్థానికంగా కొంతమంది అభ్యర్థుల్ని ఎంపికచేసి ప్రకృతి వైపరీత్యాలప్పుడు మూగజీవుల్ని కాపాడేందుకు ఎలాంటి చర్యలు చేపట్టాలో శిక్షణనిచ్చాం. మేమంతా కలిసి కేదార్‌నాథ్ వరదల్లో చిక్కుకున్న ఆరువేలకు పైగా వన్యప్రాణులను కాపాడాం' అనే గౌరి మూగజీవాల హక్కులు, బాధ్యతల గురించి పోరాడినందుకుగానూ నారీశక్తి పురస్కారాన్నీ అందుకున్నారు.

ట్రై చేయండి... కొనండి!

ఒక క్రీమ్ పడిందంటే ఒకప్పుడు దాన్నే ఏళ్లపాటు వాడేవారు. ఇప్పుడు బోలెడు ఆప్షన్లు. రోజుకో సంస్థ, సరికొత్త ఉత్పత్తులెన్నో పుట్టుకొచ్చేస్తున్నాయి. వాటిని పరిచయం చేస్తూ సోషల్‌మీడియా ఉండనే ఉంది. అంతలా ఆకట్టుకుంటోంటే మనసు ఊరుకుంటుందా? చకాచకా కార్ట్‌లోకి కొట్టేస్తాం. ఎంతో ఆశగా ప్రయత్నిస్తామా... అదేమో నప్పదు. ఇంకేం పక్కన పడేస్తాం.



అంతంత డబ్బులు పోసి కొన్నది... వృథా నేగా! అందుకే ముందు ట్రై చేయండి. సరిపోయిందా... తరవాతే కొనండి.

ఎలాగంటే... కొన్నిసంస్థలు ఈ ఉత్పత్తుల్నే చిన్న సైజుల్లో శాంపిల్ ప్యాక్‌లను ఇస్తాయి. వాటిని వాడితే సరి. smytten, samplrbox, trymefirst, yotobox వంటివన్నీ అలాంటి సంస్థలే. స్కిన్‌కేర్, ఫుడ్, మేకప్‌లకు సంబంధించిన మినీ వెర్షన్లన్నీ ఇందులో దొరుకుతాయి. పైగా చాలావరకూ ఉచితమే. షిప్పింగ్‌కి అయ్యే ఛార్జీలవరకూ చెల్లిస్తే సరిపోతుంది. ఇంకొన్ని సంస్థలైతే దరఖాస్తు చేసుకుంటే అవే ఛార్జీల్లేకుండా శాంపిల్స్ పంపిస్తాయి. వాడాక వీడియో లేదా మెసేజ్ రూపాల్లో ఫీడ్‌బ్యాక్ తీసుకుంటాయి. కాబట్టి, కళ్లను ఆకర్షించింది కదా అని తొందరపడి కొనేయకండి. దాని శాంపిల్ ఎక్కడైనా దొరుకుతుందేమో చూడండి. వాడాక నచ్చితే ఆపై పెద్దది కొనుక్కుంటే సరి.

వానల్లో ఈవీ..

జాగ్రత్తలు ఇవీ



తెలుగు రాష్ట్రాల్లో పర్యావరణహిత విద్యుత్తు వాహనాల (ఈవీ) వినియోగం పెరుగుతోంది. డీజిల్, పెట్రోల్ వాహనాలతో పోల్చితే ప్రయాణ ఖర్చు తక్కువ అవుతుండటంతో ప్రజలు వీటివైపు మొగ్గు చూపుతున్నారు. ఇది మంచి పరిణామమే అయినా కొన్నిచోట్ల బ్యాటరీలు పేలిపోవడం, ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతుండడం వంటి సంఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. వీటి నిర్వహణపై అవగాహన లేకనే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని నిపుణుల మాట. వర్షాకాలంలో మరింత అప్రమత్తత అవసరమని వారు సూచిస్తున్నారు.

తెలుగు రాష్ట్రాల్లో ఈ-వాహనాలు

వాహనం	తెలంగాణ	ఏపీ
ద్విచక్రవాహనం	1,62,270	1,03,210
కార్లు	20,771	6,134
ఆటోలు	9,318	7,907
బస్సులు	709	126

100 శాతం... వద్దు!

- బ్యాటరీలు ఫుల్‌ఛార్జ్ కావాలని రాత్రంతా ఛార్జింగ్ పెట్టేసి వదిలేస్తుంటారు. ఇది అత్యంత ప్రమాదకరం. ఛార్జింగ్ 20 నుంచి 80 శాతం వరకే ఉండేలా చూసుకుంటే వాటి మన్నిక బాగుంటుంది.
- దూర ప్రాంతాలకు వెళ్లి వచ్చిన వెంటనే ఛార్జింగ్ పెడుతుంటారు. వాహనం అప్పటికే వేడెక్కి ఉంటుంది. మళ్లీ ఛార్జింగ్ పెట్టడం వల్ల మరింత వేడెక్కుతుంది. ఇలా ఒత్తిడి పెరిగి, పేలిపోయే అవకాశం ఉంది.
- ప్రయాణం చేసి వచ్చినప్పుడు వాహనానికి గాలి తగిలేలా చూసుకుంటే మంచిది. బండి కదిలితే పూర్తిగా ఆరిపోయాకే ఛార్జింగ్ పెట్టాలి.

సర్వీసింగ్ ఎప్పుడు?



- వాహనంలో బ్యాటరీ పేలిపోయే ముందు కొన్ని సంకేతాలు ఇస్తుంది. బండి బాగా వేడెక్కుతుంది. లోపలి నుంచి పొగ వస్తుంటే ఛార్జింగ్ ఆపేసి బండిని చల్లని ప్రదేశంలో ఉంచాలి.
- బ్యాటరీ ఛార్జింగ్ అవుతున్నప్పుడు కొద్దిగా వేడెక్కుతుంది. ఆ తర్వాత 10 నిమిషాల్లోనే చల్లబడుతుంది. అలా జరగకుంటే వెంటనే డీలర్‌ను సంప్రదించాలి.
- వాహనం సరిగ్గా నడుస్తున్నా.. ప్రతి మూడు నెలలకోసారి తనిఖీ చేయించాలి.. ఆరు నెలలకోసారి వైరింగ్, బ్యాటరీ పనితీరును పూర్తిగా తనిఖీ చేయించాలి.
- వర్షాకాలంలో ముసురు, గాల్లోని తేమ వల్ల ఎలక్ట్రిక్ కనెక్టర్లు, వైర్లు, రంగు లేని చోట వాహనం తుప్పు పడుతుంటుంది.
- వాటర్ ప్రూఫ్ ఉన్నా.. నీటిలో ఉన్నప్పుడు అరగంట వరకే అది రక్షణ ఇస్తుంది. అంతకంటే ఎక్కువ సమయం వాహనం నీటిలో ఉంటే బ్యాటరీలోకి నీరు చేరుతుంది.

అధీకృత ఛార్జర్లు మేలు...

- మార్కెట్‌లో బ్రాండెడ్ బ్యాటరీలను పోలిన నకిలీవి చాలా వస్తున్నాయి. సగం ధరకే ఇస్తామని వ్యాపారులు మభ్యపెడుతుంటారు. ఇలా తక్కువ ధరకు కొనుగోలు చేసే నాసిరకం బ్యాటరీలే ఎక్కువగా పేలిపోతుంటాయి.
- వాహనంతో వచ్చిన బ్యాటరీ లైఫ్ అయిపోయాక కూడా బ్రాండెడ్, అధీకృత డీలర్ వద్దే బ్యాటరీలు కొనుగోలు చేయాలి.
- ఆటోమోటివ్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఏఆర్ఏఐ), ఇతర నాణ్యతా ప్రమాణాలు ఉన్న బ్యాటరీలే ఎంచుకోవాలి. ఛార్జింగ్ పెట్టేందుకు ఒరిజినల్, అధీకృత ఛార్జర్లనే వాడాలి. **-హర్షిన్ లాల్‌పేట్,** సవర్ష్ ఆల్ ఈవీ సర్వీసెస్

ఎందుకు పేలుతాయి..?



- ఈవీల్లో లిథియం - అయాన్ బ్యాటరీ ప్యాక్ చేయడంలో తేడాలుంటే పేలిపోతాయి.
- బ్యాటరీల్లో నాసిరకం సెల్స్ ఉండటం వల్ల షార్ట్‌సర్క్యూట్ అవుతాయి.
- వైరింగ్‌లో తప్పిదాలు, ఫ్యూయల్ లీకేజీ వల్ల కూడా పేలతాయి.

ఇలా చేయండి..

- వర్షా కాలంలో ఉరుములు, మెరుపుల సమయంలో ఈవీలకు ఛార్జింగ్ పెట్టాల్సి వస్తే జాగ్రత్తగా ఉండాలి.
- తడిసిన ఛార్జింగ్ పోర్ట్, ప్లగ్ వల్ల విద్యుత్తు సరఫరాలో హెచ్చుతగ్గులు ఏర్పడి షార్ట్ సర్క్యూట్ అయ్యే అవకాశం ఉంది.
- ఈవీల ఛార్జింగ్‌కి ప్రత్యేక పాయింట్ ఏర్పాటు చేసుకుంటేనే ఉత్తమం. ప్లగ్, పోర్టు ఎప్పుడూ తడవకుండా, శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి.



- ఈనాడు డిజిటల్, హైదరాబాద్

కృత్రిమ మేధతో పన్ను ఎగవేతదారుల కట్టడి

రాష్ట్రాల మంత్రుల కమిటీ సమీక్షలో పయ్యావుల ప్రస్తావన



సమావేశంలో వర్చువల్‌గా పాల్గొని, మాట్లాడుతున్న మంత్రి కేశవ్

అనంతపురం (జిల్లా సచివాలయం), న్యూస్‌టుడే: దేశంలో పన్ను ఎగవేతదారులను కట్టడి చేసేందుకు కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) పరిజ్ఞానాన్ని వినియోగిస్తే సత్ఫలితాలు వస్తాయని రాష్ట్ర ఆర్థిక, వాణిజ్య పన్నుల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. జీఎస్టీ పన్నుల సరళిని తరచూ సమీక్షించడానికి కేంద్ర ప్రభుత్వం నియమించిన పలు రాష్ట్రాల మంత్రుల కమిటీ సమీక్ష సమావేశంలో అనంతపురంలోని ఎన్ఐసీ కార్యాలయం నుంచి మంత్రి వర్చువల్‌గా పాల్గొన్నారు. పన్ను ఎగవేతదారుల గుర్తింపు, వారిని ఎలా కట్టడి చేయాలన్న దానిపై మెరుగైన చర్యలు అవసరమని కేశవ్ సూచించారు. జీఎస్టీ వసూలు, లీకేజీలు లేకుండా పలు రాష్ట్రాల్లో అమలు చేస్తున్న మంచి విధానాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. వే బిల్లులు, ఫాస్టాగ్ వంటి అంశాలపైనా లోతుగా చర్చించాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. జీఎస్టీకి సంబంధించి అన్ని రాష్ట్రాలూ సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవాలని, దీనికి కూడా ఏఐ వినియోగించుకుంటే మంచిదని వివరించారు.

ఎన్ఎంసీ దృష్టికి విదేశీ వైద్య విద్యార్థుల సమస్య

ఏపీ మెడికల్ కౌన్సిల్ ఛైర్మన్ శ్రీహరిరావు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీహరిరావు. చిత్రంలో రిజిస్ట్రార్ రమేష్

ఈనాడు, అమరావతి: విదేశీ వైద్య విద్యార్థుల శాశ్వత రిజిస్ట్రేషన్ సమస్యను జాతీయ వైద్య మండలి (ఎన్ఎంసీ) దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి చొరవ చూపుతామని ఏపీ మెడికల్ కౌన్సిల్ ఛైర్మన్ డాక్టర్ డి. శ్రీహరిరావు తెలిపారు. విజయవాడలోని ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 2023 మే నుంచి రిజిస్ట్రేషన్ సమస్య మొదలైందని గుర్తుచేశారు. గత ప్రభుత్వంలో ఏర్పడిన మెడికల్ కౌన్సిల్ 2024 జూన్‌లో రాజీనామా చేయడంతో సమస్య పరిష్కారంలో ఆలస్యమైందని పేర్కొన్నారు. నూతన కౌన్సిల్ సర్వసభ్య సమావేశంలో సమస్యల పరిష్కారంపై తీర్మానాలు చేశామని, వాటిని దిల్లీలోని ఎన్ఎంసీ ప్రతినిధులను కలిసి వివరిస్తామని చెప్పారు. హైకోర్టులో అప్పీలు పెండింగులో ఉందని, ఆ తీర్పు ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఏపీ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ ఐ. రమేష్ మాట్లాడుతూ.. ఎన్ఎంసీ మార్గదర్శకాలకు అనుగుణంగా విదేశీ వైద్య విద్యార్థుల సమస్యపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇదే అంశంపై వైకాపా వైద్య విభాగం అధ్యక్షుడు సీదిరి అప్పలరాజు, మాజీ ఎమ్మెల్యేలు శ్రీనివాసరెడ్డి, జగన్‌మోహనరావులు ఏపీ మెడికల్ కౌన్సిల్ ఛైర్మన్, రిజిస్ట్రార్‌లను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు ధర్నాచౌక్‌లో వైద్య విద్యార్థుల ఆందోళనకు మద్దతు తెలిపారు.

నటి రన్యారావు ఆస్తుల జప్తు

విలువ సుమారు రూ.34 కోట్లు

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: దుబాయ్ నుంచి అక్రమంగా బంగారాన్ని తరలిస్తూ బెంగళూరు విమానాశ్రయంలో పట్టుబడిన వెండితెర నటి రన్యారావుకు చెందిన రూ.34.12 కోట్ల విలువైన ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు శుక్రవారం జప్తు చేశారు. బెంగళూరు అరకావతి లేఅవుట్‌లో ఒక ఇంటిస్థలం, తుమకూరు పారిశ్రామికవాడలోని భూమి, ఆనేకల్ తాలూకాలో ఒక వ్యవసాయ క్షేత్రాన్ని మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద తాత్కాలికంగా జప్తు చేశామని ఈడీ అధికారులు తెలిపారు. హర్షవర్ధిని అలియాస్ రన్యారావు బంగారాన్ని అక్రమంగా తరలిస్తూ బెంగళూరు కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో మార్చి 3న డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులకు దొరికిపోయారు. ఆ సమయంలో ఆమె నుంచి రూ.12.56 కోట్లకు పైగా విలువ చేసే 14.2 కిలోల బంగారు కడ్డీలను స్వాధీనం చేసుకున్నారు.

సికింద్రాబాద్-విశాఖపట్నం వందేభారత్‌లో మరో 4 కోచ్‌లు

ఈనాడు, హైదరాబాద్: సికింద్రాబాద్-విశాఖపట్నం వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో కోచ్‌ల సంఖ్య పెంచినట్లు దక్షిణ మధ్య రైల్వే శుక్రవారం తెలిపింది. ఈ రైళ్ల(20707, 20708)లో ప్రస్తుతం 14 ఏసీ ఛైర్ కార్ కోచ్‌లు ఉండగా వాటి సంఖ్య 18కి పెంచింది. రెండు ఎగ్జిక్యూటివ్ క్లాస్ కోచ్‌ల సంఖ్యలో ఎలాంటి మార్పు చేయలేదు. ఈ నిర్ణయం శనివారం నుంచే అమల్లోకి వస్తుందని ద.మ. రైల్వే సీపీఆర్వో సీహెచ్ శ్రీధర్ తెలిపారు. సికింద్రాబాద్-విశాఖపట్నం(20707) వందేభారత్ రైలు ఉదయం 5.05 గంటలకు బయల్దేరి మధ్యాహ్నం 1.50 గంటలకు విశాఖ చేరుకుంటుంది. తిరిగి విశాఖపట్నం నుంచి మధ్యాహ్నం 2.30కి బయల్దేరే రైలు(20708) రాత్రి 11 గంటలకు సికింద్రాబాద్‌కు చేరుకుంటుంది. ◆ నాలుగు రైళ్లలో జనరల్ బోగీల సంఖ్య నాలుగుకి పెంచినట్లు రైల్వేశాఖ తెలిపింది. ఇందులో ముంబయి-బళ్లార్ష(11001/11002), ముంబయి-చెన్నై సెంట్రల్(22157/22158), మైసూరు-రేణిగుంట(22135/22136), కొల్హాపూర్-నాగ్‌పూర్(11403/11404) రైళ్లు ఉన్నాయి. ఈ నిర్ణయం సెప్టెంబరు 5 నుంచి అమల్లోకి రానుంది. ఇప్పటి వరకు వీటిల్లో రెండు లేదా మూడు జనరల్ బోగీలు మాత్రమే ఉన్నాయి.

రైతు సేవా కేంద్రాల ద్వారా రాయితీ విత్తన పంపిణీ

ఈనాడు,అమరావతి: రైతు సేవా కేంద్రాల ద్వారా విత్తన పంపిణీపై ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. డి-క్రిషి యాప్ ద్వారా రైతులకు విత్తనాలు అందించాలని పేర్కొంది. ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ నుంచి రైతు సేవా కేంద్రాల వారీగా కేటాయింపులుంటాయని తెలిపింది. ప్రభుత్వం నిర్ణయించిన రాయితీ మేరకు.. అక్కడి వ్యవసాయ/ఉద్యాన సహాయకులు విత్తనాలను పంపిణీ చేస్తారు. ఆధార్, మొబైల్ నంబరుకు ఓటీపీ ధ్రువీకరణ ద్వారా రైతుల్ని గుర్తిస్తారు. రాయితీని మినహాయించి మిగిలిన మొత్తాన్ని వసూలు చేసి, అదే రోజు విత్తనాలు పంపిణీ చేస్తారు.

ఆటోమేషన్‌తో ప్రమాదకర రసాయనాల ప్రాసెస్

- ఈ ప్రాంతాన్ని ఇతర విభాగాలకు దూరంగా ఉంచాలి
- అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ ప్రతాప్

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని పరిశ్రమలన్నీ హజార్డ్స్ ఏరియా క్లాసిఫికేషన్ (ప్రమాదకర ప్రాంత వర్గీకరణ) అధ్యయనాలు నిర్వహించుకోవాలని అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ మాదిరెడ్డి ప్రతాప్ ఆదేశించారు. హై రిస్క్ ప్రాసెస్ ఏరియాలను ఇతర విభాగాలకు పూర్తిగా దూరంగా ఉంచాలని సూచించారు. ప్రమాదకర రసాయనాలు, పదార్థాల ప్రాసెస్‌ను ఆటోమేషన్ ద్వారా లేదా సుశిక్షితులైన కొద్ది మంది సిబ్బందితో చేపట్టాలని పేర్కొన్నారు. దీనివల్ల ప్రమాదాలు జరిగినా ప్రాణనష్టం చాలా తక్కువగా ఉంటుందన్నారు. తెలంగాణలోని సిగాచీ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఔషధ పరిశ్రమలో ఇటీవల భారీ పేలుడు చోటుచేసుకున్న నేపథ్యంలో రాష్ట్రంలో అలాంటి ఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన ముందుజాగ్రత్త చర్యల్ని వివరిస్తూ రాష్ట్రంలోని అన్ని హజార్డ్స్ ఇండస్ట్రీస్‌కు లేఖ రాసినట్లు తెలిపారు. అగ్నిమాపక శాఖ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పరిశ్రమల యాజమాన్యాలు నిర్జల గ్యాస్ డ్రయింగ్ వ్యవస్థలను వినియోగించుకోవాలని, అన్ని పరికరాల గ్రౌండింగ్, బాండింగ్ సరిగ్గా ఉందా లేదా అనేది ఎప్పటికప్పుడు చూసుకోవాలని నిర్దేశించారు. ప్రతి పరిశ్రమ థర్డ్ పార్టీ ఏజెన్సీతో భద్రతా తనిఖీలు చేయించాలని తెలిపారు.

అగ్నిమాపక శాఖలో నిపుణులు లేకే..

'ప్రమాదకర పరిశ్రమల్లో ఏయే కారణాల వల్ల అగ్నిప్రమాదాలు సంభవిస్తాయి? అక్కడ ఎలాంటి చర్యలు తీసుకోవాలి అనే సూచనలు ఇవ్వగలిగే నిపుణులు అగ్నిమాపక శాఖలో లేరు. అందుకే నిపుణులతో కూడిన అధీకృత థర్డ్ పార్టీలతో తనిఖీలు నిర్వహించాలని సూచిస్తున్నాం. ఆయా యాజమాన్యాల నుంచే స్వీయ అఫిడవిట్లు తీసుకుంటున్నాం. వాటి ఆధారంగా ఎన్వోసీ (నిరభ్యంతర పత్రాలు) జారీ చేస్తున్నాం. ఏదైనా ఉల్లంఘనలు జరిగి, ప్రమాదానికి కారకులైతే ఆ పరిశ్రమతో పాటు థర్డ్ పార్టీని బాధ్యుల్ని చేసి, చర్యలకు సిఫార్సు చేస్తాం' అని ప్రతాప్ వివరించారు.



సరకు రవాణా ఓడ

సరకు రవాణాలో అదానీ కృష్ణపట్నం పోర్టు రికార్డు

ఈనాడు, అమరావతి; న్యూస్‌టుడే, ముత్తుకూరు: అదానీ కృష్ణపట్నం పోర్టు లిమిటెడ్ (ఏకేపీఎల్) జూన్‌లో 5.85 మిలియన్ మెట్రిక్ టన్నుల (ఎంఎంటీ) సరకు రవాణా చేసి కొత్త రికార్డు సాధించిందని ఆ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. మే నెలలో సాధించిన 5.74 ఎంఎంటీ రికార్డును ప్రస్తుతం అధిగమించినట్లు పేర్కొంది. 'పోర్టు ప్రారంభించినప్పటి నుంచి ఇంత పెద్ద మొత్తంలో సరకు రవాణా చేయడం ఇది రెండోసారి. తద్వారా తూర్పు తీరంలో ఏకేపీఎల్ ప్రముఖ లాజిస్టిక్స్, కార్గో రవాణా హబ్‌గా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది' అని పేర్కొంది. ఉద్యోగుల కృషి, కార్యాచరణతో రవాణాలో సరికొత్త రికార్డు సాధించామని ఏకేపీఎల్ సీఈఓ జగదీప్ పటేల్ వ్యాఖ్యానించారు.

రాష్ట్రంలో వైద్య పరికరాల నాణ్యత తనిఖీకి ఆమోదం

తొలిసారిగా మెడ్‌టెక్ జోన్‌కు అనుమతులు

ఈనాడు, విశాఖపట్నం: రాష్ట్రంలో తొలిసారిగా వైద్య పరికరాల నాణ్యతను పరిశీలించేందుకు కేంద్ర ఔషధ ప్రమాణాల నియంత్రణ సంస్థ (సీడీఎస్‌సీఓ) ధ్రువీకరించిన ఆడిటింగ్ బాడీ ఏర్పాటు కానుంది. క్లాస్ ఎ, క్లాస్ బీ వైద్య పరికరాల ఉత్పత్తి కేంద్రాలను తనిఖీ చేయడానికి విశాఖ మెడ్‌టెక్ జోన్‌లోని కలాం ఇన్‌స్టిట్యూట్ హెల్త్ టెక్నాలజీ (కేఐహెచ్‌టీ) సర్టిఫికేషన్ సర్వీసెస్‌ను అధీకృత నియంత్రణ సంస్థగా సీడీఎస్‌సీఓ గుర్తించింది. దేశవ్యాప్తంగా 14 సంస్థలను గుర్తించగా తెలుగు రాష్ట్రాల్లో ఇదొక్కటే కావడం గమనార్హం. ఫలితంగా దేశీయ తయారీదారులు ప్రపంచ ప్రమాణాలను అందుకునేందుకు, మేకిన్ ఇండియా నినాదానికి మద్దతు లభిస్తుందని మెడ్‌టెక్ జోన్ అధికారులు తెలిపారు.

గోదావరికి పెరుగుతున్న వరద

- 'పుష్కర' కాలువకు 350 క్యూసెక్కుల విడుదల

సీతానగరం, దేవీపట్నం, న్యూస్‌టుడే: ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న ప్రవాహంతో గోదావరి ఎడమగట్టు వెంట వరద పోటెత్తుతోంది. తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలంలోని పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం వద్ద శుక్రవారం సాయంత్రం 5 గంటల సమయంలో నీటిమట్టం 17 మీటర్లకు పెరిగింది. 350 క్యూసెక్కుల నీటిని పుష్కర కాలువకు మళ్లించినట్లు డీఈఈ సీహెచ్ కోటేశ్వరరావు తెలిపారు. ములకల్లంక- బొబ్బిల్లంక నదీగర్భంలోని తాత్కాలిక రోడ్డు మార్గం కొట్టుకుపోవడంతో ప్రజలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. పోలవరం, పురుషోత్తపట్నం ఫెర్రీరేవులోనూ పాపికొండల పర్యాటకుల లాంచీలు యథావిధిగా తిరుగుతున్నాయి.



గోదావరిలో పడవపై రాకపోకలు సాగిస్తున్న లంక ప్రజలు

మొదటి ప్రమాద హెచ్చరిక జారీచేస్తేనే ఇవన్నీ నిలిపివేస్తామని అధికారులు తెలిపారు. వంగలపూడి, సింగవరం, సీతానగరం, కాటవరం, ములకల్లంక తదితర చోట్ల ఇసుకరేవులు ముంపులోకి చేరాయి. ప్రభుత్వ అనుమతులతో మైదాన ప్రాంతాల్లో నిల్వ చేసిన గుట్టల నుంచి నిర్దేశించిన ధరలతో ఇసుకను వినియోగదారులు తీసుకెళ్లవచ్చని గనుల శాఖ ఏడీ ఫణిభూషణ్‌రెడ్డి 'న్యూస్‌టుడే'కు తెలిపారు.




అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలంలోని గండిపోశమ్మ ఆలయ మండపంలోకి చేరిన నీరు

ముంపులో గండిపోశమ్మ..

గోదావరిలో నీటి మట్టం మరింత పెరగడంతో అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలంలోని గండిపోశమ్మ అమ్మవారి ఆలయం ముంపునకు గురైంది. ఆలయ మండపాన్ని ముంచెత్తిన నీరు అమ్మవారి విగ్రహం సగానికి చేరడంతో దర్శనాలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఈవో లక్ష్మీకుమార్ శుక్రవారం ప్రకటించారు. ముందుజాగ్రత్తగా అధికారులు ఆలయానికి విద్యుత్తు సరఫరా నిలిపివేశారు.

ఉప్పొంగుతున్న కృష్ణవేణి

రాయచూరు (కర్ణాటక), న్యూస్‌టుడే: ఎగువ ప్రాంతంలో వర్షాలు జోరందుకోవడంతో కృష్ణానది పరవళ్లు తొక్కుతోంది. ఫలితంగా కర్ణాటకలోని ఆలమట్టి, నారాయణపుర జలాశయాల్లోకి వరద నీటి ప్రవాహం పెరిగింది. శుక్రవారం ఉదయం ఆలమట్టిలో 87.610 టీఎంసీల నీటి నిల్వ నమోదైంది. జలాశయంలోకి 94,767 క్యూసెక్కులు నీరు వస్తుండగా లక్ష క్యూసెక్కుల నీటిని నారాయణపురకు విడుదల చేస్తున్నారు. అదే సమయంలో నారాయణపుర నుంచి 95,265 క్యూసెక్కుల నీటిని 30 గేట్లను పైకెత్తి తెలంగాణలోని జూరాలకు విడుదల చేశారు.



ఆలమట్టి నుంచి కృష్ణా నదికి కొనసాగుతున్న నీటి విడుదల

శ్రీశైలం జలాశయానికి భారీగా వరద

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: ఎగువ పరీవాహక ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి భారీగా వరద వస్తోంది. జూరాల ప్రాజెక్టు నుంచి 1,24,610 క్యూసెకుల నీరు చేరుతోంది. శ్రీశైలం కుడి, ఎడమ గట్టు జలవిద్యుత్తు కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ 56,998 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జలాశయం నీటిమట్టం శుక్రవారం సాయంత్రం 6 గంటలకు 876.30 అడుగులు, నీటి నిల్వ 169.8650 టీఎంసీలుగా నమోదైంది.

బైక్‌లు దొంగిలిస్తూ.. మత్తుపదార్థం కొంటూ!

- తూర్పుగోదావరి జిల్లాలో పట్టుబడ్డ ముగ్గురు యువకులు
- 14 కేజీల గంజాయి, 16 ద్విచక్రవాహనాల స్వాధీనం



విలేకర్లకు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ తదితరులు ◆ పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్‌లు

గోకవరం, న్యూస్‌టుడే: మత్తుకు అలవాటు పడి, గంజాయి కోసం ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న ముగ్గురు యువకులు తూర్పు గోదావరి జిల్లాలో పోలీసులకు చిక్కారు. ఆ వివరాలను నార్త్‌జోన్ డీఎస్పీ శ్రీకాంత్ శుక్రవారం విలేకర్లకు వెల్లడించారు. గోకవరం మండలం కామరాజుపేట గ్రామానికి చెందిన పాశం కొండలరావు(23), వాకాడ పవన్‌కుమార్(19), కాకర్ల వెంకటకుమార్(21), గోకవరానికి చెందిన ఆవుల వంశీ(29)లు గంజాయి సేవనం, చెడు వ్యసనాలకు బానిసలయ్యారు. గంజాయి కొనుగోలుకు డబ్బులు లేకపోవడంతో ముఠాగా ఏర్పడి బైక్‌ల దొంగతనాన్ని మార్గంగా ఎంచుకున్నారు. ఉభయగోదావరి జిల్లాలతో పాటు ఇతర ప్రాంతాల్లో ఇళ్ల ముందు ఉంచిన వాహనాలను ఎత్తుకెళ్తూ. . కామరాజుపేటలోని ఓ వంతెన కింద దాచి పెడుతున్నారు. వారికి అవసరమైనప్పుడల్లా ఒక్కో ద్విచక్రవాహనాన్ని ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ఏజెన్సీకి తీసుకెళ్లి, స్మగ్లర్లకు ఇచ్చి బదులుగా గంజాయి తెచ్చుకుంటున్నారు. ఎప్పటిలాగే బైక్‌లపై గంజాయి తీసుకొస్తున్న వీరు శుక్రవారం గోకవరం శివారున బాపనమ్మ ఆలయం వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులను చూసి తప్పించుకునే ప్రయత్నం చేయగా.. ఎస్సై పవన్‌కుమార్ సిబ్బందితో కలిసి ముగ్గురిని పట్టుకున్నారు. ప్రధాన సూత్రధారి ఆవుల వంశీ పరారయ్యాడు. పట్టుబడ్డ వారి నుంచి రెండు బైక్‌లు, 14 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారిని విచారించగా కామరాజుపేటలో వంతెన కింద దాచిపెట్టిన మరో 14 వాహనాలు దొరికాయి. వీరితో పాటు ఈ దందాలో ఇంకా ఎవరున్నారు? ఈ గంజాయిని ఎవరికైనా విక్రయిస్తున్నారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కలకు రేపు యాంటీ రేబిస్ టీకాలు

ఈనాడు, అమరావతి: ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని పశువైద్యశాలలు, ప్రాంతీయ వెటర్నరీ ఆసుపత్రులు, వెటర్నరీ పాలిక్లినిక్, వెటర్నరీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు వేయనున్నట్లు పశుసంవర్ధకశాఖ సంచాలకుడు డాక్టర్ దామోదరనాయుడు తెలిపారు. మొత్తం 5.37 లక్షల టీకాలు వేయడానికి ఏర్పాట్లు చేశామన్నారు.

ఒక్కో టవర్... 50 అంతస్తులు

4 ఎకరాల్లో ఆరు టవర్ల నిర్మాణానికి ప్రణాళిక • వీఎంఆర్‌డీఏ బోర్డు సమావేశంలో నిర్ణయం



వివరాలు వెల్లడిస్తున్న వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్, కమిషనర్ విశ్వనాథన్

ఈనాడు, విశాఖపట్నం: విశాఖ నగరంలోని మధురవాడ వద్ద సర్వేనంబరు 331-1లోని 4.7 ఎకరాల్లో భారీ నివాస భవనాలు నిర్మించనున్నారు. మొత్తంగా ఆరు టవర్లు.. ఒక్కోటి 50 అంతస్తులుంటాయి. ఈ మేరకు విశాఖ మహాప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) బోర్డు సమావేశంలో నిర్ణయించారు. శుక్రవారం వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ విశ్వనాథన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. ఈ వివరాలు విలేకర్లకు వెల్లడించారు. మధురవాడలో నిర్మించే ఐకానిక్ భవన సముదాయాన్ని ప్రభుత్వ, ప్రైవేటు, భాగస్వామ్య (పీపీపీ) విధానంలో మూడు, నాలుగు పడక గదులతో నిర్మించాలని ప్రతిపాదించారు. క్లబ్‌హౌస్, ఈతకొలను, ఆటస్థలం, సైకిల్‌ట్రాక్, జాగింగ్ ట్రాక్, ఇతర వసతులు కల్పించనున్నారు. మిథిలాపురి కాలనీ, మధురవాడ, మారికవలస, వేపగుంట ప్రాంతాల్లో గుర్తించిన స్థలాల్లో మధ్యతరగతి కుటుంబాలకు అందుబాటు ధరల్లో రెండు, మూడు పడక గదులతో బహుళ అంతస్తుల భవనాలు నిర్మించేలా బోర్డులో అనుమతి వచ్చింది. బీచ్ రోడ్డులోని వీఎంఆర్‌డీఏ పార్కులో రూ.2.50 కోట్లతో స్కేటింగ్ రింక్ ఆధునికీకరణకు, వీఎంఆర్‌డీఏ, జీవీఎంసీ సంయుక్తంగా నిర్మించే వేపగుంట-పినగాడి రోడ్డు నిర్మాణానికి, అనకాపల్లి జిల్లా కొత్తూరులో సిటీ లెవెల్ పార్కు నిర్మాణానికి అనుమతి తీసుకున్నారు. ఇందులో వ్యాయామ పరికరాలు, పిల్లలకు ఆటస్థలం, అన్ని రకాల క్రీడామైదానాలు నిర్మించేలా బోర్డులో నిర్ణయించారు.

పీతల పెంపకానికి నిబంధనల జారీ

ఈనాడు, దిల్లీ: పీతల పెంపక కేంద్రాల నిర్వహణ విషయంలో భద్రతా ప్రమాణాలను నిర్దేశిస్తూ కేంద్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ శుక్రవారం నోటిఫికేషన్ జారీచేసింది. 'హేచరీస్ అండ్ ఫామ్స్ ఫర్ సీడ్ ప్రొడక్షన్ అండ్ కల్చర్ ఆఫ్ క్రాబ్ గైడ్‌లైన్స్ -2025' పేరుతో వీటిని విడుదల చేసింది. పీతలు, వాటి పిల్లల పెంపక రంగంలోకి అడుగుపెట్టే వారు తప్పనిసరిగా కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ నిర్దేశించినట్లుగా జీవ వైవిధ్య, అంతర్గత క్వారంటైన్ సౌకర్యాలు ఏర్పాటు చేసుకోవాలి. హేచరీ నిర్వాహకులు కోస్టల్ ఆక్వాకల్చర్ అథారిటీకి ఫామ్-2 సమర్పించడంతోపాటు రూ.10 వేలు చెల్లించి హేచరీలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. తమ వద్ద ఉన్న మౌలిక వసతులు, ఆర్థిక కార్యకలాపాలకు సంబంధించిన డీపీఆర్‌ను ఈ ఫామ్‌తోపాటు సమర్పించాలి. ఆక్వాకల్చర్ అథారిటీ నియమించిన బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాతే పీత పిల్లల ఉత్పత్తికి సంబంధించిన హేచరీకి అనుమతి ఇస్తారు.

రామకృష్ణ ఎలక్ట్రానిక్స్ కేసులో అల్లు అరవింద్ వాంగ్మూలం తీసుకున్న ఈడీ



ఈనాడు, హైదరాబాద్: ప్రముఖ సినీనిర్మాత అల్లు అరవింద్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) విచారణకు హాజరయ్యారు. రామకృష్ణ ఎలక్ట్రానిక్స్ నిర్వాహకులకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో బుధవారమే ఈడీ అధికారులు హైదరాబాద్ జోనల్ కార్యాలయంలో అరవింద్ వాంగ్మూలం తీసుకున్నారు. అయితే, ఈ విషయం శుక్రవారం వెలుగులోకి వచ్చింది. రామకృష్ణ ఎలక్ట్రానిక్స్ నిర్వాహకులు వినియోగించిన బ్యాంకు ఖాతాల లావాదేవీల విషయంలో ఈడీ అధికారులు అరవింద్‌ను ప్రశ్నించారు. ఆయా ఖాతాల పరిశీలన క్రమంలో కొన్ని లావాదేవీలు అనుమానాస్పదంగా కనిపించడంతో ఈడీ అధికారులు ఆరా తీస్తున్నారు. అనుమానాస్పద లావాదేవీలు ఏ బ్యాంకు ఖాతాలకు మళ్లించారనే కోణంలో దర్యాప్తు జరుపుతున్నారు. అలా నిధులు బదిలీ అయిన బ్యాంకుల ఖాతాదారుల నుంచి వివరాలు రాబడుతున్నారు. ఈ క్రమంలో రామకృష్ణ ఎలక్ట్రానిక్స్ కంపెనీకి, అల్లు అరవింద్‌కు మధ్య జరిగిన బ్యాంకు లావాదేవీలు అనుమానాస్పదంగా ఉన్నట్లు ఈడీ గుర్తించింది. ఆ లావాదేవీలపై స్పష్టత కోసం అరవింద్ వాంగ్మూలాన్ని నమోదు చేసింది.

రూ.101.48 కోట్ల రుణాల మళ్లింపు వ్యవహారంలో..

రామకృష్ణ ఎలక్ట్రానిక్స్, రామకృష్ణ టెలిట్రానిక్స్ కంపెనీలు సెల్‌ఫోన్ల మార్కెటింగ్ వ్యాపారం నిర్వహించేందుకు యూనియన్ బ్యాంకు నుంచి రుణం తీసుకున్నాయి. ఆయా కంపెనీలకు డైరెక్టర్లుగా వ్యవహరించిన రవికుమార్, రాఘవేంద్ర ఆ రుణాన్ని ప్రమోటర్లతోపాటు తమ కుటుంబసభ్యుల ఖాతాల్లోకి మళ్లించి ఇతర అవసరాలకు వినియోగించారు. అనంతరం రుణం ఎగవేయడంతో బ్యాంకు అధికారులు సదరు కంపెనీవి మోసపు ఖాతాలుగా 2019లోనే ప్రకటించారు. అనంతరం బెంగళూరు సీబీఐకి ఫిర్యాదు చేయడంతో 2022 డిసెంబరు 26న ఎఫ్ఐఆర్ నమోదైంది. ఆ ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ రంగంలోకి దిగింది. రామకృష్ణ ఎలక్ట్రానిక్స్ ద్వారా రూ.101.48 కోట్ల సొమ్మును మళ్లించినట్లు ఈడీ ప్రాథమికంగా గుర్తించింది. డైరెక్టర్ల బ్యాంకు ఖాతాల్లోని రూ.1.45 కోట్లను జప్తు చేసింది.

బాధ్యత గల పౌరుడిగా వివరణ ఇచ్చా: అల్లు అరవింద్

తనకు 2017లో ఓ ఆస్తిని అమ్మిన వ్యక్తిపై ఈడీ విచారణ కొనసాగుతోందని.. అక్కడి అకౌంట్ బుక్స్‌లో తన పేరు ఉండటంతోనే అధికారులు వివరణ అడిగినట్లు అల్లు అరవింద్ చెప్పారు. ఈడీ విచారణకి రావాలని అడిగితే.. బాధ్యత గల పౌరుడిగా తాను వెళ్లానన్నారు. ఇందులో అంతకుమించి మరేమీ లేదని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఓ వీడియో ప్రకటన విడుదల చేశారు.

పైన జీవాలు.. కింద కోళ్లు!



తిరుపతి జిల్లా కందులవారిపల్లి పంచాయతీ శేషాపురంలో రైతు రవినాయుడు వేసిన మేకలు, గొర్రెల షెడ్డు ఆకట్టుకుంటోంది. షెడ్డు పైభాగంలో జీవాలు, కింద కోళ్ల పెంపకం చేపట్టారు. జీవాల వ్యర్థాలు నేరుగా కింద పడేలా ఫ్లోరింగ్ ఉండటంతో తరచూ శుభ్రం చేయాల్సిన అవసరం లేదని రైతు తెలిపారు. దీంతో పరిసరాలు శుభ్రంగా ఉండి మేకలు, గొర్రెలకు వ్యాధులు రావంటున్నారు. ఈ ఎలివేటెడ్ షెడ్ నిర్మాణానికి రూ.6 లక్షలు వెచ్చించినట్లు, ప్రస్తుతం 10 గొర్రెలు, 30 మేకలు, 50 కోళ్లు పెంచుతున్నట్లు వివరించారు. జీవాల కోసం రెండెకరాల్లో పశుగ్రాసం పెంచుతున్నట్లు తెలిపారు.- **ఈనాడు, తిరుపతి**

నాడన్నారు.. నేడన్నారు.. అర్ధాంతరంగా వదిలేశారు..!

- వైకాపా ప్రభుత్వంలో నిధులు ఇవ్వక.. అసంపూర్తిగా పాఠశాలల భవన నిర్మాణాలు
- ఇప్పుడు ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

ఈనాడు - అమరావతి

ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేస్తున్నామంటూ వైకాపా ప్రభుత్వంలో హడావుడి చేయడమే తప్ప ప్రారంభించిన పనులు పూర్తి చేసిన పాపాన పోలేదు. నిధులు ఇవ్వకపోవడంతో 'నాడు-నేడు' పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా మారాయి. కొన్నిచోట్ల పాత భవనాలు, మరుగుదొడ్లు కూలగొట్టి.. ఆ శిథిలాలను అలాగే వదిలేశారు. మరి కొన్ని చోట్ల పనులకు డబ్బులు విడుదల చేయకపోవడంతో తెచ్చిన సిమెంటు గడ్డకట్టిపోయింది. పునాది గుంతలు విద్యార్థుల ప్రాణసంకటంగా మారాయి.

'నాడు-నేడు' రెండో విడతలో చేపట్టిన మౌలిక సదుపాయాల పనులు ఒక్కటీ పూర్తి చేయలేదు. మొదటి విడత పనుల్లోనూ తరగతి గదుల నిర్మాణాలు చేపట్టలేదు. ఐదేళ్ల వైకాపా పాలన కారణంగా ఇప్పుడు చాలా బడులు మొండిగోడలతో దర్శనమిస్తున్నాయి. గత వైకాపా ప్రభుత్వం 2021 ఆగస్టు 16న రెండో విడత పనులు చేపట్టింది. మొదట్లో నిధుల కొరతతో 6 నెలలు పనులే మొదలు పెట్టలేదు. రూ.8 వేల కోట్లు అవసరమని అంచనా వేసి అందులో సగం కూడా ఖర్చు చేయలేదు.



1 గది.. 3 తరగతులు


ప్రకాశం జిల్లా సంతనూతలపాడు అంబేడ్కర్ నగర్‌లోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులు వీరు. వైకాపా ప్రభుత్వ హయాంలో 'నాడు-నేడు' కింద 2 గదులు నిర్మిస్తామని ఒక్కటే కట్టి వదిలేయడంతో 3 తరగతుల పిల్లలు ఒక్క గదిలోనే సర్దుకుపోతున్నారు. వరండాలో, అద్దె భవనంలో మిగిలిన తరగతులు నడుస్తున్నాయి. 70 మంది పిల్లలు ఉన్న పాఠశాలను గత పాలకులు ఇలా చేసి వదిలేశారు.



గుంటూరులోని అడవితక్కెళ్లపాడు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా నిలిచిన 'నాడు-నేడు' పనులు



గదుల నిర్మాణం పూర్తికాకపోవడంతో వరండాలో తరగతులు



విశాఖపట్నం నగరంలో పీఎంపాలెం లోని లక్ష్మీవాణిపాలెం ప్రాథమికోన్నత పాఠశాల పరిస్థితి



నిధులేవైనా పనులు అసంపూర్తే

ఏలూరులోని శ్రీకృష్ణదేవరాయ నగరపాలక ఉన్నత పాఠశాలలో గతంలో 14వ ఆర్థిక సంఘం నిధులతో మొదలుపెట్టిన గ్రౌండ్, మొదటి అంతస్తు భవన పనులు మధ్యలోనే ఆగిపోయాయి. వైకాపా వచ్చి 'నాడు-నేడు' కింద ఆ అసంపూర్తి భవనంపైనే మరో అంతస్తు వేసింది. గదుల నిర్మాణం మొదలుపెట్టి మధ్యలోనే వదిలేసింది. మూసేందుకు రెండేళ్లుగా భవనం కనిపిస్తున్నా.. విద్యార్థుల అవసరాలు మాత్రం తీర్చలేకపోయింది.



నెల్లూరు నగరంలోని కేఎన్ఆర్ చిన్న స్కూల్‌లో అసంపూర్తి నిర్మాణాలు. ఇక్కడ గదుల కొరత కారణంగా ఎనిమిదో తరగతి 2 సెక్షన్లు ఒకే గదిలో కూర్చోపెడుతున్నారు.



కృష్ణా జిల్లా మచిలీపట్నం రైలుపేట నగరపాలక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సరిపడ గదులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో చేపట్టిన అదనపు తరగతి భవనాన్ని అసంపూర్తిగా వదిలేశారు. విద్యార్థులకు గదులు లేకపోవడంతో అందులోనే తరగతులు నిర్వహిస్తున్నారు.

అత్యవసర పనులకు రూ.3 వేల కోట్లు

కూటమి ప్రభుత్వం 'మన బడి-మన భవిష్యత్తు' కింద పాఠశాలల అభివృద్ధికి ప్రతిపాదనలు చేసింది. అత్యవసరంగా జరగాల్సిన పనులకు రూ.3 వేల కోట్లకుపైగా అవసరం కానున్నాయి. ఇవి కాకుండా గత ప్రభుత్వ పెండింగ్ బిల్లులు రూ.వెయ్యి కోట్ల వరకు ఉన్నాయి. విద్యార్థుల ప్రవేశాలు పూర్తయిన తర్వాత అత్యవసరమైన వాటి లెక్క తేల్చి, పనులు చేపట్టాలని భావిస్తున్నారు. కొన్ని చోట్ల గదుల సమస్యను తీర్చేందుకు తాత్కాలికంగా పార్టిషన్ చేస్తున్నారు. స్టార్ రేటింగ్ ప్రకారం 18 రకాల సదుపాయాలు కల్పించేందుకు రూ.13,525 కోట్లు అవసరం కానున్నాయి.



ఆలయం ఎదుట కుటుంబసభ్యులతో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరవింద్‌కుమార్ తదితరులు

శ్రీవారిని దర్శించుకున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి

తిరుమల, న్యూస్‌టుడే: సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరవింద్‌కుమార్ శుక్రవారం తెల్లవారుజామున కుటుంబసభ్యులతో కలిసి తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి అభిషేక సేవలో పాల్గొన్నారు. శ్రీవారి దర్శనానంతరం ఆయనకు రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా, తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు. వీరితోపాటు తితిదే బోర్డు సభ్యుడు నరేశ్, డిప్యూటీ ఈవో ఆర్1 భాస్కర్ తదితరులున్నారు.

సద్గురు జగ్గీ వాసుదేవ్‌కు 'బ్లూ టంగ్' పురస్కారం



పురస్కారం అందుకున్న సద్గురు

చెన్నై, న్యూస్‌టుడే: ఈశా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సద్గురు జగ్గీ వాసుదేవ్ 'బ్లూ టంగ్ పురస్కారం' అందుకున్నారు. బ్రిటన్ కేంద్రంగా పని చేస్తున్న 'గ్రేటర్' సంస్థ ప్రపంచవ్యాప్తంగా యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో ప్రజల్ని ప్రభావితం చేయగలిగిన వ్యక్తులను గుర్తించి ఏటా 'బ్లూ టంగ్' పురస్కారంతో గౌరవిస్తోంది. ఇటీవల జర్మనీలోని కొలోన్ నగరంలో జరిగిన కార్యక్రమంలో సద్గురుకు ఈ పురస్కారాన్ని ప్రదానం చేసింది. సద్గురు ప్రస్తుత కాలంలో అత్యంత ఆదరణ గల ఆధ్యాత్మిక గురువుల్లో ఒకరని, ఆయన లోతైన జ్ఞానం, ఆలోచనా స్పష్టతకు ఈ పురస్కారాన్ని అందించినట్లు 'గ్రేటర్' వెల్లడించింది.

డానిష్ ఫైబర్ టెక్నాలజీతో నాణ్యమైన రహదారులు

మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి వెల్లడి



డానిష్ ఫైబర్ టెక్నాలజీతో రహదారి నిర్మాణంపై అధికారులతో చర్చిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లి, సంజామల, న్యూస్‌టుడే: రాష్ట్రంలో డానిష్ ఫైబర్ టెక్నాలజీతో నాణ్యమైన రహదారులను నిర్మించవచ్చని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నంద్యాల జిల్లా సంజామల మండల వద్ద ఈ సాంకేతికతతో నిర్మించే సుమారు కి.మీ. మేర రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడని, అందుకే విదేశీ సాంకేతికతను రాష్ట్రానికి తీసుకొస్తున్నారన్నారు. సంజామల రోడ్డులో ప్రయోగాత్మకంగా ప్రారంభించామని, డెన్మార్క్ నుంచి వచ్చిన ప్రత్యేక నిపుణుల పర్యవేక్షణలో ఈ పనులు చేపట్టామన్నారు. 'సాధారణంగా కి.మీ. తారు రోడ్డు నిర్మాణానికి రూ.24 లక్షల ఖర్చు అవుతుండగా, డానిష్ ఫైబర్ టెక్నాలజీతో రూ.28 లక్షలు అవుతుంది. ఖర్చు ఎక్కువైనా, రోడ్ల నాణ్యత 8 నుంచి పదేళ్ల వరకు ఉంటుంది. ఈ లెక్కన ప్రభుత్వంపై భారం తగ్గిపోతుంది. ఇక్కడ విజయవంతమైతే రాష్ట్రస్థాయిలో విస్తరిస్తామ'ని తెలిపారు. కార్యక్రమంలో డెన్మార్క్ నిపుణులు డేవిడ్, జోసెఫ్, ఆర్అండ్‌బీ ఈఎన్‌సీలు రామచంద్ర, వివేకానందారెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

టీవీకే ముఖ్యమంత్రి అభ్యర్థిగా విజయ్



- ఆ పార్టీ కార్యవర్గ సమావేశంలో తీర్మానం
- డీఎంకే, భాజపాలతో ఎన్నటికీ పొత్తు ఉండదని ప్రకటన

చెన్నై, న్యూస్‌టుడే: వచ్చే ఏడాది జరగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల వేళ తమిళగ వెట్రి కళగం(టీవీకే) పార్టీ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ ఎన్నికల్లో టీవీకే నాయకత్వంలోనే కూటమి ఏర్పాటు చేస్తామని వెల్లడించింది. తమ సీఎం అభ్యర్థిగా పార్టీ వ్యవస్థాపకుడు, సినీనటుడు విజయ్‌ను ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం చెన్నైలో జరిగిన కార్యవర్గ సమావేశంలో తీర్మానాలు చేశారు. వచ్చే నెలలో భారీఎత్తున రాష్ట్ర మహాసభలు నిర్వహించాలని ప్రతిపాదించారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ తమ సైద్ధాంతిక శత్రువులైన డీఎంకే, భాజపాలతో ఎప్పటికీ పొత్తు ఉండదని స్పష్టం చేశారు. భాజపా విభజన రాజకీయాలు తమిళనాడులో చెల్లవన్నారు. స్వార్థపూరిత రాజకీయ లబ్ధి కోసం భాజపాతో పొత్తు పెట్టుకోవడానికి తమ పార్టీ డీఎంకే, అన్నాడీఎంకే కాదని విమర్శించారు.

పీఎంశ్రీ పాఠశాలలకు నిర్వహణ నిధులు విడుదల

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని 855 పీఎంశ్రీ పాఠశాలలకు నిర్వహణ నిధులను విడుదల చేస్తూ సమగ్ర శిక్షా అభియాన్ ఉత్తర్వులు జారీ చేసింది. మొదటి విడతగా 50% నిధులు ఇచ్చింది. విద్యార్థుల సంఖ్య వంద కంటే తక్కువగా ఉంటే రూ.4.75లక్షలు, 250 వరకు ఉంటే రూ.17.62లక్షలు, వెయ్యి వరకు ఉంటే రూ.36.8లక్షలు, వెయ్యి కంటే ఎక్కువ మంది పిల్లలు ఉంటే రూ.39లక్షల చొప్పున విడుదల చేసింది.

ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లకు తప్పని నిరీక్షణ

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వ హయాంలో నిషిద్ధ జాబితా నుంచి తప్పించిన ఎసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్లకు మరికొద్ది నెలలు నిరీక్షించక తప్పేలా లేదు. వచ్చే అక్టోబరు వరకు ఈ రిజిస్ట్రేషన్లు జరగవు. ఎసైన్డ్ భూములు పొంది 20 ఏళ్లు దాటిన లబ్ధిదారులకు జగన్ ప్రభుత్వం యాజమాన్య హక్కులు కల్పిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. సుమారు 13 లక్షల ఎకరాలను అప్పట్లో నిషిద్ధ జాబితా నుంచి తొలగించారు. ఇందులో అవకతవకలపై కూటమి ప్రభుత్వం అధ్యయనం చేయించింది. 5 లక్షల ఎకరాలకు సంబంధించి నిబంధనలు అతిక్రమించినట్లు గుర్తించారు. దీంతో గతేడాది నుంచి ప్రభుత్వం వీటి రిజిస్ట్రేషన్లను నిలిపివేసింది. 5 లక్షల ఎకరాలపై లోతుగా విచారణ జరుపుతూనే, మిగిలిన భూములకు రిజిస్ట్రేషన్లు కొనసాగించడంపై మంత్రివర్గ ఉపసంఘం సానుకూలత వ్యక్తంచేసింది. సచివాలయంలో శుక్రవారం జరిగిన రెవెన్యూశాఖ సమీక్షలో ముఖ్యమంత్రి వద్ద ఫ్రీహోల్డ్ భూముల అంశం చర్చకు వచ్చింది. అప్పుడు అసలు ఈ భూములు ఏ ప్రాంతంలో ఉన్నాయి? అవి వినియోగానికి అనుకూలమా? కాదా? సహజ వనరులను దెబ్బతీసేలా కట్టడాలకు ఆయా ప్రాంతాల్లో ప్రణాళికలు ఉన్నాయా? (మడ అడవులు ఇతరత్రా) అలాంటి వాటిపై అధ్యయనం అవసరమనే చర్చ జరిగింది. ఈ క్రమంలోనే అక్టోబరు 2 నాటికి మంత్రివర్గ ఉపసంఘం తుది నివేదిక సమర్పించాలని ముఖ్యమంత్రి సమక్షంలో నిర్ణయించారు. అప్పటివరకు ఫ్రీహోల్డ్ భూములకు రిజిస్ట్రేషన్ జరిగే పరిస్థితి కనిపించడంలేదు.

3 నెలలకోసారి నియోజకవర్గాల్లో ఉద్యోగ మేళాలు

- సెప్టెంబరు ఒకటి నాటికి నైపుణ్య పోర్టల్ సిద్ధం
- ఆగస్టు 7 నుంచి అక్షర ఆంధ్ర కార్యక్రమం
- విద్య, నైపుణ్యాభివృద్ధి శాఖల సమీక్షలో మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: నైపుణ్య పోర్టల్‌ను సెప్టెంబరు ఒకటి నాటికి సిద్ధం చేయాలని విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ ఆదేశించారు. ఈ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత ఆటోమెటిక్‌గా రెజ్యూమే సిద్ధమయ్యేలా ఉండాలన్నారు. ఉద్యోగ, ఉపాధి కల్పనకు పోర్టల్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఉండవల్లిలోని నివాసంలో శుక్రవారం ఉన్నత, పాఠశాల, ఇంటర్మీడియట్ విద్య, నైపుణ్యాభివృద్ధి- శిక్షణ శాఖలపై నిర్వహించిన సమీక్షల్లో మంత్రి మాట్లాడారు. ప్రతి 3 నెలలకోసారి నియోజకవర్గాల్లో ఉద్యోగ మేళాలు నిర్వహించాలన్నారు. జిల్లా ఉపాధి కల్పన కార్యాలయాల పనితీరుపై కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. విదేశాల్లో ఉద్యోగ, ఉపాధి కల్పనను సులభతరం చేసేలా ఆయా దేశాల రాయబార కార్యాలయాలతో సంప్రదింపులు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు ఏటా ఐఐటీ, ఎన్ఐటీల్లో ప్రవేశాలకు ఇబ్బందులు తలెత్తకుండా భాష సబ్జెక్టు మార్కులను మిగతా సబ్జెక్టుల మార్కుల సగటుగా ఇవ్వాలని సూచించారు.



అధికారులతో విద్య, నైపుణ్యాభివృద్ధి శాఖలపై సమీక్షిస్తున్న మంత్రి లోకేశ్

ఆగస్టు నాటికి డీఎస్సీ నియామకాలు

"డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు ఆగస్టు నాటికి నియామక ఉత్తర్వులు ఇచ్చేలా చర్యలు చేపట్టాలి. హైస్కూల్ ప్లస్‌లో అధ్యాపకుల నియామకంపై చర్యలు తీసుకోవాలి. డిగ్రీలో యూజీసీ నిబంధనలకు అనుగుణంగా కోర్సులు ఉండాలి. కళాశాలల సీట్ల భర్తీలో విద్యార్థుల అంగీకారాన్ని, ఆధార్‌తో అనుసంధానించాలి. నిర్ణీత కటాఫ్ తేదీ తర్వాత ప్రతిభ ఆధారంగా కన్వీనర్ కోటా సీట్లు కేటాయించాలి. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి" అని మంత్రి లోకేశ్ సూచించారు.

పాఠశాలల్లో కెరీర్ కౌన్సెలింగ్

"రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 10 నిర్వహించే తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాన్ని విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలి. పాఠశాలల్లో ఎకో క్లబ్‌లను ఏర్పాటు చేయాలి. మొక్కలు పెంచే విద్యార్థులకు గ్రీన్ పాస్‌పోర్టు అందించాలి. రాష్ట్రానికి మంజూరైన 125 ఆటిజం కేంద్రాల ఏర్పాటు, భవిత కేంద్రాలకు మరమ్మతులు చేయాలి. అగస్త్య ఫౌండేషన్ భాగస్వామ్యంతో నిర్మించిన 5 అధునాతన ప్రాంతీయ సైన్సు కేంద్రాలను విద్యార్థులకు ఉపకరించేలా చూడాలి. పాఠశాల స్థాయిలో విద్యార్థులకు కెరీర్ కౌన్సెలింగ్, వృత్తి విద్య, వ్యక్తిగత భద్రతపై శిక్షణ కార్యక్రమాల నిర్వహణకు చర్యలు చేపట్టాలి" అని లోకేశ్ తెలిపారు.

- దిల్లీ పర్యటన అనంతరం ఐటీఐల అభివృద్ధికి హబ్ అండ్ స్పోక్ విధానంలో కేంద్ర ప్రాయోజిత కార్యక్రమం కింద రూ.600 కోట్లు కేటాయించారని మంత్రికి అధికారులు వివరించారు. రాష్ట్రంలో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చేందుకు 'అక్షర ఆంధ్ర' కార్యక్రమాన్ని ఆగస్టు 7 నుంచి ప్రారంభించనున్నామని, రాష్ట్రాన్ని క్లస్టర్ల వారీగా విభజించి నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

నిబంధనల సడలింపులతో స్థిరాస్తి వ్యాపార రంగం శరవేగంగా అభివృద్ధి

సీఎం చంద్రబాబును కలిసి కృతజ్ఞతలు తెలిపిన నరెడ్కో ప్రతినిధులు




ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి కృతజ్ఞతలు తెలియజేస్తున్న నరెడ్కో రాష్ట్ర అధ్యక్షుడు చక్రధర్, కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు కిరణ్‌కుమార్ తదితరులు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో స్థిరాస్తి వ్యాపార రంగం అభివృద్ధికి ప్రభుత్వం ఇటీవల కాలంలో చేసిన నిబంధనల సడలింపులు, త్వరితగతిన అనుమతులొచ్చేలా తీసుకున్న నిర్ణయాలపై జాతీయ స్థిరాస్తి వ్యాపార అభివృద్ధి మండలి (నరెడ్కో) రాష్ట్ర ఛాప్టర్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపింది. రాష్ట్ర అధ్యక్షుడు గద్దె చక్రధర్, కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు పరుచూరి కిరణ్‌కుమార్, కార్యదర్శులు గల్లా రామచంద్రరావు, వి.నరసయ్య, ఎన్.రాంబాబు, వంశీకృష్ణ తదితరులు ముఖ్యమంత్రిని శుక్రవారం సచివాలయంలో కలిశారు. లేఔట్, భవన నిర్మాణాలకు సంబంధించిన నిబంధనల్లో కీలక మార్పులు తీసుకొచ్చి స్థిరాస్తి వ్యాపార రంగం అభివృద్ధికి సహకరిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. నాలా చట్టాన్ని రద్దు చేసేందుకు చొరవ తీసుకున్నందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ.. కొత్త విధానం త్వరితగతిన అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. జాయింట్ డెవలప్‌మెంట్ ఒప్పందాలు, ఫ్యామిలీ పార్టీషన్ డీడ్‌లపై స్టాంపు డ్యూటీ తగ్గించడానికి అంగీకరించినందుకు సంతోషం వ్యక్తం చేశారు. కాలపరిమితితో సింగిల్‌విండో అనుమతులు, సెట్‌బ్యాక్‌లు, అదనపు అంతస్తుల సడలింపులు, బాల్కనీ నిబంధనలు, రోడ్ల వెడల్పు హేతుబద్ధీకరణ, రక్షణ, రైల్వేల నుంచి ఎన్‌వోసీల్లో సరళీకరణ ద్వారా రాష్ట్రంలో నిర్మాణ రంగం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని చక్రధర్, కిరణ్‌కుమార్ అన్నారు. రాజధాని అమరావతి ప్రాంతంలోని తుళ్లూరు, పెదకూరపాడు, తాడికొండ, అమరావతి మండలాల్లో కొత్త లేఔట్ల ఏర్పాటు కోసం చేసుకున్న దరఖాస్తులు పరిష్కరించేలా చూడాలని ముఖ్యమంత్రిని కోరారు.

డిగ్రీలో సింగిల్ మేజర్ విధానం అమలు

- రద్దు కానున్న ఉన్నత విద్యా మండలి డబుల్ మేజర్ ప్రకటన
- ఆన్‌లైన్ ప్రవేశాల కౌన్సెలింగ్‌లో కళాశాలలకు ప్రాధాన్యం



ఈనాడు, అమరావతి: డిగ్రీలో కొన్ని మార్పులతో సింగిల్ మేజర్ సబ్జెక్టు విధానాన్ని అమలుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. డిగ్రీలో 126 క్రెడిట్లు ఉండేలా మార్పును న్నారు. ఉన్నత విద్యామండలి డబుల్ మేజర్ విధానం అమలుకు సిలబస్ రూపొందించి నోటిఫికేషన్ జారీచేయగా.. ఇప్పుడు కొన్ని మార్పులతో సింగిల్ సబ్జెక్టు విధానమే అమలుచేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో గత నెలలో ఉన్నత విద్యామండలి ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దుచేసే అవకాశం ఉంది. వైకాపా హయాంలో 2023-24లో సింగిల్ మేజర్ విధానాన్ని తీసుకురాగా.. దీంట్లో మార్పులంటూ ఉన్నత విద్యామండలి డబుల్ మేజర్ సబ్జెక్టు విధానం అమలుకు చర్యలు చేపట్టింది. సిలబస్‌ను సైతం ఖరారు చేసింది. అమలుకు నోటిఫికేషన్ జారీచేయడంతో ప్రైవేటు డిగ్రీ కళాశాలలు సింగిల్ నుంచి డబుల్‌కు మారేందుకు దరఖాస్తు చేసుకున్నాయి. ఈ తరుణంలో కొన్ని మార్పులతో సింగిల్ మేజర్ విధానాన్నే అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉన్నత విద్యామండలి డబుల్ మేజర్‌కు చర్యలు తీసుకోగా.. కళాశాల విద్యాశాఖ సింగిల్ మేజర్ అమలుచేయాలని పట్టుబట్టింది. దీనిపై రెండుశాఖల మధ్య ప్రచ్ఛన్నయుద్ధం సాగుతోంది. మంత్రి లోకేశ్ వద్ద శుక్రవారం జరిగిన సమీక్షలోనూ డబుల్, సింగిల్ మేజర్లపై రెండు విభాగాల తరపున ప్రజెంటేషన్ ఇచ్చారు.

క్వాంటమ్.. ఏఐ.. ఏం చేస్తారు?

రాష్ట్రంలో క్వాంటమ్ కంప్యూటింగ్ వ్యాలీని ఏర్పాటు చేస్తున్నందున డబుల్ మేజర్ విధానంలో క్వాంటమ్ టెక్నాలజీని మైనర్ సబ్జెక్టుగా ఉన్నత విద్యామండలి ప్రవేశపెట్టింది. బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు క్వాంటమ్ టెక్నాలజీని తప్పనిసరి చేసింది. ఇంటర్మీడియట్‌లో గణితం, భౌతికశాస్త్రం సబ్జెక్టులు చదివి, డిగ్రీలో ఇతర కోర్సులు చదివేవారికి ఐచ్ఛికం చేసింది. నైపుణ్యాభివృద్ధి కోర్సుల్లో కృత్రిమమేధను తీసుకొచ్చింది. ఇప్పుడు డబుల్ మేజర్ లేకపోతే.. వీటిపై సందిగ్ధత ఏర్పడుతుంది.

ఆన్‌లైన్‌లో రెండు విధానాలు

డిగ్రీ ప్రవేశాలను ఆన్‌లైన్‌లో రెండు విధాలుగా నిర్వహించాలని నిర్ణయించింది. ఇప్పటివరకు ఉన్నత విద్యామండలి కన్వీనర్ కోటా సీట్లకు ఆన్‌లైన్ కౌన్సెలింగ్ నిర్వహిస్తోంది. ఈ ఏడాది నుంచి విద్యార్థులు నేరుగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. కళాశాలల ద్వారానూ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఆయా కళాశాలల్లోని 70% సీట్లను కన్వీనర్ కోటాగా కేటాయిస్తారు. మిగతా 30% యాజమాన్య కోటాలో కళాశాలలు భర్తీ చేసుకోవాలి. కన్వీనర్ కోటాకు బోధన రుసుముల చెల్లింపు పథకం వర్తిస్తుంది.

తెలుగు మహిళకు అరుదైన అవకాశం

- ఐటీయూ బోర్డు డైరెక్టర్ పదవికి భారత అభ్యర్థిగా రేవతి మన్నెపల్లి నామినేషన్
- కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా వెల్లడి
- ఆమె స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని సూళ్లూరుపేట



రేవతి మన్నెపల్లి

ఈనాడు, దిల్లీ - సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: ఇంటర్నేషనల్ టెలీ కమ్యూనికేషన్ యూనియన్ (ఐటీయూ) రేడియో రెగ్యులేషన్స్ బోర్డు డైరెక్టర్ పదవికి భారత అభ్యర్థిగా తెలుగు మహిళ రేవతి మన్నెపల్లిని కేంద్ర ప్రభుత్వం నామినేట్ చేసింది. ఈ విషయాన్ని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా వెల్లడించారు. రేవతి స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని సూళ్లూరుపేట. 'స్వగ్రామంలో తొలి ఇంజినీర్ అయిన ఆమె అక్కడి నుంచి ఐక్యరాజ్య సమితి ఇంటర్నేషనల్ టెలీ కమ్యూనికేషన్ యూనియన్ రేడియో రెగ్యులేషన్స్ బోర్డుకు నాయకత్వం వహించే పదవికి భారత్ తరఫున నామినేట్ అయ్యే స్థాయికి ఎదిగారు. ఆమెది ప్రపంచ స్థాయిలో ప్రభావం చూపే అద్భుతమైన ప్రయాణం. 2027-30 కాలానికి ఐటీయూ రేడియో కమ్యూనికేషన్ బ్యూరో డైరెక్టర్ పదవికి భారత అభ్యర్థిగా నామినేట్ అయినందుకు రేవతికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతున్నాను. ఆమె ఎన్నికైతే ఈ బ్యూరోకు నాయకత్వం వహించే తొలి మహిళగా చరిత్ర సృష్టిస్తారు. ఆమె విజయం సాధించి భారత విజన్‌ను ప్రపంచస్థాయికి తీసుకెళ్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అని జ్యోతిరాదిత్య పేర్కొన్నారు. 2026లో జరిగే సమావేశంలో ఈమె ఎన్నిక జరుగుతుంది.

బార్క్.. ఇస్రోలో సేవలు


రేవతి మన్నెపల్లి 1989-93 మధ్య హైదరాబాద్ జేఎన్‌టీయూలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ విభాగంలో బీటెక్ చేశారు. 1993-95 వరకు షార్‌లో ఇంజినీరుగా పనిచేశారు. అప్పట్లో ఏఎస్ఎల్‌వీ, పీఎస్ఎల్‌వీ రాకెట్ ప్రయోగాల్లో భాగం పంచుకున్నారు. 2015 నుంచి ఆసియా పసిఫిక్ ప్రాంతంలో స్పేస్ స్పెక్ట్రమ్‌కు సంబంధించిన విషయాల్లో ఫ్రీక్వెన్సీ ఎక్స్‌పర్ట్‌గా ఇంటర్నేషనల్ టెలీ కమ్యూనికేషన్స్ శాటిలైట్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ జనరల్‌కు సలహాలు అందిస్తూ వస్తున్నారు. 2017లో భారత్ ప్రయోగించిన దక్షిణాసియా శాటిలైట్‌కు ఆర్బిటల్ హక్కులు సాధించడంలో కీలకపాత్ర పోషించారు. స్పెక్ట్రమ్‌కు సంబంధించిన టెక్నో రెగ్యులేటరీ విషయాల్లో 2018లో ది హేగ్‌లోని ఇంటర్నేషనల్ కోర్ట్ ఆఫ్ జస్టిస్‌కు మన దేశం తరఫున ప్రాతినిధ్యం వహించారు. 6జీ, ఎన్‌జీఎస్‌వో, స్పెక్ట్రం ఫ్యూచర్ పాలసీలపై మన దేశానికి సూచనలు అందించారు. సార్క్ దేశాలకు అత్యవసర సేవలు అందించేందుకు ఆమె గతంలో బార్క్‌లో శాస్త్రవేత్తగా సేవలందించారు. రెండున్నరేళ్లుగా జెనీవాలోని ఇంటర్నేషనల్ రేడియో రెగ్యులేషన్ బోర్డులో సభ్యురాలిగా కొనసాగుతున్నారు. ప్రస్తుతం టెలికమ్యూనికేషన్స్ డిపార్ట్‌మెంట్‌లో జాయింట్ వైర్‌లెస్ అడ్వైజర్‌గా ఉన్నారు.

ఆలయాలపై వైకాపా దుష్ప్రచారం ఆపడం లేదు

తెదేపా నేత బుచ్చి రాంప్రసాద్ ధ్వజం

ఈనాడు, అమరావతి: జగన్ పాలనలో హిందూ ధర్మంపై దాడి చేసిన వైకాపా నాయకులు అధికారం పోయాక కూడా దుష్ప్రచారంతో ఆలయాల ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నారని తెదేపా బ్రాహ్మణ సాధికార సమితి అధ్యక్షుడు బుచ్చి రాంప్రసాద్ ధ్వజమెత్తారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'తితిదే గోశాలలోని గోవులు మృతి చెందాయంటూ తప్పుడు వార్తలు ప్రచారం చేశారు. క్యూలైన్ కంపార్టుమెంట్‌లో భక్తుడి ముసుగులో ఉన్న వైకాపా నాయకుడు అచ్చారావు రాజకీయ నినాదాలు చేశారు. శ్రీశైలం ప్రసాదంలో బొద్దింక, విజయవాడ దుర్గమ్మ ప్రసాదంలో మేకులు పెట్టి రచ్చ చేశారు. ఆలయాల అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపైనా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు' అని మండిపడ్డారు.

అరటి పండు వలిచినట్లు చెప్పాలి



మూర్ఖులు ఓ సాధారణ విషయాన్ని కూడా సంక్లిష్టంగా మార్చి గందరగోళం సృష్టిస్తారు. కానీ ఓ సంక్లిష్ట అంశాన్ని సాధారణ వ్యక్తులకూ అర్థమయ్యేలా అతి సులువుగా చెప్పగలగడం నేటి ప్రపంచంలో అత్యంత కీలకం. ఆ నైపుణ్యం ఉన్నవారు ఏ రంగంలో ఉన్నా తమ ప్రత్యేకత చాటుకొని సారథిగా ఎదుగుతారు.

– రే డలియో, ఫండ్ మేనేజర్

ఛాంపియన్

బజ్‌బాల్.. సిరాజ్ కమాల్

- ఇంగ్లాండ్ 407 ఆలౌట్
- స్మిత్, బ్రూక్ భారీ శతకాలు
- సిరాజ్‌కు ఆరు వికెట్లు
- బలమైన స్థితిలో భారత్

బర్మింగ్‌హామ్ రెండో టెస్టు.. ఇంగ్లాండ్ 84 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది. ఇక భారత బౌలర్లు ప్రత్యర్థిని చుట్టేస్తారని అనుకుంటే బజ్‌బాల్ ఆటతో జేమీ స్మిత్, బ్రూక్స్ భారీ శతకాలు బాదేశారు. పరుగుల అంతరాన్ని కరిగించేస్తూ కంగారు పెట్టారు. శుభ్‌మన్ సేన పట్టుకోల్పోతుందేమో అనుకుంటున్న స్థితిలో.. ఆఖరి సెషన్లో సిరాజ్, ఆకాశ్‌దీప్ విజృంభించి జట్టును మళ్లీ మ్యాచ్‌లోకి తీసుకొచ్చారు. భారత్‌కు 180 పరుగుల ఆధిక్యాన్ని సాధించిపెట్టారు. రెండో ఇన్నింగ్స్‌లో స్థిరంగా ఆడుతున్న టీమ్‌ఇండియా మొత్తంగా 244 పరుగుల ముందంజలో నిలిచింది. ఇప్పటికే మెరుగైన స్థితిలో ఉన్న భారత్ నాలుగో రోజు జోరు కొనసాగిస్తే మ్యాచును గుప్పెట్లోకి తెచ్చుకున్నట్లే!





బర్మింగ్‌హామ్

బర్మింగ్‌హామ్ రెండో టెస్టులో భారత్ బలమైన స్థితిలో నిలిచింది. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్‌ను 407 పరుగులకు ఆలౌట్ చేసి 180 పరుగుల ఆధిక్యాన్ని సొంతం చేసుకున్న శుభ్‌మన్ సేన.. మ్యాచ్‌పై పట్టు బిగించింది. తొలి ఇన్నింగ్స్‌లో భారీ ఆధిక్యాన్ని అందుకున్న భారత్.. రెండో ఇన్నింగ్స్‌లో దూకుడుగా ఆడింది. యశస్వి జైస్వాల్, రాహుల్ పోటీపడి షాట్లు ఆడడంతో భారత్ 7.3 ఓవర్లలోనే 50 పరుగులు దాటింది. ఈ స్థితిలో యశస్వి (28; 22 బంతుల్లో 6×4)ను టంగ్ ఎల్బీగా ఔట్ చేశాడు. మూడో రోజు, శుక్రవారం ఆట చివరికి భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 64/1తో నిలిచింది. రాహుల్ (28), కరుణ్ నాయర్ (7) క్రీజులో ఉన్నారు. భారత్ ప్రస్తుతం 244 పరుగుల ఆధిక్యంలో ఉంది. అంతకుముందు జేమీ స్మిత్ (184 నాటౌట్; 207 బంతుల్లో 21×4, 4×6), హ్యారీ బ్రూక్ (158; 234 బంతుల్లో 17×4, 1×6) భారీ శతకాలతో ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 407 పరుగులు చేసింది. సిరాజ్ (6/70), ఆకాశ్‌దీప్ (4/88) ప్రత్యర్థిని కట్టడి చేశారు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 587 పరుగులు చేసింది.

అయినా.. బజ్‌బాల్: మూడో రోజు ఆట ఆరంభమైన 10 బంతుల వ్యవధిలోనే ఇంగ్లాండ్ ఇద్దరు బ్యాటర్లను కోల్పోయింది. సిరాజ్ వరుస బంతుల్లో రూట్ (22), స్టోక్స్ (0)లను పెవిలియన్ చేర్చాడు. ఓవర్‌నైట్ స్కోరు 77/3తో తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన ఇంగ్లాండ్ పరిస్థితి ఇది. 84 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. భారత్ బౌలర్లు చూస్తే విరామం లోపే ఇంగ్లాండ్ ఇన్నింగ్స్‌ను చుట్టేసి ఫాలోఆన్ ఆడిస్తుందా అనిపించింది. కానీ లంచ్ కోసం ఇంగ్లిష్ జట్టు ఆనందంగా వెళ్లింది. టీమ్‌ఇండియా నిరాశతో మైదానాన్ని వీడింది. ఇందుకు కారణం జేమీ స్మిత్, హ్యారీ బ్రూక్! వందలోపే సగం జట్టు పెవిలియన్ చేరినా.. ఈ జంట ఏమాత్రం బెదరలేదు. బజ్‌బాల్ ఆట్నాన్ని బయటకు తీసి స్కోరు బోర్డు పరుగులు పెట్టించింది. ముఖ్యంగా వికెట్‌కీపర్ స్మిత్ టెస్టులో టీ20ని చూపించాడు. పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ వేసిన ఓ ఓవర్లో స్మిత్ చెలరేగిపోయాడు. ఒక సిక్స్, 4 ఫోర్లు బాదేశాడు. బ్రూక్ (ఓవర్‌నైట్ 30) సైతం బ్యాట్ ఝుళిపించడంతో ఇంగ్లాండ్ ఇన్నింగ్స్ టీ20 తరహాలో సాగిపోయింది. 43 బంతుల్లోనే అర్ధసెంచరీ చేసిన స్మిత్.. ఆ తర్వాత దూకుడు కొనసాగించాడు. కాసేపట్లో లంచ్ అనగా జడేజా బౌలింగ్‌లో వరుసగా రెండు ఫోర్లు బాది స్మిత్ 80 బంతుల్లోనే శతకాన్ని సాధించాడు. ఇంగ్లాండ్ 249/5తో లంచ్‌కు వెళ్లింది. ఈ ఒక్క సెషన్లోనే ఇంగ్లాండ్ 172 పరుగులు రాబట్టింది.

పేసర్ల విజృంభణ: లంచ్ తర్వాతా స్మిత్-బ్రూక్ జోరు కొనసాగింది. తొలి టెస్టులో ఒక్క పరుగు తేడాతో శతకం కోల్పోయిన బ్రూక్ ఈసారి ఆ మైలురాయిని అందుకున్నాడు. 137 బంతుల్లో టెస్టుల్లో తొమ్మిదో శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. మరోవైపు అదే జోరుతో ఆడిన స్మిత్ 144 బంతుల్లోనే 150 అందుకున్నాడు. ఇంగ్లాండ్ స్కోరు చూస్తుండగానే 350 దాటేసింది. టీ విరామానికి ఆ జట్టు 355/5తో నిలిచింది. విరామం తర్వాత బ్రూక్ కూడా 150 దాటాడు. భారత్ కొత్త బంతిని తీసుకోవడం మ్యాచ్ గమనాన్ని మార్చింది. భారీ స్కోర్లు చేసి పాతుకుపోయిన స్మిత్-బ్రూక్ జంట ఎట్టకేలకు విడిపోయింది. ఘనత మాత్రం ఆకాశ్‌దీప్‌దే. ఆకాశ్ వేసిన లెంగ్త్ బంతిని బ్రూక్స్ ఫార్వర్డ్ డిఫెన్స్ ఆడబోగా అది బ్యాట్, ప్యాడ్ మధ్య నుంచి దూరి స్టంప్స్‌ను గిరాటేసింది. దీంతో ఆరో వికెట్‌కు 303 పరుగుల భారీ భాగస్వామ్యానికి తెరపడింది. అక్కడ నుంచి భారత బౌలర్లదే హవా. అటు సిరాజ్ ఇటు ఆకాశ్ విజృంభించడంతో ఇంగ్లాండ్ బ్యాటర్లు నిలవలేకపోయారు. ఆ జట్టు 4 ఓవర్ల తేడాతో 3 వికెట్లు కోల్పోయింది. వోక్స్ (5)ను ఆకాశ్ బుట్టలో వేయగా.. కార్స్ (0), టంగ్ (0)లను ఔట్ చేసిన సిరాజ్ అయిదు వికెట్ల ఘనత సాధించాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా మరోవైపు స్మిత్ ఒంటరి పోరాటం చేశాడు. పరుగుల అంతరాన్ని వీలైనంత తగ్గించే ప్రయత్నం చేశాడు. కానీ బషీర్ (0)ను ఔట్ చేసిన సిరాజ్ ఆరో వికెట్ ఖాతాలో వేసుకోవడంతో పాటు ఇంగ్లాండ్ ఇన్నింగ్స్‌కు తెరదించాడు. స్మిత్ అజేయంగా నిలిచాడు. ఆకాశ్‌దీప్ నాలుగు వికెట్లు పడగొట్టాడు. ఇంగ్లాండ్ చివరి 4 వికెట్లను 20 పరుగుల తేడాతో కోల్పోయింది.



- ఇంగ్లాండ్ 400పైన స్కోరు చేసినా ఆరుగురు బ్యాటర్లు డకౌట్ అయ్యారు. ఇలా జరగడం చరిత్రలో ఇదే తొలిసారి.
- భారత్‌పై అత్యధిక స్కోరు చేసిన వికెట్‌కీపర్లలో స్మిత్ (184 నాటౌట్)ది రెండో స్థానం. ఆండీ ఫ్లవర్ (232 నాటౌట్) అగ్రస్థానంలో ఉన్నాడు.

4 టెస్టుల్లో 5 వికెట్ల ప్రదర్శన చేయడం సిరాజ్‌కు ఇది నాలుగోసారి.

1 టెస్టుల్లో వేగంగా 2 వేల పరుగులు పూర్తి చేసిన భారత బ్యాటర్లలో ద్రవిడ్, సెహ్వాగ్‌తో కలిసి యశస్వి అగ్రస్థానంలో నిలిచాడు. ముగ్గురు 40 ఇన్నింగ్స్‌ల్లో ఈ మైలురాయి అందుకున్నారు.

భారత్ తొలి ఇన్నింగ్స్: 587

ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్: క్రాలీ (సి) కరుణ్ (బి) సిరాజ్ 19; డకెట్ (సి) శుభ్‌మన్ (బి) ఆకాశ్‌దీప్ 0; పోప్ (సి) రాహుల్ (బి) ఆకాశ్‌దీప్ 0; రూట్ (సి) పంత్ (బి) సిరాజ్ 22; బ్రూక్ (బి) ఆకాశ్‌దీప్ 158; స్టోక్స్ (సి) పంత్ (బి) సిరాజ్ 0; జేమీ స్మిత్ నాటౌట్ 184; వోక్స్ (సి) కరుణ్ (బి) ఆకాశ్‌దీప్ 5; కార్స్ ఎల్బీ (బి) సిరాజ్ 0; టంగ్ ఎల్బీ (బి) సిరాజ్ 0; బషీర్ (బి) సిరాజ్ 0; ఎక్స్‌ట్రాలు 19; **మొత్తం:** (89.3 ఓవర్లలో ఆలౌట్) **407; వికెట్ల పతనం:** 1-13, 2-13, 3-25, 4-84, 5-84, 6-387, 7-395, 8-396, 9-407; **బౌలింగ్:** ఆకాశ్‌దీప్ 20-2-88-4; సిరాజ్ 19.3-3-70-6; ప్రసిద్ధ్ కృష్ణ 13-1-72-0; నితీశ్‌కుమార్ 6-0-29-0; జడేజా 17-2-70-0; సుందర్ 14-0-73-0

భారత్ రెండో ఇన్నింగ్స్: యశస్వి ఎల్బీ టంగ్ 28; రాహుల్ బ్యాటింగ్ 28; కరుణ్ బ్యాటింగ్ 7; ఎక్స్‌ట్రాలు 1 **మొత్తం:** (13 ఓవర్లలో వికెట్ నష్టానికి) 64; **వికెట్ల పతనం:** 1-51; **బౌలింగ్:** వోక్స్ 5-0-28-0; కార్స్ 5-1-23-0; టంగ్ 3-1-12-1

మియా.. సరైన సమయంలో

అయిదు టెస్టుల సిరీస్‌లో భారత్ తొలి టెస్టు ఓడిపోయింది. రెండో టెస్టుకు స్టార్ పేసర్ బుమ్రా లేడు. కుర్రాళ్లతో కూడిన బౌలింగ్ దళం. ఈ స్థితిలో.. ఒత్తిడిలో పేసర్ మహ్మద్ సిరాజ్ అదరగొట్టాడు. అనుభవాన్ని రంగరించిన మియా.. బౌలింగ్‌కు చుక్కానిలా మారాడు. కొన్నాళ్ల నుంచి సరిగా రాణించక విమర్శలు ఎదుర్కొంటున్న ఈ హైదరాబాదీ బౌలర్.. కీలక సమయంలో సత్తా చాటాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లు తీసి ఇంగ్లాండ్ కట్టడిలో కీలకపాత్ర పోషించాడు. రెండో రోజు ఆరంభంలోనే ప్రమాదకర రూట్, స్టోక్స్ వికెట్లు ఖాతాలో వేసుకున్న అతడు.. ఆట చివర్లో కొత్త బంతితో ఇంగ్లాండ్ టెయిలెండర్లను చుట్టేశాడు. భారత్‌కు విలువైన ఆధిక్యం దక్కడంలో ప్రధాన పాత్ర పోషించాడు. ఇంగ్లాండ్‌తో పాటు ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్‌లలో సిరాజ్ అయిదు వికెట్ల ప్రదర్శన చేయడం విశేషం.

కొత్త అధ్యాయానికి నాంది: నీరజ్



'నీరజ్ క్లాసిక్'లో పాల్గొనబోయే క్రీడాకారులతో నీరజ్

బెంగళూరు: భారత్‌లో అంతర్జాతీయ జావెలిన్ త్రో ఈవెంట్ జరుగుతుండటం కలలా ఉందని స్టార్ క్రీడాకారుడు నీరజ్ చోప్రా అన్నాడు. ప్రపంచ అగ్రశ్రేణి జావెలియన్ త్రోయర్లు పాల్గొంటున్న ఈవెంట్‌కు నీరజ్ చోప్రా క్లాసిక్ అని పేరు పెట్టారు. ఈ ఈవెంట్ శనివారం బెంగళూరులోని శ్రీ కంఠీరవ స్టేడియంలో జరుగనుంది. ఈ నేపథ్యంలో నీరజ్ మాట్లాడుతూ.. "నేను కలలో ఉన్నట్లు అనిపిస్తోంది. పతకాల సంగతి వేరు. కానీ భారత్, ఇక్కడి క్రీడాకారులకు ఇలాంటి ప్రతిష్ఠాత్మక టోర్నీ ఇవ్వగలిగా. నాకెంతో సంతోషంగా ఉంది. భారత అథ్లెటిక్స్ చరిత్రలో కొత్త అధ్యాయానికి నాంది ఇది. ప్రతి ఒక్కరి నుంచి మద్దతు లభిస్తోంది. భారత్‌లో అంతర్జాతీయ టోర్నీలకు ఇది ఆరంభం. ఏడాదిలో కనీసం 4, 5, 6 ప్రపంచ స్థాయి పోటీలు భారత్‌లో జరగాలి. అప్పుడే మన అథ్లెట్లకు అవకాశాలు వస్తాయి. వాళ్లను అభిమానులు చూస్తారు" అని నీరజ్ తెలిపాడు. థామస్ రోలర్ (జర్మనీ), జులియస్ యెగో (కెన్యా), కర్టిస్ థాంప్సన్ (అమెరికా) లాంటి అంతర్జాతీయ స్టార్లు ఈ ఈవెంట్లో పోటీ పడనున్నారు.

యుఎస్ ఓపెన్‌లో రెండు టైటిళ్లు.. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో రెండు టైటిళ్లు సాధించి.. హార్డ్ కోర్టుల్లో తన ఆధిపత్యాన్ని చాటిన జపాన్ భామ నవోమి ఒసాకా.. పచ్చిక మీద మాత్రం మరోసారి చతికిలపడింది. వింబుల్డన్‌లో వైఫల్యాన్ని కొనసాగిస్తూ.. మూడో రౌండ్లోనే నిష్క్రమించింది. అమెరికా అమ్మాయి మాడిసన్ కీస్‌కు కూడా షాక్ తగలగా.. బ్రిటన్ యువ క్రీడాకారిణి కార్టల్ సంచలన ప్రదర్శనను కొనసాగిస్తూ ప్రిక్వార్టర్స్‌లో అడుగుపెట్టింది.



ఒసాకా నిష్క్రమణ

కీస్ కూడా ఇంటికి

ప్రిక్వార్టర్స్‌లో పవ్లిచెంకోవా, కార్టల్

లండన్

వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో ప్రపంచ మాజీ నంబర్‌వన్ నవోమి ఒసాకా (జపాన్)కు చుక్కెదురైంది. హార్డ్ కోర్టుల్లో జరిగే యుఎస్ ఓపెన్, ఆస్ట్రేలియన్ ఓపెన్‌ల్లో రెండేసి టైటిళ్లు గెలిచిన ఒసాకాకు మరోసారి వింబుల్డన్ గ్రాస్ కోర్టులో కలిసిరాలేదు. మహిళల సింగిల్స్‌లో ఒసాకా మూడు రౌండ్లోనే నిష్క్రమించింది. శుక్రవారం జరిగిన పోరులో ఒసాకా 6-3, 4-6, 4-6తో అనస్తేసియా పవ్లిచెంకోవా (రష్యా) చేతిలో పరాజయం చవిచూసింది. తొలి సెట్ గెలిచిన ఒసాకా.. తర్వాతి రెండు సెట్‌లను చేజార్చుకుని మ్యాచ్‌ను కోల్పోయింది. నిర్ణయాత్మక మూడో సెట్‌లో 4-4తో ఒసాకా, పవ్లిచెంకోవా సమంగా నిలిచారు. అయితే అనవసర తప్పిదాలు ఒసాకా కొంపముంచాయి. దీంతో చివరి 10 పాయింట్లలో ఎనిమిదింటిని సొంతం చేసుకున్న పవ్లిచెంకోవాను విజయం వరించింది. మరో అగ్రశ్రేణి క్రీడాకారిణి మాడిసన్ కీస్ (అమెరికా) సైతం టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఈ ఆరో సీడ్ క్రీడాకారిణి మూడో రౌండ్లో 3-6, 3-6తో లారా సీగ్మండ్ (జర్మనీ) చేతిలో పరాజయం పాలైంది.



కార్టల్.. తగ్గేదేలే: స్థానిక క్రీడాకారిణి సోనే కార్టల్ (బ్రిటన్) సంచలన ప్రదర్శన కొనసాగుతోంది. క్వాలిఫయర్‌గా అడుగుపెట్టిన కార్టల్ అద్భుతమైన ఆటతో, స్థానిక ప్రేక్షకుల మద్దతుతో ప్రిక్వార్టర్స్ చేరుకుంది. మూడో రౌండ్లో కార్టల్ 6-4, 6-2తో డియాన్ పారీ (ఫ్రాన్స్)ను చిత్తుచేసింది. ఒక దశలో 4-1తో వెనుకంజలో ఉన్న కార్టల్ వరుసగా తొమ్మిది గేమ్‌ల్లో పైచేయి సాధించి ముందంజ వేసింది. అమండా అనిసిమోవా (అమెరికా) 6-3, 5-7, 6-3తో డాల్మా గాల్ఫి (హంగేరి)పై, సోలానా సియెరా (అర్జెంటీనా) 7-5, 1-6, 6-1తో క్రిస్టినా బుస్కా (స్పెయిన్)పై గెలిచి ప్రిక్వార్టర్స్‌లో అడుగు పెట్టారు.

చెమటోడ్చిన ఫ్రిట్జ్: పురుషుల సింగిల్స్‌లో అమెరికా అగ్రశ్రేణి ఆటగాడు, అయిదో సీడ్ టేలర్ ఫ్రిట్జ్ ప్రిక్వార్టర్స్ చేరాడు. అతను మూడో రౌండ్లో 6-4, 6-3, 6-7 (5-7), 6-1తో డేవిడోవిచ్ (స్పెయిన్)పై చెమటోడ్చి నెగ్గాడు. 14వ సీడ్ రుబ్లెవ్ 7-6, 6-2, 6-3తో మనారినో (ఫ్రాన్స్)ను ఓడించి ప్రిక్వార్టర్స్‌లో అడుగు పెట్టాడు. మోన్‌ఫిల్స్ 4-6, 6-1, 6-4, 6-7 (5-7), 4-6తో ఫుస్కోవిక్స్ (హంగేరి) చేతిలో ఓడాడు. బెన్ షెల్టన్ (అమెరికా) 6-2, 7-5, 6-4తో రింకీ హిజికటా (ఆస్ట్రేలియా) ఓడించి మూడో రౌండు చేరాడు.

యుకి జోడీ శుభారంభం: మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత ఆటగాడు యుకి బాంబ్రి శుభారంభం చేశాడు. తొలి రౌండ్లో యుకి-జియాంగ్ (చైనా) 6-3, 1-6, 7-6 (10-6)తో క్రిస్టియన్ హారిసన్-మెలిచార్ (అమెరికా) జంటను ఓడించింది.

బంగ్లాలో భారత్ పర్యటన వాయిదా!

దిల్లీ: బంగ్లాదేశ్‌లో భారత్ పర్యటన వాయిదా పడే సూచనలు కనిపిస్తున్నాయి. ఆటగాళ్ల భద్రతపై బీసీసీఐ ఆందోళనే ఇందుకు కారణం. షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 17 నుంచి 31 వరకు మూడేసి టీ20లు, వన్డేలలో బంగ్లా, భారత్ ఆడాల్సి ఉంది. చిట్టగాంగ్, ఢాకా వేదికలు. అయితే నిరుడు షేక్ హసీనా నేతృత్వంలోని ప్రభుత్వం పతనం తర్వాత బంగ్లాలో ఇప్పటికీ శాంతిభద్రతలపై ఆందోళన కొనసాగుతోంది. దీంతో భారత పర్యటనను వాయిదా వేయాలని బీసీసీఐ భావిస్తోంది. "పౌర అశాంతి అనంతరం బంగ్లాలో భద్రత విషయంలో బీసీసీఐ జాగ్రత్తగా వ్యవహరిస్తోంది. పర్యటన రద్దు కాలేదు. వేరే తేదీల్లో నిర్వహించొచ్చు. బహుశా 2026లో ఉండొచ్చు" అని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. బంగ్లాలో సార్వత్రిక ఎన్నికలు జరిగి.. శాంతిభద్రతల్ని జాగ్రత్తగా చూసుకునే స్థిరమైన ప్రభుత్వం ఏర్పడ్డాక ఆ దేశంలో పర్యటించాలని బీసీసీఐ భావిస్తోంది.

విండీస్ 153/4

సెయింట్‌జార్జ్: ఆస్ట్రేలియాతో తొలి టెస్టులో చిత్తుగా ఓడిన వెస్టిండీస్.. రెండో టెస్టులో పైచేయి సాధించేందుకు పోరాడుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియాను 286 పరుగులకు ఆలౌట్ చేసిన ఆతిథ్య జట్టు.. రెండో రోజు కడపటి వార్తలందేసరికి 41 ఓవర్లలో 4 వికెట్లకు 153 పరుగులు చేసింది. క్రెయిగ్ బ్రాత్‌వైట్ (0), కార్టీ (6), చేజ్ (16) విఫలమవడంతో ఇబ్బందుల్లో పడ్డ విండీస్‌ను.. జాన్ క్యాంప్‌బెల్ (40), బ్రెండన్ కింగ్ (59 బ్యాటింగ్) ఆదుకున్నారు. కింగ్‌కు తోడుగా షై హోప్ (21 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. ఆసీస్ బౌలర్లలో హేజిల్‌వుడ్ (2/37) రాణించాడు. తొలి రోజు వెబ్‌స్టర్ (60), కేరీ (63) రాణించడంతో ఒక దశలో 222/5తో నిలిచిన ఆసీస్.. అల్జారి జోసెఫ్ (4/61) ధాటికి చివరి 5 వికెట్లను 64 పరుగుల తేడాలో కోల్పోయి 300 లోపే ఆలౌటైంది.

గుకేశ్‌కు ర్యాపిడ్ టైటిల్



జాగ్రెబ్: భారత స్టార్ చెస్ ప్లేయర్, ప్రపంచ ఛాంపియన్ దొమ్మరాజు గుకేశ్ సత్తా చాటాడు. గ్రాండ్ చెస్ టూర్ జాగ్రెబ్ టోర్నీలో ర్యాపిడ్ విభాగంలో విజేతగా నిలిచాడు. ఏడు, ఎనిమిది రౌండ్లలో అనీష్ గిరి, సారిచ్‌లతో డ్రా చేసుకున్న భారత గ్రాండ్‌మాస్టర్.. చివరిదైన తొమ్మిదో రౌండ్లో వెస్లీ సోను ఓడించాడు. మొత్తం 14 పాయింట్లతో అగ్రస్థానం సాధించి టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. టైటిల్‌ను నెగ్గే క్రమంలో ప్రపంచ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్‌ను కూడా గుకేశ్ ఓడించాడు. బ్లిట్జ్ టోర్నీ శనివారం ఆరంభం కానుంది.

ఇషాన్.. 6 బంతులను 6 రకాలుగా!

లండన్: భారత జట్టులో చోటు కోల్పోయి కౌంటీ బాట పట్టిన వికెట్‌కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్.. చక్కటి ప్రదర్శనే చేస్తున్నాడు. అక్కడతను బ్యాటింగ్‌తోనే కాక బౌలింగ్‌తోనూ ఆకట్టుకున్నాడు. నాటింగ్‌హామ్‌షైర్‌కు ఆడుతున్న ఇషాన్.. యార్క్‌షైర్‌పై 87 పరుగులు చేశాడు. తర్వాత సోమర్‌సెట్‌పైనా (77 పరుగులు) సత్తా చాటాడు. సోమర్‌సెట్‌తో మ్యాచ్‌లో ఈ వికెట్‌కీపర్ గ్లోవ్స్ వదిలి బంతి అందుకున్నాడు. ఓ ఓవర్లో 6 బంతులను ఆరు రకాలుగా సంధించాడు. తొలి బంతిని ఆఫ్‌స్పిన్నర్ హర్భజన్‌సింగ్‌లా వేసిన కిషన్.. తర్వాత దిగ్గజ లెగ్‌స్పిన్నర్ షేన్ వార్న్ యాక్షన్‌ను అనుకరించాడు. ఆ ఓవర్లో మిగిలిన నాలుగు బంతులను కూడా భిన్నమైన శైలితో వేసి అలరించాడు.

బీసీసీఐ అంపైర్‌గా చంద్రయ్య



చంద్రయ్య

కాజీపేట, న్యూస్‌టుడే: హనుమకొండ జిల్లా దర్గా కాజీపేటకు చెందిన వలుపదాసు చంద్రయ్య బీసీసీఐ అంపైర్‌గా ఎంపికయ్యారు. గత నెల అహ్మదాబాద్‌లో నిర్వహించిన బీసీసీఐ అంపైరింగ్ పరీక్షలో చంద్రయ్య ఉత్తీర్ణుడయ్యారు. దేశవ్యాప్తంగా బీసీసీఐ ఎంపిక చేసిన 26 మంది అంపైర్లలో చంద్రయ్య ఒకరు. ఆయన గతంలో దేశవాళీ మ్యాచ్‌ల్లో అంపైరింగ్ చేశారు. చంద్రయ్య ప్రస్తుతం స్టేట్ బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నారు.

తారకు రజతం



అస్తానా: ఆసియా యూత్, జూనియర్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారిణి పుంగ్ని తార సత్తాచాటింది. శుక్రవారం యూత్ బాలికల 44 కేజీల విభాగంలో అద్భుతమైన ప్రదర్శనతో రజత పతకం సాధించింది. మొత్తం 141 కేజీలు (60 కిలోలు+81 కిలోలు) బరువులెత్తి ద్వితీయ స్థానంలో నిలిచింది. క్లీన్ అండ్ జెర్క్‌లో 81 కేజీల ప్రదర్శనకు గాను ఆమెకు బంగారు పతకం లభించింది. ప్రపంచకప్, ప్రపంచ ఛాంపియన్‌షిప్, ఖండాంతర టోర్నీల్లో స్నాచ్.. క్లీన్ అండ్ జెర్క్.. మొత్తానికి విడివిడిగా మూడు పతకాలు ఇస్తారు.

భవానికి రెండు స్వర్ణాలు


ప్రపంచ పారా అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రి



భవాని

నెల్లూరు క్రీడా విభాగం, న్యూస్‌టుడే: ప్రపంచ పారా అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రి పోటీల్లో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు చెందిన వి.భవాని రెండు స్వర్ణాలు సాధించింది. చెక్ రిపబ్లిక్‌లోని ఒలోమౌక్‌లో జరుగుతున్న టోర్నీలో భవాని.. 200 మీటర్లు, 100 మీటర్ల పరుగులో అగ్రస్థానం సాధించింది.

ఆస్వాదించలేకపోతున్నా



కార్ల్‌సన్

జాగ్రెబ్: చెస్ ఆడటాన్ని ఆస్వాదించలేకపోతున్నట్లు ప్రపంచ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్ అన్నాడు. ప్రపంచ ఛాంపియన్ దొమ్మరాజు గుకేశ్ చేతిలో వరుసగా రెండో ఓటమి నేపథ్యంలో తనను తాను బలహీనమైన ఆటగాడిగా అతను అభివర్ణించాడు. "నిజాయతీగా చెప్పాలంటే నేనిప్పుడు చెస్ ఆడటాన్ని ఆస్వాదించలేకపోతున్నా. నేను ఆడుతున్నప్పుడు నా ఆటలో లయ కనిపించట్లేదు. తరచుగా సంకోచిస్తున్నా. ప్రస్తుతం చాలా బలహీనంగా ఆడుతున్నా. గుకేశ్ అద్భుతంగా రాణిస్తున్నాడు. వరుసగా అయిదు గేమ్‌లు గెలవడం అంత తేలికైన విషయం కాదు" అని కార్ల్‌సన్ తెలిపాడు.


BIG C
250+ STORES | AP | TS | TN
EXPERIENCE THE DIFFERENCE!
మా ధరలు మరియు ఎక్స్‌క్లూజివ్ ఆఫర్లు
ఆన్‌లైన్ & ఇతర ఆఫ్‌లైన్ డీల్స్‌ను అధిగమిస్తాయి
ఆషాఢం సేల్*
UPTO ₹10000 WORTH MOBILE PROTECTION FREE* (Buy 1st Year & get 2nd Year FREE)
ZERO DOWN PAYMENT
UPTO 10% INSTANT CASHBACK*
NO COST EMI
*T&C Apply
ప్రతి మొబైల్ కొనుగోలుపై ఖచ్చితమైన బహుమతి*
vivo upto ₹7000 Instant Cashback
oppo upto ₹5500 Instant Cashback
SAMSUNG upto ₹12000 Instant Cashback
REDMI upto ₹10000 Instant Cashback
realme upto ₹4000 Instant Cashback
NOTHING upto ₹2000 Instant Cashback
iPhone upto ₹12000 Instant Discount
OnePlus upto ₹5000 Instant Discount
Google upto ₹10000 Instant Cashback
oppo Reno14 Series 5G AI Portrait Camera
upto ₹5000 Instant Cashback
₹10499 Watch + Ear Buds + Mobile Protection FREE (Buy 1st Year & get 2nd Year FREE)
vivo Y400 Pro It's My Style
upto 10% Instant Cashback
₹4699 Watch + Antivirus+ Mobile Protection FREE (Buy 1st Year & get 2nd Year FREE)
SAMSUNG Galaxy A56 A36 5G Seal the triple zero deal
Down Payment Interest Hassle
Galaxy Buds Core ₹1000 off ₹4999 ₹3999 (1 Unit) Limited time offer
Starting at ₹ 56/day*
Google Pixel 9a with Gemini
₹3000 Instant Cash Back
NOTHING CMF Phone 2 Pro
₹1000 Instant Cash Back
Zero Down Payment | No Cost EMI
iPhone Built for Apple Intelligence.
₹7000* instant store discount + ₹4000 Instant Cash Back on credit cards of AXIS BANK ICICI Bank kotak + Exchange bonus upto ₹8000*
XIAOMI SMART GOOGLE TV 32 Inches (81 cm)
₹24999 ₹11999
Zero Down Payment | No Cost EMI
BRANDED ACCESSORIES
boAt HOMETHEATRE Starts From ₹7999
SAMSUNG Galaxy Buds Core ₹4999
CMF by NOTHING BUDS ₹2299
XIAOMI Power Bank ₹1299
Redmi Note 14 Series Iconic shots, AI crafted All Variants
₹1000 Instant Cash Back
Zero Down Payment | No Cost EMI
realme C73/C75 5G
upto ₹1000 Instant Cash Back
Zero Down Payment | No Cost EMI
OnePlus 13s Stronger. Smarter. Smaller.
upto ₹2500 Instant Cash Back
Zero Down Payment | No Cost EMI
UPTO ₹3,750 INSTANT DISCOUNT* SBI card
#Min. Trxn.: ₹15,000; Max. Discount: ₹3,750 per card; Also valid on EMI Trxns.; Validity: 14 Jun - 13 Jul 2025. T&C Apply.
FINANCE PARTNERS
BAJAJ FINSERV ICICI Bank HDFC BANK Paytm SBI card IDFC FIRST Bank TVS CREDIT HDB FINANCIAL SERVICES
BIG C
www.bigcmobiles.com





EENADU Vol: 51, Issue: 326 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

కాల్వలకు సాగునీటి విడుదల పెంపు

ఎన్టీఆర్ కలెక్టరేట్: వ్యవసాయ అవసరాల దృష్ట్యా సాగునీటి విడుదల మరింత పెంచారు. ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణా తూర్పు ప్రధాన కాలువకు 6,542, పశ్చిమ కాలువకు 305 క్యూసెక్కులు విడుదల చేశారు. కేఈ ప్రధాన కాలువ నుంచి రైవస్ కాల్వకు 3,509, ఏలూరు 1,021, బందరు 1,155, కేఈబీ (దివిసీమ) కాల్వకు 857 క్యూసెక్కుల చొప్పున ఇస్తున్నారు.



లెక్కలేదు.. లెక్కల్లోనూ లేదు!

డిపాజిటర్ల సొమ్ముతో ఆదిత్య జల్సాలు.. అంతుచిక్కని రూ.82 కోట్లు

ఈనాడు, అమరావతి - న్యూస్‌టుడే, పటమట

డిపాజిటర్ల నుంచి వసూలు చేసిన రూ.కోట్ల సొమ్మును ఆదిత్య సొంత అవసరాలకు దారి మళ్లించినట్లు దర్యాప్తులో వెలుగు చూస్తోంది. ఈ మొత్తాన్ని ఎక్కడా అధికారికంగా చెల్లించినట్లు నమోదు చేయలేదు. దాదాపు రూ.82 కోట్లకు లెక్కలు సరిపోలడం లేదు. ఈ మొత్తం ఏమైందనే దానిపై పోలీసులు దృష్టి సారించారు. అద్వీక ట్రేడింగ్ కంపెనీ మోసం కేసులో పలు అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. లెక్క తేలని మొత్తాన్ని ఆదిత్య విలాసాలకు వినియోగించాడా? లేక సొమ్మును దారి మళ్లించి ఆస్తులు కొన్నాడా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గుట్టు విప్పిన టాస్క్‌ఫోర్స్..

టాస్క్‌ఫోర్స్ పోలీసులు వారం రోజులుగా లెక్కలు తేల్చే పనిలో నిమగ్నమవగా శుక్రవారానికి కొలిక్కి వచ్చింది. ఏజెంట్లు డిపాజిటర్ల నుంచి వసూలు చేసింది.. తిరిగి వారికి వడ్డీ రూపంలో ఇచ్చిన వివరాలను సేకరించి క్రోడీకరించారు. రూ.382 కోట్లు వసూలు చేసినట్లుగా తేల్చారు. ఇందులో రూ.300 కోట్లు వివిధ మార్గాల్లో చెల్లించినట్లు గుర్తించారు. మిగిలిన మొత్తం సంగతి తేలలేదు. మొత్తం 1,100 మంది డిపాజిటర్లు అద్వీక ట్రేడింగ్ కంపెనీతో 1,700 ఎంవోయూలు కుదుర్చుకున్నారు. అధిక వడ్డీ ఆశచూపడంతో పలువురు రెండు, మూడు విడతలుగా సొమ్ము పెట్టుబడిగా పెట్టారు.

పబ్‌లో రూ.4 లక్షలు గాల్లోకి విసిరి

కొద్ది సమయంలోనే భారీగా పెట్టుబడులు రావడంతో.. ఆ సొమ్మును నిందితుడు విచ్చలవిడిగా విలాసాలకు ఖర్చు చేసినట్లు తెలిసింది. ఎక్కువగా పబ్బులు, దుబాయికి, కంపెనీ వార్షికోత్సవాలు, పుట్టినరోజు వేడుకలకు వెచ్చించాడని తేలింది. ఇటీవల బందరు రోడ్డులోని ఓ పబ్బుకు వెళ్లిన ఆదిత్య.. మద్యం మత్తులో సుమారు రూ.4 లక్షల నగదును గాలిలోకి చల్లుతుండగా పబ్బు సిబ్బంది వచ్చి అడ్డుకున్నారు. నా వద్ద డబ్బు ఉంది.. చల్లుతాను.. మీకేంటి ఇబ్బంది అని వారితో వాగ్వాదానికి దిగాడు. డైరెక్టర్లకు ఎమిరేట్స్ బిజినెస్ వీసాలు తీసుకుని.. తరచూ వారిని తీసుకుని అక్కడికి వెళ్లేవాడు. ఆపై ఇక్కడికి వచ్చిన తర్వాత అందరినీ పిలిచి భారీఎత్తున పార్టీలు ఏర్పాటు చేసేవాడు. కంకిపాడులోని ఓ ఫంక్షన్ హాలులో కంపెనీ వార్షికోత్సవానికి బుల్లితెర నటులను తీసుకొచ్చి హడావుడి చేశాడు. ఈ కార్యక్రమానికి రూ.4 కోట్లు పైగా ఖర్చు చేసినట్లు తెలిసింది.

లాకర్లూ సీజ్.. అప్పటికే బంగారం తరలింపు?

ఇప్పటికే బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేసిన పోలీసులు.. లాకర్లపైనా దృష్టి సారించారు. ఏజెంట్ల లాకర్లనూ ఫ్రీజ్ చేయమని సంబంధిత బ్యాంకులకు పోలీసులు లేఖలు రాశారు. తద్వారా వీటిలో ఉన్న డబ్బు, బంగారం, ఇతర వస్తువులు తీసుకునే వీల్లేకుండా ఈ నిర్ణయం తీసుకున్నారు. నిందితుడు ఆదిత్యకు బెంజి సర్కిల్ సమీపంలోని ఓ బ్యాంకులో లాకర్ ఉంది. దీనిని గుర్తించిన పోలీసులు.. దానిని ఫ్రీజ్ చేయమని బ్యాంకుకు లేఖ ఇచ్చారు. ఉన్నతాధికారుల నుంచి ఇంకా అనుమతి రాలేదని దానిని ఫ్రీజ్ చేయలేదు. అప్పటికే ఆదిత్య భార్య సుజాత.. ఈ లాకర్ నుంచి రూ.20 లక్షల విలువైన బంగారు ఆభరణాలు తీసుకెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.





వారాహి నవరాత్రి ఉత్సవాలు ముగింపు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: దుర్గమ్మ గుడిలో జూన్ 26న ప్రారంభమైన వారాహి నవరాత్రోత్సవాలు పూర్ణాహుతి క్రతువుతో శుక్రవారం ముగిశాయి. రుత్వికులు తొమ్మిది రోజులపాటు వారాహి మాతను సప్త మాతృకలలో ఒకరుగా భావిస్తారు. పంచ వారాహి మంత్రాలతో లోక కల్యాణార్థం నవరాత్రులను నిర్వహించినట్లు వైదిక కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఈవో, వైదిక కమిటీ సభ్యులు కోట ప్రసాద్ పాల్గొన్నారు. ★ సనాతన ధర్మ ప్రచారంలో భాగంగా శ్రీశైల దేవస్థానం ప్రత్యేక సలహాదారు ప్రముఖ రచయిత పురాణపండ శ్రీనివాస్ రచించిన శ్రీమాలిక పుస్తకాలను ఆలయ దర్శనానికి వచ్చే దాతలు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, న్యాయమూర్తులకు అందజేస్తున్నట్లు ఈవో శీనానాయక్ తెలిపారు.


మెరుపు వేగం.. తక్షణ సాయం



రైలు ప్రమాదం జరిగినప్పుడు రైల్వే సిబ్బంది ఏ విధంగా స్పందించి సహాయ సహకారాలు చేపట్టాలి. సిబ్బంది ఎంత త్వరగా ఘటనా స్థలానికి చేరుకోవాలి. ప్రాణనష్టం జరగకుండా ఏ విధంగా వ్యవహరించాలో కళ్లకు కట్టేలా శుక్రవారం మెగా మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఎన్‌డీఆర్‌ఎఫ్, రైల్వే బ్రేక్ డౌన్ సిబ్బంది, రాష్ట్ర ప్రభుత్వ అత్యవసర ప్రతిస్పందన బృందాల ఆధ్వర్యంలో సిబ్బందికి అవగాహన కల్పించారు.

– విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే





దసరా వేడుకల సమయంలోనే విజయవాడ ఉత్సవ్!



మాట్లాడుతున్న ఎంపీ కేశినేని చిన్ని, పక్కనే కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర తదితరులు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: నగర పరిసరాలు ఇంద్ర వైభవాన్ని తలపించాలి... ఆధ్యాత్మికత ఉట్టిపడాలి.. ఆహ్లాదం పంచాలి.. విద్య, వైజ్ఞానిక, సాంస్కృతిక, కళా వారసత్వం ప్రతిబింబించాలి.. అలా 'విజయవాడ ఉత్సవ్' విశిష్టంగా నిర్వహించాలని ఎంపీ కేశినేని శివనాథ్ ఆకాంక్షించారు. రానున్న దసరా ఉత్సవాలను ఇంద్రకీలాద్రిపై జరిగే భక్తులకు మధురానుభూతి కలిగించే కార్యక్రమాలు నిర్వహించాలని కసరత్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నగరంలోని కలెక్టరేట్‌లో విజయవాడ ఉత్సవ్‌పై శుక్రవారం ప్రాథమిక సమావేశాన్ని నిర్వహించారు. నిర్వహణ సాధ్యాసాధ్యాలపై చర్చించారు. ఎంపీ మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక, సాంస్కృతిక పర్యాటకాన్ని ప్రోత్సహించడం, దానికి విజ్ఞానం, వినోదం మేళవించాలని, అందుకు ఎలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తే బాగుంటుందనే విషయమై అభిప్రాయాలు స్వీకరించారు. దసరా ఉత్సవాలకు లక్షలాది మంది భక్తులు తరలి వస్తారు, ఆ సమయంలో ఉత్సవ్ నిర్వహించాలనే యోచనలో ఉన్నట్లు చెప్పారు. ☛ హరిత బెరం పార్కు, పున్నమి ఘాట్, భవానీ ద్వీపం, తుమ్మలపల్లి కళా క్షేత్రం, పవిత్ర సంగమం తదితర ప్రాంతాల్లో వైవిధ్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. జానపద కళలను ప్రోత్సహిస్తామని తెలిపారు. ఫుడ్ ఫెస్టివల్, వాటర్ స్పోర్ట్స్, డ్రోన్, లేజర్ షోలు, థీమ్ బ్యూటిఫికేషన్ వంటి వాటిపై దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు. అందరి సలహాలు, సూచనలు పరిగణనలోకి తీసుకుని ఉత్సవ్ నిర్వహణకు ముందుకెళ్తున్నట్లు ఎంపీ వివరించారు. ఎగ్జిబిషన్ సొసైటీ పూర్వ వైభవం తీసుకువచ్చేలా నిర్వహించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో కలెక్టర్ జి.లక్ష్మీశ, పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు, వీఎంసీ కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్ర, జిల్లా పర్యాటక అధికారి ఎ.శిల్ప, ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతినిధుల తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర రహదారులకు రాజసం

63.7 కి.మీ మేర పనులకు రూ.37.8 కోట్లు

ఈనాడు, అమరావతి

వైకాపా పాలనలో చిన్నాభిన్నమైన రహదారుల రూపురేఖలు కూటమి సర్కారు మార్చనుంది. పల్లె పండగ ద్వారా ఉమ్మడి జిల్లాలో పెద్ద సంఖ్యలో సీసీ రహదారులు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అధ్వానంగా ఉన్న రాష్ట్ర హైవేలను సైతం గాడిన పెడుతున్నారు. గత ఐదేళ్లలో కనీస మరమ్మతులు లేక కునారిల్లుతున్న 12 రాష్ట్ర రహదారులను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం తాజాగా నిధులు మంజూరు చేసింది.

రహదారి	కి.మీ	రూ.కోట్లు
తిరువూరు-రాజవరం	4	7.8
నూజివీడు-మైలవరం	13.4	6
రామానగరం-నడకుదురు	10.8	5
సింగరాయపాలెం-బంటుమిల్లి	8.8	4
ముదినేపల్లి-గుడ్లవల్లేరు	3.7	2.5
గుడివాడ బైపాస్	3.7	2.5
చెవిటికల్లు-వత్సవాయి	5	2
నందిగామ-జొన్నలగడ్డ	5.7	2
మదిర-కంచికచర్ల	1.4	1
విజయవాడ-నూజివీడు	1.6	2
కందులపాడు-గంగినేని	1.7	1.5
మచిలీపట్నం-కమ్మవారిచెరువు	3.7	1.5
మొత్తం	63.7	37.8

ఆ 12 రోడ్లకు మంచి రోజులే...


ఉమ్మడి జిల్లాలో విజయవాడ, మచిలీపట్నం డివిజన్ల పరిధిలో 12 రాష్ట్ర హైవేల అభివృద్ధికి ప్రభుత్వం రూ.37.8 కోట్లు మంజూరు చేసింది. మొత్తం 63.7 కి.మీ మేర రహదారులను బాగు చేయనున్నారు. అత్యధికంగా నూజివీడు-మైలవరం రహదారి 13.4, రామానగరం-నడకుదురు, 10.4 కి.మీ, సింగరాయపాలెం-బంటుమిల్లి 8.8 కి.మీ మేర అభివృద్ధి చేయనున్నారు. అత్యల్పంగా విజయవాడ-నూజివీడు 1.6, కందులపాడు- గంగినేని 1.7 కి.మీ మేర అభివృద్ధి చేయనున్నారు. ఇందులో చెవిటికల్లు-వత్సవాయి, నందిగామ-జొన్నలగడ్డ, మదిర-కంచికచర్ల, విజయవాడ-నూజివీడు, కందులపాడు-గంగినేని రహదారులు పాలన, సాంకేతిక అనుమతులు రావాల్సి ఉంది. టెండర్లు కూడా పిలిచారు. జులై 10న టెండర్లు తెరిచి గుత్తేదారులను సైతం ఎంపిక చేస్తారు. మిగిలిన 7 రహదారులకు పాలన అనుమతులు రాగా సాంకేతిక అనుమతుల కోసం ప్రతిపాదనలు పంపించారు.



గత పాలకుల పాపమే...

నిధులు మంజూరు చేసిన రహదారులు ప్రస్తుతం దారుణంగా ఉన్నాయి. గత ప్రభుత్వం తట్టెడు మట్టి కూడా వేయలేదు. ఓంటో పూర్తిగా ఛిద్రమయ్యాయి. అప్పట్లో మరమ్మతులు చేస్తే రూ.15-20 కోట్లతో పనులు పూర్తయ్యేవి. ఏళ్ల తరబడి పట్టించుకోపోవడంతో ఇప్పుడు అంచనా వ్యయం తడిసిమోపెడైంది. హైవేపై ఇప్పటికే పాలు ప్రజలు అడుగు తీసేందుకు నరకం అనుభవించారు. వర్షం పడితే గుంతల్లో కనీసం వాహనాలు తెరిగే పరిస్థితి కూడా లేదు. కొన్ని రోడ్లు మూడు, నాలుగు కి.మీల అభివృద్ధికే రూ.కోట్ల నిధులు అవసరమయ్యాయంటే ఏ స్థాయిలో ఛిద్రమయ్యాయో తెలుస్తోంది. రహదారి పనుల ప్రక్రియ సార్వజనీనంత త్వరగా మొదలుపెడతామని ఆర్‌అండ్‌బీ ఎస్ఈ భాస్కరరావు తెలిపారు.

సీతారామరాజు.. ఓ మహోజ్వల శక్తి



అల్లూరి చిత్రపటానికి నివాళులర్పించిన కలెక్టర్ లక్ష్మీశ, డీఆర్వో లక్ష్మీనరసింహం, డీపీవో విజయకుమారి, ఏవో శ్రీనివాసరెడ్డి

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఆంగ్లేయులను గడగడలాడించిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు ఓ మహోజ్వల శక్తి అని కలెక్టర్ జి.లక్ష్మీశ పేర్కొన్నారు. గిరిజనులపై ఆంగ్లేయులు సాగించిన దుశ్చర్యలను ఎదురొడ్డి పోరాడిన యోధుడని, నేటి యువతకు స్ఫూర్తిప్రదాత అని పేర్కొన్నారు. నగరంలోని కలెక్టరేట్‌లో శుక్రవారం అల్లూరి జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, డీపీవో విజయకుమారి, కలెక్టరేట్ ఏవో ఎస్.శ్రీనివాసరెడ్డి, భూ విభాగ సూపరింటెండెంట్ సి.హెచ్.దుర్గాప్రసాద్, డీపీఆర్వో ఎస్.వి.మోహనరావు, డివిజనల్ పీఆర్వో కె.రవి తదితరులు పాల్గొన్నారు.

దేవినేని చొరవ.. రైతుల హర్షం

కంచికచర్ల, న్యూస్‌టుడే: ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకోలేక కంది రైతులు పడుతున్న కష్టాలను మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు చొరవతో పరిష్కారం దొరకడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వీరులపాడు మండలం చౌటపల్లి, పట్టెన్నపాలెం గ్రామాల్లో రైతులు కంది పంట అధికంగా సాగు చేస్తారు. పంట చేతికొచ్చి నాలుగు నెలలు దాటినా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.7550 లకు కొనుగోలు చేయలేదు. కొనుగోలు చేయాల్సిన మార్క్‌ఫెడ్ పట్టించుకోకపోవడంతో రైతులు తమ ఆర్థిక అవసరాలకు బహిరంగ మార్కెట్‌లో తక్కువ ధరకు విక్రయించుకునే పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో రైతులు తమ సమస్యను గత నెలలో మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి సమస్యను మార్క్‌ఫెడ్ అధికారులకు తెలిపి సమస్యను పరిష్కరించి కందులు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో గత నెల 28న మార్క్‌ఫెడ్ డీఎం నాగమల్లిక చౌటపల్లి గ్రామంలో పర్యటించి రైతుల వద్ద ఉన్న కందులను పరిశీలించి కొనుగోలు చర్యలు చేపట్టారు. దీంతో ఆనందపడిన రైతులు ఉత్సాహంగా చూస్తూ ఉండగా అధికారులు ఆ ఆశలు ఆవిరి చేశారు. వ్యవసాయాధికారులు చేపట్టిన ఈ-పంట నమోదులో ఉన్న లోపాలతో రైతుల వద్ద ఉన్న పంట పూర్తిగా అమ్ముకోలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో చౌటపల్లి గ్రామానికి చెందిన రైతులు గొల్లపూడిలోని కార్యాలయంలో శుక్రవారం దేవినేని ఉమామహేశ్వరరావును కలిసి తమ బాధను మొరపెట్టుకున్నారు. సమస్య తీవ్రత తెలుసుకున్న ఆయన వెంటనే అధికారులు, మిల్లర్లతో ఫోన్ ద్వారా సంప్రదించి చర్చలు జరిపారు. సుమారు 200 టన్నుల కందులు రైతుల వద్ద ఉన్నాయని, రైతుల ఇబ్బందులను గమనించి వెంటనే కందులను కొనాలని కోరారు. అందుకు మిల్లర్లు సానుకూలంగా స్పందించి, తాము సమావేశం నిర్వహించి కందులు కొనుగోలు చేస్తామని తెలిపారు.



అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న దేవినేని ఉమా, పక్కన రైతులు

కార్మికుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి

విజయవాడ బస్‌స్టేషన్, విద్యాధరపురం: గత కొన్నేళ్లుగా ఏపీఎస్ ఆర్టీసీలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఏపీపీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం విజయవాడ డిపో వద్ద ధర్నా నిర్వహించారు. ఈయూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వివిధ కారణాలతో నిలిచిపోయిన 3వేల మంది ఉద్యోగుల పదోన్నతులకు సంబంధించిన అంశాన్ని పరిశీలించాలని, కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు 12వ పీఆర్సీ కమిషన్ నియమించి ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీలో చాలాకాలం నుంచి ఖాళీగా ఉన్న సుమారు 10 వేల ఖాళీలను భర్తీచేయాలన్నారు. ఈయూ జోనల్ కార్యదర్శి వై శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి టీపీ భవాని, మొయింటినెస్ కమిటీ కన్వీనర్ యన్‌సీహెచ్ చక్రవర్తి, ఈయూ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి యస్ కె మొహిద్దీన్, విజయవాడ డిపో కార్యదర్శి రాధాకృష్ణ, ఈయూ నాయకులు పాల్గొని ఇతర డిమాండ్లు నెరవేర్చాలన్నారు. ☛ గవర్నరుపేట-1, 2 డిపోలు, విద్యాధరపురం ఆర్టీసీ వర్క్‌షాపు ఎదుట కూడా కార్మికులు ధర్నా చేపట్టారు. యూనియన్ నాయకులు కోటేశ్వరరావు, పాపారావు, కరీముల్లా, సురేష్ పాల్గొన్నారు.



డిపో ఎదుట ధర్నా చేస్తున్న ఆర్టీసీ కార్మికులు

బ్రహ్మేశ్వరరావుకు ఉత్తమ ఎన్‌సీసీ అధికారి అవార్డు



బ్రహ్మేశ్వరరావును సత్కరిస్తున్న ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్ కమిటీ సభ్యులు

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: పాతబస్తీ ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్‌లోని ఎన్‌సీసీ అధికారిగా పని చేస్తున్న బి.బ్రహ్మేశ్వరరావును యూనిట్ ఉత్తమ అసోసియేట్ ఎన్‌సీసీ అధికారి అవార్డు వరించిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాసరావు తెలిపారు. పాఠశాలలో శుక్రవారం అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ.. 2024-25 విద్యా సంవత్సరంలో హిందూ హైస్కూల్ ఎన్‌సీసీ విద్యార్థులు నిర్వహించిన పలు సేవా కార్యక్రమాలు, డ్రిల్, సాంస్కృతిక రంగాల్లో సాధించిన ప్రగతికి గానూ ఉత్తమ ఎన్‌సీసీ అధికారి అవార్డుకు ఎంపికైనట్లు వెల్లడించారు. 8-ఏ ఏయిర్ స్క్వాడ్రన్ ఎన్‌సీసీ కమాండింగ్ అధికారి అజిత్‌సింగ్‌రారి అవార్డు ప్రకటించినట్లు తెలిపారు. ఈనెల రెండవ తేదీన వీఆర్ సిద్ధార్థ కళాశాలలో జరిగిన అభినందన సభలో బ్రహ్మేశ్వరరావు అవార్డును అందుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్ కమిటీ అధ్యక్షుడు తొమ్మండ్రు శేషయ్య, ప్రధాన కార్యదర్శి గోపిశెట్టి మల్లయ్య, పాఠశాల కార్యదర్శి కేఎల్‌వీ మోహన్‌రావు, పాఠశాల సిబ్బంది ఎన్‌సీసీ అధికారిని అభినందించి సత్కరించారు.

బీఫార్మసీలో జేఎన్‌టీయూ టాపర్‌గా ఐతవరం విద్యార్థిని



గవర్నర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న నర్మద

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ఐతవరం గ్రామానికి చెందిన దర్శి నర్మద బీఫార్మసీలో కాకినాడ జేఎన్‌టీయూ విశ్వవిద్యాలయ టాపర్‌గా నిలిచింది. గ్రామానికి చెందిన తెదేపా నాయకుడు దర్శి నాగమల్లేశ్వరరావుకు కుమార్తె, కుమారుడు. శుక్రవారం జేఎన్‌టీయూలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆమెకు బంగారు పతకం, ప్రశంసాపత్రం బహూకరించారు. ప్రస్తుతం ఆమె దివీస్ ఫార్మా కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. యూనివర్సిటీ టాపర్‌గా నిలిచిన ఆమెను మాజీ హోంమంత్రి వసంత నాగేశ్వరరావు, తెదేపా నాయకుడు యరమాస అంకురావు అభినందించారు.

6న శునకాలకు ఉచిత టీకాలు

లబ్బీపేట(విజయవాడ సిటీ): ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా ఈనెల 6న ఉదయం 9 గంటలకు ఎంజీరోడ్డులోని ఎన్టీఆర్ వెటర్నరీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో పెంపుడు, వీధిలోని శునకాలకు ఉచితంగా ర్యాబిస్ టీకాలు వేయనున్నట్లు సంయుక్త సంచాలకులు ప్రేమ్‌చంద్ తెలిపారు. యజమానులు తమ శునకాలను తీసుకురావాలని కోరారు. పెంపుడు జంతువుల నుంచి మనుషులకు వచ్చే జునోసిస్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

పథకం రచించి.. ప్రాణాలు తీసేసి..


ఆస్తి కోసం నాయనమ్మను చంపిన మనవడు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ ప్రసాదరావు, సీఐ చంద్రశేఖర్

జి.కొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని చెవుటూరు గ్రామంలో ఉమ్మడి హైమావతిని ఆమె మనవడు ఉమ్మడి వేణుగోపాల్ పథకం ప్రకారమే హత్య చేసినట్లు మైలవరం ఏసీపీ వై.ప్రసాదరావు తెలిపారు. శుక్రవారం జి.కొండూరు పోలీస్‌స్టేషన్ ఆవరణలో జరిగిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. చెవుటూరులో ఉమ్మడి హైమావతి, చలపతిరావు దంపతులు..వారికి 2.5 ఎకరాల మామిడి తోట, 1.35 ఎకరాల మాగాణి, 40 సెంట్ల ఇళ్ల స్థలం, ఒక డాబా ఉంది. వీరికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు సంతానం కాగా. .చిన్న కూతురు, చిన్న కుమారుడు వివాహ అనంతరం అనారోగ్యంతో మరణించారు. మరో కుమార్తె మూలపాడులో తన భర్తతో జీవిస్తోంది. పెద్ద కుమారుడు పరిటాలలో నివాసముంటున్నాడు. ఈ క్రమంలో తన నాయనమ్మ, తాతయ్యలు తమకు ఆస్తి చెందకుండా చేస్తారేమోనని, వారిని చంపుతానని వేణుగోపాల్ నిత్యం బెదిరించేవాడు. ఈ నేపథ్యంలో ముందస్తు పథకం ప్రకారం జూలై 1న చెవుటూరు గ్రామ శివారు పొలాల్లో ఒంటరిగా గేదెలు మేపుతున్న హైమావతి వద్దకు తన స్నేహితుడైన ఆకుల గోపితో కలిసి బజాజ్ ప్లాటినా ద్విచక్ర వాహనంపై వెదురు కర్ర, పెట్రోల్ తీసుకుని చేరుకున్నారు. ఈ క్రమంలో అదును చూసుకుని ఆమె తలపై కొట్టి, అనంతరం పెట్రోల్ పోసి తగలపెట్టి అక్కడ నుంచి పరారయ్యారు. నిందితులను పట్టుకునేందుకు రెండు బృందాలుగా గాలింపు చేపట్టగా..సురక్ష 360 కార్యక్రమంలో గ్రామాల్లో పెట్టిన సీసీ కెమెరాల సాయంతో నిందితుల కదలికలు గమనించి మైలవరం శివారు తిరువూరు రోడ్డు దర్గా సమీపంలో వారిని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. మృతురాలి భర్త ఉమ్మడి చలపతిరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను కోర్టు ముందు హాజరు పరిచి రిమాండుకు తరలిస్తామని చెప్పారు. కేసును త్వరితగతిన పరిష్కరించినందుకు మైలవరం సీఐ చంద్రశేఖర్, జి.కొండూరు ఎస్సై కే సతీష్‌కుమార్‌ను ఉన్నతాధికారులు అభినందించారని ఏసీపీ తెలియజేశారు.

బ్రాయిలర్ ధరలు (కిలో ఒక రూ.లలో)



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -97 రిటైల్ ధర 119 చికెన్ విత్ స్కిన్ - 173, చికెన్ స్కిన్‌లెస్ - 196. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & బ్రీడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 105, 113, 124 చికెన్ విత్ స్కిన్ - 200 చికెన్ స్కిన్‌లెస్ - 210.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్ల ధర 100 గుడ్లకు రూ. 570 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.88/-.

రౌడీషీటర్ విడుదలకు ముఖ్యనేత సిఫార్సు

రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసిన వైనం

పటమట, న్యూస్‌టుడే: ఇంటిని ఖాళీ చేసే వ్యవహారంలో వైకాపా మద్దతుగా ఉండే రౌడీషీటర్ వీరంగం సృష్టించాడు. తీరా అతన్ని పోలీసులు అదుపులోకి తీసుకుంటే విడుదల చేయమని కూటమి పార్టీల ముఖ్యనేత సిఫార్సు చేశారు. ఆచార్య ఎన్జీరంగా నగర్‌లో కృష్ణారావుకు చెందిన నివాసంలో కోట సామ్రాజ్యం నాలుగేళ్ల నుంచి అద్దెకు ఉంటున్నారు. ఆమె అద్దె సక్రమంగా చెల్లించకపోవడంతో ఇంటిని ఖాళీ చేయమని యజమానులు చెప్పారు. అయినా ఇంటిని ఖాళీ చేయలేదు. దీంతో ఈ పనిని కానూరుకు చెందిన పేరుమోసిన రౌడీషీటర్ కొక్కిలగడ్డ జాన్‌బాబుకు అప్పగించారు. అతను వైకాపా ఎన్నికల క్యాంపెయిన్‌లో పాల్గొనేవాడు. గురువారం రాత్రి 10 గంటల సమయంలో జాన్‌బాబు, అతనికి చెందిన 10 మంది అనుచరులు సామ్రాజ్యం అద్దెకు ఉంటున్న ఇంట్లోకి బలవంతంగా ప్రవేశించి ఇంట్లోని వస్తువులన్నీ ధ్వంసం చేశారు. దీంతో సామ్రాజ్యం పోలీసు కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేయడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చారు. రౌడీషీటర్ కొక్కిలిగడ్డతోపాటు అనుచరులను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని మాచవరం పోలీసులకు అప్పగించారు. ఈ క్రమంలో ఓ ముఖ్యనేత ఫోన్ చేయడంతో పోలీసులు రౌడీషీటర్, అతని అనుచరులను వెంటనే విడిచి పెట్టారు. వైకాపాకు చెందిన రౌడీషీటర్‌ను విడుదల చేయాలని కూటమి పార్టీలకు చెందిన ముఖ్యనేత ఫోన్ చేయడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ఇప్పటివరకు వారిపై కేసు కూడా నమోదు చేయలేదు.

నదిలో మునిగి యువకుడి దుర్మరణం



అభిరామ్ (పాతచిత్రం)

కృష్ణలంక, న్యూస్‌టుడే: ఉన్నత విద్యతో ఉజ్వల భవిష్యత్తును అందుకోవాల్సిన యువకుడి జీవితం అర్ధాంతరంగా ముగిసింది. కృష్ణానది రూపంలో మృత్యువు కబళించింది. కృష్ణలంక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం మండలం ఓబులనాయనిపల్లికి చెందిన గడ్డం అభిరామ్(19) విజయవాడ రూరల్ మండలం గూడవల్లిలోని ఒక ప్రయివేటు కళాశాలలో ఇంటర్ పూర్తి చేశాడు. అతడితోపాటు ధర్మవరం పరిసర ప్రాంతాలకు చెందిన పలువురు అదే కళాశాలలో ఇంటర్ చదివారు. ఉన్నత విద్యలో చేరే నిమిత్తం టీసీ అవసరమవడంతో అందు కోసం 12 మంది గురువారం సాయంత్రం ధర్మవరంలో రైలెక్కి శుక్రవారం ఉదయం విజయవాడ రైల్వే స్టేషన్‌లో దిగారు. తొలుత కృష్ణానదిలో స్నానం చేసి కనకదుర్గమ్మను దర్శించుకుని అనంతరం కళాశాలకు వెళ్లి టీసీలు తీసుకుందామని నిర్ణయానికి వచ్చారు. దీంతో వారు రైల్వేస్టేషన్ నుంచి సీతమ్మ వారి పాదాల సెంటర్‌లోని శనీశ్వరాలయం పరిసరాల్లో నది వద్దకు చేరుకున్నారు. అందరూ ఒడ్డునే స్నానం చేస్తుండగా అభిరామ్, హరికిరణ్‌లు తమకు ఈతొచ్చంటూ నది లోపలకు వెళ్లారు. కొద్ది సేపటికి ఆయాస పడుతూ ఇద్దరూ వెనుదిరిగిన క్రమంలో ఒకరు ఒడ్డుకు చేరుకోగా..అభిరామ్ మధ్యలోనే మునిగిపోయాడు. దీంతో స్నేహితులు పోలీస్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న కృష్ణలంక పోలీసులు తీరంలో గాలించగా..ఆచూకీ లభించలేదు. దీంతో ఎన్డీఆర్ఎఫ్ బృందాల సాయంతో గాలింపు చేపట్టి అభిరామ్ మృతదేహాన్ని వెలికి తీశారు. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు.

☛ కృష్ణానదిలో మునిగి మృతి చెందిన అభిరామ్ కుటుంబానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ అండగా నిలిచారు. సమాచారం తెలుసుకున్న వెంటనే మంత్రి ఘటనాస్థలానికి వెళ్లి సహాయాన్ని అందించాల్సిందిగా వ్యక్తిగత సిబ్బందిని ఆదేశించారు. మృతుడి తల్లిదండ్రులను పరామర్శించి అండగా నిలవనున్నట్లు చెప్పారు. మృతదేహాన్ని ధర్మవరం వరకు తరలించేందుకు ప్రైవేటు అంబులెన్స్ ఏర్పాటు చేశారు.

అనుమానాస్పద స్థితిలో ఎన్టీటీపీఎస్ ఉద్యోగి మృతి

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్ ఉద్యోగి కృష్ణారావు(54) అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి ఎస్సై పాపారావు తెలిపిన వివరాల ప్రకారం. .ఎన్టీటీపీఎస్ ఫైర్ స్టేషన్ విభాగంలో వ్యాన్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న కృష్ణారావు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. రెండు రోజుల కిందట కడుపులోని పెద్ద పేగుకు శస్త్ర చికిత్స నిర్వహించారు. ఈ క్రమంలో విజయవాడ ఆసుపత్రి నుంచి ఇబ్రహీంపట్నంలో తాను నివాసముంటున్న ఇంటికి బంధువులు గురువారం తీసుకొచ్చారు. అయితే శుక్రవారం ఉదయం ఇంటి బయట కాలిన గాయాలతో మృతిచెంది ఉన్నారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం



★ స్థానిక పంచాయతీలోని డ్రెయినేజీలో పూడిక, పిచ్చి కాడ పెరిగి మురుగు నీటి ప్రవాహానికి అడ్డుగా మారిందని స్థానికులు మేమున్నాం..మీకు తోడుగాకు తెలిపిన సమస్యను పంచాయతీ కార్యదర్శి రామారావుకు వివరించగా స్పందించి 1, 2వార్డులకు వెళ్లే రహదారి వైపు కొంతమేర తొలగించారు. **-న్యూస్‌టుడే, రెడ్డిగూడెం**


★ గ్రామ వీధుల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని స్థానికులు తెలిపిన సమస్యపై తుమ్మలపాలెం కార్యదర్శి ప్రసాద్ స్పందించారు. పారిశుద్ధ్య కార్మికులతో శుక్రవారం ఆ ప్రాంతంలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులను నిర్వహింపజేసి చెత్తను తొలగించారు.
-న్యూస్‌టుడే, తుమ్మలపాలెం(ఇబ్రహీంపట్నం గ్రామీణం)

వైభవంగా దీపాలంకరణ సేవ



నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని నెమలి వేణుగోపాల స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి అర్చకులు గోపాలాచార్యుల ఆధ్వర్యంలో అష్టోత్తర శత దీపాలంకరణ సేవ వైభవంగా నిర్వహించారు. రుక్మిణి, సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఉత్సవ మూర్తులకు పూజలు నిర్వహించగా భక్తులు పాల్గొన్నారు. మూలవిరాట్‌ను విశేషంగా అలంకరించారు.

శాకంబరిగా ముత్యాలమ్మ



పెనుగొలను(గంపలగూడెం), న్యూస్‌టుడే: ఆషాఢ మాసం సందర్భంగా మండలంలోని పెనుగొలనులో గ్రామదేవత ముత్యాలమ్మ అమ్మవారి మూలవిరాట్‌ను శుక్రవారం అర్చకులు డి.రామలింగేశ్వరశర్మ ఆధ్వర్యంలో వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. అమ్మవారికి ప్రీతిపాత్రమైన దద్ధోజనం ప్రసాదం నివేదించి భక్తులకు పంపిణీ చేశారు. శాకంబరి అలంకరణలో ముత్యాలమ్మను గ్రామస్థులు దర్శించుకున్నారు.

ఇబ్రహీంపట్నం గ్రామీణం: ఎన్టీటీపీఎస్ ఏ కాలనీలోని వెంకటేశ్వర ఆలయ ప్రాంగణంలో ఉన్న అమ్మవారు శుక్రవారం శాకంబరిగా దర్శనమిచ్చారు. వివిధ కూరగాయలతో అమ్మవారిని అలంకరించారు.

భక్తిశ్రద్ధలతో లలితా సహస్ర పారాయణం

మైలవరం: ద్వారకా తిరుమల దత్తత దేవాలయమైన స్థానిక కోటమహాలక్ష్మమ్మ ఆలయంలో వారాహి నవరాత్రుల సందర్భంగా లలితా సహస్రపారాయణ పఠనం చేశారు. పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలు పారాయణం అనంతరం ప్రత్యేక హారతులిచ్చారు.

ప్రకృతిని కాపాడుకోవాలి



మొక్కలు నాటుతున్న సీఐ చంద్రశేఖర్

మైలవరం, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని సీఐ దాడి చంద్రశేఖర్ పేర్కొన్నారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ మైలవరం ఆధ్వర్యంలో శుక్రవారం పలు ప్రభుత్వ కార్యాలయాలు, రహదారుల పక్కన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతిని కాపాడుకోవడం ద్వారా మెరుగైన ఆరోగ్యం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో క్లబ్ నాయకులు కె.ముత్యప్రసాద్, జాస్తి వెంకటేశ్వరరావు, బాలగోపాలరెడ్డి, నాగభూషణం, రాములెడ్డి, హరిప్రసాద్‌కుమార్‌రావు, లక్ష్మణరావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలకు సీసీ కెమెరాలు తప్పనిసరి



ఆలయాల నిర్వాహకులకు సురక్ష డివైస్‌పై వివరిస్తున్న సీఐ గిరిబాబు

తిరువూరు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని అన్ని మతాల ఆలయాలకు నిర్వాహకులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తిరువూరు సీఐ కె.గిరిబాబు, ఎస్సై కేవీజీవీ.సత్యనారాయణ స్పష్టం చేశారు. విజయవాడ సీపీ రాజశేఖర్‌బాబు ఆదేశం మేరకు శుక్రవారం రాత్రి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో హిందూ, ముస్లిం, క్రైస్తవ ఆలయాల నిర్వాహకులకు 'సురక్ష డివైస్' కార్యక్రమంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ప్రార్థనా మందిరాలకు సీసీ కెమెరాలు ఉంటే కలిగే ప్రయోజనాలు వివరించారు. వివిధ గ్రామాల నుంచి హిందూ దేవాలయాలు, మసీదులు, చర్చిల నిర్వాహకులు పాల్గొని పోలీస్ అధికారుల సూచనలు పాటిస్తామన్నారు.

ముందుగానే సాగుతున్నారిలా

సాగునీటి వనరులకు జలకళ

తిరువూరు, విస్సన్నపేట, ఎ.కొండూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే



మునుకుళ్లలో వరినాట్లు వేస్తున్న కూలీలు

నియోజకవర్గ రైతులు ఈ ఏడాది ఖరీఫ్ వరి సాగును జులై మొదటి వారంలోనే ఆరంభించారు. చెరువులు, వాగులు, ఎత్తిపోతల పథకాలు, బోర్లలో సాగు నీరు అందుబాటులో ఉంది. దీంతో ముందుస్తుగానే మాగాణి భూముల్లో వరి నాట్లు ప్రారంభించారు. జూన్‌లో వర్షాలు తగ్గడంతో ఖరీఫ్ వరి సాగుపై సాగుదారుల్లో కాస్త సందిగ్ధత నెలకొనగా.. పంట ఆలస్యంగా సాగవుతుందని భావించారు. అయితే జులై మొదటి వారంలో వర్షాలు కురుస్తుండడంతో రైతులు, కూలీలు మాగాణి సాగులో నిమగ్నమయ్యారు. జూన్ రెండో పక్షం నుంచే నారుమడులు సిద్ధం చేసుకున్నారు. కొందరు రైతులు నేరుగా గింజలు చల్లే పద్ధతిలో సాగు చేస్తున్నారు. ఆ గింజలు కూడా వర్షాలకు తేమ శాతం లభ్యమై మొలకెత్తాయి. ఈ నెల రెండో పక్షం నాటికి నాలుగు మండలాల్లో వరి నాట్లు ముమ్మరంగా ప్రారంభమవుతాయి. ఆగస్టు చివరి వారంలో నాట్లు వేయడం ముగిస్తారు.

44 వేల ఎకరాల్లో వరి సాగు లక్ష్యం

తిరువూరు నియోజకవర్గంలో ప్రధాన ఆహార పంట వరి. సాగునీరు లభ్యత మేరకు ఖరీఫ్, రబీలో కూడా ధాన్యం పండిస్తారు. ఈ ఏడాది నియోజకవర్గంలో ఖరీఫ్ వరి సాగు లక్ష్యం 44 వేలు ఎకరాలు. ప్రస్తుతం వరినాట్లు ప్రారంభమవడంతో గ్రామాల్లో అందరికీ చేతినిండా పని ఉంటోంది. ప్రస్తుతం తిరువూరు మండలం మునుకుళ్ల, వాముకుంట్లలో వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. నాలుగు మండలాల్లో బోర్లు కింద నాట్లు వేసేందుకు హాలికులు సిద్ధమయ్యారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో 2 వేల ఎకరాల్లో మాగాణి పంట సాగైంది. ఆగస్టు మొదటి పక్షం నాటికి నూరుశాతం సాధారణ విస్తీర్ణంలో వరి నాట్లు పూర్తవుతాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం చెరువులకు నీరు చేరడంతో వరి సాగుకు ఇబ్బంది లేదని భరోసాగా ఉన్నారు.

నియోజకవర్గంలో సాగు సాధారణ విస్తీర్ణం	
మండలం	హెక్టార్లు
తిరువూరు	7479
విస్సన్నపేట	3931
గంపలగూడెం	3491
ఎ.కొండూరు	2493



బాటలు తీస్తే మేలు: ప్రస్తుతం వర్షాలు కురవడంతో వరినాట్లకు సమృద్ధిగా నీరు లభించింది. మాగాణి వరి నాట్లు వేశాక ప్రతి రెండు మీటర్లకు మధ్య 20 సెం.మీ బాటలు తీస్తే ఎరువులు, పురుగు మందులు వేయడానికి, పైరు పరిస్థితిని గమనించేందుకు, గాలి వెలుతురు అందేందుకు ఉపయుక్తంగా ఉంటుంది. భూమిని రెండు మూడు దఫాలు కలియ దున్నాక అడ్డతో చదును చేసి మొక్క నాటాలి. 4 లేదా 6 ఆకులు ఉన్న మొక్కలు పైపైన నాటాలి. ముదురు ఆకు నాటితే దిగుబడి తగ్గుతుంది. **- ఎస్‌కే.టిప్పుసుల్తాన్, సాంకేతిక ఏవో తిరువూరు సబ్‌డివిజన్**

నట్టల నివారణ మందు పంపిణీ

కోకిలంపాడు, చిక్కుళ్లగూడెం(తిరువూరు): మండలంలోని కోకిలంపాడు, చిక్కుళ్లగూడెంలో శుక్రవారం నిర్వహించిన శిబిరాల్లో పశువైద్యాధికారులు డి.అభిలాష్, టి.శ్వేత పాల్గొని గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాగించారు. జీవాల పెంపకందారులకు వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వీఏఎస్‌లు ఎం.గోపాలకృష్ణ, వీఎల్వో నాగేంద్రబాబు, ఏహెచ్ఏ రామారావు, నాగరాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహం

గొల్లపూడి, న్యూస్‌టుడే: గొల్లపూడిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది పదో తరగతిలో 500 మార్కులు పైగా వచ్చిన విద్యార్థులకు గ్రామ తెదేపా నాయకులు ఆర్థిక ప్రోత్సాహం అందించారు. విద్యార్థులు అహ్మదీ సుల్తానా, సాహు శ్రావణి, కౌశినా, నవదీపిక, పరిమళ, నాగభవానీ శంకర్‌లకు రూ.5వేలు చొప్పున రూ.30వేలు ఇచ్చారు. తెదేపా నాయకులు బొమ్మసాని సుబ్బారావు, నర్రా వాసు, ప్రధానోపాధ్యాయుడు శేషగిరిరావు, తదితరులు పాల్గొన్నారు.

మండల పరిషత్ సమావేశం నేడు

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం 2గంటలకు ఎంపీపీ కె.నాగలక్ష్మి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బి.శ్రీనివాసరావు తెలిపారు. ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు పాల్గొనాలని ఆయన కోరారు.

అనేక సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: మండలంలో అనేక సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పి.వి.ఆంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్డిగూడెం ఎస్సీవాడ ఏరియాలో సామాజిక భవనం నిర్మాణం కలగానే మిగిలిందన్నారు. గ్రామాల్లో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, మురుగు పారుదల సక్రమంగా జరగక అవస్థలు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో టి.వీరాస్వామి, విజయ్, ఎం.మాధవరెడ్డి, వి.కృష్ణారెడ్డి, జి.అప్పిరెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకం పనులపై ప్రజావేదిక



సామాజిక తనిఖీ నివేదికలు పరిశీలిస్తున్న అధికారులు

తిరువూరు, న్యూస్‌టుడే: మండలంలో 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు నిర్వహించిన ఉపాధి హామీ పథకం పనులపై శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రజావేదిక నిర్వహించారు. గత నెలలో గ్రామాల్లో నిర్వహించిన ఉపాధి పనులపై జరిగిన సామాజిక తనిఖీ వివరాలను ప్రజావేదికలో సంబంధిత సిబ్బంది నివేదించారు. ఏడాదిలో 20 గ్రామ పంచాయతీల్లో రూ.22,69,82,899 విలువైన 1,630 పనులు నిర్వహించారు. గ్రామాల వారీగా నివేదికలను జిల్లా అధికారులు పరిశీలించి జరిమానాలు, రికవరీలను నమోదు చేస్తున్నారు. శనివారం కూడా ప్రజావేదిక జరుగుతుంది. డ్వామా పీడీ ఎ.రాము, ఎంపీపీ జి.భారతి, ఏపీడీ పార్థసారథి, ఎంపీడీవో రవిబాబు, ఏపీవో శీలం మాధవరెడ్డి పాల్గొన్నారు.

మాజీ సీఎం రోశయ్యకు నివాళి

తిరువూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని రాజీవ్‌భవన్‌లో శుక్రవారం మాజీ సీఎం కొణిజేటి రోశయ్య జయంతి నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ బ్లాక్, మండల, పట్టణ శాఖల అధ్యక్షులు బి.ప్రకాశరావు, పి.శ్రీనివాసరావు, జీవన్‌బాబు, నాయకులు పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

గొల్లపూడి పంపింగ్ స్కీం పరిశీలన

గొల్లపూడి, న్యూస్‌టుడే: గొల్లపూడి పంపింగ్ స్కీం వద్ద నుంచి వెళ్తున్న పంట కాలువలోని తూటికాడ, వ్యర్థాలను మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు శుక్రవారం తొలగించారు. గొల్లపూడి పంపింగ్ స్కీంను పరిశీలించిన ఆయన కాలువ అవతలివైపు ఉన్న గ్రామాంలో శుభ్రం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలువలో తూటికాడ, వ్యర్థాలు పేరుకుపోవడం వల్ల నీటి ప్రవాహానికి అడ్డంకులు ఎదురవుతున్నాయన్నారు. కాలువను శుభ్రం చేస్తే అన్ని ప్రాంతాలకు నీరు వెళ్తుందని తెలిపారు. తెదేపా ఎల్లప్పుడూ రైతుల పక్షాన నిలుస్తుందని వెల్లడించారు.

త్వరలోనే బాధితులకు పరిహారం



ఆర్డీవో కావూరి చైతన్యకు సమస్య వివరిస్తున్న సీపీఎం నాయకులు

మైలవరం, న్యూస్‌టుడే: రహదారి విస్తరణలో ఇళ్లు, స్థలాలు కోల్పోయిన మండలంలోని చంద్రాల బాధితులకు త్వరలోనే పరిహారం అందేలా చర్యలు తీసుకుంటున్నామని విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పొందుగలలో రెవెన్యూ, అటవీశాఖల మధ్య సమస్యగా ఉన్న ప్రాంతాన్ని పరిశీలించి తహసీల్దార్ కార్యాలయానికి రాగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పీవీ ఆంజనేయులు, మండల కార్యదర్శి సీహెచ్ సుధాకర్‌లు వెల్వడం, చంద్రాల బాధితులను తీసుకుని ఆయన్ను కలిశారు. ఆయా గ్రామాల్లో పరిహారం అందని వైనం, రహదారి దుస్థితిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.3 కోట్లకు పైగా పరిహారానికి సంబంధించిన దస్త్రం పే అండ్ అకౌంట్స్ విభాగానికి వెళ్లిందని, అక్కడి నుంచి ఆర్థికశాఖ ద్వారా త్వరలోనే ఆమోదం వస్తుందని వివరించారు. సీపీఎం నాయకులు వెంకటరెడ్డి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఇలా వదిలేస్తారు.. రోగాలు తెప్పిస్తారు..!

సెప్టిక్ ట్యాంకు వ్యర్థాలను సేకరించే కొన్ని సంస్థలు ట్యాంకులోని వ్యర్థాలను నివాస ప్రాంతాలు, రహదారుల వెంబడి కొందరు వదిలేసి వెళ్లిపోతున్నారు. దీంతో తీవ్ర దుర్గంధం వెలువడి స్థానికులు ఉండలేకపోతున్నారు. మరోవైపు ప్రమాదకరమైన వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని. .వాటి నుంచి దోమలు వృద్ధి చెంది కుడుతున్నాయిని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గొల్లపూడి గ్రామ పంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా కనిపిస్తోంది. సంబంధిత అధికారులు స్పందించి ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. **-న్యూస్‌టుడే, గొల్లపూడి**




అటు ఇటు పల్లం.. ఇదెక్కడి విడ్డూరం



మైలవరం పంచాయతీ నాయకుల తీరు ఎవరికీ అర్థం కావడంలేదు. గత ప్రభుత్వ హయాంలో ప్రస్తుత పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో ప్రజల ఇబ్బందులను పట్టించుకోకుండా స్థానిక తారకరామానగర్‌లో అంతర్గత రహదారులకు అనుబంధంగా ఎత్తయిన చప్టాలు నిర్మించారు. వాటితో రాకపోకలకు ఇబ్బందిగా ఉండడంతో.. ప్రస్తుత నాయకులు ఎత్తుగా ఉన్న రెండు చప్టాలను కలుపుతూ రహదారికి అడ్డంగా అనుసంధానించారు. దాంతో ప్రధాన రహదారి మధ్య మెరక, ఇరువైపులా పల్లంగా మారడంతో వర్షపునీరు రహదారిపైనే నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. కనీసం మురుగుకాలువలకు మరలేలా చేయాలన్న ఆలోచన చేయడంలేదు. **-న్యూస్‌టుడే, మైలవరం**

కూటమి పాలనపై ప్రజల్లో సంతృప్తి



తిరువూరు: కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, పక్కన తెదేపా నాయకులు



మైలవరంలో

తిరువూరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కూటమి ఏడాది పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలపై ప్రజలు సంతృప్తితో ఉన్నారని శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. పట్టణంలోని 16, 17 వార్డుల్లో శుక్రవారం ఆయన సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొని కరపత్రాలు పంపిణీ చేశారు.

మైలవరం: మైలవరంలో తెదేపా నాయకులు లితీష్, బాలకృష్ణ ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కరపత్రాలు పంపిణీ చేశారు.

రెడ్డిగూడెం: మండల పరిధిలోని శ్రీరాంపురం గ్రామంలో తెదేపా నాయకుడు ఎన్.చెన్నకేశవరావు ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు.



రెడ్డిగూడెంలో

కొండపల్లి: కొండపల్లి గాయత్రీనగర్‌లో వైస్ ఛైర్మన్ శ్రీను, తెదేపా నాయకులు ఇంటింటికి వెళ్లి కూటమి ప్రచారం చేశారు. కార్యక్రమంలో యండ్లూరి హరిత తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక మరమ్మతులు



చదును చేస్తున్న యంత్రం

తరామచంద్రాపురం(ఎ.కొండూరు), న్యూస్‌టుడే: మండలంలోని రామచంద్రాపురం వద్ద జాతీయ ప్రధాన రహదారిపై గుంతలకు సంబంధిత అధికారులు శుక్రవారం తాత్కాలిక మరమ్మతులు చేశారు. తిరువూరు - విజయవాడ ప్రధాన రహదారిపై రాకపోకలు సాగించే వేలాది మంది వాహనదారులు రామచంద్రాపురం వద్ద లోతైన గుంతలను దాటేందుకు నరకం చూస్తున్నారు. శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు చొరవ చూపి రహదారిపై గుంతలు పూడ్చించాలని ఎన్‌హెచ్ఏ అధికారులతో మాట్లాడారు. దీంతో సంబంధిత అధికారులు కి.మీ పొడవునా ఏర్పడిన గుంతలను కంకరతో పూడ్చించి యంత్రాలతో చదును చేశారు. కానీ శాశ్వతంగా సమస్య పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

లయన్స్‌క్లబ్ చొరవతో గుంతల పూడ్చివేత

విస్సన్నపేట, న్యూస్‌టుడే: మండల కేంద్రానికి సమీప ఎన్నెస్పీ కాల్వ వద్ద అధ్వానంగా ఉన్న రహదారికి లయన్స్‌క్లబ్ సభ్యులు స్వచ్ఛందంగా మరమ్మతులు చేసి వాహనదారుల కష్టాలను తాత్కాలికంగా తొలగించారు. విస్సన్నపేట-ఎ.కొండూరు రోడ్డులో కళాశాల, గుడి సమీప సాగర్ కాల్వ వద్ద గుంతలు ఏర్పడి నీరు నిలిచి రాకపోకలు సాగించే ప్రజలు, వాహనదారులు తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఆర్అండ్‌బీ శాఖ అధికారులు రహదారి మరమ్మతులను నిర్లక్ష్యం చేశారు. దీంతో విస్సన్నపేటకు చెందిన లయన్స్‌క్లబ్ క్యాబినేట్ సభ్యుడు ఎన్టీ వెంకటేశ్వరరావు రూ.30వేలు విరాళం అందించడంతో లయన్స్‌క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.అరుణకుమారి, జగన్‌మోహన్‌రెడ్డి, సభ్యుల పర్యవేక్షణలో శుక్రవారం రహదారిపై గుంతలను కంకరతో పూడ్చించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

జి.కొండూరు, న్యూస్‌టుడే: జి.కొండూరు, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలంలోని చెవుటూరు బైపాస్ జాతీయరహదారి-30 పై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు డ్రైవర్లకు కాళ్లు విరగ్గా..బస్సులో ఉన్న మరో డ్రైవర్‌కు..లారీ క్యాబిన్‌లో ఉన్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. సేకరించి సమాచారం మేరకు..చెవుటూరు గ్రామ బైపాస్ శివసాయి హోటల్ సమీపంలో మైలవరం నుంచి విజయవాడ వస్తున్న బస్సు..చిలకలూరిపేట నుంచి భద్రాద్రి కొత్తగూడేనికి డబ్ల్యూపీవీసీ పైపుల లోడుతో వెళ్తున్న లారీ ఎదురెదురుగా ఢీకొట్టుకున్నాయి. ప్రమాదంలో బస్సు పక్కనున్న చేలల్లోకి దూసుకెళ్లింది. సమాచారం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని 108 సాయంతో క్షతగాత్రులను విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బస్సులోని ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.



నుజ్జయిన వాహనాలు

చెట్టును ఢీకొట్టిన లారీ



గొల్లపూడి, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై గొల్లపూడి నల్లకుంట సెంటర్ వద్ద పెద్ద ప్రమాదం తప్పింది. గొల్లపూడి నుంచి ఇబ్రహీంపట్నం వైపు వెళ్తున్న టిప్పర్ శుక్రవారం ఉదయం అదుపు తప్పి పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టింది. వేగంగా వెళ్తున్న టిప్పర్‌ను డ్రైవర్ అదుపు చేయలేక చెట్టును ఢీకొట్టడంతో అతడికి స్వల్ప గాయాలయ్యాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

పోరాటయోధుడు అల్లూరి

గొల్లపూడి, బ్రిటీషు వారిపై అల్లూరి సీతారామరాజు చేసిన పోరాటం మరువలేనిదని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. అల్లూరి జయంతిని గొల్లపూడిల శుక్రవారం నిర్వహించి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.



గొల్లపూడిలో నివాళులు అర్పిస్తున్న మాజీ మంత్రి దేవినేని ఉమా

మైలవరం: స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించారు. ప్రిన్సిపల్ కె.అప్పారావు పాల్గొరన్నారు.

జి.కొండూరు: గంగినేని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు వి.నారాయణరావు ఆధ్వర్యంలో అల్లూరి చిత్రపటానికి నివాళులర్పించారు.



జి.కొండూరు: గంగినేని జిల్లా పరిషత్ పాఠశాలలో..



విస్సన్నపేట: రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో..

గొల్లపూడి: విజయవాడ గ్రామీణ మండలం తహసీల్దారు కార్యాలయంలో అల్లూరి చిత్రపటాలకు తహసీల్దారు సుగుణ, వీఆర్‌ఓలు నివాళులర్పించారు.

విస్సన్నపేట: మండల రెవెన్యూ కార్యాలయం వద్ద తహసీల్దారు కె.లక్ష్మీకల్యాణి, ఆర్ఐ సుజాత, రెవెన్యూ సిబ్బంది పాల్గొని అల్లూరి చిత్రపటానికి నివాళులర్పించారు.

రంగా సేవలు ఎనలేనివి



మైలవరం: కేకు కోస్తున్న నాయకులు

తిరువూరు, న్యూస్‌టుడే: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి తుదిశ్వాస వరకు పోరాడిన దివంగత వంగవీటి మోహన్ రంగా ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలో శుక్రవారం రాధారంగా మిత్రమండలి ఆధ్వర్యంలో జరిగిన వీఎం.రంగా జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని రంగా విగ్రహానికి నివాళులర్పించారు.

గంపలగూడెం: మండల కేంద్రంలో రాధా రంగా మిత్ర మండలి నాయకులు ఆర్.పిచ్చియ్య, సీహెచ్.రామారావు, ఎన్.కృష్ణ, సీహెచ్.కృష్ణ, ఆర్.రామ్మోహన్‌రావు తదితరుల ఆధ్వర్యంలో శుక్రవారం వీఎం.రంగా చిత్రపటానికి నివాళులర్పించి, మిఠాయిలు పంచారు.

మైలవరం: మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహన రంగా జయంతిని పురస్కరించుకుని కాపు సంఘం నాయకులు శుక్రవారం మైలవరంలో రంగా, మదర్ థెరెసా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నాయకులు ఉమామహేశ్వరరావు, ఆజాద్, శ్రీనివాసరావు, సీతయ్యప్రసాద్, రత్తయ్య, డి.శ్రీనివాసరావు, వెంకటనారాయణ, తిరుపతిరావు, పానకాలరావు తదితరులు పాల్గొన్నారు.



గంపలగూడెం: రాధారంగా మిత్ర మండలి ఆధ్వర్యంలో

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: మహిళ మెడలో బంగారు గొలుసును ఇద్దరు దుండగులు లాక్కెళ్లిన ఘటన శుక్రవారం కుదప గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై బి.మోహనరావు తెలిపిన వివరాలు ప్రకారం.. జమలమ్మ తన గేదెలు మేపడానికి ఊరు చివర ఉన్న పొలాలకు తీసుకెళ్లింది. ఈ క్రమంలో 11 గంటల సమయంలో ఇద్దరు యువకులు బైక్‌పై ఆమె వద్దకు వచ్చి తుమ్మలపల్లి రాఘవయ్య పొలం ఎక్కడని అడగ్గా ఆమె వెనుకకు తిరిగి చూపిస్తున్న సమయంలో ఒక్కసారిగా తనను కింద పడేసి మెడలోని సుమారు రూ.లక్ష విలువగల మూడున్నర కాసుల బంగారు నానుతాడు..మంగళ సూత్రాలు లాక్కుని పరారయ్యారు. భయంతో జమలమ్మ కేకలు వేయడంతో చుట్టుపక్కలవారు వచ్చేసరికే దుండగులు వెళ్లిపోయారు. అనంతరం బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో సీసీ కెమెరాల్లో బైక్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులను గమనించి వారే నిందితులై ఉంటారనే కోణంలో విచారణ చేస్తున్నారు.

బురదలో కూరుకుపోయి ఒకరి మృతి

వావిలాల(తిరువూరు): మండలంలోని వావిలాలలో శుక్రవారం పొలం గట్టుపై నడుస్తూ ప్రమాదవశాత్తు దమ్ము చేసిన బురదలో బోర్లా పడి తాటి మోహన్‌రావు(38) మృతి చెందినట్లు ఎస్సై-2 జి.వెంకటేశ్వరరావు తెలిపారు. బురదలో పడినప్పుడు పైకిలేవలేక ఊపిరాడక మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. సంఘటనపై భార్య సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని తిరువూరు ప్రభుత్వ ఆస్పత్రిలో మార్చురీకి తరలించారు. శనివారం పోస్టుమార్టం చేస్తారని తెలిపారు.

తెలంగాణకు చెందిన వ్యక్తుల మధ్య ఘర్షణ

చీమలపాడు(ఎ.కొండూరు), న్యూస్‌టుడే: మండలంలోని చీమలపాడు వద్ద శుక్రవారం రాత్రి తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఇరువర్గాలు ఘర్షణ పడినట్లు తెలిసింది. సంఘటనలో ఒకరి గాయాలవగా విజయవాడ సమీప కార్పొరేట్ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించినట్లు తెలిసింది. ఒక వర్గానికి చెందిన వారిని ఎ.కొండూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఈనాడు ప్రతిభ

https://pratibha.eenadu.net ♦ https://eenadupratibha.net

విద్య, ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

కరెంట్ అఫైర్స్

■ కమ్లా పెర్సాద్ బిస్సెస్సార్ ఇటీవల ఏ దేశ ప్రధాన మంత్రిగా తిరిగి పదవి చేపట్టారు? (ఈమె ఈ దేశానికి తొలి మహిళా ప్రధానిగా 2010 నుంచి 2015 వరకు కొనసాగారు.) **జ:** ట్రినిడాడ్ అండ్ టొబాగో



■ ఇటీవల ఏ రాష్ట్రంలో ఆఫ్రికన్ స్వైన్ ఫీవర్

మాదిరి ప్రశ్నలు

(ఏఎస్ఎఫ్) వ్యాధి బారిన పడి మూడు వేలకు పైగా పందులు చనిపోయాయి? (ఈ మహమ్మారి ఈ రాష్ట్రంలోని సియాహా, లాంగ్ట్లై, లుంగ్లై, మామిట్ అనే నాలుగు జిల్లాలను ప్రభావితం చేసింది.) **జ:** మిజోరాం

■ పండిట్ చతుర్‌లాల్ శత జయంతిని పురస్కరించుకుని తపాలా శాఖ ఇటీవల స్మారక స్టాంపును విడుదల చేసింది. ఈయన ఏ వాయిద్యంలో ప్రసిద్ధులు? **జ:** తబలా

■ పని ప్రదేశంలో భద్రత, ఆరోగ్యం కోసం ప్రపంచ దినోత్సవాన్ని (వరల్డ్ డే ఫర్ సేఫ్టీ అండ్ హెల్త్ ఎట్ వర్క్) ఏటా ఏ రోజున నిర్వహిస్తారు? (రివల్యూషనైజింగ్ హెల్త్ అండ్ సేఫ్టీ: 'ది రోల్ ఆఫ్ ఏఐ అండ్ డిజిటలైజేషన్ ఎట్ వర్క్' అనే థీమ్‌తో ఈ ఏడాది దినోత్సవాన్ని నిర్వహించారు.) **జ:** ఏప్రిల్ 28

మరింత సమాచారం

గడియారాలు

వివిధ రకాల పోటీ పరీక్షల్లో 'గడియారాలు' అనే అధ్యాయం నుంచి తరచూ ప్రశ్నలు వస్తుంటాయి. అవి సాధారణంగా గంటల ముల్లు, నిమిషాల ముల్లును ఆధారంగా చేసుకుని ఉంటాయి. రెండు ముళ్లు ఏ సందర్భంలో ఏకీభవిస్తాయి, ఎప్పుడు వ్యతిరేక దిశలో ఉంటాయి, ఏ సమయంలో లంబ కోణాన్ని ఏర్పరుస్తాయి.. తదితర అంశాలతోపాటు రెండు ముళ్ల మధ్య ఏర్పడే కోణాన్ని కనుక్కోవడంపై కూడా సాధారణంగా ప్రశ్నలు అడుగుతుంటారు.

★ ముళ్ల మధ్య ఉన్న సందర్భాన్నీ కనుక్కోవడానికి కింది సూత్రాన్ని ఉపయోగిస్తారు.

$M = \frac{2}{11}[H \times 30 \pm \theta]$



M = నిమిషాలు

H = ప్రారంభ గంట

θ = రెండు ముళ్ల మధ్య కోణం

గమనిక: ప్రారంభ గంట 12 గా ఉన్నప్పుడు H = 0గా తీసుకోవాలి.

ముళ్ల కదలికలను గుర్తిస్తే మార్కులు!



అందరి జీవితాల్లో గడియారం అనేది అనివార్యమైన భాగం. నిద్ర లేవడం మొదలు రాత్రి పడుకునే వరకు అంతా సమయాన్ని అనుసరించే సాగుతుంది. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం ఆటలు, రాత్రి చదువు అన్నీ టైమ్ ప్రకారం జరుగుతుంటాయి. గడియారం లేకపోతే అంతా గందరగోళంగా ఉంటుంది. అన్ని వేళల్లో అతి ముఖ్యమైన ఆ గడియారంపై పోటీ పరీక్షల రీజనింగ్‌లో ప్రశ్నలు అడుగుతుంటారు. వాటి ఆధారంగా అభ్యర్థుల విశ్లేషణా సామర్థ్యాన్ని అంచనా వేస్తారు. ఈ అధ్యాయంపై పట్టు సాధించాలంటే కొన్ని ప్రాథమిక విషయాలపై దృష్టిపెట్టాలి. ముఖ్యంగా గంటల ముల్లు, నిమిషాల ముల్లు వేగాలను, అవి ప్రయాణించే దూరాలను, వాటి మధ్య కోణాలను అర్థం చేసుకోవాలి. ఎప్పుడు ముళ్లు ఏకీభవిస్తున్నాయి, ఏ సందర్భంలో ఎదురెదురుగా ఉంటున్నాయో లెక్కించడం నేర్చుకోవాలి.

జనరల్ స్టడీస్
రీజనింగ్

మాదిరి ప్రశ్నలు

మోడల్ - 1

1. గడియారంలో 2, 3 గంటల మధ్య రెండు ముళ్లు ఏ సందర్భంలో ఏకీభవిస్తాయి?

1) 3 గంటల $10\frac{10}{11}$ నిమిషాలు

2) 2 గంటల $10\frac{10}{11}$ నిమిషాలు

3) 3 గంటల $11\frac{10}{11}$ నిమిషాలు

4) 2 గంటల $11\frac{10}{11}$ నిమిషాలు

వివరణ: $M = \frac{2}{11}(H \times 30 \pm \theta)$

ప్రారంభ గంట (H) = 2

$M = \frac{2}{11}(2 \times 30^\circ \pm 0^\circ)$

రెండు ముళ్లు ఏకీభవించే సందర్భంలో $\theta = 0^\circ$ గా తీసుకోవాలి.


$M = \frac{2}{11} \times 60 \Rightarrow M = \frac{120}{11}$

$M = 10\frac{10}{11}$ నిమిషాలు

∴ 2 గంటల $10\frac{10}{11}$ నిమిషాల సమయం వద్ద రెండు ముళ్లు ఏకీభవిస్తాయి. **జ: 2**

మోడల్ - 2

రెండు ముళ్లు వ్యతిరేకదిశలో ఉన్న సందర్భంలో కోణం (θ)ని కింది విధంగా తీసుకోవాలి.





★ మొదటి అర్ధభాగ సమయం (12 గంటల నుంచి 6 గంటల సమయం) కు θను $+180^\circ$ గా, రెండో అర్ధభాగ సమయం (6 గంటల నుంచి 12 గంటల సమయం)కు θ ను -180° గా తీసుకోవాలి.

2. గడియారంలో 11, 12 గంటల సమయం వద్ద రెండు ముళ్లు ఏ సందర్భంలో వ్యతిరేక దిశలో ఉంటాయి?

1) 11 గంటల $27\frac{3}{11}$ నిమిషాలు

2) 12 గంటల $17\frac{12}{13}$ నిమిషాలు

3) 11 గంటల $16\frac{2}{3}$ నిమిషాలు

4) 11 గంటల $18\frac{2}{3}$ నిమిషాలు

వివరణ: రెండో అర్ధభాగ సమయం కాబట్టి $\theta = -180^\circ$ గా తీసుకోవాలి.

$M = \frac{2}{11}[H \times 30 \pm \theta]$

$M = \frac{2}{11}[11 \times 30 - 180^\circ]$


$M = \frac{2}{11}[330 - 180] \Rightarrow M = \frac{2}{11}(150)$

$M = \frac{300}{11} \Rightarrow M = 27\frac{3}{11}$ నిమిషాలు.

11 గంటల $27\frac{3}{11}$ నిమిషాల సమయం వద్ద రెండు ముళ్లు వ్యతిరేక దిశలో ఉంటాయి. **జ: 1**

మోడల్ - 3

గడియారంలో ఏ సమయం వద్ద రెండు ముళ్లు లంబంగా ఉంటాయి అన్నప్పుడు ప్రతి ఒక గంట సమయానికి రెండు సార్లు లంబంగా ఉంటాయి. కాబట్టి కోణాన్ని ఈ విధంగా తీసుకోవాలి.





3. గడియారంలో 1, 2 గంటల సమయం వద్ద రెండు ముళ్లు ఏ సందర్భంలో లంబంగా ఉంటాయి?

1) 1 గంట $21\frac{9}{11}$ నిమిషాలు, 2 గంటల $21\frac{9}{11}$ నిమిషాలు.

2) 1 గంట $38\frac{2}{11}$ నిమిషాలు, 1 గంట $16\frac{2}{3}$ నిమిషాలు.

3) 2 గంటల $21\frac{9}{11}$ నిమిషాలు, 2 గంటల $18\frac{3}{11}$ నిమిషాలు.

4) 1 గంట $21\frac{9}{11}$ నిమిషాలు, 1 గంట $38\frac{2}{11}$ నిమిషాలు.

వివరణ: కేస్ − 1: ($\theta = +90$)

$M = \frac{2}{11}[1 \times 30 + 90] \Rightarrow M = \frac{2}{11}[120]$

$M = \frac{240}{11} \Rightarrow M = 21\frac{9}{11}$ నిమిషాలు.

∴ 1 గంట $21\frac{9}{11}$ నిమిషాలు

కేస్ − 2: ($\theta = +180^\circ$)

$M = \frac{2}{11}[1 \times 30 + 180] = \frac{2}{11}[210]$

$= \frac{420}{11} = 38\frac{2}{11}$ నిమిషాలు.

∴ 1 గంట $38\frac{2}{11}$ నిమిషాలు. **జ: 4**

మోడల్ - 4

4. గడియారంలో సమయం 3:40 వద్ద రెండు ముళ్ల మధ్య ఏర్పడే కోణం ఎంత?

1) 130° 2) 135°

3) 180° 4) 175°

వివరణ: H = 3, M = 40

$M = \frac{2}{11}[H \times 30 \pm \theta]$

$40 = \frac{2}{11}[3 \times 30 \pm \theta]$

$40 \times \frac{11}{2} = 90 \pm \theta \Rightarrow 220 = 90 \pm \theta$

$\theta = 220 - 90 \Rightarrow \theta = 130^\circ$

∴ రెండు ముళ్ల మధ్య ఏర్పడే కోణం $\theta = 130^\circ$ **జ: 1**

5. గడియారంలో సమయం 8:15 నిమిషాల వద్ద రెండు ముళ్ల మధ్య ఏర్పడే పరావర్తన కోణం ఎంత?

1) $208\frac{1}{2}^\circ$ 2) $202\frac{3}{4}^\circ$

3) $202\frac{1}{2}^\circ$ 4) $201\frac{1}{2}^\circ$

వివరణ: H = 8, M = 15



$M = \frac{2}{11}[H \times 30 \pm \theta]$

$15 = \frac{2}{11}[8 \times 30 \pm \theta]$

$15 \times \frac{11}{2} = 240 \pm \theta$

$\frac{165}{2} = 240 \pm \theta \Rightarrow 82\frac{1}{2} = 240 \pm \theta$

$\theta = 240 - 82\frac{1}{2}^\circ \Rightarrow \theta = 157\frac{1}{2}^\circ$

పరావర్తన కోణం $(\theta) = 360 - 157\frac{1}{2}^\circ$

$= 202\frac{1}{2}^\circ$ **జ: 3**

మోడల్ - 5

6. గడియారంలో గంటల ముల్లు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు తిరిగినా, అది చేసే కోణం ఎంత?

1) 180° 2) 220° 3) 210° 4) 240°


వివరణ: ఉదయం 8:00 AM నుంచి 3:00 PM మధ్యాహ్నం వరకు మొత్తం 7 గంటలు.

గంటల ముల్లు ఒక గంట సమయానికి చేసే కోణం 30°.

$\therefore 7 \times 30^\circ = 210^\circ$ **జ: 3**

మోడల్ - 6

7. ఒక గడియారం సోమవారం ఉదయం 7 గంటలకు సరైన సమయం చూపించింది. ఆ గడియారం ప్రతి 24 గంటలకు 15 నిమిషాలు కోల్పోతుంది. తర్వాత శుక్రవారం ఉదయం ఆ గడియారం 6 గంటలుగా సమయం చూపిస్తే అప్పుడు సరైన సమయం ఎంత?



1) 6:15 am శుక్రవారం

2) 6:30 am శుక్రవారం

3) 7:00 am శుక్రవారం

4) 7:15 am శుక్రవారం

వివరణ: 24 గంటలకు 15 నిమిషాలు కోల్పోయింది అంటే సమయం 23 గంటల 45 నిమిషాలు

$= 23$ గంటలు $+ \frac{45}{60}$ నిమిషాలు

$= 23\frac{3}{4}$ గంటలు

సోమవారం 7 am నుంచి శుక్రవారం 6 am వరకు 95 గంటలు

$23\frac{3}{4} \rightarrow 24, 95 \rightarrow ?$

$= \frac{95}{\left(\frac{95}{4}\right)} \times 24 = 96$ గంటలు $= 4$ రోజులు

సోమవారం ఉదయం 7 am + 96 గంటలు = శుక్రవారం 7:00 am **జ: 3**



రచయిత: **గోలి ప్రశాంత్ రెడ్డి**

పేరు ఘనం.. నిర్వహణ శూన్యం



గ్యాలరీలో మందుబాబులు, ఆకతాయిలు



శునకాల సంచారం



నగరానికే తలమానికంగా నిలిచే ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం మందుబాబులకు అడ్డాగా మారుతోంది. రాత్రి వేళ మందుబాబులు గ్యాలరీల్లో చేరి మద్యం తాగి ఖాళీ సీసాలను పగలగొట్టి వెళ్లిపోతున్నారు. స్టేడియంలోకి ప్రవేశించే వారిపై పర్యవేక్షణ లేక.. ఆకతాయిలు, మందుబాబులు గోడలు, గేట్లు దూకేసి.. లోపలకు చేరి తిష్ట వేస్తున్నారు. ఉదయం, సాయంత్రం నడకకు వచ్చే మహిళలు, క్రీడాకారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. **- ఈనాడు అమరావతి**

అబ్బురపరిచిన మాక్‌డ్రిల్

రైల్వే సిబ్బందికి అవగాహన

విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: రైలు ప్రమాదం జరిగినప్పుడు రైల్వే సిబ్బంది ఏ విధంగా స్పందించాలి,సకాలంలో ఘటనా స్థలానికి చేరుకునే విధానం, ప్రాణనష్టం జరగకుండా ఏ విధంగా వ్యవహరించాలో శుక్రవారం మెగా మాక్‌డ్రిల్‌లో కళ్లకు కట్టినట్లు చూపించారు. ఎన్‌డీఆర్ఎఫ్, రైల్వే బ్రేక్ డౌన్ సిబ్బంది, రాష్ట్ర ప్రభుత్వ అత్యవసర ప్రతిస్పందన బృందాలు పాల్గొని నిజంగా ప్రమాదం జరిగినట్లు సృష్టించారు. ఆసమయంలో బ్రేక్ డౌన్ సిబ్బంది ప్రమాదస్థలానికి చేరుకొని ఏఆర్‌టీ, ఎంఆర్‌టీ, సేఫ్టీ, ఎస్ అండ్‌టీ, ఆపరేటింగ్, కమర్షియల్ విభాగాల సిబ్బంది పాల్గొని ట్రాక్‌ను క్లియర్ చేయడం, ప్రమాదం జరిగిన ప్రదేశంలో భారీ క్రేన్ల సహాయంతో బోగీలను పక్కకు పెట్టడం, మెడికల్ సిబ్బంది ప్రయాణికులకు ప్రాథమిక చికిత్స అందించడం, కమర్షియల్ సిబ్బంది ప్రయాణికుల వివరాలు సేకరించడం, పౌరసంబంధాల అధికారులు మీడియాకు సమాచారం ఇవ్వడం, అగ్నిమాపక దళం అగ్ని నియంత్రణ, పోలీసు, ఆర్పీఎఫ్ రద్దీని నివారించడం వంటివి ఇందులో చూపించారు. ఈసందర్భంగా దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ సేఫ్టీ ఆఫీసర్ కె.వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ సిబ్బంది అప్రమత్తత కోసం మాక్‌డ్రిల్ నిర్వహించామన్నారు. డీఆర్ఎం నరేంద్ర ఆనందరావు పాటిల్, ఏడీఆర్ఎంలు కొండా శ్రీనివాసరావు, పి.ఇ.ఎడ్విన్‌తో కలిసి పరిశీలించారు. డీఆర్ఎం నరేంద్ర ఆనందరావు పాటిల్, వివిధ విభాగాల అధికారులు ధర్మేంద్రకుమార్, స్వరాజ్‌కుమార్, డాక్టర్ శ్రీనివాస సత్యనారాయణ, బి.ప్రశాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రమాదానికి గురైన బోగీలను తొలగిస్తూ..

ఈ పాపం.. జగన్ సర్కారుదే

చంద్రిక అయోధ్య అపార్ట్‌మెంట్ బాధితుల గగ్గోలు

అదనంగా చెల్లించాలని కొనుగోలుదారులపై దౌర్జన్యం

ఈనాడు, అమరావతి, గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే

గన్నవరం పట్టణ శివారులోని 'చంద్రిక అయోధ్య' గృహ సముదాయం వివాదం ముదురుతోంది. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్నామంటూ ప్రకటించిన రాకీ అవెన్యూస్ సంస్థ తమను అడ్డంగా ముంచేసి మాయమైందని.. ఆ స్థానంలో వైకాపా నేత వల్లభనేని వంశీ అనుచరుడు గుర్రం నాని పాగా వేసి తమను తీవ్రంగా వేధిస్తున్నట్లు వాపోతున్నారు. తాము మొత్తం డబ్బులు చెల్లించేసినా ఫ్లాట్లు అప్పగించకుండా రకరకాలుగా ఆర్థిక భారం మోపి ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ తెలిపారు. దీనిపై బాధితులు పోలీసులను ఆశ్రయించేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే చాలామంది రెరాలోనూ ఫిర్యాదు చేశారు. మంత్రి నారా లోకేశ్‌కు ఒక్కొక్కరిగా వెళ్లి కలిసి తమ బాధలు చెప్పుకుని న్యాయం చేయమంటూ వేడుకుంటున్నారు.



గన్నవరం శివారులోని చంద్రిక అయోధ్య గృహసముదాయం

వల్లభనేని వంశీ అనుచరుడి పాగా..

2017లో దాదాపు 14 మంది రైతులకు చెందిన 10.5 ఎకరాల భూమిని రాకీ అవెన్యూస్ సంస్థ తీసుకుంది. 65:35 శాతం భాగస్వామ్యంతో ఒప్పందం చేసుకుంది. 670 ఫ్లాట్లతో కూడిన గృహసముదాయ నిర్మాణం ఆరంభించింది. 2019 వరకు పనులు వేగంగానే జరిగాయి. కానీ వైకాపా ప్రభుత్వం గద్దెనెక్కాక పరిస్థితి దారుణంగా మారిపోయింది. ప్రభుత్వ విధానాలతో ఇసుక ఇతర సామగ్రి దొరకక నిర్మాణాలు కుంటుపడ్డాయి. రాకీ సంస్థ ఆర్థికంగా దివాలా తీసింది. అప్పటి నుంచి 2021 వరకు నిర్మాణ పనులు పూర్తిగా నిలిపేసింది. 2021 డిసెంబరు 6న రాకీ సంస్థను పూర్తిగా తప్పించేశారు. వైకాపా సర్కారు అధికారంలో ఉండడం, స్థానికంగా వల్లభనేని వంశీ చక్రం తిప్పడంతో గుర్రం నాని.. చంద్రిక అయోధ్య అపార్ట్‌మెంట్లను హస్తగతం చేసుకున్నారు. భూమిలిచ్చిన వారిలో నాని కూడా ఉండడంతో ఇదే సాకుగా చూపించి మొత్తంగా పాగా వేశారు.

కొన్నవాళ్లకు కష్టాలు..

ఈ ఫ్లాట్లకు సంబంధించిన కొనుగోలుదారులు పూర్తిగా డబ్బులు చెల్లించి మరీ రాకీ అవెన్యూస్ సంస్థతో ఒప్పందం చేసుకున్నారు. వారి ఒప్పందాలతో గుర్రం నానికి ఎలాంటి సంబంధం లేదు. అందుకే గట్టిగా అడిగితే నాకేం సంబంధం, వెళ్లి ఎవరితో ఒప్పందం చేసుకున్నారో వాళ్లనే అడగమంటూ దౌర్జన్యం చేస్తున్నారని, బూతులు తిడుతూ వెళ్లగొడుతున్నారంటూ కొనుగోలుదారులు వాపోతున్నారు. తాము వెళ్లినా బయట సిబ్బందిని పెట్టి, గేటు దాటి లోపలికి రానివ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు.

☛ చంద్రిక అపార్ట్‌మెంట్లలో కొనుగోలు చేసిన వారిలో చాలా మంది విజయవాడ, హైదరాబాద్‌తో పాటు విదేశాల్లోనూ ఉన్నారు. వారంతా పూర్తిగా డబ్బులు చెల్లించినప్పటికీ ఇంతవరకూ ఫ్లాట్లు కేటాయించలేదు. అదనంగా ఇంకా చెల్లించాలంటూ డిమాండ్ చేస్తున్నారని వాపోతున్నారు.

☛ ప్రస్తుతం అపార్ట్‌మెంట్ల నిర్మాణానికి భూములు ఇచ్చిన మిగతా రైతులు కూడా తమకు అన్యాయం జరిగిందని, ఒప్పందం చేసుకున్న రాకీ అవెన్యూస్ సంస్థ యజమాని కనిపించకుండాపోయి, తమను మోసం చేశారంటూ గగ్గోలు పెడుతున్నారు.

☛ చంద్రిక అయోధ్య అపార్ట్‌మెంట్లకు ఆనుకునే మరో ఐదెకరాల భూమిని రాకీ అవెన్యూస్ సంస్థ అభివృద్ధికి తీసుకుంది. ఇక్కడ ఫేజ్ 02 కింద అపార్ట్‌మెంట్లను ఆరంభించింది. దాదాపు వంద మంది వరకూ ఈ ఫ్లాట్ల కోసం ఒప్పందాలు చేసుకుని డబ్బులు చెల్లించారు. వైకాపా గద్దెనెక్కే సమయానికి ఇవి పిల్లర్ల దశలో ఉన్నాయి. ఇప్పటికీ అక్కడే ఆగిపోయాయి. కొనుగోలుదారులు లబోదిబోమంటున్నారు.

రంగా ఆశయ సాధనకు కృషి చేద్దాం

కృష్ణలంక, న్యూస్‌టుడే: రంగా ఆశయాల సాధనకు కృషి చేద్దామని ఎంపీ కేశినేని శివనాథ్ పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహన రంగా జయంతి పురస్కరించుకుని రాధారంగ మిత్రమండలి ఆధ్వర్యంలో రాణిగారితోటలో ఏర్పాటు చేసిన ఆయన విగ్రహాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీ శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివనాథ్ మాట్లాడుతూ నిస్వార్థంగా ప్రజలకు సేవ చేసిన నాయకులు ప్రజల గుండెల్లో నిలిచి ఉంటారనడానికి రంగా జీవితమే ఉదాహరణ అన్నారు. రంగా ఒక శక్తి అని, అందరికీ చెందిన ప్రజా నాయకుడని పేర్కొన్నారు. కూటమి గెలుపులో మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ కీలకపాత్ర పోషించారని, భవిష్యత్తులో ఆయనకు సముచిత స్థానం లభిస్తుందన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయే నాయకుడు మోహనరంగా అన్నారు. వంగవీటి రాధాకృష్ణ మాట్లాడుతూ రంగా తుది శ్వాస వరకు పేదలకు అండగా నిలిచారన్నారు. జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు సామినేని ఉదయభాను, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొప్పన భవకుమార్, రాధ రంగ మిత్ర మండలి నాయకులు పాల్గొన్నారు.



విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడుతున్న ఎంపీ శివనాథ్, చిత్రంలో ఎమ్మెల్యే రామ్మోహన్, రాధాకృష్ణ, ఉదయభాను

నమ్మించాడు.. నిలువునా ముంచాడు

వెలుగులోకి కిరణ్ అక్రమాలు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే

విజయవాడ కేంద్రంగా యూపిక్స్ సినిమా యానిమేషన్ పేరుతో జనాన్ని నిలువునా ముంచిన నిందితుడు నిడమోలు కిరణ్ అక్రమాలు ఇంకా బయట పడుతున్నాయి. సంస్థలో పెట్టుబడి పెడితే రెట్టింపు లాభాలు వస్తాయని రాష్ట్ర వ్యాప్తంగా రూ.500 కోట్లకుపైగా కొల్లగొట్టిన విషయం తెలిసిందే. సినిమాలకు యానిమేషన్ సాఫ్ట్‌వేర్ అందిస్తుంటానని, రూ.లక్ష చెల్లిస్తే.. ఏడాదిలో రూ.లక్ష లాభం అంటూ వ్యాపారులు, ఉద్యోగులను నమ్మించి రూ.కోట్లలో వసూలు చేశాడు. అతని మాటలు నమ్మి విజయవాడతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా వందల సంఖ్యలో బాధితులు మోసపోయారు. నాలుగు నెలల కిందట సత్యనారాయణపురంలో సంస్థ ప్రధాన కార్యాలయాన్ని ఎత్తివేసి తప్పించుకొని తిరుగుతున్న కిరణ్‌ను రెండు నెలల కిందట ప్రకాశం జిల్లా పోలీసులు వేరే రాష్ట్రంలో అరెస్టు చేశారు. 300కుపైగా బాధితులు ఉన్నట్లు పోలీసుల విచారణలో బయటపడింది. పైగా విజయవాడతో పాటు హైదరాబాద్‌లో భారీగా ఆస్తులు కొన్నట్లు గుర్తించారు.

☛ నెలన్నర కిందట హైదరాబాద్ నుంచి ఓ న్యాయవాది బాధితులకు ఫోన్లు చేశారు. కిరణ్ వసూలు చేసిన డబ్బు అంతా ఇస్తాడని, తొందర పడి కేసులు పెట్టవద్దని నమ్మించారు. డబ్బులు వస్తాయని ఆశగా ఎదురుచూసిన బాధితులకు షాక్ ఇచ్చాడు. కొద్దిరోజులకే అందరికీ కోర్టు నుంచి ఐపీ నోటీసులు పంపాడు. విజయవాడలో నమోదైన కేసుల్లో సుమారు రూ.20 కోట్లకు పైగా వసూలు చేసినట్లు సత్యనారాయణపురంలోని ఓ ప్రైవేటు బ్యాంకు లావాదేవీల ద్వారా తేలింది. ఒక్క నరసరావుపేటలోనే సుమారు రూ.300 కోట్లు వసూలు చేసినట్లు ప్రకాశం జిల్లా పోలీసుల విచారణలో బయటపడింది. అక్కడ ఒక రైస్‌మిల్లు యజమానే రూ.70 కోట్లు చెల్లించారు.

భారీగా ఆస్తులు కొనుగోలు చేసి..

బాధితుల నుంచి వసూలు చేసిన డబ్బుతో భారీగా ఆస్తులు కొనుగోలు చేశారు. వాటిని విక్రయిస్తే బాధితులకు న్యాయం జరుగుతుందా? అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. ఆస్తులను నిందితుడు, అతని భార్య పేరుతో కాకుండా దూరపు బంధువుల పేర్లతో కొన్నట్లు విచారణలో తెలిసింది. ప్రస్తుతం వాటి విలువ రూ.కోట్లలోనే ఉంటుందని సమాచారం. అతడిపై విజయవాడలో కేసులు పెట్టింది ఆరుగురే. ఆదాయపు పన్ను ఇబ్బందులు వస్తాయని మిగిలిన వారు కేసులు పెట్టడానికి వెనుకడుగు వేశారు. వారు ఇచ్చింది సుమారు రూ.50 కోట్లు ఉంటుందని చెబుతున్నారు.

★ ఈ కేసును సీఐడీకి అప్పగిస్తేనే న్యాయం జరుగుతుందని బాధితులు భావిస్తున్నారు. ఇప్పటికే తమకు జరిగిన మోసాన్ని సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లారు. అతని బారిన పడ్డ వారిలో మాజీ పోలీసు అధికారులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులు ఉన్నారు.

జాతీయ లోక్‌అదాలత్ నేడు

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ నెల 5న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న జిల్లా జడ్జి గుత్తాల గోపి అన్నారు. ఉమ్మడి కృష్ణా పరిధిలోని మచిలీపట్నం, విజయవాడ, గుడివాడ, నూజివీడు, నందిగామ, అవనిగడ్డ, కైకలూరు, గన్నవరం, తిరువూరు, జగ్గయ్యపేట, బంటుమిల్లి, మైలవరం, ఉయ్యూరు, మొవ్వ ఇలా అన్ని కోర్టుల్లోనూ లోక్‌అదాలత్ జరుగుతుందన్నారు. దీని కోసం అన్ని కోర్టుల్లో కలిపి 44 బెంచ్‌లు ఏర్పాటు చేశామన్నారు. రాజీపడదగిన సివిల్, క్రిమినల్, చెక్‌బౌన్స్, మోటారువాహన ప్రమాద క్లైమ్‌లు సహా మొత్తం 14,100 కేసులు లోక్‌అదాలత్‌కు రిఫర్ చేసినట్లు పేర్కొన్నారు. కక్షిదారులు అందరూ వినియోగించుకోవాలని కోరారు.

స్టాంప్ పత్రాలు ఏమయ్యాయ్..?

అనుమానితుల ఇళ్లలో తనిఖీ

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: గన్నవరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో చోరీకి గురైన విలువైన స్టాంప్ పత్రాలు ఏమయ్యాయనే కోణంలోనే పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. రూ.13.56 లక్షల విలువైన స్టాంప్ పత్రాల చోరీ ఇంటి దొంగల పనే అయి ఉంటుందని భావిస్తున్నారు. అందుకే అనుమానితులతోపాటు, కార్యాలయ సిబ్బందికి చెందిన ఇళ్లలో కూడా తనిఖీ చేపట్టారు. పరిసరాల్లో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా నిందితులను ఆరా తీస్తున్నారు. కార్యాలయంలోకి మొత్తం ముగ్గురు దుండగులు చొరబడినట్లు ప్రాథమికంగా గుర్తించారు. దుండగులు రెయిన్‌కోట్, ఫేస్ మాస్క్, చేతికి గ్లౌజ్‌లు పెట్టుకోవడంతో గుర్తించడం కష్టంగా మారుతోంది. ఈ దుండగులు ఎవరు, ఎక్కడి నుంచి వచ్చారనే దానిపైనే విచారణ చేస్తున్నారు. గన్నవరం సబ్‌రిజిస్ట్రార్ ప్రసాద్‌తో పాటు కార్యాలయ సిబ్బందిని స్టేషన్‌కు పిలిపించి అనుమానితుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యాలయం వెలుపల ఉన్న సీసీ కెమెరాలు పనిచేయక పోవడంతో.. దీనిపైనా దృష్టిసారించారు. ముందుగానే పక్కా ప్రణాళికతో ఈ చోరీ చేసినట్లు అర్థమవుతోంది.

ఇరాన్ అణుకేంద్రాలపై దాడిలో పాల్గొన్న

రెండో ‘గబ్బిలం’ ఏదీ?



ఇంటర్నెట్ డెస్క్: ఇరాన్‌లోని అణుకేంద్రాలే లక్ష్యంగా గగనతల దాడులు చేసిన ఇజ్రాయెల్‌కు ప్రత్యక్ష మద్దతునిస్తూ.. కీలకమైన ఫోర్డో, నటాంజ్ స్థావరాలపై అమెరికా బంకర్ బస్టర్లను ప్రయోగించింది. ఇందుకోసం బి-2 స్పిరిట్ యుద్ధ విమానాలను వినియోగించింది. ఈ ఆపరేషనులో తాజాగా మరో ఉత్కంఠ రేకెత్తింది. అమెరికా ప్రయోగించిన రెండు యుద్ధ విమానాల్లో ఒకటి తిరిగి ఎయిర్‌బేస్‌కు చేరుకోగా.. రెండోది ఎక్కడుందన్న దానిపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఆపరేషనులో భాగంగా జూన్ 21న అమెరికా రెండు గ్రూపులుగా మిసోరీ వైట్‌మ్యాన్ ఎయిర్‌ఫోర్స్ బేస్ నుంచి బి-2 బాంబర్లను ప్రయోగించింది. అందులో ఒకటి ఇరాన్ రక్షణ వ్యవస్థను తప్పుదోవ పట్టించేలా పసిఫిక్ మహాసముద్రానికి పశ్చిమభాగం వైపుగా దూసుకెళ్లింది. వెనువెంటనే 7 బంకర్ బస్టర్లతో మరో యుద్ధ విమానం ఫోర్డో, నటాంజ్ అణు కేంద్రాలపై దాడి చేసింది. ఈ మేరకు ‘యూరేషియన్ టైమ్స్’ జూన్ 27న కథనం వెలువరించింది. ఆపరేషను ముగించుకొని 37 గంటల సుదీర్ఘ ప్రయాణం తర్వాత ఓ విమానం తిరిగి వచ్చింది. మరో విమానంపై స్పష్టత కొరవడింది. ఇది పసిఫిక్ మహాసముద్రానికి పశ్చిమంగా ప్రయాణించి అమెరికాకు చెందిన హవాయి దీవులంలో ఎమర్జెన్సీ ల్యాండింగు అయినట్లు వినిపిస్తున్నా.. స్పష్టమైన ఆధారాలు లేవు. అంతేకాకుండా బి-2 విమానాన్ని అటువైపుగా ఎందుకు మళ్లించాల్సి వచ్చిందన్న కారణాలు తెలియరాలేదు. ఒకవేళ అది పునర్వినియోగానికి సిద్ధంగా ఉందా?.. లేదా వ్యవస్థలన్నీ విఫలమయ్యాయా? అన్నదీ స్పష్టత లేదు. మరోవైపు.. ఇరాన్ భూభాగంలోనే కుప్పకూలిపోయిందన్న వాదనలు కూడా వినిపిస్తున్నాయి.

బి-2 బాంబర్ల ప్రత్యేకత :

రెక్కలు చాచిన గబ్బిలంలాంటి ఆకారం బి-2 స్పిరిట్ యుద్ధ విమానాల ప్రత్యేకత. ప్రత్యర్థి గగనతల రక్షణ వ్యవస్థలను ఏమారుస్తూ గుట్టుచప్పుడు కాకుండా వచ్చి.. లక్ష్యాలను ఛేదించగలదు. ప్రచ్ఛన్నయుద్ధ కాలంలో.. ఘర్షణలు చెలరేగితే సోవియట్ యూనియన్ గగనతలంలోకి చొచ్చుకుపోయి అణ్వస్త్రాలను జారవిడిచేందుకు బి-2 బాంబర్ ప్రాజెక్టును 1980లలో అమెరికా చేపట్టింది. నార్తాప్ గ్రుమన్ సంస్థకు ఆ బాధ్యతను అప్పగించింది. ఈ బాంబరు బలమైన ప్రత్యర్థి గగనతలంలోకి ప్రవేశించాల్సి ఉన్నందువల్ల అక్కడి రాడార్లు, గగనతల రక్షణ వ్యవస్థలను ఏమార్చేందుకు వినూత్న డిజైను, స్టెల్త్ పరిజ్ఞానంతో ఆ సంస్థ దీన్ని రూపొందించింది.

బ్రిటన్ యుద్ధ విమానం

ఎఫ్-35.. అంటే జోక్ కాదు!

- ప్రతి బోల్టుకూ ఓ సెక్యూరిటీ కోడ్



ఇంటర్నెట్ డెస్క్: సాంకేతిక కారణాలతో కేరళలోని తిరువనంతపురం విమానాశ్రయంలో నిలిచిపోయిన బ్రిటన్ రాయల్ నేవీకి చెందిన యుద్ధ విమానం ఎఫ్-35బీ మీద మనవాళ్లు బోలెడు మీమ్స్, జోకులు సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. వాస్తవానికి ఈ విమానం అత్యాధునిక యుద్ధరంగంలో ఓ వజ్రాయుధం లాంటిది. ఇటీవల ఇరాన్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థల కళ్లుగప్పి టెహ్రాన్‌పై దాడులు చేసినవాటిలో ఈ రకం విమానాలూ ఉన్నాయి. ఈ జెట్ తయారీలో వాడిన ప్రతిఒక్క పరికరాన్నీ దాని గోప్యతను కాపాడేలా చూసుకొన్నారు. ఇంత సంక్లిష్ట నిర్మాణం కాబట్టే.. మరమ్మతులు అంత తేలిగ్గా జరిగే పని కాదు. ఇప్పుడు ఇందులోని కొన్ని భాగాలను విడదీసి భారీ విమానంగా పేరున్న సీ-17 గ్లోబ్ మాస్టర్‌లోకి ఎక్కించి మరమ్మతులకు తరలించనున్నారు. ఇది కేవలం లాక్‌హీడ్ మార్టిన్ ఇంజినీర్లకే సాధ్యం. దీనిని విడగొట్టే సమయంలో రహస్య సమాచారం బయటకు పొక్కకుండా బ్రిటన్ జాగ్రత్తలు తీసుకుంటోంది. విడగొట్టే క్రమంలో ప్రతి చర్యను రికార్డుల్లో నమోదు చేసి సరిచూస్తారు. ఈ జెట్ నుంచి డేటా లీక్ కాకుండా ప్రతి బోల్టుకు సెక్యూరిటీ కోడ్‌ను ఇస్తారు. దీని స్టెల్త్ టెక్నాలజీ లీకైతే అది బ్రిటన్ యుద్ధ రహస్యాలకు సమస్యగా మారడంతోపాటు దౌత్యపరమైన చిక్కులు తీసుకొస్తుంది. ఎఫ్-35లు దళాల్లోకి వచ్చాక తొలిసారి 2019లో ఫ్లోరిడాలోని ఎగ్లిన్ బేసులో దీని రెక్కలను విడదీశారు. అప్పుడూ సి-17 గ్లోబ్‌మాస్టర్‌ను వాడారు. 2 లక్షల డాలర్ల వ్యయం, నాలుగేళ్ల కృషితో ఈ తరలింపు ప్రాజెక్టును పూర్తి చేశారు. ఈ విమాన ప్రయాణాన్ని గోప్యంగా ఉంచేందుకు దీని బాడీపై ప్రత్యేక కోటింగు, రాడార్ బ్లాకర్లు ఉన్నాయి. ఇవి కృత్రిమమేధ, డేటా ఫ్యూజన్ వ్యవస్థలు, ఎన్‌క్రిప్టెడ్ సాఫ్ట్‌వేర్లు, సెన్సర్లను వాడుకొంటాయి. ఈ విమానం అణ్వాయుధాలను కూడా ప్రయోగించగలదు. ఈ యుద్ధ విమానం రూపకల్పనకు 1.7 ట్రిలియన్ డాలర్లు ఖర్చయ్యాయి. దాదాపు 20 ఏళ్ల సమయం పట్టింది.

✦ బ్రిటన్‌కు చెందిన విమాన వాహకనౌక క్వీన్ ఎలిజబెత్ నుంచి ఎఫ్-35బీ శ్రేణి విమానం గతంలో మధ్యధరా సముద్రంలో పడిపోయింది. నాడు పైలట్ మాత్రం సురక్షితంగా బయటపడ్డారు. దీని శకలాలను చైనా, రష్యా దళాలు ఎక్కడ స్వాధీనం చేసుకొని స్టెల్త్ టెక్నాలజీని అపహరిస్తాయో అనే భయంతో ఆగమేఘాల మీద గాలింపు చర్యలు చేపట్టాల్సి వచ్చింది. ప్రచ్ఛన్నయుద్ధ సమయంలో ఇలా సముద్రంలో మునిగిపోయిన ఆయుధాలను రష్యన్లు, అమెరికన్లు స్వాధీనం చేసుకొని ఆ టెక్నాలజీని కాపీ కొట్టిన సందర్భాలున్నాయి.

నీట్-యూజీ 2025 ఫలితాలు సవరించాలన్న పిటిషన్ కొట్టివేత

దిల్లీ: ప్రశ్నాపత్రంలోని ఒక ప్రశ్నలో తప్పు ఉందని పేర్కొంటూ నీట్-యూజీ 2025 ఫలితాలను సవరించాలని కోరిన పిటిషన్‌ను శుక్రవారం సుప్రీం కోర్టు కొట్టివేసింది. రెండు రోజుల క్రితం కూడా ఇటువంటి పిటిషనే తమ ముందుకు రాగా తిరస్కరించామని జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ ఆర్.మహదేవన్ ధర్మాసనం తెలిపింది. ‘‘ఒక ప్రశ్నకు బహుళ సమాధానాలు ఉండే అవకాశాన్ని మేం నిరాకరించడం లేదు. అయితే, లక్షల మంది అభ్యర్థులతో కూడిన పరీక్షలో జోక్యం చేసుకోదలచుకోలేదు. ఇది ఏ ఒక్కరి వ్యవహారమో కాదు. వేల మంది విద్యార్థులపై దీని ప్రభావం ఉంటుంది’’ అని ధర్మాసనం పేర్కొంది. ప్రశ్నాపత్రంలోని తప్పును సరిదిద్ది ఫలితాలను మళ్లీ ప్రకటించాలని పిటిషనర్ కోరారు. నీట్-యూజీ ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రక్రియపై నిలుపుదల (స్టే) ఉత్తర్వులివ్వాలని కూడా విజ్ఞప్తి చేశారు.

సీయూఈటీ- యూజీ ఫలితాలు విడుదల

- నాలుగు సబ్జెక్టుల్లో 100 శాతం సాధించిన విద్యార్థి

దిల్లీ: ఉమ్మడి విశ్వవిద్యాలయాల పరీక్ష(సీయూఈటీ-యూజీ) ఫలితాలు విడుదలయ్యాయి. జాతీయ పరీక్షల మండలి(ఎన్టీఏ) శుక్రవారం వీటిని వెల్లడించింది. ఫలితాల్లో కేవలం ఒక విద్యార్థి మాత్రమే నాలుగు సబ్జెక్టుల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాడని తెలిపింది. 2025-2026 విద్యా సంవత్సరానికిగాను 37 సబ్జెక్టులపై సీయూఈటీ- యూజీ పరీక్షను నిర్వహించగా... 13,54,699 మంది విద్యార్థులు హాజరయ్యారు. ‘‘ఒక విద్యార్థి మాత్రమే ఐదు సబ్జెక్టుల్లో నాలుగింటిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. మూడు సబ్జెక్టుల్లో 17 విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణులయ్యారు. రెండు సబ్జెక్టుల్లో 150 మంది, ఒకే సబ్జెక్టులో 2,679 మంది నూటికి నూరుశాతం ఫలితాలు వచ్చాయి’’ అని ఎన్టీఏ సీనియర్ అధికారులు తెలిపారు.

ఇజ్రాయెల్ దాడుల్లో మరో 35 మంది పాలస్తీనియన్ల మృతి

డెయిర్ అల్ బలాహ్: గాజాలో ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో శుక్రవారం 35 మంది పాలస్తీనియన్లు మృతి చెందినట్లు ఇక్కడి ఆసుపత్రి వర్గాలు పేర్కొన్నాయి. వైమానిక దాడుల్లో 15 మంది మరణించగా, దక్షిణ గాజాలో సహాయ పంపిణీ కేంద్రాల దగ్గర జరిగిన కాల్పుల్లో మరో 20 మంది మృతి చెందారు. తాజా మరణాలతో గాజాలో మృతుల సంఖ్య 57 వేలు దాటింది. గాజా హ్యూమానిటేరియన్ ఫౌండేషన్(జీహెచ్ఎఫ్) నిర్వహిస్తున్న పంపిణీ కేంద్రాల దగ్గర మే నుంచి జరిపిన కాల్పుల్లో మొత్తం 613 మంది ప్రాణాలు కోల్పోయారని ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల కార్యాలయం (యూఎన్‌హెచ్ఆర్ఓ) ప్రకటించింది.

బిహార్‌లో 5 లక్షల మందికి ఉచిత శ్యానిటరీ న్యాప్‌కిన్లు

- ప్రకటించిన కాంగ్రెస్

పట్నా: బిహార్‌లో 5 లక్షల మంది మహిళలకు ఉచితంగా శ్యానిటరీ న్యాప్‌కిన్లు పంపిణీ చేయనున్నట్లు కాంగ్రెస్ శుక్రవారం ప్రకటించింది. పట్నాలోని సదాకత్ ఆశ్రమంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్ కుమార్ ప్రకటించారు. ఇండియా కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయబోయే నెలకు రూ.2500 స్టైఫండ్ పథకానికి అనుగుణంగా ఈ కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు.

మణిపుర్‌లో భారీగా ఆయుధాలు, పేలుడు సామగ్రి స్వాధీనం

ఇంఫాల్: మణిపుర్‌లో భద్రతా బలగాలు భారీగా ఆయుధాలు, పేలుడు సామగ్రిని స్వాధీనం చేసుకున్నాయి. టెంగ్నౌపాల్, కాంగ్‌పోక్పి, చందేల్, చురాచంద్‌పుర్ జిల్లాల్లోని వివిధ ప్రదేశాల్లో గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు ఆపరేషన్ నిర్వహించినట్లు ఏడీజీపీ లారి డోర్జి లాటూ పేర్కొన్నారు. రెండు వందలకు పైగా వివిధ రకాల ఆయుధాలు, 30 ఐఈడీలు, 109 రకాల మందుగుండు సామగ్రి, 10 గ్రెనేడ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

పాక్-రష్యాల మధ్య రైలు మార్గానికి అంగీకారం

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌ను తమ దేశంతోపాటు మధ్యాసియా దేశాలతో అనుసంధానించే బలమైన రైలు, రోడ్డు నెట్‌వర్క్ ఏర్పాటులో సహకారం అందించేందుకు రష్యా అంగీకరించింది. ఈ మేరకు ఇరుదేశాల మధ్య అంగీకారం కుదిరింది. రష్యాతో కుదిరిన ఒప్పందం తమ దేశాన్ని ఒక వ్యూహాత్మక అంతర్జాతీయ రహదారి కూడలిగా మారుస్తుందని పాకిస్థాన్ కమ్యూనికేషన్ల మంత్రి అబ్దుల్ అలీం అన్నారు. చైనాలోని టియాన్‌జిన్‌లో జరిగిన షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సీఓ) మంత్రిత్వ స్థాయి సమావేశం సందర్భంగా ఆయన ఈ విషయం వెల్లడించారు. ప్రపంచ దేశాలతో వాణిజ్య, ఆర్థిక అనుబంధం పెంపొందించుకునేందుకు తాము కృషి చేస్తున్నామన్నారు. పాకిస్థాన్ చేపట్టిన ఆధునీకరణ చర్యల్ని ఆయన ప్రస్తావించారు. ఇందులో భాగంగానే రవాణా మౌలిక సదుపాయాలను డిజిటీకరించామని, ఎలాంటి అవరోధాల్లేని మోటార్‌వేల ఏర్పాటు, ఈ-ట్యాగింగ్, సీసీటీవీ నిఘా వంటి అనేక చర్యలుచేపట్టామన్నారు. పాకిస్థాన్, రష్యాల మధ్య సహకారం ప్రాంతీయ వాణిజ్య సమీకరణలను మార్చివేస్తాయని రష్యా ఉప మంత్రి నికిటిన్ అన్నారు.

భక్తుడిగానే మాట్లాడా: రిజిజు

దిల్లీ: టిబెట్ ఆధ్యాత్మిక గురువు దలైలామా వారసుడి ఎంపిక అంశంలో చైనా వ్యాఖ్యలపై స్పందించిన కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు... ‘‘నేను భారత ప్రభుత్వం తరపున గాని, చైనాకు వ్యతిరేకంగా గానీ మాట్లాడలేదు. కేవలం ఓ భక్తుడిగా మాత్రమే మాట్లాడాను. దలైలామాపై నమ్మకం ఉన్న వాళ్లు రాబోయే వారసుడిని ఆయనే నిర్ణయించాలని కోరుకుంటారు’’ అని స్పష్టతనిచ్చారు.

రేపు దలైలామా పుట్టినరోజు వేడుక

దలైలామా తన 90 పుట్టినరోజును ఈ నెల 6న జరుపుకోనున్నారు. ఈ సందర్భంగా హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాలలో జరగనున్న వేడుకలకు ప్రముఖ హాలీవుడ్ నటుడు రిచర్డ్ గేర్, కేంద్ర మంత్రి రిజిజు హాజరుకానున్నారు. శనివారం జరగనున్న ‘సామూహిక ప్రార్థన’ కార్యక్రమంలో దలైలామా పాల్గొననున్నారు. సాయంత్రం ‘4 రివర్స్ 6 రేంజెస్’ అనే చిత్రాన్ని ప్రదర్శించనున్నారు.

హిందీ వ్యతిరేక నిరసన.. మహారాష్ట్రలో ప్రొఫెసర్‌పై కేసు

ముంబయి: పాఠశాల స్థాయిలో హిందీని తృతీయ భాషగా ప్రవేశపెట్టాలన్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ గత నెలలో చేపట్టిన నిరసనలో పాల్గొన్న ముంబయి యూనివర్సిటీ ప్రొఫెసర్ దీపక్ పవార్‌పై కేసు నమోదైంది. ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో హిందీపై ఉత్తర్వులను మహారాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకున్నప్పటికీ కేసును కొనసాగించడం విశేషం. నిరసనలో పాల్గొన్న రాజకీయ నాయకుల పేర్లను మాత్రం ఈ కేసులో చేర్చలేదు. అనుమతి లేకుండా గుమిగూడినందునే నిరసనకారులపై కేసులు నమోదు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కమ్లా.. బిహార్ ముద్దుబిడ్డే: మోదీ

పోర్ట్ ఆఫ్ స్పెయిన్: అయోధ్యలోని సరయూ నది జలాలు, రామమందిరం ప్రతిమ, మహాకుంభమేళా జలాలను ట్రినిడాడ్ అండ్ టొబాగో ప్రధాని కమ్లా పర్సాద్-బిసెసర్‌కు మోదీ అందజేశారు. 1999 తర్వాత ట్రినిడాడ్ అండ్ టొబాగోలో భారత ప్రధాని తొలి ద్వైపాక్షిక పర్యటన ఇదే. ఈ సందర్భంగా భారత సంతతి ప్రజలతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో మోదీ మాట్లాడుతూ..ట్రినిడాడ్ అండ్ టొబాగోకు బిహార్‌తో ఉన్న సంబంధాలను ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రధాని కమ్లా పర్సాద్-బిసెసర్ పూర్వీకులు ఆ రాష్ట్రం నుంచే వచ్చారని గుర్తుచేశారు. భారతీయులు ఆమెను బిహార్ ముద్దుబిడ్డగా పరిగణిస్తుంటారని చెప్పారు. ఆ రాష్ట్ర వారసత్వం భారత్‌కే కాకుండా యావత్ ప్రపంచానికి గర్వకారణమని వ్యాఖ్యానించారు. ప్రపంచంలోని అత్యంత గౌరవనీయ, దార్శనిక నాయకుల్లో మోదీ ఒకరంటూ కమ్లా పర్సాద్-బిసెసర్ భారత ప్రధానిపై ప్రశంసల వర్షం కురిపించారు. ట్రినిడాడ్ అండ్ టొబాగో అధ్యక్షురాలు క్రిస్టైన్ కర్లా కంగలూ పూర్వీకులు తమిళనాడుకు చెందినవారే. ఈ ఆత్మీయ భేటీలో ట్రినిడాడ్ అండ్ టొబాగో ప్రధానమంత్రి కమ్లా పర్సాద్-బిసెసర్ కూడా పాల్గొన్నారు. మరోవైపు ద్వైపాక్షిక చర్చల్లో భాగంగా మౌలిక, ఔషధ సహా వివిధ రంగాల్లో పరస్పరం సహకరించుకునేందుకు ట్రినిడాడ్ అండ్ టొబాగో-భారత్ ప్రధానులు నిర్ణయించారు. ఇందులో భాగంగా ఇరు దేశాలు ఆరు ఒప్పందాలను కుదుర్చుకున్నాయి. అనంతరం తన ట్రినిడాడ్ అండ్ టొబాగ్ పర్యటనను ముగించుకున్న ప్రధాని మోదీ శుక్రవారం అర్జెంటీనాకు బయలుదేరి వెళ్లారు.



కమ్లా పర్సాద్-బిసెసర్‌కు సరయూ నదీజలాల పాత్రను బహూకరిస్తున్న మోదీ

సోహరీ ఆకుపై ఆహారం వడ్డన



ట్రినిడాడ్ అండ్ టొబాగో ప్రధాని ఇచ్చిన విందులో మోదీకి సంప్రదాయ రీతిలో సోహరీ ఆకుపై భోజనం వడ్డించారు. ఆ ఫొటోను భారత ప్రధానమంత్రి స్వయంగా ‘ఎక్స్’లో పోస్ట్ చేశారు. సోహరీ ఆకు దాదాపు అరిటాకు లాంటిదే. భారతీయ మూలాలున్న ట్రినిడాడ్ అండ్ టొబాగో ప్రజలు పండగలు, ఇతర ప్రత్యేక సందర్భాల్లో ఈ ఆకుపైనే భోజనం చేస్తుంటారు.

హిమాచల్‌లో వరుణుడి విధ్వంసం

- రెండు వారాల్లో 69 మంది మృతి
- రూ.7 వేల కోట్ల మేర ఆస్తి నష్టం

శిమ్లా: హిమాచల్ ప్రదేశ్‌లో వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. రెండు వారాలుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలతో ఆకస్మిక వరదలు ముంచెత్తుతున్నాయి. కొండచరియలు విరిగిపడి విధ్వంసం సృష్టిస్తున్నాయి. ఈ విపత్తులో 69 మంది ప్రాణాలు కోల్పోయినట్లు ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు శుక్రవారం వెల్లడించారు. మరో 37 మంది గల్లంతయ్యారని, 110 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. జూన్ 20 నుంచి కురుస్తున్న వర్షాల వల్ల రూ.7వేల కోట్ల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు చెప్పారు. వరదల్లో నివాసాలు కోల్పోయిన ప్రతి కుటుంబానికి రూ.5 వేల సాయం చేస్తామని ప్రకటించారు. వర్షాలు మండీ జిల్లాను తీవ్రంగా ప్రభావితం చేశాయి. ఈ ఒక్క జిల్లాలోనే అత్యధికంగా మరణాలు నమోదయ్యాయి. జిల్లాలోని దాదాపు 156 రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. పలు ప్రాంతాల్లో ఇళ్లు, వాహనాలు, వంతెనలు ధ్వంసమయ్యాయి. నీరు, విద్యుత్ సరఫరాలు నిలిచిపోయాయి. మరోవైపు రాష్ట్రంలో శనివారం నుంచి మంగళవారం వరకు వాతావరణ కేంద్ర ఆరెంజ్ అలర్ట్‌ను జారీచేసింది. భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది.

ఉత్తరాఖండ్‌లో ఇద్దరు అధికారుల మృతి

ఉత్తరాఖండ్‌లో విషాదం చోటుచేసుకుంది. సరదాగా సెలవును ఆస్వాదించడానికి వచ్చిన భారత వాయుసేనకు చెందిన ఇద్దరు అధికారులు నదిలో పడి మృతిచెందారు. భారీ వర్షాల కారణంగా ఉప్పొంగిన భీమటాల్ సరస్సులో మునిగిపోయిన వారిని పంజాబ్‌లోని పఠాన్‌కోట్‌కు చెందిన ప్రిన్స్ యాదవ్(23), ముజఫర్‌పుర్‌కు చెందిన షాహిల్ కుమార్ (23)గా గుర్తించారు. మరోవైపు వర్షాల కారణంగా కొండచరియలు విరిగి పడుతుండటంతో కేదార్‌నాథ్ యాత్రను తాత్కాలికంగా నిలిపివేశారు.

బిహార్‌లో చురుగ్గా ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ

- ఈసీ ప్రకటన

దిల్లీ: నకిలీ, అనర్హులైన ఓటర్లను జాబితాల నుంచి తొలగించే ప్రక్రియలో భాగంగా ఎన్నికల సంఘం (ఈసీ) బిహార్‌లో చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్.ఐ.ఆర్) చురుగ్గా కొనసాగుతోందని అధికారులు శుక్రవారం వెల్లడించారు. రాష్ట్రంలో మొత్తం 7.96 కోట్ల మంది ఓటర్లు నమోదు కాగా వీరిలో 6.86 కోట్ల మందికి (87 శాతం) పాక్షికంగా పూర్తి చేసిన ఓటరు గణన పత్రాలను బూత్ స్థాయి అధికారుల (బీఎల్‌వో) ద్వారా అందజేసినట్లు తెలిపారు. మిగిలిన ఓటర్లు ఇళ్లకు తాళాలు వేసి ఉండడం, వలసపోయి ఉండడం లేదా మృతి చెందిన వారై ఉంటారని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పత్రాలను అందజేయడం కోసం సుమారు 1.5 కోట్ల నివాస గృహాలకు బీఎల్‌వోలు వెళ్లినట్లు చెప్పారు. వీటిలో 38 లక్షల పత్రాలు బీఎల్‌వోల వద్దకు తిరిగి వచ్చాయన్నారు. కాగా, ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) తప్పుపట్టింది. ప్రజలను తీవ్ర వేదనకు, వేధింపులకు గురిచేస్తోన్న ఈ కార్యక్రమాన్ని వెంటనే నిలిపివేయాలని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా డిమాండ్ చేశారు.

దిల్లీలో వాహనాలు ‘కారు’చౌక!



రూ.82 లక్షలకు కొన్న మెర్సిడెస్ బెంజ్ రూ.2.5 లక్షలకు..

ఈటీవీ భారత్: దిల్లీలో జులై 1 నుంచి అమల్లోకి తీసుకువస్తామన్న కొత్త వాహన పాలసీ భయంతో చాలా మంది కార్ల యజమానులు తమ వాహనాలను ఇప్పటికే కారుచౌకగా అమ్మేశారు. పదేళ్లు పైబడిన డీజిలు, 15 ఏళ్లు పైబడిన పెట్రోలు వాహనాలకు బంకుల్లో ఇంధనం పోసేది లేదని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ మేరకు గడువు తీరిన, తీరబోతున్న కార్లను నామమాత్రపు ధరలకు పలువురు అమ్ముకున్నారు. ఈ క్రయ విక్రయాలను కొందరు సోషల్ మీడియా వేదికగా పంచుకొన్నారు. కొత్త వాహన పాలసీపై దిల్లీ ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత రావటంతో చివరి క్షణంలో భాజపా సర్కారు వెనక్కు తగ్గింది. ఇదేదో ముందే తెలిస్తే తమ కార్లను చౌకగా అమ్ముకునే దుస్థితి వచ్చేది కాదని బాధిత యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ప్రకటనతో తనలాంటి ఎంతోమంది వాహనదారులు నష్టపోయారని దిల్లీకి చెందిన నితిన్ గోయల్ తెలిపారు. ఈయన రూ.65 లక్షల జాగ్వార్ ల్యాండ్ రోవర్‌ను రూ.8 లక్షలకే అమ్మేశారు. రితేశ్ గందోత్ర అనే మరో యజమాని రూ.55 లక్షల లగ్జరీ ఎస్‌యూవీ కారును నామమాత్రపు రేటుకు విక్రయించారు.

అగ్రరాజ్యం హామీ ఇస్తేనే అణు చర్చలు: ఇరాన్

ఇంటర్నెట్‌డెస్క్: భవిష్యత్తులో తమ దేశంపై ఎలాంటి దురాక్రమణ చర్యలకు పాల్పడబోమని అమెరికా హామీ ఇస్తే తప్ప అణుఒప్పందంపై జరిగే చర్చలకు అర్థం ఉండదని భారత్‌లోని ఇరాన్ రాయబారి ఇరాజ్ ఎలాహి పేర్కొన్నారు. ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఎలాహి మాట్లాడుతూ.. ‘‘అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందంపై సంతకం చేయని ఇజ్రాయెల్ దగ్గర అణ్వాయుధాలు ఉన్నాయి. అలాంటి దేశం అణ్వాయుధాలు కలిగి ఉండకూడదనే నెపంతో మాపై దాడులు చేయడం సరికాదు. ఈ దాడులు ఐక్యరాజ్యసమితి చట్టాలను ఉల్లంఘించాయి’’ అని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ ఎలాంటి దురాక్రమణ చర్యలకు పాల్పడకూడదని తెలిపారు. అలాంటి విశ్వసనీయమైన హామీ అగ్రరాజ్యం ఇస్తే తప్ప ఆ దేశంతో అణుఒప్పందంపై జరిగే చర్చలకు అర్థం ఉండదన్నారు.

యుద్ధంలో రష్యా ఓడితే.. అమెరికా మాపై దృష్టి పెడుతుంది

- చైనా భయాన్ని నిక్కచ్చిగా చెప్పేసిన విదేశాంగ మంత్రి

బీజింగ్: ఉక్రెయిన్‌తో యుద్ధంలో రష్యా ఓడిపోతే వ్యూహాత్మకంగా తమకు చాలా నష్టం వాటిల్లుతుందని చైనా భావిస్తోంది. ఒకవేళ మాస్కో పరాజయం పాలైతే. . ఆ తర్వాతి నుంచి అమెరికా దృష్టంతా తమపైనే ఉంటుందని అది భయపడుతోంది. ఈ విషయాన్ని చెప్పింది మరెవరో కాదు..! స్వయంగా చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ. ఐరోపా కమిషన్ ఉపాధ్యక్షురాలు కాయా కాలస్‌తో తాజా భేటీలో నిక్కచ్చిగా ఆయన చేసిన ఈ వ్యాఖ్యల గురించి తెలుసుకొని పలువురు ఐరోపా సంఘం (ఈయూ) నేతలు ఆశ్చర్యపోతున్నారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధంపై చైనా వైఖరి ఏంటన్నది ఈ మాటలతో స్పష్టంగా అర్థమైపోయినట్లయిందని వారు చెబుతున్నారు. వాంగ్ ప్రస్తుతం ఈయూ పర్యటనలో ఉన్నారు. అయితే యుద్ధంలో రష్యాకు సైనికంగా, ఆర్థికంగా చైనా సాయం చేస్తోందన్న ఆరోపణలను మాత్రం కాలస్‌తో సమావేశంలో వాంగ్ తోసిపుచ్చినట్లు తెలుస్తోంది. మరోవైపు- వాంగ్ వ్యాఖ్యలపై చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మావో నింగ్‌ను విలేకరులు శుక్రవారం ప్రశ్నించగా.. ఆమె సమాధానం దాటవేశారు.

వైద్య కళాశాలల్లో నిబంధనల తారుమారు

- అధికారులు సహా 34 మందిపై సీబీఐ కేసులు

దిల్లీ: వైద్య కళాశాలను నియంత్రించే విధానాలను చట్టవిరుద్ధంగా మారుస్తూ అవినీతికి పాల్పడుతున్న అధికారులు సహా 34 మందిపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) కేసులు నమోదు చేసింది. వీరిలో 8 మంది కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ అధికారులు ఉండగా.. ఐదుగురు జాతీయ వైద్య కమిషన్(ఎన్ఎంసీ)లోని డాక్టర్లు ఉన్నారు. టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ ఛైర్మన్ డి.పి. సింగ్, గీతాంజలి విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ మయూర్ రవల్, రవత్‌పుర వైద్య, పరిశోధన కళాశాల ఛైర్మన్ రవి శంకర్ జీ మహారాజ్, ఇండెక్స్ వైద్య కళాశాల ఛైర్మన్ సురేశ్ సింగ్ భదోరియా పేర్లను సైతం సీబీఐ ఎఫ్ఐఆర్‌లో చేర్చింది.

విమానంలో ప్రయాణికుడిపై పిడిగుద్దులు

- భారత మూలాలున్న వ్యక్తి అరెస్ట్

న్యూయార్క్: విమానంలో ప్రయాణిస్తుండగా తోటి ప్రయాణికుడిపై అకారణంగా దాడి చేశాడన్న ఆరోపణలతో భారత మూలాలున్న వ్యక్తి అరెస్టయ్యాడు. న్యూయార్క్‌లో నివాసముండే ఇషాన్ శర్మ(21) గతనెల 30న ఫిలాడెల్ఫియా నుంచి మయామీ వెళ్తున్న విమానంలో ప్రయాణించాడు. అదే సమయంలో తోటి ప్రయాణికుడైన కెయాను ఎవాన్స్‌తో వాగ్వాదం చోటుచేసుకుంది. అతనిపై పిడిగుద్దులు కురిపించాడు. కొట్టుకోవడం ఆపండి అని మిగిలిన ప్రయాణికులు అరుస్తున్నా వినకుండా వారిద్దరూ మెడలు పట్టుకుని మరీ గొడవపడుతున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరలయింది. దీంతో మయామీ పోలీసులు ఇషాన్‌ని సోమవారం అరెస్టుచేశారు. నిందితుడికి 500 డాలర్ల జరిమానా విధించారు. కేటాయించిన సీటు వద్దకు తిరిగి వెళ్తుండగా ఇషాన్ ఒక్కసారిగా దాడిచేశాడని, ఆతడిని రెచ్చగొట్టేలా తను ప్రవర్తించలేదని ఎవాన్స్ తెలిపాడు.

కచ్చతీవు ద్వీపాన్ని వదులుకునే ఉద్దేశం లేదు

- శ్రీలంక మంత్రి విజితా హెరాథ్ స్పష్టీకరణ

కొలంబో: కచ్చతీవు ద్వీపాన్ని వదులుకునే ఉద్దేశమేదీ శ్రీలంకకు లేదని ఆ దేశ విదేశాంగ మంత్రి విజితా హెరాథ్ స్పష్టంచేశారు. శ్రీలంక ప్రాదేశిక జలాల్లోకి ప్రవేశించారంటూ భారతీయ మత్స్యకారులను అరెస్టు చేస్తుండడంపై సిరసా టీవీ ఛానెల్ పాత్రికేయుడు అడిగిన ప్రశ్నకు హెరాథ్ స్పందించారు. ఈ ద్వీపానికి సంబంధించి భారత్‌లో పదేపదే వస్తున్న డిమాండ్లు, ప్రకటనలు అక్కడి రాజకీయ పార్టీల మధ్య నడుస్తున్న అంశమని ఆయన వెల్లడించారు. ‘‘మేం ఈ అంశాన్ని (మత్స్యకారుల అరెస్టులు) పరిష్కరించేందుకు మా దౌత్య మార్గాలను తెరిచే ఉంచాం. అంతర్జాతీయ చట్టం ప్రకారం దక్కిన కచ్చతీవును వదులుకోవడానికి శ్రీలంక ఎన్నటికీ అంగీకరించబోదు’’ అని విజితా హెరాథ్ పేర్కొన్నారు.

చైనాలో పిల్లల్ని కంటే కాసుల పంట



ఇంటర్నెట్ డెస్క్: జనాభా సంక్షోభాన్ని అధిగమించేందుకు వివిధ పథకాలు ప్రవేశపెడుతున్న చైనా.. మరో భారీ నగదు ప్రోత్సాహక కార్యక్రమం అమలుకు సిద్ధమవుతోంది. ఈ ఏడాది జనవరి 1 నుంచి పుట్టిన ఒక్కో బిడ్డకు ఏడాదికి రూ.42 వేలు చొప్పున ఇవ్వాలని, చిన్నారికి మూడేళ్లు వచ్చేవరకు దీన్ని కొనసాగించే ప్రణాళికలు సిద్ధం చేసినట్లు సమాచారం. చైనాలోని హోహోట్, టియాన్మెన్ వంటి నగరాల్లో ముగ్గురు, అంతకంటే ఎక్కువ సంతానం ఉన్న కుటుంబాలకు రూ.లక్షల నగదు, ఇతర ప్రోత్సాహకాలు అందించే పథకాలు ఇప్పటికే అమలవుతున్నాయి. ఒకే బిడ్డ విధానాన్ని అనేక దశాబ్దాలపాటు అమలుచేసిన చైనా.. 2016 జనవరి 1తో దానికి స్వస్తి పలికింది. అయినప్పటికీ పిల్లల్ని కనేందుకు చైనీయులు ముందుకు రావడం లేదు. దీంతో సంతానోత్పత్తి రేటు గణనీయంగా తగ్గుతోంది. 2016లో జననాల సంఖ్య 1.8 కోట్లుగా ఉండగా.. గతేడాది ఇది 95 లక్షలకు పడిపోయింది.

కేరళ స్కూళ్లలో అమ్మ సంరక్షణ కేంద్రాలు



ఈటీవీ భారత్: కేరళ సర్కారు రాష్ట్రంలో కనీసం వెయ్యి పాఠశాలల్లో ‘కుడుంబశ్రీ’ (మదర్ కేర్ సెంటర్లు) కేంద్రాల ఏర్పాటుకు కసరత్తు చేస్తోంది. ‘మా కేర్’ అనే ఈ ప్రాజెక్టును రెండేళ్ల క్రితం కాసరగోడ్ జిల్లాలోని చైయోత్ హయ్యర్ సెకండరీ స్కూలులో విజయవంతంగా పరీక్షించినట్లు కుడుంబశ్రీ ప్రాజెక్టు కోఆర్డినేటరు జితిన్ ‘ఈటీవీ భారత్’కు తెలిపారు. ప్రస్తుతం కన్నూర్, కాసరగోడ్ జిల్లాల్లోని 72 పాఠశాలల్లో ఈ కేంద్రాలు పనిచేస్తున్నాయి. క్రమంగా కేరళ అంతటా విస్తరించాలని ప్రభుత్వ యోచన. ఈ కేంద్రాల్లో స్థానిక సిబ్బంది తయారుచేసిన తినుబండారాలు, పానీయాలతోపాటు పుస్తకాలు, పెన్నులు, శానిటరీ న్యాప్‌కిన్స్‌ను పాఠశాల ప్రాంగణంలోనే అందుబాటులో ఉంచుతారు. తక్కువ ధరలతో విద్యార్థులకు వీటిని అందిస్తారు. ఈ ప్రాజెక్టును రాష్ట్రమంతా విస్తరిస్తే మొదటిదశలో కనీసం 5,000 మంది మహిళలు మెరుగైన జీవనోపాధిని పొందుతారు.

10 మంది పొరుగువాళ్ల సమ్మతిస్తేనే శునకాన్ని పెంచుకోవాలి!

- సూరత్ మున్సిపల్ కార్పొరేషన్ షరతు

సూరత్: పెంపుడు జంతువుల ప్రేమికులకు సూరత్ మున్సిపల్ కార్పొరేషన్ అనూహ్యమైన ఆంక్షలు విధించింది. ఇంట్లో శునకాన్ని పెంచుకోవాలంటే కనీసం 10 మంది పొరుగు వారి నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) తీసుకుని సమర్పించాలని మున్సిపల్ కార్పొరేషన్ షరతు విధించింది. బహుళ అంతస్తుల భవనాల్లో శునకాన్ని పెంచుకోవాలంటే ఆ భవనం సంక్షేమ సంఘం ఛైర్‌పర్సన్, కార్యదర్శి అనుమతి తప్పని సరి అంటూ ఉత్తర్వులు జారీ చేసింది. మే నెలలో కుక్క దాడిలో ఓ చిన్నారి మృతి చెందడంతో ఈ నిబంధన విధించాల్సి వచ్చిందని మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తెలిపారు.



శుక్రవారం బాల్‌టాల్‌లో సాగిపోతున్న అమర్‌నాథ్ యాత్రికులు

శేషనాగ్ బేస్‌క్యాంప్‌లో యూపీ యాత్రికుడి మృతి

జమ్ము: శేషనాగ్ బేస్ క్యాంప్ వద్ద ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ఓ యాత్రికుడు మృతిచెందాడు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని లఖింపుర్ ఖేరీకి చెందిన దిలీప్ శ్రీవాస్తవ్ అనేవ్యక్తి రెండోరోజు యాత్రలో స్పృహతప్పి పడిపోయాడు. అతన్ని ఆసుపత్రికి తరలించగా.. మృతిచెందాడని అధికారులు వెల్లడించారు.

సినిమా

ధనుష్‌కు జోడీగా పూజ!



పూజా హెగ్డే

తమిళ చిత్రసీమలో ఇప్పుడు పూజా హెగ్డే హవానే కనిపిస్తోంది. విజయ్‌తో కలిసి 'జన నాయగన్'లో తెర పంచుకుంటున్న ఆమె.. రజనీకాంత్‌తో 'కూలీ'లో ప్రత్యేక గీతంలో ఆడిపాడింది. అలాగే లారెన్స్‌తో 'కాంచన 4'లోనూ సందడి చేయనుంది. అయితే ఇప్పుడామె ఖాతాలో మరో సినిమా చేరినట్లు తెలుస్తోంది. కథానాయకుడు ధనుష్ 54వ చిత్రంలో ఆమె నాయికగా కనిపించనుందని సమాచారం. ఇప్పటికే ఈ విషయమై చర్చలు జరిగినట్లు తెలిసింది. విఘ్నేశ్ రాజా దర్శకత్వంలో రూపొందనున్న ఈ సినిమాని వేల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ సంస్థ నిర్మించనున్నట్లు తెలుస్తోంది. ఇదొక పీరియాడిక్ యాక్షన్ డ్రామా కథతో ముస్తాబు కానుందని.. 90రోజుల్లో చిత్రీకరణ పూర్తి చేయనున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. ఈనెల రెండో వారం నుంచి చిత్రీకరణ మొదలు కానున్నట్లు తెలిసింది. ధనుష్ ఈ సినిమా తర్వాత 'అమరన్' ఫేమ్ రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో ఓ చిత్రం చేయనున్నారు.

చకచకా 'స్పిరిట్' సన్నాహాలు



ప్రభాస్

కథానాయకుడు ప్రభాస్ 'ది రాజాసాబ్'ను ముగించే పనిలో ఉన్నారు. అలాగే ప్రభాస్‌తో హను రాఘవపూడి చేస్తోన్న చిత్రాన్ని చకచకా పరుగులు పెట్టిస్తున్నారు. ఇక ఇప్పుడు మరోవైపు 'స్పిరిట్'ను పట్టాలెక్కించేందుకు జోరుగా సన్నాహాలు చేసుకుంటున్నారు. 'యానిమల్' విజయం తర్వాత సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న బహుభాషా చిత్రమిది. భద్రకాళి పిక్చర్స్ ప్రొడక్షన్స్, టీ-సిరీస్ ఫిల్మ్స్ సంస్థలు నిర్మిస్తున్నాయి. త్రిప్తి దిమ్రీ కథానాయిక. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనుల్లో ఉన్న ఈ సినిమాని సెప్టెంబరు నుంచి సెట్స్‌పైకి తీసుకెళ్లేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే దీని కోసం ప్రభాస్ బల్క్ డేట్స్ కేటాయించినట్లు సమాచారం ప్రస్తుతం దీనికి తగ్గట్లుగానే పూర్వ నిర్మాణ పనుల్ని వేగవంతం చేసినట్లు తెలిసింది. హైఓల్టేజ్ కాప్ యాక్షన్ థ్రిల్లర్‌గా ముస్తాబవుతున్న ఈ సినిమాలో ప్రభాస్ శక్తిమంతమైన పోలీసు పాత్రలో కనువిందు చేయనున్నారు. దీన్ని తొమ్మిది భాషల్లో ప్రపంచవ్యాప్తంగా ఒకేసారి విడుదల చేయనున్నారు. ఈ చిత్రానికి సంగీతం: హర్ష వర్ధన్ రామేశ్వర్.

న్యాయం జరగడం ఆలస్యమైతే..

ఓ లుక్కేయొచ్చు!

సినిమా: 'యుద్ధ కాండ-చాప్టర్ 2' (తెలుగు, హిందీ, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో)

జానర్: లీగల్ డ్రామా

ప్లాట్‌ఫామ్: అమెజాన్ ప్రైమ్ వీడియో




కొన్ని సార్లు నిజం బాధనిస్తుంది.. అబద్ధం ఆనందాన్నిస్తుంది. కానీ నిజం ఇచ్చిన ప్రశాంతత.. అబద్ధం ఎప్పటికీ ఇవ్వలేదని చాలా మంది చెప్తూ ఉంటారు. నేటి సమాజంలో నిజాన్ని.. ఇది నిజమని నిరూపించడానికి ఎన్నో తంటాలు పడుతుంటారు. కానీ.. ఆలస్యమయినా ధర్మమే గెలుస్తుందని మరోసారి చాటి చెప్పాడు ఓ యువకుడు. అంతే కాదు.. న్యాయం జరగడానికి ఆలస్యమైతే వాటిల్లే ముప్పును కూడా కళ్లకు కట్టినట్లు చూపించాడు. ఆ యువకుడి కథే 'యుద్ధకాండ-చాప్టర్ 2'.

కథాంశం: భరత్ (అజయ్ రావు) చాలా నిజాయతీపరుడు.. ఆపదలో ఉన్న వారికి సహాయం చేసే మంచి గుణం ఉన్న వ్యక్తి. అనాథ అయిన భరత్.. హోటల్‌లో పని చేస్తూ.. కష్టపడి చదివి న్యాయవాది అవుతాడు. ఈ క్రమంలోనే ఓ సీనియర్ లాయర్ దగ్గర అసిస్టెంట్‌గా పనిచేస్తుంటాడు. ఓ రోజు ఓ కేసు విషయంపై కోర్టుకు వెళతాడు భరత్. అదే సమయంలో నివేదిత(అర్చన జోస్) అనే అమ్మాయి కోర్టు ముందే ఓ ఎమ్మెల్యే తమ్ముడిని హత్య చేస్తుంది. దీంతో తన గురించి తెలుసుకొని ఆమెకు సహాయం చేయాలని నిర్ణయించుకుంటాడు భరత్. మరి నివేదిత గురించి ఆయన తెలుసుకున్న విషయాలేంటి? నివేదిత దోషిగా బయటికొచ్చిందా? అసలు ఆమె ఆ హత్య చేయడానికి కారణమేంటి? అనేదే ఈ సినిమా కథాంశం. ఈ కన్నడ చిత్రానికి పవన్ భట్ దర్శకత్వం వహించారు.

◆ న్యాయం కోసం ఎదురుచూస్తూ మరణించిన వృద్ధుడు.. న్యాయం జరగదేమోనని నిందితుణ్ని హత్య చేసిన బాధితుడు.. ఇలాంటి వార్తలు రోజూ మనం చూస్తూనే ఉంటాం. ఇప్పుడీ కోవలోనే దేశంలో ఎంత మందికి సత్వరమే న్యాయం జరుగుతుంది? అని ప్రశ్నిస్తూ ఆలోచింపజేస్తుంది ఈ చిత్రం. పోలీసు దర్యాప్తులు, వాయిదాలతో సంవత్సరాల పాటు చేసే విచారణలు.. ఎంతో మంది బాధితుల గుండెల్లో ఆరని మంటలను రేపుతూ నేరాలకు పాల్పడేలా చేస్తున్నాయి. ఈ విషయాన్ని బలమైన సన్నివేశాలు, సంభాషణలతో తెరపై ఆవిష్కరించిన దర్శకుడి ప్రయత్నం విజయవంతమైంది. మరోవైపు న్యాయం ఆలస్యం కావడం వల్ల కొత్తగా పుట్టుకొస్తున్న అబద్ధాలతో నిజాన్ని నిరూపించడమే అసాధ్యంగా మారిందని మరోసారి నిరూపించిందీ చిత్రం. అన్యాయం జరిగిన వెంటనే ఆలస్యం చేయకుండా న్యాయం జరగాలనే మంచి సందేశాన్ని సమాజానికి అందించింది.

వైరల్ వయ్యారి



శ్రీలీల, కిరీటి

"ఇన్‌స్టాగ్రామ్‌లో నా ఫాలోయింగు.. చూశావంటే మైండ్ బ్లోయింగు.. ఫాలోవర్స్ అందరికీ నేనే డార్లింగు.. నేనేమి చేసినా పుల్లు ట్రెండింగు" అంటూ కిరీటి రెడ్డితో కలిసి హుషారుగా చిందేస్తోంది శ్రీలీల. ఇప్పుడీ ఇద్దరూ జంటగా నటించిన చిత్రం 'జూనియర్'. రాధాకృష్ణ దర్శకత్వం వహించిన ఈ సినిమాని రజనీ కొర్రపాటి నిర్మించారు. జెనీలియా కీలక పాత్ర పోషించింది. ఈ సినిమా ఈ నెల 18న తెలుగు, కన్నడ, తమిళ, హిందీ, మలయాళ భాషల్లో విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే శుక్రవారం ఈ చిత్ర రెండో గీతాన్ని బయటకు వదిలారు. "వైరల్ వయ్యారినీ.. నే వయసొచ్చిన అణుబాంబుని" అంటూ హుషారుగా సాగిన ఈ మాస్ పాటకు దేవిశ్రీ ప్రసాద్ సంగీతమందించడమే కాక హరిప్రియతో కలిసి స్వయంగా ఆలపించారు. కల్యాణ్ చక్రవర్తి సాహిత్యమందించారు. రేవంత్ గొల్లమండల నృత్యరీతులు అందించారు. ఈ పాటలో కిరీటి, శ్రీలీల కెమిస్ట్రీ.. వాళ్లిద్దరూ వేసిన స్టెప్పులు ఆకర్షణగా నిలిచాయి. ప్రేమ, యాక్షన్, స్నేహం అంశాలతో ముడిపడిన ఈ యూత్ ఎంటర్‌టైనర్‌కు కె.కె.సెంథిల్ కుమార్ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరించారు. పీటర్ హెయిన్స్ యాక్షన్ కొరియోగ్రఫీ చేశారు.

హాలీవుడ్ స్వర సంచలనాలను వెనక్కినెట్టిన అర్జిత్‌సింగ్

● స్పాటిఫైలో 151 మిలియన్ల ఫాలోవర్లతో తొలిస్థానం



అర్జిత్‌సింగ్

మ్యూజిక్ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ స్పాటిఫైలో 151 మిలియన్ల ఫాలోవర్లను సంపాదించుకుని తన కంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నాడు ప్రముఖ భారతీయ గాయకుడు, సంగీత దర్శకుడు అర్జిత్ సింగ్. టేలర్ స్విఫ్ట్, ఎడ్ షీరాన్ లాంటి ప్రముఖ గాయకుల్ని దాటుకొని అత్యధిక ఫాలోవర్లను సంపాదించుకుని తొలి స్థానంలో నిలవడం విశేషం. ఈ వారం స్పాటిఫై స్వయంగా సంగీతకారుల జాబితాను విడుదల చేసింది. అందులో పాప్ మ్యూజిక్ సర్క్యూట్‌లో పాపులర్ అయిన అమెరికన్ గాయని స్విఫ్ట్ 139.6 మిలియన్ల మంది ఫాలోవర్లతో రెండవ స్థానంలో, 121 మిలియన్లతో బ్రిటన్‌కు చెందిన షీరాన్ మూడో స్థానంలో ఉన్నారు. ఈ జాబితాలో ఉన్న భారతీయులలో ఏఆర్ రెహమాన్ 65.6 మిలియన్ల ఫాలోవర్లతో 14వ స్థానంలో, ప్రీతమ్ 53.4 మిలియన్లతో 21, నేహా కక్కర్ 48.5 మిలియన్ల మందితో 25వ స్థానంలో నిలిచారు. దివంగత సంగీత దిగ్గజాలు లతా మంగేష్కర్ 22 మిలియన్లతో 100వ స్థానం, కిశోర్ కుమార్ 16 మిలియన్ల మంది ఫాలోవర్లతో 144వ స్థానాల్లో ఉన్నారు. భారతీయ సంగీత పరిశ్రమలో అర్జిత్ ఎదుగుదల అనూహ్యమైనది. ఈయన 2005లో 'ఫేమ్ గురుకుల్' అనే రియాలిటీ షోలో పోటీదారుగా తన కెరీర్‌ను ప్రారంభించాడు. కానీ 8 సంవత్సరాల తర్వాత 'ఆషికి 2'లో 'తుమ్ హి హో' పాట పాడాడు. ఆ పాట విజయం అతని ఇంటి పేరుగా మార్చింది.

నిధి అన్వేషణ మళ్లీ మొదలు



నాగచైతన్య

కథానాయకుడు నాగచైతన్య.. దర్శకుడు కార్తీక్ దండు కలయికలో ఓ బహుభాషా చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర, సుకుమార్ రైటింగ్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. మీనాక్షి చౌదరి కథానాయిక. బాపినీడు సమర్పిస్తున్నారు. చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా రెండో షెడ్యూల్‌ను ప్రారంభించుకున్నట్లు చిత్ర బృందం శుక్రవారం ప్రకటించింది. హైదరాబాద్‌లో మొదలైన ఈ షెడ్యూల్ మూడు వేర్వేరు ప్రాంతాల్లో చిత్రీకరణ చేసుకోనుందని తెలిసింది. ఈ షెడ్యూల్‌లో భాగంగా చైతన్యపై కీలక సన్నివేశాలతో పాటు యాక్షన్ సీక్వెన్స్ తెరకెక్కించనున్నట్లు తెలుస్తోంది. ఇది నిధి అన్వేషణతో ముడిపడి ఉన్న ఆసక్తికర కథతో రూపొందుతున్న సినిమా. చైతూ ఇందులో అర్జున్ అనే ట్రెజర్ హంటర్‌గా సాహసాలు చేయనున్నారు. ఈ చిత్రానికి శ్రీనాగేంద్ర తంగల ప్రొడక్షన్ డిజైనర్‌గా వ్యవహరిస్తున్నారు. సంగీతం: అజనీశ్ లోక్‌నాథ్, ఛాయాగ్రహణం: నీల్ డి కున్హా.

నిజ జీవిత సంఘటనలతో.. మై బేబి



అథర్వ, నిమిష

తమిళంలో విజయవంతమైన 'డి.ఎన్.ఎ' చిత్రం తెలుగులో 'మై బేబి' పేరుతో ప్రేక్షకుల ముందుకొస్తోంది. అథర్వ మురళీ, నిమిషా సజయన్ ప్రధాన పాత్రధారులుగా నటించిన చిత్రమిది. నెల్సన్ వెంకటేశన్ దర్శకత్వం వహించారు. ఎస్.కె.పిక్చర్స్ పతాకంపై సురేశ్ కొండేటి ఈ నెల 11న తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. 2014లో ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి జీవితంలో జరిగిన సంఘటనల స్ఫూర్తితో సాగే కథ ఇదనీ, సమాజంలో మనం ఎంత జాగ్రత్తగా ఉండాలో ఈ సినిమా చాటి చెబుతుందని నిర్మాత సురేశ్ తెలిపారు. థ్రిల్లింగ్ అంశాలు, భావోద్వేగాలు, ఆకట్టుకునే కథనం ఈ సినిమాకి ప్రధాన బలం అని, తమిళంలో విజయవంతమైనట్టే తెలుగు ప్రేక్షకుల్నీ మెప్పిస్తుందని ఆయన చెప్పారు.

సొంతింటికి దూరమైన భావన కలుగుతోంది

అలంకార పాత్రల కంటే.. యాక్షన్ పాత్రలకే ఎక్కువ ప్రాధాన్యతనిస్తానని అంటోంది నాయిక ప్రియాంక చోప్రా. హాలీవుడ్‌లో వరుస సినిమాలతో మెప్పిస్తూనే.. మరోవైపు సిరీస్‌లతోనూ సత్తా చాటుతున్న కథానాయికీమె. ఇటీవలే ప్రియాంక 'హెడ్స్ ఆఫ్ స్టేట్' చిత్రంతో ప్రేక్షకుల్ని పలకరించింది. ఇందులో ప్రపంచాన్ని కాపాడే ఏజెంట్ నోయల్ బిస్సెట్ పాత్రలో కనిపించి తన నటనతో ఆకట్టుకుంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ప్రియాంక ఈ సినిమా, తన రాబోయే ప్రాజెక్టుల గురించి కొన్ని ఆసక్తికర సంగతుల్ని పంచుకుంది.



ప్రియాంక చోప్రా

ఇలాంటి పాత్రలు రావడం అరుదు

"దర్శకుడు ఇల్యా నైషల్లర్ 'హెడ్స్ ఆఫ్ స్టేట్' గురించి నాతో మొదటిసారి మాట్లాడిన రోజే ఇందులో భాగం కావాలని నిర్ణయించుకున్నా. ఈ యాక్షన్ చిత్రానికి ఒక మహిళ నాయకత్వం వహించడం ముఖ్యమని దర్శకుడు భావించారు. అదే నన్ను ఈ సినిమా చేయాలనే కోరికను కలిగించింది. ఇలాంటి పాత్రలు నటీమణుల దగ్గరికి రావడం చాలా అరుదు. సినిమాలు ఎక్కువగా కథానాయకులే ప్రధాన కథాంశంగా రూపొందుతుంటాయి. కానీ ఇలా హీరోలకు దీటుగా యాక్షన్ సీక్వెన్స్ చేసే మహిళా పాత్రల్ని సృష్టించడం గౌరవంగా ఉంది. ఈ ప్రయాణంలో భాగం కావడం సంతోషంగా ఉంది".

ఈ విషయంలో సంతోషంగా ఉంది

"సినిమా రంగంలో చాలా మంది అందానికే ప్రాధాన్యతనిస్తుంటారు. కానీ నా దృష్టిలో అందమైన ముఖం మాత్రమే కాదు.. స్క్రీన్‌ను సొంతం చేసుకోవడం చాలా ముఖ్యం. అందుకే నేను ఎక్కువగా అలంకార పాత్రల కంటే యాక్షన్ పాత్రలకే ప్రాధాన్యతనిస్తుంటా. కథను నడిపించే మహిళా పాత్రలపైనా నాకు ఆసక్తి ఎక్కువ. యాక్షన్ కామెడీ నేపథ్యంలో రూపొందిన 'హెడ్స్ ఆఫ్ స్టేట్' చిత్రంలో నటించడానికి ఇదే ప్రధాన కారణం. ప్రస్తుతం లేడీ ఓరియెంటెడ్ సినిమాల్ని కొత్తగా తీర్చిదిద్దడానికి ప్రయత్నిస్తున్న దర్శకనిర్మాతల పట్ల నాకు చాలా సంతోషంగా ఉంది. ఈ విధంగానే భవిష్యత్తులో మరింత లోతుగా, బలంగా మహిళా పాత్రల్ని రూపొందిస్తారని ఆశిస్తున్నా".


వారు చూపిన ప్రేమ విలువైనది

"ప్రస్తుతం హాలీవుడ్ సినిమాలతో తీరిక లేకుండా గడుపుతున్నా. కానీ ఇండియాను, హిందీ సినిమాలను చాలా మిస్ అవుతున్నాను. అప్పుడప్పుడు నా సొంత ఇంటికి దూరమయ్యాననే భావన కలుగుతుంటుంది. ఈ ఏడాది ఓ భారతీయ చిత్రంలో నటిస్తున్నా. ఆ ప్రాజెక్టు కోసం ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నా. భారతీయ ప్రేక్షకులు నాపై చూపే ప్రేమ ఎంతో విలువైనది. వారి నుంచి నేను ఎంతో ప్రేమ, మద్దతును పొందాను. ఇకపై కూడా అది ఇలాగే కొనసాగుతుందని కోరుకుంటున్నా".

వీరిద్దరి సాహసాలంటే ఇష్టం

"ఎన్ని జానర్లలో నటించినా యాక్షన్ సినిమాలు చేయడమంటేనే నాకు ఆసక్తి ఎక్కువ. హాలీవుడ్ హీరో టామ్ క్రూజ్, అక్షయ్ కుమార్ చేసే సాహసోపేతమైన విన్యాసాలంటే చాలా ఇష్టం. వీరిద్దరూ తరచుగా తమ సినిమాల్లో రిస్క్‌తో కూడిన సీక్వెన్స్‌లు చేయడం మనం చూస్తూనే ఉంటాం. నాకు కూడా భారీ స్థాయిలో స్టంట్‌లు, సాహసాలు చేసే సినిమాల్లో భాగం కావాలనే కోరిక ఉంది".


కొత్తపల్లిలో అసలేం జరిగింది?



మనోజ్ చంద్ర

పల్లెటూళ్లని తడిమి చూడాలి కానీ... అక్కడ చెవులు కొరుక్కుంటూ చెప్పుకునే ఊసులు అన్నీ ఇన్నీ కావు. కొత్తపల్లి సంగతి కూడా అంతే! రికార్డింగ్ డ్యాన్స్ స్టూడియోని నిర్వహించాలని కలలు కన్న ఆ ఊరి యువకుడు డ్యాన్స్ పార్టనర్ కోసం వెతకడం మొదలుపెట్టాడు. ఆ క్రమంలో ఎలాంటి సమస్యల్లో చిక్కుకున్నాడు? అతని గురించి ఊరి జనాలు ఏం మాట్లాడుకున్నారు? అతని కలలు నెరవేరాయా లేదా? తదితర విషయాలు తెలియాలంటే 'కొత్తపల్లిలో... ఒకప్పుడు' చూడాల్సిందే! 'కేరాఫ్ కంచరపాలెం', ఉమామహేశ్వర ఉగ్రరూపస్య' సినిమాల్ని నిర్మించిన ప్రవీణ పరుచూరి ఈ చిత్రంతో దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు. ఆమె తన పరుచూరి విజయ ప్రవీణ ఆర్ట్స్ సంస్థపై గోపాలకృష్ణ పరుచూరితో కలిసి నిర్మిస్తున్నారు. రానా దగ్గుబాటి సమర్పకులు. మనోజ్ చంద్ర, మోనిక.టి ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ నెల 18న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా శుక్రవారం టీజర్‌ని విడుదల చేశారు. పల్లెటూరి జీవితాల్ని, అక్కడ సరదాల్ని ఆవిష్కరించే చిత్రమిదని సినీ వర్గాలు తెలిపాయి. ఉషా బోనెల, రవీంద్ర విజయ్, బెనర్జీ, బొంగు సత్తి, ఫణి, ప్రేమ్ సాగర్ తదితరులు నటించిన ఈ చిత్రానికి పాటలు: మణిశర్మ, నేపథ్య సంగీతం: వరుణ్ ఉన్ని, ఛాయాగ్రహణం: పెట్రోస్ ఆంటోనియాడిస్, కథ, మాటలు: గురుకిరణ్ బత్తుల.

ఆపరేషన్ డ్రీమ్ థియేటర్



'సప్తసాగరాలు దాటి' సినిమాల తర్వాత దర్శకుడు హేమంత్‌రావు తెరకెక్కిస్తున్న చిత్రం '666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్'. డాలీ ధనంజయ కథానాయకుడిగా నటిస్తున్నారు. శివ రాజ్‌కుమార్ కీలక పాత్రని పోషిస్తున్నారు. వైశాక్‌గౌడ నిర్మిస్తున్నారు. శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటున్న ఈ సినిమాలోని కథా నాయకుడు డాలీ ధనంజయ లుక్‌ని విడుదల చేసింది చిత్ర బృందం. "భావోద్వేగాలతో కూడిన యాక్షన్ థ్రిల్లర్ చిత్రమిది. కన్నడతోపాటు, తెలుగులోనూ ఒకేసారి ప్రేక్షకుల ముందుకొస్తుంది. 'పుష్ప' సినిమాలతో ప్రేక్షకులకు చేరువైన డాలీ ధనుంజయ్‌తో పాటు, శివరాజ్‌కుమార్ ఇందులో విభిన్నమైన పాత్రల్లో కనిపిస్తార"ని సినీ వర్గాలు తెలిపాయి.

అంతా మిస్టరీనే!



అబిద్, మేఘన

'రక్తకన్నీరు' నాగభూషణం మనవడు అబిద్ భూషణ్ కథానాయకుడిగా తెరకెక్కిన చిత్రం 'మిస్టీరియస్'. రోహిత్ సహాని, రియా కపూర్, మేఘనా రాజ్‌పుత్ కీలక పాత్రలు పోషించారు. మహి కోమటిరెడ్డి దర్శకుడు. ఉషా, శివాని నిర్మాతలు. ఈ సినిమా టీజర్ ఆవిష్కరణ కార్యక్రమం హైదరాబాద్‌లో జరిగింది. దర్శకుడు మాట్లాడుతూ "ప్రేక్షకులకు సరికొత్త అనుభవాన్ని పంచే ఉత్కంఠభరితమైన కథ ఇది. టీజర్‌కి వచ్చిన స్పందన సినిమాపై మాకు మరింత నమ్మకాన్ని పెంచింది" అన్నారు. నిర్మాతలు మాట్లాడుతూ "ఓ ఎస్సై మిస్ కావడం మొదలుకొని... ఇందులో చాలా సంఘటనలు మిస్టరీగా మిగిలిపోతాయి. వాటి చుట్టూ సాగే సంఘటనలే ఈ చిత్రం. ఆద్యంతం ఉత్కంఠని రేకెత్తించే ఈ చిత్రం అన్నివర్గాల ప్రేక్షకుల్నీ మెప్పిస్తుంది" అన్నారు. ఇప్పటికే విడుదలైన పాటలకి మంచి స్పందన వచ్చిందని, టీజర్ కూడా అందరి దృష్టినీ ఆకర్షించడం ఆనందంగా ఉందన్నారు అబిద్‌భూషణ్, రోహిత్ సహానీ. ఈ కార్యక్రమంలో చిత్రబృందం పాల్గొంది.

ఈనాడు బిజినెస్

ఆర్థిక పత్రాలను సమర్పించండి

అల్ట్రాటెక్, మరో 2 సంస్థలకు సీసీఐ ఆదేశం

దిల్లీ: ఆదిత్య బిర్లా గ్రూప్ సంస్థ అల్ట్రాటెక్, ఐటీవా కొనుగోలు చేసిన ఇండియా సిమెంట్స్‌తో పాటు మరో రెండు సంస్థలను ఆర్థిక పత్రాలు సమర్పించాల్సిందిగా కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆదేశించింది. పోటీ నిబంధనలను ఉల్లంఘించినట్లు సీసీఐ విచారణలో తేలడంతో ఇందుకు నేపథ్యం. బ్యాలెన్స్ షీట్, లాభం/నష్టం వివరాలతో ఆడిట్ చేసిన ఆర్థిక పత్రాలను 8 వారాల్లోగా ఇవ్వాల్సిందిగా దాల్మియా భారత్ సిమెంట్స్, శ్రీ దిగ్విజయ్ సిమెంట్స్‌ను సీసీఐ ఆదేశించింది. 2014-15 నుంచి 2018-19 మధ్య ఇండియా సిమెంట్స్ 5 ఆర్థిక సంవత్సరాల ఖాతాల వివరాలు ఇవ్వాల్సిందిగా అల్ట్రాటెక్‌ను కోరింది. 2010-11 నుంచి 2018-19 మధ్య 9 ఏళ్ల వివరాలను ఇవ్వాల్సిందిగా దాల్మియా, దిగ్విజయ్ సిమెంట్స్‌ను ఆదేశించింది. ఆయవేళ ఆర్థిక వివరాలు, ఆదాయపు పన్ను రికార్డులను సమర్పించాల్సిందిగా కంపెనీ ఎగ్జిక్యూటివ్‌లకు సీసీఐ సూచించింది.

ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ ఛైర్మన్‌గా పీవీ కృష్ణారెడ్డి



ఈనాడు, హైదరాబాద్: విద్యుత్ బస్సుల తయారీ సంస్థ ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ సీఎండీ కేవీ ప్రదీప్ తన పదవికి రాజీనామా చేశారు. ఆయన రాజీనామాను ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ బోర్డు శుక్రవారం ఆమోదించింది. దీంతో ఎంఈఐఎల్ గ్రూపు వ్యవస్థాపకుడు పీవీ కృష్ణారెడ్డిని ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ బోర్డు ఛైర్మన్‌గా నియమించారు. పి.వి.కృష్ణారెడ్డి, పి.రాజేష్ రెడ్డిలను బోర్డు డైరెక్టర్లుగా ఎంపిక చేశారు. ఎండీ- సీఈఓ పోస్టును భర్తీ చేసేందుకు సరైన అభ్యర్థి కోసం అన్వేషణ చేపట్టారు. ఆడిట్ కమిటీ, ఇతర కమిటీలను కూడా పునర్వ్యవస్థీకరించారు.

న్యూయార్క్‌లో నాస్కామ్ యూఎస్ సీఈఓ ఫోరమ్!

దిల్లీ: న్యూయార్క్‌లో యూఎస్ సీఈఓ ఫోరమ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఐటీ పరిశ్రమ సంఘం నాస్కామ్ పేర్కొంది. భారత టెక్ సీఈఓలు, అమెరికా భాగస్వాములను ఒక దగ్గరకు చేర్చడం ద్వారా వినూత్నత, ఎంటర్‌ప్రైజ్, విధానాలు, నైపుణ్యాభివృద్ధి తదితరాలపై వ్యూహాత్మక చర్చలకు అవకాశం ఉంటుందని తెలిపింది. 'ఇరు దేశాలు ప్రపంచంలోనే అత్యంత వ్యూహాత్మక భాగస్వామ్యాలను కలిగి ఉన్నాయి. వీటిని మరింత బలోపేతం చేసేందుకు న్యూయార్క్‌లోని కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇండియాలో జులై 9న ఈ ఫోరమ్‌ను ఏర్పాటు చేస్తున్న'ట్లు నాస్కామ్ పేర్కొంది.

కోడి గుడ్లు

5న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్)
(100కు రూపాయలలో)

హైదరాబాద్	560
వరంగల్	562
విజయవాడ	570
గోదావరి	535
విశాఖపట్నం	560
చిత్తూరు	633

గృహరుణంపై 7.45% వడ్డీ: బీఓబీ

ఈనాడు, హైదరాబాద్: బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) గృహరుణాలపై వడ్డీ రేటును తగ్గించింది. కొత్త వడ్డీ రేటు 7.45 శాతంగా ఉండనుంది. ఇది వెంటనే అమల్లోకి వస్తుంది. దీంతో పాటు పరిశీలనా రుసుములనూ రద్దు చేస్తున్నట్లు వెల్లడించింది. గృహరుణాలు తీసుకోవాలనుకునే వారికి ఎంతో అనుకూలంగా ఈ వడ్డీ రేటు ఉందని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజయ్ తెలిపారు.

స్టాక్‌మార్కెట్లను కొల్లగొట్టిన అమెరికా సంస్థ!?



రూ.44,358 కోట్ల అక్రమార్జన

- సెబీ విచారణలో బట్టబయలు
- 'జేన్ స్ట్రీట్' పై నిషేధం
- దేశీయ స్టాక్‌మార్కెట్ చరిత్రలోనే అత్యధికంగా రూ.4,843 కోట్ల పెనాల్టీ

దిల్లీ

మన స్టాక్‌మార్కెట్లో చట్టవ్యతిరేక విధానాల ద్వారా, అక్రమంగా రూ.వేల కోట్లు ఆర్జించిన అమెరికాకు చెందిన జేన్ స్ట్రీట్ గ్రూపు అనే సంస్థపై మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నిషేధం విధించింది. స్టాక్‌మార్కెట్లో ఇండెక్స్ (ఆయా రంగాల సూచీ) ధరలను ప్రభావితం చేసి, మదుపరుల సొమ్మును కొల్లగొట్టటం ఈ సంస్థ చేసిన నేరం.

✦ జేన్ స్ట్రీట్ దాదాపు రూ.44,358 కోట్లు అక్రమంగా ఆర్జించినట్లు సెబీ నిర్ధారించింది. అదే సమయంలో స్టాక్ ఫ్యూచర్స్ ట్రేడ్‌లో రూ.7,208 కోట్లు, ఇండెక్స్ ఫ్యూచర్స్ ట్రేడ్‌లో రూ.191 కోట్లు, నగదు విభాగంలో రూ.288 కోట్లు పోగొట్టుకుంది. ఈ నష్టాలను మినహాయిస్తే, నికరంగా రూ.36,671 కోట్లు అక్రమంగా ఆర్జించినట్లు గుర్తించారు. అందులో రూ.4,843 కోట్ల సొమ్మును జరిమానాగా చెల్లించాలని సెబీ ఆదేశించింది.

✦ దేశీయ స్టాక్‌మార్కెట్ల చరిత్రలో సెబీ ఇంత పెద్దమొత్తాన్ని పెనాల్టీ రూపంలో రాబట్టాలని నిర్ణయించటం ఇదే ప్రథమం. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. జేన్ స్ట్రీట్ గ్రూపు సంస్థలైన జేఎస్ఐ ఇన్వెస్ట్‌మెంట్స్, జేఎస్ఐ2 ఇన్వెస్ట్‌మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్, జేన్ స్ట్రీట్ సింగపూర్ పీటీఈ లిమిటెడ్, జేన్ స్ట్రీట్ ఏషియా ట్రేడింగ్ సంస్థలు తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకూ మనదేశంలోని స్టాక్‌మార్కెట్లలో కార్యకలాపాలు నిర్వహించరాదనీ సెబీ స్పష్టం చేసింది.

ఎక్కడిదీ సంస్థ?

ప్రొప్రైటరీ ట్రేడింగ్ సేవల సంస్థ అయిన జేన్ స్ట్రీట్ గ్రూపు 2000 సంవత్సరంలో ఏర్పాటైంది. అమెరికా, ఐరోపా, ఆసియా దేశాల్లో ఈ సంస్థ కార్యాలయాల్లో 2,600 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. మనదేశంలో ముంబయి నుంచి కార్యకలాపాలు సాగిస్తోంది. స్టాక్‌మార్కెట్లో నగదు విభాగంతో పాటు ఫ్యూచర్స్, ఆప్షన్స్ ట్రేడింగ్ కార్యకలాపాల ద్వారా.. సూచీల ధరలను కృత్రిమంగా హెచ్చుతగ్గులకు లోను చేయడం ద్వారా, అనూహ్య లాభాలు ఆర్జించే విధానాలను ఈ సంస్థ అమలు చేసింది. ప్రధానంగా లిక్విడిటీ అధికంగా ఉండే బ్యాంక్ నిఫ్టీ, నిఫ్టీ ఇండెక్స్ ఆప్షన్లపై అత్యధికంగా ట్రేడింగ్ కార్యకలాపాలు నిర్వహించింది. ఈ సంస్థ 2023 జనవరి నుంచి 2025 మే నెల మధ్యకాలంలో నగదు, ఫ్యూచర్స్ విభాగాల్లో భారీ లావాదేవీలు సాగించింది, తద్వారా ఇండెక్స్ హెచ్చుతగ్గులను ప్రభావితం చేసినట్లు సెబీ గుర్తించింది, దర్యాప్తు చేపట్టింది. ఈ దర్యాప్తులో దిగ్భ్రాంతికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. ప్రధానంగా ఈ సంస్థ అనుసరించిన రెండు వ్యూహాలను పసిగట్టారు.

అక్రమ లావాదేవీలు ఇలా

✦ ఉదయాన్నే స్టాక్‌మార్కెట్లో ట్రేడింగ్ ప్రారంభం కాగానే జేన్ స్ట్రీట్ గ్రూపు తన సంస్థల ద్వారా బ్యాంక్ నిఫ్టీలో భాగంగా ఉన్న షేర్లను నగదు, ఫ్యూచర్స్ విభాగాలలో భారీగా కొనుగోలు చేస్తుంది. దీనివల్ల ఆ షేర్ల ధరలు పెరిగి, ఆమేరకు బ్యాంక్ నిఫ్టీ ధర పెరుగుతుంది.

✦ మధ్యాహ్నం తర్వాత వాటిని ఒకే సారి విక్రయిస్తుంది. దీనివల్ల ధరలు పడిపోతాయి.

✦ ఈ విషయం ముందే తెలుసు కాబట్టి, ఆమేరకు ఇండెక్స్ ఆప్షన్లలో పొజిషన్లు తీసుకుని, క్యాష్ చేస్తూ ఉంటుంది.

✦ ఆ పొజిషన్లు విక్రయించి భారీగా లాభాలు ఆర్జిస్తుంది. ఇదొక వ్యూహం.

మరొక వ్యూహాన్ని కూడా ...

✦ ఫ్యూచర్స్, ఆప్షన్స్ ఎక్స్‌పైరీ రోజు ట్రేడింగ్ ముగియడానికి చివరి 2-3 గంటల్లో బ్యాంక్ నిఫ్టీ, నిఫ్టీ షేర్లు, ఫ్యూచర్స్‌ను తరచుగా భారీగా కొనడం, అమ్మడం చేస్తుంది. దీనివల్ల బ్యాంక్ నిఫ్టీ, నిఫ్టీ ధరలు బాగా హెచ్చుతగ్గులకు లోనవుతాయి. ఆ ధరలకు అనుగుణంగా ఆప్షన్లు కొనడం, అమ్మడం చేసి లాభపడుతుంది. ఈ క్రమంలో నగదు విభాగం, ఫ్యూచర్స్‌లో కొంత సొమ్ము కోల్పోవాల్సి వస్తుంది. దానికి ఎన్నోరెట్లు అధికంగా ఆప్షన్లలో లాభాలు ఆర్జించే అవకాశం సంస్థకు కలుగుతుంది.

ఎఫ్‌పీఐ నిబంధనలను పాటించలేదు

మనదేశంలో విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపరి (ఎఫ్‌పీఐ) తరగతి కిందకు వచ్చే ఈ సంస్థ, నగదు, ఫ్యూచర్స్, ఆప్షన్స్ విభాగాల్లో ట్రేడింగ్ చేసే క్రమంలో ఎఫ్‌పీఐ నిబంధనలను మించినట్లు సెబీ గుర్తించింది. దాదాపు 21 సందర్భాల్లో లావాదేవీలు సాగించి, భారీ మొత్తాలు ఆర్జించినట్లు నిర్ధారించింది. దీంతో సెబీ దర్యాప్తు కొనసాగిస్తోంది. ఈ లోపు ఆ గ్రూపు సంస్థల బ్యాంకు ఖాతాల నుంచి, తన ముందస్తు అనుమతి లేకుండా చెల్లింపులు చేయరాదని బ్యాంకులకు ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటివరకు 18 రోజుల బ్యాంక్ నిఫ్టీ, 3 రోజుల నిఫ్టీ ఎక్స్‌పైరీలో అవకతవకలను మాత్రమే దర్యాప్తు చేసిన సెబీ.. ఇతర ఎక్స్‌పైరీ రోజులు, ఇతర సూచీలపై కూడా దృష్టి పెట్టనున్నట్లు తెలుస్తోంది.

బ్రోకరేజీ కంపెనీల షేర్లు డీలా: జేన్ స్ట్రీట్ పరిణామాల నేపథ్యంలో విదేశీ ట్రేడింగ్ కార్యకలాపాలతో సంబంధమున్న నువామా వెల్త్, ఏంజెల్ వన్ లాంటి స్టాక్ బ్రోకింగ్ కంపెనీలు, ప్రముఖ స్టాక్ ఎక్స్ఛేంజీ బీఎస్ఈ, సీడీఎస్ఎల్ షేర్లపై ఆ ప్రభావం కనిపించింది. నువామా వెల్త్ 11.26%, ఏంజెల్ వన్ 5.94%, బీఎస్ఈ 6.42%, సీడీఎస్ఎల్ 2.29% నష్టపోయాయి.

దేవయానీ ఇంటర్నేషనల్, సఫైర్ ఫుడ్స్ విలీనం!

ఇరు సంస్థలదీ కలిపి రూ.30,000 కోట్ల మార్కెట్ విలువ



దిల్లీ: అమెరికా దిగ్గజ ఫాస్ట్ ఫుడ్ సంస్థ యమ్ బ్రాండ్ ఇంక్‌కు మన దేశంలో ఉన్న రెండు అతిపెద్ద ఫ్రాంఛైజీ భాగస్వాములు దేవయానీ ఇంటర్నేషనల్, సఫైర్ ఫుడ్స్ ఇండియా విలీనానికి చర్చలు జరుగుతున్నాయి. కేఎఫ్‌సీ, పిజ్జా హట్, టాకో బెల్ వంటి బ్రాండ్లు యమ్ బ్రాండ్ చేతిలో ఉన్నాయి. మందకొడిగా ఉన్న వృద్ధిని ఎదుర్కొనేందుకు భారత్‌లో కార్యకలాపాలను ఏకీకరణ చేయాలన్నది యమ్ బ్రాండ్ ప్రతిపాదనగా ఆంగ్ల వార్తా సంస్థలు పేర్కొన్నాయి.


ప్రతిపాదిత విలీనం ఇలా

సఫైర్ వాటాదార్లు తమ ప్రతి 3 షేర్లకు ఒక దేవయానీ షేరును పొందుతారు. సఫైర్‌కు చెందిన కేఎఫ్‌సీ, పిజ్జా హట్ ఫ్రాంఛైజీ హక్కులను దేవయానీ కొనుగోలు చేస్తుంది. తద్వారా యమ్ భారత కార్యకలాపాలు ఈ సంస్థ కిందకు వస్తాయి.

✦ భారత కుబేరుడు రవి జయ్‌పురియాకు చెందిన ఆర్‌జే గ్రూప్‌లో భాగమైన దేవయానీ ఇంటర్నేషనల్, ప్రస్తుతం భారత్, నేపాల్, నైజీరియా, థాయ్‌లాండ్‌ల్లో 2,030 విక్రయశాలలను నిర్వహిస్తోంది. సునీల్ చందరమణి నేతృత్వంలోని సఫైర్ ఫుడ్స్ ఇండియాకు భారత్, శ్రీలంకల్లో 963 రెస్టారెంట్లు ఉన్నాయి. సఫైర్ మార్కెట్ విలువ రూ.10,313 కోట్లు కాగా.. దేవయానీ మార్కెట్ విలువ రూ.19,935 కోట్లుగా ఉంది. అంటే ఈ రెండు సంస్థల మార్కెట్ విలువ కలిపి రూ.30,000 కోట్ల పైనే.

బెజవాడ ఇంజినీర్.. అమెరికా ఫిన్‌టెక్‌లో భళా

ఫాల్కన్‌ఎక్స్ సీఈఓ రఘు యార్లగడ్డకు రెండు అవార్డులు



ఈనాడు, హైదరాబాద్: అమెరికాలోని డిజిటల్ అసెట్ ట్రేడింగ్ సేవల సంస్థ ఫాల్కన్‌ఎక్స్ సహ-వ్యవస్థాపకుడు, సీఈఓ రఘు యార్లగడ్డకు రెండు ప్రతిష్ఠాత్మక అవార్డులు లభించాయి. ఒకటి తానా అవార్డు కాగా, మరొకటి యూటీ డల్లాస్ అవార్డు. ఈ ఏడాది జనవరిలో 'యూటీ డల్లాస్ డిస్టింగ్విష్డ్ అల్యూమ్ని అవార్డు'కు ఎంపికైన ఆయన తాజాగా అమెరికాలో జరుగుతున్న 24వ తానా సదస్సులో 'తానా అవార్డ్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ ఫైనాన్షియల్ టెక్నాలజీ (ఫిన్‌టెక్) అవార్డు' అందుకుంటున్నారు. రఘు యార్లగడ్డ విజయవాడ వాస్తవ్యులు. వేలూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ) లో బీటెక్ (ఈసీఈ) చేశాక, అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్- డల్లాస్‌లో ఎంఎస్ (సిగ్నల్ ప్రాసెసింగ్, ఎంఎల్) ప్రోగ్రామ్ చేశారు. ఆ తర్వాత హార్వర్డ్ బిజినెస్ స్కూల్ నుంచి ఎంబీఏ పట్టా పుచ్చుకున్నారు. 2018లో కాలిఫోర్నియా కేంద్రంగా ఫాల్కన్‌ఎక్స్‌ను స్థాపించారు. ఈ సంస్థ విలువ ఇప్పటికే 8 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.70,000 కోట్ల)ను మించింది. కృత్రిమ మేధ (ఏఐ)ను విస్తృతంగా వినియోగించడం, విలువైన భాగస్వామ్యాలు కుదుర్చుకోవడం, ఈటీఎఫ్ విభాగంలో క్రియాశీలకంగా ఉండటం వల్లే ఫాల్కన్‌ఎక్స్ శరవేగంగా ఎదిగింది. ఈ సంస్థ ఈ ఏడాదిలో ఐపీఓకు రావటానికి సన్నద్ధం అవుతోంది. తద్వారా, ఇంజినీర్‌గా కెరీర్ ప్రారంభించి, ప్రపంచ స్థాయి ఔత్సాహిక పారిశ్రామికవేత్తగా ఎదిగిన తెలుగువాళ్ల జాబితాలో ఆయన స్థానం సంపాదించుకున్నట్లు అవుతుంది. సరైన ప్రణాళిక, ప్రోత్సాహం ఉంటే డిజిటల్ ఆస్తుల్లో భారతదేశం ప్రపంచ దేశాల్లో అగ్రస్థానానికి చేరుకోగలదని రఘు యార్లగడ్డ అభిప్రాయ పడ్డారు.

భారత్‌లో సంయుక్త సంస్థకు జేఎస్‌డబ్ల్యూ-రెనో చర్చలు

దిల్లీ: మనదేశంలో సంయుక్త సంస్థను ఏర్పాటు చేసేందుకు జేఎస్‌డబ్ల్యూ గ్రూప్‌తో రెనో చర్చలు జరుపుతున్నట్లు బ్లూమ్‌బర్గ్ వార్తా సంస్థ తెలిపింది. ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న వాహన మార్కెట్లలో ఒకటైన భారత్‌లో, తమ స్థానాన్ని బలోపేతం చేసుకోవాలని రెనో చూస్తోంది. ఇదే సమయంలో నిస్సాన్ మోటార్ కంపెనీతో భాగస్వామ్యాన్ని పునర్వ్యవస్థీకరణ చేయనుంది. చెన్నైలో సంయుక్తంగా ఏర్పాటు చేసిన ప్లాంట్‌లో నిస్సాన్ వాటాను రెనో కొనుగోలు చేసే ప్రక్రియ చివరి దశలో ఉన్నట్లు తెలుస్తోంది. జేఎస్‌డబ్ల్యూతో చర్చలు ప్రారంభ దశలోనే ఉన్నాయని, ఒప్పందం వరకు వెళ్లలేదని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. భారత్‌లో తమ కార్యకలాపాలను బలోపేతం చేయాలన్న రెనో వ్యూహంలో భాగంగా ఈ చర్చలు జరుగుతున్నాయి.

✦ ఎంజీ మోటార్ ఇండియాలో సజ్జన్ జిందాల్ నేతృత్వంలోని జేఎస్‌డబ్ల్యూ గ్రూప్‌నకు 35% వాటా ఉంది. చైనా ఎస్ఏఐసీ మోటార్ కార్ప్‌తో సంయుక్త సంస్థ ద్వారా ఈ పెట్టుబడులు పెట్టింది.

ఫీనిక్స్ ట్రైటన్ ప్రాజెక్ట్‌లో అర్థ గ్లోబల్ రూ.700 కోట్ల పెట్టుబడి

హైదరాబాద్: భారత్‌లో మొట్టమొదటి ప్రైవేట్ పెట్టుబడిని అర్థ గ్లోబల్ అపర్చ్యూనిటీస్ ఫండ్ ప్రకటించింది. హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని ప్రీమియం వాణిజ్య స్థిరాస్తి ప్రాజెక్ట్ ఫీనిక్స్ ట్రైటన్ పూర్తి చేసేందుకు రూ.700 కోట్లు అందించనుంది. నాలుగేళ్ల కాలవ్యవధితో నాన్ కన్వర్టబుల్ డిబెంచర్ల (ఎన్‌సీడీ) రూపంలో ఈ రుణాలను ఇవ్వనుంది. 3.15 ఎకరాల్లో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టులో 2.8 మిలియన్ చదరపు అడుగుల వాణిజ్య స్థలాన్ని అభివృద్ధి చేస్తున్నారు.

అమెరికాపై భారత్ ప్రతీకార సుంకాలు!

మన వాహన ఉత్పత్తులపై అమెరికా అమలు చేసిన టారిఫ్‌లే కారణం



దిల్లీ: ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) నిబంధనల కింద అమెరికాపై ప్రతీకార సుంకాలను భారత్ ప్రతిపాదించింది. భద్రతా చర్యల పేరిట వాహన ఉత్పత్తులపై అమెరికా విధించిన టారిఫ్‌లు డబ్ల్యూటీఓ నిబంధనల ఉల్లంఘన కిందకే వస్తాయని మనదేశం పేర్కొంది. అందువల్ల అమెరికాకు మినహాయింపులు, ఇతరత్రా చర్యలను రద్దు చేయాలని కోరుతూ డబ్ల్యూటీఓకు చెందిన కౌన్సిల్ ఫర్ ట్రేడ్ ఇన్ గూడ్స్‌ను భారత్ కోరింది.

ఇదీ జరిగింది: భారత్ నుంచి అమెరికాలోకి దిగుమతి అయ్యే ప్రయాణికుల వాహనాలు, తేలిక పాటి ట్రక్కులు, వాహన విడిభాగాలపై సుంకాన్ని 25% పెంచుతున్నట్లు అమెరికా ఈ ఏడాది మార్చి 26న ప్రకటించింది. మే 2 నుంచి ఇది అమల్లోకి వచ్చింది. అపరిమిత గడువుకు వర్తించేలా తీసుకున్న ఈ అంశాన్ని డబ్ల్యూటీఓకు అమెరికా నివేదించలేదు.

గాట్-1994నూ పాటించట్లేదు: జనరల్ అగ్రిమెంట్ ఆన్ ట్రేడ్ అండ్ టారిఫ్ (గాట్) 1994, సేఫ్‌గార్డ్స్ అగ్రిమెంట్ కింద అమెరికా చర్యలు సరైనవి కావని భారత్ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో భారత విజ్ఞప్తి మేరకు 'మినహాయింపులను ఇతర ప్రోత్సాహకాలను రద్దు చేసేందుకు భారత్‌కు హక్కు ఉందంటూ' డబ్ల్యూటీఓ నోటిఫికేషన్ వెలువరచింది. దీంతో అమెరికా నుంచి భారత్‌కు దిగుమతి అయ్యే వస్తువులపై అంతే సుంకాన్ని విధించాలని భారత్ ప్రతిపాదించిందనీ తెలిపింది. మరోవైపు, ఉక్కు, అల్యూమినియంపై అమెరికా టారిఫ్‌లకు స్పందనగా ప్రతీకార సుంకాలను విధించే హక్కు తమకుందని డబ్ల్యూటీఓకు భారత్ సమాచారం అందించింది.

అమెరికా సుంకాలు ఇలా

✦ ఏటా భారత్ నుంచి అమెరికాకు ఎగుమతయ్యే 2,895 మిలియన్ డాలర్ల ఉత్పత్తులపై అదనపు సుంకం పడుతోంది. ఇందువల్ల వసూలు చేయబోయే మొత్తం 723.75 మి. డాలర్లు కావచ్చు.

✦ ప్రపంచవ్యాప్తంగా అమెరికా గతేడాది 89 బి. డాలర్ల విలువైన వాహన విడిభాగాలను దిగుమతి చేసుకుంది. ఇందులో మెక్సికో(36 బి.డా.), చైనా(10.1 బి.డా.)లతో పోలిస్తే భారత వాటా(2.2 బి.డా.) చాలా తక్కువ.

9లోగా వాణిజ్య ఒప్పందం

దిల్లీ: అమెరికా-భారత్ మధ్య ఈనెల 9లోగా మధ్యంతర వాణిజ్య ఒప్పందం కుదిరే అవకాశం ఉంది. వాణిజ్య చర్చల నిమిత్తం అమెరికా వెళ్లిన భారత బృందం తిరిగివచ్చింది. వ్యవసాయ ఉత్పత్తులు, వాహన రంగాలతో పాటు మరికొన్ని అంశాలపై ఇరుదేశాల మధ్య చర్చలు కొనసాగనున్నాయని ఒక అధికారి పేర్కొన్నారు. తమ వ్యవసాయ దిగుబడులపై సుంకాల తగ్గింపులను అమెరికా కోరుతోంది. అందుకు ఆమోదిస్తే, మనదేశంలో రైతుల ప్రయోజనాలు దెబ్బతింటాయనే ఆందోళన ఉంది. ఇది రాజకీయంగా సున్నిత అంశమైనందున, వ్యవసాయ ఉత్పత్తులపై సుంకం మినహాయింపులకు భారత్ ససేమిరా అంటోంది. డెయిరీ రంగాన్ని సైతం ఏ వాణిజ్య భాగస్వామికీ మనదేశం అందుబాటులో ఉంచలేదు.

ఫిన్‌టెక్‌లోకి రూ.7,600 కోట్లు

2025 ప్రథమార్ధంపై ట్రాక్షన్ నివేదిక

దిల్లీ: ఈ ఏడాది ప్రథమార్ధం (జనవరి-జూన్)లో భారత ఫిన్‌టెక్ రంగం 889 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.7,600 కోట్లు) సమీకరించిందని మార్కెట్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్ ట్రాక్షన్ నివేదిక వెల్లడించింది. 2024 ద్వితీయార్ధంలో సమీకరించిన 1.2 బిలియన్ డాలర్ల (సుమారు 10,300 కోట్ల)తో పోలిస్తే ఇది 26% తక్కువ. 2024 ప్రథమార్ధంలో వచ్చిన 936 మి.డాలర్ల (రూ.8,000 కోట్ల)తో చూస్తే 5% తక్కువని వెల్లడించింది. ఫిన్‌టెక్ సంస్థల్లోకి నిధుల సమీకరణలో.. ప్రపంచంలో భారత్ మూడో స్థానంలో నిలిచింది. మొదటి రెండు స్థానాల్లో అమెరికా, బ్రిటన్ ఉన్నాయి.



'నిధుల సమీకరణలో భారత ఫిన్‌టెక్ రంగం కొద్దిగా నెమ్మదించింది. ప్రారంభ స్థాయి పెట్టుబడులు స్థిరంగా ఉండటం, కొనుగోలు కార్యకలాపాల్లో వృద్ధితో పెట్టుబడిదార్ల ఆసక్తి బలంగా ఉందని స్పష్టమవుతోంది. ముఖ్యంగా వినూత్నత ఆధారిత మోడళ్లపై ఆశావహంగా ఉన్నారు' అని ట్రాక్షన్ సహవ్యవస్థాపకులు నేహ సింగ్ వెల్లడించారు. ఫిన్‌టెక్ రంగంలో బెంగళూరు ఆధిపత్యం కొనసాగుతోందని, తద్వారా అంతర్జాతీయ ఫిన్‌టెక్‌లో భారత్ స్థానం బలంగా ఉందని తెలిపారు.

✦ ఫిన్‌టెక్ రంగ కంపెనీల్లో సీడ్ స్టేజ్, లేట్ స్టేజ్ పెట్టుబడులతో పోలిస్తే ప్రారంభ స్థాయి పెట్టుబడులు మెరుగ్గా ఉన్నాయి. సీడ్ స్టేజ్ స్టార్టప్‌లు 91.2 మి.డాలర్లు సమీకరించాయి. 2024 ద్వితీయార్ధం (126 మి.డాలర్ల)తో చూస్తే ఇవి 27% తక్కువ. 2024 ప్రథమార్ధంలో వచ్చిన 137 మి.డాలర్లతో పోలిస్తే 33% క్షీణించాయి.

✦ ప్రారంభ స్థాయి సంస్థలు మాత్రం 361 మి.డాలర్లు సమీకరించాయి. 2024 ద్వితీయార్ధంలో వచ్చిన 329 మి.డాలర్లతో చూస్తే 10% వృద్ధి నమోదైంది. 2024 ప్రథమార్ధంలో సమీకరించిన 9 శాతంతో పోలిస్తే 9% పెరిగాయి.

✦ లేట్ స్టేజ్ సమీకరణ మాత్రం 437 మి.డాలర్లకు తగ్గాయి. 2024 ద్వితీయార్ధం (745 మి.డాలర్ల)తో పోలిస్తే 41%, 2024 ప్రథమార్ధం (467 మి.డాలర్ల)తో చూస్తే 6% చొప్పున క్షీణత కనిపించింది.

✦ 2025 ప్రథమార్ధంలో 16 కొనుగోళ్లు నమోదయ్యాయి. 2024 ప్రథమార్ధంలో 11 కొనుగోళ్లు ఉండగా, 2024 ద్వితీయార్ధంలో 17 కొనుగోళ్లు జరిగాయి. ఫిస్‌డమ్‌ను గ్రో 150 మి.డాలర్లకు కొనుగోలు చేయడం అతిపెద్ద లావాదేవీగా ఉంది. స్టాకోను ఇన్‌క్రెడ్ మనీ 35 మి.డాలర్లకు దక్కించుకుంది.

✦ మొత్తం నిధుల సమీకరణలో బెంగళూరు వాటా 55 శాతంగా ఉంది. ముంబయి 14 శాతంతో రెండో స్థానంలో నిలిచింది.

పాకిస్థాన్‌లో మైక్రోసాఫ్ట్ మూతపడింది



కరాచీ: ప్రపంచ వ్యాప్తంగా ఉద్యోగాల్లో కోతలు విధిస్తున్న మైక్రోసాఫ్ట్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. పాకిస్థాన్‌లో 25 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన తన కార్యాలయాన్ని మూసివేస్తున్నట్లు గురువారం ప్రకటించింది. పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థకు ఇదొక 'ఆందోళనకర సంకేతం'గా పలువురు విశ్లేషిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉద్యోగుల హేతుబద్ధీకరణ, క్లౌడ్ ఆధారిత సేవలు విస్తరణలో భాగంగా 9,100 మందికి మైక్రోసాఫ్ట్ లేఆఫ్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో పాకిస్థాన్‌లోని కార్యాలయాన్ని మూసేస్తున్నట్లు ప్రకటించింది. ఈ పరిణామంపై మైక్రోసాఫ్ట్ పాకిస్థాన్ మాజీ కంట్రీ మేనేజర్ జవ్వద్ రెహమాన్ స్పందిస్తూ.. ప్రభుత్వం, ఐటీ మంత్రి ఈ విషయంపై దృష్టి సారించాలని, తగిన ప్రణాళికలతో కంపెనీలను సంప్రదించాలని 'ఎక్స్' వేదికగా సూచించారు. దేశంలో ప్రస్తుత వ్యాపార పరిస్థితులను ఈ పరిణామం ప్రతిబింబిస్తోందన్నారు. మైక్రోసాఫ్ట్ వంటి అంతర్జాతీయ దిగ్గజాలూ ఇక్కడ ఉండలేకపోతున్నాయన్నారు. పాకిస్థాన్ మాజీ అధ్యక్షుడు ఆరిఫ్ అల్వీ సైతం ఈ విషయంపై ఎక్స్ వేదికగా స్పందించారు.

ఒడుదొడుకులు.. ఆఖర్లో లాభాలు

దిగ్గజ కంపెనీల షేర్లల్లో కొనుగోళ్ల ప్రభావం

ఎఫ్ఐఐ విక్రయాలు.. రూ.760.11 కోట్లు
డీఐఐ విక్రయాలు.. రూ.1,028.24 కోట్లు



సెన్సెక్స్ ▲ 193	నిఫ్టీ ▲ 56
83433	25461

అధిక ఒడుదొడుకుల మధ్య మన స్టాక్ మార్కెట్ లాభాల్లో ముగిసింది. బ్యాంకింగ్ సహా సూచీల్లో అధిక వాటా ఉన్న కొన్ని దిగ్గజ కంపెనీల షేర్ల రాణింపు ఇందుకు దోహదం చేసింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 15 పైసలు పెరిగి 85.40 వద్ద ముగిసింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు ధర 0.87% నష్టంతో 68.16 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

✦ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.97,000 కోట్లు పెరిగి రూ.461.23 లక్షల కోట్ల (5.40 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.

మధ్యాహ్నం వరకు నష్టాల్లోనే..: సెన్సెక్స్ (క్రితం ముగింపు 83,239.47తో పోలిస్తే) స్వల్ప లాభంతో 83,306.81 పాయింట్ల వద్ద ఆరంభమైంది. ఆ తర్వాత నష్టాల్లోకి జారుకుని 83,015.83 పాయింట్ల వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని చేరింది. అక్కడ నుంచి సూచీ బలంగా పుంజుకుని, లాభాల్లోకి వచ్చింది. చివరకు 193.42 పాయింట్ల లాభంతో 83,432.89 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 55.70 పాయింట్లు పెరిగి 25,461 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 25,470.25 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని, 25,331.65 పాయింట్ల వద్ద నష్టాన్ని నమోదు చేసింది.

ట్రెంట్‌కు అమ్మకాల ఒత్తిడి..: సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో 10 మినహా మిగతావి లాభాల్లో ముగిశాయి. టాటా గ్రూపునకు చెందిన ట్రెంట్ షేరు 11.93% నష్టపోయింది. కంపెనీకి చెందిన ఫ్యాషన్ విభాగానికి సంబంధించి, సమీప కాల వృద్ధి అంచనాలు నిరాశపర్చడం ఇందుకు కారణం. టాటా స్టీల్ 1.72%, టెక్ మహీంద్రా 1.07%, మారుతీ సుజుకీ 0.81%, అదానీ పోర్ట్స్ 0.44%, మహీంద్రా అండ్ మహీంద్రా 0.41% చొప్పున తగ్గాయి. బజాజ్ ఫైనాన్స్ 1.6%, ఇన్ఫోసిస్ 1.36%, హిందుస్థాన్ యునిలీవర్ 1.19%, ఐసీఐసీఐ బ్యాంక్ 1.15%, అల్ట్రాటెక్ సిమెంట్ 0.9% పెరిగాయి.

జీవనకాల గరిష్ఠానికి చేరువలో విదేశీ మారకపు నిల్వలు




ముంబయి: మన విదేశీ మారకపు నిల్వలు జూన్ 27వ తేదీతో ముగిసిన వారంలో 4.84 బిలియన్ డాలర్లు పెరిగి 702.78 బిలియన్ డాలర్లకు చేరాయి. అంతకుముందు వారంలో ఇవి 1.01 బిలియన్ డాలర్లు పెరిగి 697.93 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. 2024 సెప్టెంబరు చివర్లో నమోదైన 704.885 బిలియన్ డాలర్ల విదేశీ మారకపు నిల్వలే ఇప్పటివరకు జీవనకాల గరిష్ఠంగా ఉన్నాయి. ఆర్‌బీఐ విడుదల చేసిన వివరాల ప్రకారం.. సమీక్షిస్తున్న వారంలో విదేశీ కరెన్సీ ఆస్తులు 5.75 బిలియన్ డాలర్లు పెరిగి 594.82 బిలియన్ డాలర్లకు చేరాయి. పసిడి నిల్వలు 1.23 బిలియన్ డాలర్లు తగ్గి 84.5 బిలియన్ డాలర్లుగా పరిమితమయ్యాయి. స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ 158 మిలియన్ డాలర్లు పెరిగి 18.83 బిలియన్ డాలర్లకు చేరాయి. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) వద్ద భారత నిల్వల స్థితి 176 మిలియన్ డాలర్లు పెరిగి 4.62 బిలియన్ డాలర్లుగా ఉంది.

షెల్ చేతికి రాజ్ పెట్రో స్పెషాలిటీస్



ముంబయి: రాజ్ పెట్రో స్పెషాలిటీస్‌ను కొనుగోలు చేయడం ద్వారా ప్రపంచంలో మూడో అతిపెద్ద ల్యూబ్రికెంట్ విపణి అయిన భారత్‌లో తన ఉనికిని మరింతగా విస్తరించుకునే యత్నాల్లో అంతర్జాతీయ ఇంధన దిగ్గజం షెల్ ఉంది. ఇప్పటికే భారత్‌లోని ఎల్ఎన్‌జీ టర్మినల్స్, ఇంధన విక్రయ కేంద్రాలు, పునరుత్పాదక విద్యుత్, టెక్నాలజీ కేంద్రాలపై 5 బిలియన్ డాలర్ల (సుమారు రూ.42,500 కోట్ల)ను షెల్ పెట్టుబడులుగా పెట్టింది.

☛ క్రిజాక్ లిమిటెడ్ తొలి పబ్లిక్ ఆఫర్ ముగిసేసరికి 59.82 రెట్ల స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా 2,58,36,909 షేర్లను జారీ చేయనుండగా.. 1,54,56,79,488 షేర్లకు బిడ్‌లు దాఖలయ్యాయి. చిన్న మదుపర్ల విభాగంలో 10.24 రెట్ల స్పందన లభించింది.


బాలగంగాధర్ తిలక్


బిపిన్ చంద్రపాల్

భారతదేశాన్ని పట్టిపీడిస్తున్న ఆంగ్లేయుల అరాచకాలు అంతకంతకూ పెరిగిపోయాయి. బ్రిటిష్ వారి కబంధ హస్తాల నుంచి దేశ విముక్తి కోరుతూ స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న వారిపై వారి దమనకాండ పెచ్చరిల్లుతూ పోయింది. దీనికి వ్యతిరేకంగా కొందరు అహింసను నమ్మి ముందుకు సాగితే, మరికొందరు హింసే మార్గమని భావించారు. బ్రిటిష్‌వారి పాలనకు వ్యతిరేకంగా స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కోసం దేశంలోని వివిధ వర్గాలవారు స్వాతంత్ర్యోద్యమంలో భాగమయ్యారు. ఈ పోరాటంలో వామపక్షాలు, సాయుధ పోరాట భావాలు ఉన్నవారు, మితవాదులు, అతివాదులు, విప్లవకారులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్యమే లక్ష్యంగా సమరశీల ఉద్యమం

పోటీ పరీక్షల ప్రత్యేకం
భారతదేశ చరిత్ర

భారత స్వాతంత్ర్యోద్యమం - విప్లవకారులు

1906 నుంచి 1920 వరకు కొనసాగిన జాతీయోద్యమ దశను సమరశీల జాతీయోద్యమం లేదా తీవ్రవాద జాతీయోద్యమంగా పిలుస్తారు.

▮ మితవాదులు బ్రిటిష్ ప్రభుత్వం పట్ల విధేయత చూపిస్తూ సంతులిత పద్ధతిలో విన్నవిస్తే, వాటిని ప్రభుత్వం ఆమోదించి పరిష్కరిస్తుందని భావించారు. రాజ్యాంగబద్ధ ఉద్యమం ద్వారా సరైన పద్ధతిలో పరిమిత విమర్శలు, డిమాండ్లతో బ్రిటిష్ వారిపై ఒత్తిడి తీసుకువచ్చి స్వాతంత్ర్యం సాధించాలనుకున్నారు.

▮ అతివాదులు పూర్తిస్థాయి స్వాతంత్ర్యం కోసం స్వరాజ్య సాధనే ధ్యేయంగా పోరాడారు. వీరు తమ భావాలను వ్యక్తపరుస్తూ ప్రజల్లో జాతీయతా భావాన్ని పెంపొందించి, ఉద్యమాల ద్వారా అనుకున్న లక్ష్యం సాధించాలని ఆకాంక్షించారు.

▮ అతివాదుల్లో లాలాలజపతిరాయ్, బాలగంగాధర్ తిలక్, బిపిన్ చంద్రపాల్ ముఖ్యమైనవారు. వీరంతా తీవ్రవాద జాతీయవాదానికి బలమైన పునాది వేశారు. తిలక్ 'స్వరాజ్యం నా జన్మహక్కు' అని ప్రకటించారు.


లాలాలజపతిరాయ్

▮ సమరశీల జాతీయవాదులు వీరికి సమాంతరంగా సాయుధ పోరాటాలు నిర్వహించి జాతీయోద్యమంలో కీలకపాత్ర పోషించారు.

విప్లవ జాతీయవాదులు

వీరు సాయుధ పోరాటం ద్వారా మాత్రమే బ్రిటిష్ పాలనను అంతమొందించవచ్చని నమ్మారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని, వారి సైనికశక్తిని నిర్మూలించడానికి హింసాయుత విధానాలను అనుసరించారు.

❖ 1857 సిపాయిల తిరుగుబాటు తర్వాత బ్రిటిష్ ప్రభుత్వం చేపట్టిన అనేక హింసా విధానాలు, దమననీతి, జాతీయ నాయకుల రాజకీయ పోరాట వైఫల్యం, ఉద్యమకారుల వ్యక్తిత్వం విప్లవవాద విజృంభణకు కారణాలుగా పేర్కొనవచ్చు.

❖ వీరు బ్రిటిష్ పాలనా యంత్రాంగాన్ని నిర్వీర్యం చేయడం, బ్రిటిష్ వారికి సహకరించిన భారతీయులను శిక్షించడం, ఆంగ్లేయులను హతమార్చడం, రహస్య సంఘాలను స్థాపించడం లాంటివి చేశారు.

❖ 20వ శతాబ్ది ప్రారంభం నాటికి అనేక సమితులతో పాటు రహస్య సంఘాలను స్థాపించారు. వీటిలో యువకులు, విద్యార్థులను సభ్యులుగా చేర్చుకున్నారు. వీరికి దేహదారుఢ్యంతో పాటు కుస్తీ పట్టడం, మల్లయుద్ధ విధానం, కత్తిసాము, కర్రసాము, గుర్రపుస్వారీ మొదలైన వాటిలో ప్రావీణ్యం ఉండేది. ధైర్య సాహసాలతో వీరు శత్రువులను ఎదుర్కొనేవారు. ❖ విప్లవ కార్యక్రమాలకు కావాల్సిన ధనం చందాల ద్వారా సమకూర్చుకునేవారు. ప్రభుత్వ ధనాగారాలను కొల్లగొట్టి డబ్బు సంపాదించడం వీరి కార్యక్రమాల్లో భాగంగా ఉండేది.

❖ విప్లవవాదులు బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, స్విట్జర్లాండ్, జపాన్, చైనా, హాంగ్‌కాంగ్, సింగపూర్, అమెరికా, కెనడా, ఫిలిప్పీన్స్, టర్కీ, ఆఫ్ఘనిస్థాన్ మొదలైన దేశాల్లో విప్లవవాద సంస్థలు ఏర్పాటు చేసి బ్రిటిష్‌వారికి వ్యతిరేకంగా కార్యకలాపాలు నిర్వహించేవారు. విదేశాల నుంచి రహస్యంగా ఆయుధాలు, ముందుగుండు సామగ్రి సమకూర్చుకునేవారు.

❖ దేశంలో బెంగాల్, ఉత్తర్‌ప్రదేశ్, మద్రాసు, పంజాబ్, ఢిల్లీ మొదలైన ప్రాంతాల్లో విప్లవ కార్యక్రమ కేంద్రాలు ఉండేవి.


బెంగాల్‌లో విప్లవవాదులు

బెంగాల్‌లో విప్లవోద్యమాన్ని నిర్వహించినవారు అరబిందోఘోష్, అతడి సహోదరుడు బరీంద్రకుమార్ ఘోష్, స్వామి వివేకానందుడి సోదరుడు భూపేంద్రనాథ్ దత్తా.

◆ ఈ ఉద్యమానికి ఆధ్యాత్మిక ఛాయను అందించడమే కాకుండా భగవద్గీత సందేశాన్ని విస్తృతంగా ప్రచారం చేశారు.

◆ 1906లో బరీంద్రకుమార్ ఘోష్, భూపేంద్రనాథ్ దత్తా 'యుగాంతర్' అనే పత్రికను స్థాపించారు. రాజద్రోహ నేరం కారణంగా బ్రిటిష్ ప్రభుత్వం ఈ పత్రికను నిషేధించడంతో పాటు వీరికి అనేక పర్యాయాలు జరిమానాలు, శిక్ష విధించారు.

◆ అరబిందో ఘోష్ వందేమాతరం పత్రికను, బ్రహ్మబంద్ ఉపాధ్యాయులు సంధ్యా అనే పత్రికను ప్రచురించి విప్లవోద్యమాన్ని ఉద్ధృతంగా ప్రచారం చేశారు.


అరబిందో ఘోష్

◆ విప్లవకారులపై బంకించంద్ర ఛటర్జీ, స్వామి వివేకానంద, అరబిందో ఘోష్ రచనల ప్రభావం తీవ్రంగా ఉండేది. బరీంద్రకుమార్ ఘోష్ బెంగాల్ యువకుల్లో ధైర్యసాహసాలు నింపి, స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగానికైనా వెనుకాడవద్దని ఉద్బోధించేవారు.

◆ 1902లో సతీష్‌చంద్రబసు, ప్రమతనాథ్ మిత్రాలు కలకత్తాలో అనుశీలన్ సమితిని స్థాపించారు. వీరికి బరీంద్రకుమార్ ఘోష్, అతడి అనుచరులు సహకరించారు.

◆ ఢాకా కేంద్రంగా పులిన్ బెహారి దాస్ అనుశీలన్ సమితిని స్థాపించాడు. దీనికి తూర్పు బెంగాల్‌లో 500 శాఖలుండేవి. ఈ సమితులకు అరబిందో ఘోష్, సిస్టర్ నివేదిత సహకరించారు.

◆ ఈ రెండు సమితులు కలకత్తా, ఢాకా కేంద్రాలుగా పనిచేస్తూ విప్లవ సాహిత్యాన్ని పంచి, అజ్ఞాతవర్గాలను నెలకొల్పాయి. ఇవి రష్యన్, ఇటాలియన్ రహస్య సంఘాల నమూనాలో పనిచేసేవి. దీనిలోని కార్యకర్తలు స్వాతంత్ర్యోద్యమంలో పాలుపంచుకునే వారిని ఇబ్బందులకు గురిచేస్తున్న బ్రిటిష్ అధికారులపై పోరునెరిపేవారు.

◆ బెంగాల్‌లో బిపిన్ బెహారి గంగూలీ 'ఆత్మోన్నతి సమితి' అనే విప్లవ సంఘాన్ని స్థాపించారు.

◆ శకరాం గణేష్ దేశ్‌కర్ (మరాఠీ స్కాలర్) బెంగాల్, మహారాష్ట్ర విప్లవకారులను ఏకం చేసి ఉద్యమంలో పాల్గొనేలా చేశారు. బెంగాల్ విభజన (1905) అనంతరం విప్లవకారుల కార్యక్రమాలు మరింత పెరిగాయి.

◆ సుహృద్ సమితి, సాధనా సమితిని మైమన్‌సింగ్ స్థాపించారు.

◆ అరబిందో ఘోష్, భూపేంద్రనాథ్ దత్తా, రాజా సుబోధ్‌మాలిక్, బరీంద్ర ఘోష్ 1906లో యుగాంతర్ అనే విప్లవ సంఘాన్ని స్థాపించారు. బాంబులు తయారు చేయడం, జనసమ్మతం కాని బ్రిటిష్ అధికారులను చంపడమే ప్రధాన లక్ష్యంగా ఈ సంఘం పని చేసేది.

◆ విప్లవకారులు తూర్పు బెంగాల్ లెఫ్టినెంట్ గవర్నర్ పుల్లర్‌పై మొదటి బాంబును ప్రయోగించారు. కానీ ఆ ప్రయత్నం ఫలించలేదు. ఆ తర్వాత 1907 డిసెంబరు 6న మిద్నాపూర్ వద్ద బెంగాల్ లెఫ్టినెంట్ గవర్నర్ ప్రయాణిస్తున్న రైలు పేల్చేందుకు ప్రయత్నించారు, అదే నెలలో ఢాకా జిల్లా మాజీ మెజిస్ట్రేట్ 'లెన్‌'ను కాల్చి వేశారు.

◆ కింగ్స్‌ఫోర్డ్ అనే మెజిస్ట్రేట్ కలకత్తాలో ఉన్నప్పుడు సుశీల్‌సేన్ అనే యువకుడిని వందేమాతరం అన్నందుకు 16 కొరడా దెబ్బలు కొట్టించాడు. దీంతో ఆగ్రహానికి గురైన విప్లవకారులు అతడిని హత్య చేయాలని భావించారు. కానీ ముందుగానే పసిగట్టిన బ్రిటిష్ ప్రభుత్వం అతడిని ముజఫర్‌నగర్ (బిహార్) మెజిస్ట్రేట్‌గా బదిలీ చేసింది. ఇతడిని హత్య చేసేందుకు 1908 ఏప్రిల్ 30న కింగ్స్‌ఫోర్డ్ ప్రయాణిస్తున్న రైలుకోచ్‌పై ఖుదీరాంబోస్, ప్రఫుల్లాచౌకి అనే విప్లవకారులు బాంబులు విసిరారు. అయితే ఈ దాడిలో కింగ్స్‌ఫోర్డ్, కెన్నడీ తప్పించుకోగా కెన్నడీ భార్య, కుమార్తె చనిపోయారు.

◆ ప్రఫుల్లాచౌకి తనను తాను కాల్చుకుని ఆత్మహత్య చేసుకోగా, ఖుదీరాంబోస్‌ను అరెస్ట్ చేసి విచారణ అనంతరం ఉరి తీశారు. వీరి త్యాగాలను బాలగంగాధర్ తిలక్ 'కేసరి' అనే పత్రికలో ప్రశంసించగా, రాజద్రోహనేరం కింద ఆరేళ్ల మాండలే జైలుకు పంపారు.


రచయిత
డాక్టర్ వి. రాజమహ్మద్
అసోసియేట్ ప్రొఫెసర్

Word of the Day

701

Bigotry

Telugu meaning: మూఢవిశ్వాసం, మతవైరం

English meaning: The word bigotry (బిగట్రీ) is a noun that describes unreasonable attachment to a particular belief or opinion, especially prejudice or intolerance toward those who are different.

Synonyms: Intolerance, Prejudice

Antonyms: Open-mindedness, Acceptance

Usage: 1. Bigotry in any form can divide societies and destroy mutual respect among communities.

2. His speech condemned the rising bigotry and called for unity among all ethnic groups.

కరెంట్ అఫైర్స్




అయిదు దేశాల పర్యటన కోసం 2025, జులై 2న దిల్లీ నుంచి బయల్దేరిన ప్రధాని నరేంద్ర మోదీ తొలుత ఘనా రాజధాని అక్రా చేరుకున్నారు. గత మూడు దశాబ్దాల్లో భారత ప్రధాని ఒకరు ఘనాను సందర్శించడం ఇదే ప్రథమం. మోదీకి ఘనా తమ దేశ అత్యున్నత పౌర పురస్కారమైన 'ది ఆఫీసర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది స్టార్ ఆఫ్ ఘనా'ను ప్రదానం చేసింది.



భారత క్రికెట్ టెస్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఇంగ్లండ్ జట్టుపై ఆ దేశంలో జరిగిన టెస్టుల్లో డబుల్ సెంచరీ సాధించిన తొలి భారత, ఆసియా కెప్టెన్‌గా రికార్డు సృష్టించాడు. 2025, జులై 3న బర్మింగ్‌హామ్‌లో జరిగిన రెండో టెస్టు రెండో రోజు 269 పరుగులు (387 బంతుల్లో 30×4, 3×6) చేశాడు.

▮ శ్రీలంక బ్యాటర్ దిల్షాన్ 2011లో లార్డ్స్‌లో సాధించిన 193 పరుగులే ఇప్పటివరకు ఇంగ్లండ్‌లో ఓ ఆసియా కెప్టెన్ చేసిన అత్యధిక స్కోరు.



బాలీవుడ్ హీరోయిన్ దీపికా పదుకొణె 'హాలీవుడ్ వాక్ ఆఫ్ ఫేమ్ స్టార్ 2026'కు ఎంపికయ్యారు. ఈ గౌరవాన్ని దక్కించుకున్న తొలి భారతీయ నటిగా రికార్డు సృష్టించింది. మోషన్ పిక్చర్స్ విభాగంలో ఆమె ఈ ఘనతను సొంతం చేసుకుంది.

ప్రపంచవ్యాప్తంగా ఉత్తమ ఆహారం లభించే 100 దేశాల జాబితాలో భారత్‌కు 12వ స్థానం లభించింది. క్రొయేషియా ప్రధాన కేంద్రంగా కార్యకలాపాలు సాగించే ప్రఖ్యాత ప్రైవేట్ ట్రావెల్ గైడ్ సంస్థ 'టేస్ట్ అట్లాస్' ఈ జాబితాను ఇటీవల విడుదల చేసింది. గ్రీస్ మొదటి స్థానంలో నిలిచింది. అమెరికా 13వ ర్యాంకులో ఉంది.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

ఎస్‌డీజీ రిపోర్ట్ 2025: టాప్ - 10 దేశాలు

స్టడీ - జోన్

ప్రకృతిలోని సహజవనరులను పరిమితంగా వినియోగించుకుని, అభివృద్ధి చెందుతూ.. వాటిని తర్వాతి తరాలకు అందించడమే సుస్థిరాభివృద్ధి. రియో సదస్సు జరిగి 2012 నాటికి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రపంచ దేశాధినేతలు రియోలో సమావేశమై సుస్థిరాభివృద్ధి లక్ష్యాల (ఎస్‌డీజీ) గురించి చర్చించారు. ఇందులో చర్చకు వచ్చిన అంశాలకు 2015లో ఐక్యరాజ్యసమితి (యూఎన్) సర్వ సభ్య సమావేశంలో ఆమోదం తెలిపారు. వీటినే అజెండా 2030 అని పిలుస్తారు. ఇందులో మొత్తం 17 లక్ష్యాలు, 169 ఉపలక్ష్యాలు ఉన్నాయి. 2016 జనవరి నుంచి ప్రారంభించి 2030 డిసెంబరు నాటికి వీటిని సాధించాలని తీర్మానించారు.

▮ ప్రపంచ స్థాయిలో ఎస్‌డీజీ పురోగతి ఏ విధంగా ఉందనే విషయంపై యూఎన్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ సొల్యూషన్ నెట్‌వర్క్ (ఎస్‌డీఎస్ఎన్) ఏటా సుస్థిరాభివృద్ధి నివేదిక (ఎస్‌డీఆర్)ను విడుదల చేస్తుంది. ఎస్‌డీఎస్ఎన్ ఇటీవల ఎస్‌డీఆర్ 2025 పేరుతో తన 10వ రిపోర్ట్‌ను వెలువరించింది. మొత్తం 167 దేశాల పురోగతిని పాయింట్లు, స్థానాల రూపంలో నివేదిక వెల్లడించింది.



▮ ఐక్యరాజ్యసమితి నిర్దేశిత సుస్థిరాభివృద్ధి లక్ష్యాల (ఎస్‌డీజీ) సాధనలో భారతదేశం మొట్టమొదటిసారి తొలి 100 స్థానాల్లో చోటు దక్కించుకుంది. 2025 ఎస్‌డీజీ సూచీలో 67 స్కోరుతో మన దేశం 99వ స్థానంలో నిలిచింది. 2024లో 109వ ర్యాంకులో ఉంది.

▮ నివేదికలో చివరి ర్యాంకుల్లో సౌత్ సూడాన్ (167, 41.6 స్కోరు), సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్ (166, 45.2 స్కోరు), చద్ (165, 46.0 స్కోరు), సోమాలియా (164, 46.1 స్కోరు), యెమన్ (163, 47.7 స్కోరు) ఉన్నాయి.

ఎస్‌డీజీ లక్ష్య సాధనలో టాప్-10 దేశాలను పరిశీలిస్తే..

ర్యాంకు	దేశం	స్కోరు
1	ఫిన్లాండ్	87.0
2	స్వీడన్	85.7
3	డెన్మార్క్	85.3
4	జర్మనీ	83.7
5	ఫ్రాన్స్	83.1
6	ఆస్ట్రియా	83.0
7	నార్వే	82.7
8	క్రొయేషియా	82.4
9	పోలండ్	82.1
10	చెక్ రిపబ్లిక్	81.9

జనరల్ స్టడీస్ - ఇండియన్ ఎకానమీ

భారతదేశంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు

దేశ ఆర్థికాభివృద్ధిలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు కీలకపాత్ర పోషిస్తాయి. రుణం లేని ఆర్థిక వనరులను అందించడం, సాంకేతిక పరిజ్ఞానం బదిలీ, ఉపాధి అవకాశాల పెరుగుదల లాంటివి ఎఫ్‌డీఐల వల్ల కలిగే ప్రయోజనాలు. అందుకే భారత ప్రభుత్వం పన్నులు, ప్రత్యేక పెట్టుబడి ప్రోత్సాహకాల ద్వారా విదేశీ పెట్టుబడులను ఆకర్షించే ప్రయత్నం చేస్తోంది. విదేశీ మూలధనం - ఆవశ్యకత, రకాలు; ఎఫ్‌డీఐలను అనుమతించడానికి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు మొదలైనవాటిపై పోటీపరీక్షార్థికి అవగాహన అవసరం.



విదేశీ మూలధనం

అభివృద్ధి చెందుతున్న దేశాల్లో పారిశ్రామికీకరణ వేగవంతం కావాలంటే తొలిదశలో యంత్రాలు, పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానం, ముడిపదార్థాలు మొదలైనవాటిని దిగుమతి చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం విదేశీ మారక ద్రవ్యం అవసరం.

రకాలు

విదేశీ మూలధనం ఆరు రకాలు. అవి:

1. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు
2. విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు
3. భాగస్వామ్యం 4. ప్రభుత్వాల మధ్య రుణాలు
5. అంతర్జాతీయ విత్తసంస్థల నుంచి రుణాలు
6. విదేశీ బ్యాంకుల నుంచి రుణాలు

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి సదుపాయ పోర్టల్

విదేశీ పెట్టుబడి అభివృద్ధి మండలి (ఎఫ్ఐపీబీ) స్థానంలో 2017, జూన్‌లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి సదుపాయ పోర్టల్‌ను నెలకొల్పారు.

అనుమతి విధానాలు

భారతదేశంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అనుమతించేందుకు ప్రభుత్వం రెండు విధానాలను అనుసరిస్తుంది. అవి: స్వయంచాలక మార్గం, ఆమోద మార్గం.

1991 నూతన పారిశ్రామిక విధానం - విదేశీ పెట్టుబడి, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 2.0, దేశంలోకి ఎఫ్‌డీఐల ప్రవాహం మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

నోటిఫికేషన్స్

ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు ఎంబీఏ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్ 2025

ఆర్థిక పరిస్థితుల కారణంగా ఉన్నత చదువులు చదవలేని ప్రతిభావంతులైన విద్యార్థులకు చేయూత అందించేందుకు ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు రూ.2 లక్షల ఉపకార వేతనాన్ని అందిస్తోంది. ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ 20 జులై 2025.

హోమీ బాబా క్యాన్సర్ హాస్పిటల్‌లో ఉద్యోగాలు

హోమీ బాబా క్యాన్సర్ హాస్పిటల్ & రిసెర్చ్ సెంటర్, బిహార్ మెడికల్ ఫిజిసిస్ట్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 39. అర్హులైన అభ్యర్థులు 2025, జులై 10, 11, 14, 15 తేదీల్లో ఇంటర్వ్యూకు హాజరుకావొచ్చు.

ఆశా వర్కర్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, జిల్లా వైద్య, ఆరోగ్య కార్యాలయం, కాకినాడ జిల్లా ఆరోగ్య సమితి ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పట్టణ ఆరోగ్య కేంద్రాలు (యూపీహెచ్‌సీ)లో తాత్కాలిక ప్రాతిపదికన రూరల్ అర్బన్ ఆశా వర్కర్ల నియామకానికి నోటిఫికేషన్ విడుదలైంది. మొత్తం పోస్టుల సంఖ్య 42. అర్హులైన అభ్యర్థులు 2025, జులై 7 నుంచి 9 వరకు ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

దరఖాస్తు చేశారా..?

కింది ఉద్యోగాలకు నేడే (జులై 5) చివరి తేదీ

▮ ఎయిమ్స్ గువాహటిలో 64 ఫ్యాకల్టీ పోస్టులు. ఎంబీబీఎస్, డీఎన్‌బీ, ఎంఎస్/ఎండీ, ఎంసీహెచ్, డీఎం ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.

▮ పార్వతీపురం మన్యం జిల్లాలో 34 ఆశా వర్కర్ పోస్టులు. పదో తరగతి ఉత్తీర్ణులు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Probability

1. There are 5 hotels in a city. If 3 tourists check into hotels randomly on the same day, what is the probability that each tourist checks into a different hotel?

A) $\frac{12}{25}$ B) $\frac{25}{12}$ C) $\frac{90}{125}$ D) $\frac{100}{125}$

2. Person A speaks the truth in 70% of the cases and person B speaks the truth in 75% of the cases. What is the percentage of cases in which they are likely to contradict each other in stating a fact?

A) 37.5% B) 35%
C) 33.25% D) 40%

3. Tickets numbered 1 to 50 are mixed up and one ticket is drawn at random. What is the probability that the number on the drawn ticket is a multiple of 5 or 7?

A) $\frac{17}{50}$ B) $\frac{16}{50}$ C) $\frac{19}{50}$ D) $\frac{20}{50}$

4. A bag contains 7 red, 5 green, and 8 blue balls. Two balls are drawn at random. What is the probability that none of the balls drawn is blue?

A) $\frac{10}{57}$ B) $\frac{15}{57}$ C) $\frac{33}{95}$ D) $\frac{28}{95}$

5. Two cards are drawn together from a standard pack of 52 cards. What is the probability that one card is a diamond and the other is a club?

A) $\frac{13}{102}$ B) $\frac{26}{221}$ C) $\frac{13}{204}$ D) $\frac{13}{51}$

6. A problem is given to three students: Arun, Bina, and Chetan. Their chances of solving the problem are $\frac{2}{5}$, $\frac{1}{4}$, and $\frac{3}{5}$ respectively. What is the probability that the problem will be solved?

A) $\frac{41}{50}$ B) $\frac{49}{80}$ C) $\frac{31}{40}$ D) $\frac{59}{90}$

7. In a class, 40% of the students opted for Maths, 35% opted for Biology, and 15% opted for both. If a student is selected at random, what is the probability that the student opted for either Maths or Biology?

A) 60% B) 70%
C) 65% D) 75%

8. Two friends Amit and Sumit appeared for an exam. The probability of selection of Amit is $\frac{2}{5}$ and that of Sumit is $\frac{3}{7}$. What is the probability that both are selected?

A) $\frac{5}{14}$ B) $\frac{6}{35}$ C) $\frac{1}{3}$ D) $\frac{2}{7}$

Railway Exams

Mathematics

9. A basket contains 5 blue, 3 red, 6 green, and 4 yellow balls. If 2 balls are picked at random, what is the probability that either both are red or both are yellow?

A) $\frac{1}{33}$ B) $\frac{2}{55}$ C) $\frac{3}{55}$ D) $\frac{1}{17}$

10. When two dice are thrown simultaneously, what is the probability that the sum of the two numbers is greater than 9?

A) $\frac{5}{18}$ B) $\frac{7}{18}$ C) $\frac{1}{6}$ D) $\frac{11}{36}$

11. Riya rolls three fair six-faced dice in a game. To win, she must get a total of 16 or more on the three dice. What is the probability that Riya wins the game?

A) $\frac{3}{54}$ B) $\frac{5}{108}$ C) $\frac{5}{216}$ D) $\frac{10}{216}$

12. Person X speaks the truth in 70% of the cases and person Y in 60% of the cases. What is the percentage of cases in which they are likely to contradict each other, while narrating the same incident?

A) 42% B) 30% C) 52% D) 46%

13. A single letter is selected at random from the word "EXAMINATION". What is the probability that the chosen letter is a vowel?

A) $\frac{4}{11}$ B) $\frac{5}{11}$ C) $\frac{6}{11}$ D) $\frac{7}{11}$

14. A bag contains 5 blue balls, 7 yellow balls, and some white balls. If the probability of drawing a blue ball is $\frac{5}{22}$ and that of drawing a yellow ball is $\frac{7}{22}$, then find the number of white balls in the bag.

A) 10 B) 12 C) 15 D) 18

15. A committee of 4 students is to be selected at random from a group of 4 boys, 3 girls, and 5 juniors. What is the probability that exactly two of them will be juniors?

A) $\frac{18}{33}$ B) $\frac{17}{33}$
C) $\frac{14}{33}$ D) $\frac{21}{33}$

Scan the QR code for Key

These model questions were prepared by subject experts

ఇల్లే లేదు.. 33 ఎకరాలున్నట్లు నమోదు చేశారు

హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌లో తప్పిదంపై బాధితురాలి ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: తనకు ఉండడానికి ఇల్లు లేకపోయినా, వైకాపా ప్రభుత్వంలో చేపట్టిన హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌లో 33 ఎకరాల భూమి ఉన్నట్లు తప్పుగా నమోదు చేశారని ఎన్టీఆర్ జిల్లా బాపులపాడు మండలానికి చెందిన సాదరబోయిన నాగలక్ష్మి వాపోయారు. దీన్ని సరిదిద్ది.. తల్లికి వందనం నిధులు జమయ్యేలా చూడాలని కోరుతూ మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఫిర్యాదు చేశారు. వివిధ సమస్యలతో వచ్చిన బాధితుల నుంచి తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. పలు సమస్యలపై అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కారం దిశగా చర్యలు తీసుకున్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే తమ గ్రామాలు ముంపునకు గురవుతాయని, సర్వే చేయించి పరిహారం ఇప్పించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలంలోని రెండు గ్రామాల వారు అభ్యర్థించారు.

పది అసెంబ్లీ నియోజకవర్గాలకు కాంగ్రెస్ సమన్వయకర్తల నియామకం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో పది అసెంబ్లీ నియోజకవర్గాలకు పార్టీ సమన్వయకర్తలను నియమిస్తూ ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల శుక్రవారం నిర్ణయం తీసుకున్నారు. సకే శంకర్(సింగరాయకొండ), సీకే కార్తికేయన్(నగరి), జి.ప్రతాప్‌రెడ్డి(రాయదుర్గం), సనమునేటి శ్రీనివాసరావు(విజయనగరం), కె.వెంకట సూర్యనారాయణ(విశాఖపట్నం), మేడవరపు భద్రరావు(నిడదవోలు), మన్నం రాజశేఖర్(గుడివాడ), పలపర్తి విజేష్‌రాజు(యర్రగొండపాలెం), పి.ప్రభాకర్(పూతలపట్టు), పసుమర్తి సుధాకర్(సంతనూతలపాడు)ను సమన్వయకర్తలుగా నియమించినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బీసీ, ఓసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో అన్యాయం

ఏపీ సచివాలయ బీసీ, ఓసీ ఉద్యోగుల సంఘం డిమాండ్

ఈనాడు, అమరావతి: సచివాలయంలో పనిచేసే బీసీ, ఓసీ, మైనారిటీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్ నిబంధనల అమలుపై హైకోర్టు ఆదేశాలను ప్రభుత్వం అమలు చేయాలని ఏపీ సచివాలయ బీసీ, ఓసీ ఉద్యోగుల సంఘం శుక్రవారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. న్యాయస్థానం 2018లో ఇచ్చిన ఆదేశాలను తెలంగాణ ప్రభుత్వం మూడేళ్ల కిందటి నుంచే అమలు చేస్తుంటే.. ఏపీ ప్రభుత్వం ఇప్పటికీ అమలు చేయడం లేదని సంఘం అధ్యక్షుడు అప్పారావు ఆరోపించారు. “2014 నుంచి కల్పించిన పదోన్నతులపై ప్రభుత్వం నియమించిన సలహా.. అధికారుల కమిటీలు గణాంకాలతో నివేదికను ప్రభుత్వానికి ఇచ్చాయి. ఆ నివేదికలను ప్రభుత్వం అమలు చేయకపోగా గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్‌తో మరో కమిటీ ఏర్పాటు చేశామని.. మరో 6 నెలల వ్యవధి కావాలని కోర్టును అడగడం కాలయాపన చేయడమే అవుతుంది. ఆ నిర్ణయం 80 శాతం మంది ఉన్న బీసీ, ఓసీ ఉద్యోగులను ఆవేదనకు గురిచేస్తోంది. ఈ వ్యవహారంపై నిరసన తెలపకముందే ప్రభుత్వం పదోన్నతులపై సమీక్షించి బీసీ, ఓసీ ఉద్యోగులకు న్యాయం చేయాలి” అని కోరారు.

రామోజీరావు, ఎన్టీఆర్‌లు యుగకర్తలు

- తానా మహాసభల్లో సాహితీవేత్త యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్



తానా సభలో పాల్గొన్న యార్లగడ్డ, మురళీమోహన్, గంగాధరశాస్త్రి, రఘురామకృష్ణరాజు తదితరులు

ఈనాడు, అమరావతి: రామోజీ గ్రూప్ సంస్థల వ్యవస్థాపక ఛైర్మన్ రామోజీరావు, తెదేపా వ్యవస్థాపకుడు, మాజీ సీఎం ఎన్టీఆర్‌లు యుగకర్తలని, వాళ్లు మధ్య తరగతి రైతు కుటుంబాల్లో పుట్టి, ఉన్నత స్థానాలకు ఎదిగారని ప్రముఖ సాహితీవేత్త యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ప్రస్తుతించారు. అమెరికాలోని డెట్రాయిట్‌లో జరిగిన ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) మహాసభల్లో ఆయన మాట్లాడుతూ.. ‘కృషి ఉంటే మనుషులు రుషులవుతారు.. మహా పురుషులవుతారు అనే నానుడిని నిజం చేసిన వ్యక్తులు వారు. కీర్తి, యశస్సును సాధించిన వారికి మరణం లేదు. అలాంటి మహనీయులే రామోజీరావు, ఎన్టీఆర్’ అని పేర్కొన్నారు. ‘వార్తాపత్రిక అంటే వార్తలు ఇవ్వడమే కాదు, సమాజంలోని సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకువచ్చి, వాటి పరిష్కారానికి మార్గం చూపించేది అని రామోజీరావు రుజువు చేశారు. 1981-82 సంవత్సరాల్లో ఉమ్మడి రాష్ట్రంలో ప్రతిపక్షం లేకుండా పోయిన సమయంలో ‘ఈనాడు’ ప్రతిపక్ష పాత్ర పోషిస్తుందని రామోజీరావు చెప్పారు. ప్రజా సమస్యలపై, నాటి కంటక ప్రభుత్వాలపై ధైర్యంగా, క్రమశిక్షణతో, పట్టుదలతో పోరాడిన ధీరోదాత్తుడు రామోజీరావు” అని తెలిపారు.

విపత్తుల వేళ ఆదుకున్నారు

“రామోజీరావు అనేక దానాలు, సేవా కార్యక్రమాలు చేశారు. దివిసీమ తుపాన్ వచ్చినప్పుడు ఇళ్లు కట్టించారు. ఒడిశా, కేరళ, ఏపీల్లో వరదల్లో నిరాశ్రయులైన వారికి పక్కా గృహాలు నిర్మించి ఇచ్చారు. గుజరాత్‌లో భూకంప బాధితులకు అండగా నిలిచారు. రామోజీరావు ఏది చేపట్టినా సంచలనమే. మొదటగా జిల్లా ఎడిషన్లు తీసుకొచ్చారు. గ్రామాల్లో ఏం జరుగుతుందో తెలియజేసి, అవినీతిపరులైన అధికారులు, రాజకీయ నేతలను నిలదీసిన ఏకైక పత్రిక ‘ఈనాడు’. చలనచిత్ర నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టి, సినిమాల ద్వారా ప్రజల్లో చైతన్యాన్ని తీసుకొచ్చారు. రామోజీరావు తానా సభలకు వచ్చినప్పుడు నేనూ పాల్గొన్నాను. రామోజీరావు తల్లి చనిపోయినప్పుడు. పత్రికలో పనిచేసే వారు ఆయన తల్లి ఫొటో వేసి, మరణం వార్త వేస్తామంటే.. రూ.2 పెట్టి పేపర్ కొనేవారికి రామోజీరావు తల్లి మరణం.. వార్త ఎలా అవుతుంది, కావాలంటే ప్రకటన వేసుకోండి. వార్త వేయడానికి వీల్లేదని అన్నారు. ఈ రోజుల్లో అలా ఎవరు చెప్పగలరు?” అని యార్లగడ్డ వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో ఏపీ శాసనసభ ఉపసభాపతి రఘురామకృష్ణరాజు, ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, వసంత కృష్ణప్రసాద్, పితాని సత్యనారాయణ, తంగిరాల సౌమ్య, చదలవాడ అరవిందబాబు, సినీ నటుడు మురళీమోహన్, గాయకుడు గంగాధరశాస్త్రి, తానా ప్రతినిధులు నాదెండ్ల గంగాధర్, ఉదయ్, కోమటి జయరాం తదితరులు పాల్గొన్నారు.

‘ఎపెక్స్ కౌన్సిల్’ సమావేశం ప్రతిపాదన ఉందా?

- గోదావరి బోర్డు అధికారులకు జలశక్తి అదనపు కార్యదర్శి సుబోధ్ ప్రశ్న
- రాష్ట్రాలతో సఖ్యతగా ఉండాలని సూచన

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రాల ప్రాజెక్టులకు తుది అనుమతులు ఇవ్వాల్సిన ఎపెక్స్ కౌన్సిల్ సమావేశానికి సంబంధించిన ప్రతిపాదనలు ఏమైనా ఉన్నాయా అని గోదావరి బోర్డు అధికారులను జలశక్తి శాఖ అదనపు కార్యదర్శి సుబోధ్ యాదవ్ ప్రశ్నించినట్లు తెలిసింది. ప్రాజెక్టులకు సంబంధించిన సమాచారాన్ని కేంద్రానికి తెలియజేస్తూ బోర్డు నుంచి ప్రతిపాదన ఏమైనా చేశారా అంటూ ఆరా తీసినట్లు సమాచారం. బోర్డు పరిపాలన వ్యవహారాలపై సమీక్ష కోసం శుక్రవారం దిల్లీ నుంచి వచ్చిన ఆయన హైదరాబాద్‌లోని బోర్డు ప్రధాన కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుల నిర్వహణ తదితర కీలక అంశాలపై చర్చించారు. నదీ యాజమాన్య బోర్డుల పరిశీలన, సీడబ్ల్యూసీలోని టెక్నికల్ అప్రైజల్ కమిటీ(టీఏసీ) ఆమోదం తరువాత ప్రాజెక్టుల తుది అనుమతులను ఎపెక్స్ కౌన్సిల్ జారీ చేయాల్సి ఉంటుంది. రెండు రాష్ట్రాల సీఎంలు, కేంద్ర జలశక్తి మంత్రి సభ్యులుగా ఉండే ఈ కౌన్సిల్ సమావేశం చివరిసారిగా 2020లో జరిగింది. ఈ అంశాలన్నీ శుక్రవారంనాటి సమావేశంలో చర్చకు వచ్చినట్లు తెలిసింది. తెలంగాణలో మోడికుంటవాగు, సమ్మక్క సాగర్, సీతమ్మసాగర్, చనాఖా-కోర్టా, చిన్నకాళేశ్వరం, చౌట్‌పల్లి హనుమంత్‌రెడ్డి ప్రాజెక్టులు టీఏసీ అనుమతి పూర్తయి ఉన్నట్లు అధికారులు చెప్పినట్లు తెలుస్తోంది. అయితే ఎపెక్స్ కౌన్సిల్ సమావేశం నిర్వహణ అవసరమే కదా.. కేంద్ర ప్రభుత్వాన్ని ఎందుకు సంప్రదించలేదని సుబోధ్ అన్నట్లు సమాచారం.

నిధులు.. పనితీరుపై చర్చ

బోర్డుకు బడ్జెట్ కొరత ఉందని సమావేశంలో చర్చకు రాగా.. అసలు బోర్డుకు పనిలేనట్లు కనిపిస్తోంది కదా అని సుబోధ్ పేర్కొన్నట్లు తెలిసింది. రాష్ట్రాల ప్రాజెక్టులకు సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ల పరిశీలన ఉంటోందని అధికారులు సమాధానమిచ్చినట్లు సమాచారం. గోదావరిపై ఉన్న ప్రాజెక్టుల అప్పగింత ఎందుకు పూర్తికావడం లేదని ఆయన ప్రశ్నించగా తెలంగాణ అప్పగిస్తేనే తాము ముందుకొస్తామని ఏపీ చెబుతోందని అధికారులు పేర్కొన్నట్లు తెలిసింది. ఒక్క పెద్దవాగు ప్రాజెక్టు ఒక్కటే బోర్డుకు అప్పగించడానికి రెండు రాష్ట్రాలు సముఖత వ్యక్తం చేశాయని, ఆ ప్రాజెక్టుకు ఆధునికీకరణ పనులు చేపట్టాల్సి ఉందని, బడ్జెట్ సమస్యలు ఉన్నాయని అధికారులు జవాబిచ్చినట్లు తెలిసింది. తెలంగాణ ఆ ప్రాజెక్టును పునరుద్ధరిస్తామని చెబుతోందని, ఏపీ కూడా నిధులిచ్చేందుకు సిద్ధమే అంటున్నా పనులు మాత్రం ముందుకు కదలడం లేదని వారు వివరణ ఇచ్చినట్లు సమాచారం. రాష్ట్రాలు బోర్డుకు నిధులు విడుదల చేయడంలో జరుగుతున్న జాప్యానికి కారణమేంటని సుబోధ్ ఆరా తీసినట్లు తెలిసింది. బోర్డును రాష్ట్రాలు ప్రాధాన్య దృష్టితో చూడటం లేదనిపిస్తోందంటూ కొందరు అధికారులు చెప్పినట్లు సమాచారం. రాష్ట్రాలతో సఖ్యతగా మెలిగితే.. సమస్యలనేవి ఉండవంటూ ఆయన పేర్కొన్నట్లు తెలిసింది. బోర్డుకు సంబంధించిన అన్ని సమస్యలు, ఇతర అంశాలపై కేంద్రానికి నివేదిక పంపాలని సుబోధ్ సూచించారు. బోర్డు ఛైర్మన్ ప్రధాన్ తదితరులు స్పందిస్తూ.. అన్ని అంశాలపై త్వరలోనే నివేదిక పంపుతామని, ఎపెక్స్ కౌన్సిల్ సమావేశానికి అవసరమైన సమాచారం అందజేస్తామని పేర్కొన్నట్లు సమాచారం.

నీతి ఆయోగ్‌తో సమన్వయానికి స్టీరింగ్ కమిటీ

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని విద్యుత్తు సంస్థల్లో చేపట్టిన పనుల పురోగతి, వాటికి సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు నీతి ఆయోగ్‌కు తెలిపేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఛైర్మన్‌గా తొమ్మిది మంది సభ్యులతో స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విద్యుత్తు సరఫరా, అభివృద్ధి పనులను సమీక్షించేందుకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నీతి ఆయోగ్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, రోడ్లు, భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి, ఏపీ ట్రాన్స్‌కో సీఎండీ, మూడు డిస్కంల సీఎండీలు, జెన్‌కో ఎండీ, నెడ్‌క్యాప్ వీసీఎండీ స్టీరింగ్ కమిటీలో సభ్యులుగా, ఏపీ పవర్ కో-ఆర్డినేషన్ కమిటీ (ఏపీపీసీసీ) నుంచి మెంబర్ కన్వీనర్‌ను ప్రభుత్వం నియమించింది. ఏపీపీసీసీ మెంబర్ కన్వీనర్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని ఉత్తర్వుల్లో పేర్కొంది.

పింగళి వెంకయ్య సేవలను స్మరించుకుందాం: చంద్రబాబు

ఈనాడు, అమరావతి: దేశ ఆత్మగౌరవ ప్రతీక అయిన జాతీయ పతాకాన్ని రూపొందించిన గొప్ప దేశభక్తుడు పింగళి వెంకయ్య అని ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. పింగళి వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఎక్స్ వేదికగా నివాళి అర్పించారు. ఆ మహానుభావుని నిస్వార్థ సేవలను స్మరించుకోవాలని పిలుపునిచ్చారు.

- ‘గుండెల నిండా దేశభక్తిని నింపుకొని, జాతీయ జెండాను రూపొందించిన మన ఆంధ్రుడు పింగళి వెంకయ్య. ఆ మహనీయుని వర్ధంతి సందర్భంగా నివాళులు’ అని మాజీ సీఎం జగన్ ‘ఎక్స్’లో పోస్ట్ చేశారు.



అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ఎదురించిన వీరుడు: మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: ‘మన్యంలో పోరాటవీరుల్ని తీర్చిదిద్ది.. బ్రిటిష్ సామ్రాజ్యానికి ఎదురొడ్డి నిలిచిన అల్లూరి జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం’ అని మంత్రి నారా లోకేశ్ కొనియాడారు. ఉండవల్లిలోని తన నివాసంలో అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అల్లూరి జయంతిని మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సహా పలువురు నేతలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అల్లూరి స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

అల్లూరి పేరుతో జిల్లా ఏర్పాటు: జగన్

‘బ్రిటిష్ పాలనను ఎదిరించి, స్వరాజ్య సాధనలో ప్రాణాలు సైతం పణంగా పెట్టి పోరాడిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు. ఆ గొప్ప యోధుడిని గుర్తుంచుకునేలా ఆయన పేరుతో అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లాను ఏర్పాటు చేశాం’ అని మాజీ సీఎం జగన్ ‘ఎక్స్’లో పోస్ట్ చేశారు.

భారతీయ సంస్కృతిని ప్రపంచానికి చాటిన మహనీయుడు స్వామి వివేకానంద: చంద్రబాబు

ఈనాడు, అమరావతి: భారత సంస్కృతి, ఆధ్యాత్మిక విశిష్టతను ప్రపంచానికి చాటడంతో పాటు యువతను కార్యశూరులుగా తయారుచేసే స్ఫూర్తిదాయక బోధనల్ని స్వామి వివేకానంద అందించారని ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. వివేకానంద వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఎక్స్ వేదికగా ఆయనకు నివాళి అర్పించారు. ప్రతి నిమిషాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఎంతైనా సాధించగలమని వివేకానంద చరిత్ర చెబుతోందని చంద్రబాబు పేర్కొన్నారు.

- ‘వివిధ సూక్తులు, స్ఫూర్తిదాయక ప్రసంగాలతో యువతను చైతన్యపరచిన మహోన్నత వ్యక్తి స్వామి వివేకానంద. ఆ మహనీయుని వర్ధంతి సందర్భంగా నివాళులు’ అని మాజీ సీఎం జగన్ ‘ఎక్స్’లో పోస్ట్ చేశారు.

కొణిజేటి రోశయ్యకు చంద్రబాబు, జగన్ నివాళులు

ఈనాడు, అమరావతి: ఆదర్శవంతమైన, నిజాయతీ గల రాజకీయాలకు ప్రతీక ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి రోశయ్య అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. రోశయ్య జయంతి సందర్భంగా శుక్రవారం ఎక్స్ వేదికగా నివాళి అర్పించారు. నేటితరం నేతలు ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

- ‘ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, సుదీర్ఘకాలం ఆర్థికశాఖ మంత్రిగా కొణిజేటి రోశయ్య అందించిన సేవలు చిరస్మరణీయం. ఆయన జయంతి సందర్భంగా నివాళులు’ అని మాజీ సీఎం జగన్ ఎక్స్‌లో పోస్టు చేశారు.

ఆపరేషన్ సిందూర్ మా నిబద్ధతకు నిదర్శనం

- కేంద్ర హోం మంత్రి అమిత్‌షా



పుణెలోని ఎన్‌డీఏలో బాజీరావ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న అమిత్ షా. చిత్రంలో ఫడణవీస్, ఏక్‌నాథ్ శిందే, అజిత్ పవార్ తదితరులు

పుణె: దేశ సార్వభౌమాధికార రక్షణలో ప్రభుత్వం, సాయుధ దళాలు ఎంత నిబద్ధతతో ఉన్నాయో చెప్పేందుకు ఆపరేషన్ సిందూర్ అద్భుతమైన ఉదాహరణ అని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అభివర్ణించారు. శుక్రవారం మహారాష్ట్రలోని పుణెలో నేషనల్ డిఫెన్స్ అకాడమీ(ఎన్‌డీఏ)లో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మరాఠా రాజనీతిజ్ఞుడు, జనరల్ పీష్వా బాజీరావ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో అమిత్ షా మాట్లాడుతూ “పీష్వా బాజీరావు స్మారకానికి ఎన్‌డీఏనే అత్యంత అనువైన ప్రదేశం. ఇక్కడే మన సైనిక నాయకత్వం శిక్షణ పొందుతోంది. మన స్వాతంత్ర్య సంగ్రామం శివాజీ మహారాజ్ నుంచే మొదలైంది. పీష్వాలు దానిని మరో వందేళ్లు ముందుకు తీసుకెళ్లారు. ఇదే జరగకపోతే భారత దేశ ప్రాథమిక నిర్మాణం నిలిచిపోయేది” అని పేర్కొన్నారు. పుణె పర్యటనలో భాగంగా అమిత్ షా జైరాజ్ స్పోర్ట్స్ అండ్ కన్వెన్షన్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్, ఉపముఖ్యమంత్రులు ఏక్‌నాథ్ శిందే, అజిత్ పవార్ తదితరులు పాల్గొన్నారు.

విరామాన్ని ఆస్వాదించిన శుభాంశు!

- కుటుంబ సభ్యులు, స్నేహితులతో ముచ్చట్లు

దిల్లీ: యాక్సియం-4లో భాగంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాని (ఐఎస్ఎస్)కి వెళ్లిన భారత వ్యోమగామి శుభాంశు శుక్లా.. రోదసిలో ఒక వారం పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా ఒక రోజు విరామాన్ని తీసుకున్నారు. తాను తీసుకెళ్లిన భారత వంటకాలు.. మామిడి రసం, క్యారెట్ హల్వా, పెసరపప్పు హల్వాలను సహచర వ్యోమగాములతో పంచుకున్నారు. ఇతర దేశాల రుచులను ఆస్వాదించారు. భూమిపై ఉన్న తన కుటుంబసభ్యులు, మిత్రులతో మాట్లాడారు. అలాగే బెంగళూరులోని యు.ఆర్.రావు ఉపగ్రహ కేంద్రంలోని శాస్త్రవేత్తలతో హామ్ రేడియో కనెక్షన్ ద్వారా కొద్దిసేపు మాట్లాడారు. భిన్న దేశాల వారితో కలిసి పనిచేయడం, వారితో ఆహారాన్ని ఆస్వాదించడం అద్భుతంగా ఉందన్నారు. ఐఎస్ఎస్ నుంచి భూమిని వీక్షించడం గొప్ప అనుభూతి అని ఆయన పేర్కొన్నారు. మరోవైపు రోదసిలో సుదీర్ఘకాలం గడిపిన భారత వ్యోమగామిగా కూడా శుక్లా గురువారం చరిత్ర సృష్టించారు. 1984లో రాకేశ్ శర్మ సాధించిన 7 రోజులు, 21 గంటలు, 40 నిమిషాల రికార్డును ఆయన అధిగమించారు.

పరిశోధనలు..

యాక్సియం-4 కమాండర్ పెగ్గీ విట్సన్, పైలట్ శుభాంశు శుక్లా, మిషన్ స్పెషలిస్టులు స్లావోస్జ్ ఉజ్నాన్స్‌కీ విస్నియెస్కీ, టిబర్ కపులు 7 రోజుల్లోనే అనేక శాస్త్రీయ పరిశోధనలు చేశారని యాక్సియం స్పేస్ సంస్థ పేర్కొంది.



ఆదివారం వచ్చే శయన ఏకాదశి(ఆషాఢ ఏకాదశి) పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం ముంబయిలో చిన్నారులు నిర్వహించిన దిండీ శోభాయాత్ర

ఉక్రెయిన్‌పై అతిపెద్ద వైమానిక దాడి

- 550 డ్రోన్లు, 11 క్షిపణులు ప్రయోగించిన రష్యా
- దెబ్బతిన్న పోలండ్ దౌత్య కార్యాలయం




రష్యా జరిపిన దాడిలో కీవ్‌లో అలముకున్న పొగ

మాస్కో: ఉక్రెయిన్‌లోని కీవ్ సహా 13 ప్రదేశాలు లక్ష్యంగా భారీగా క్షిపణులు, డ్రోన్లతో శుక్రవారం రష్యా అతిపెద్ద వైమానిక దాడి చేసింది. ఈ దాడిలో 23 మంది గాయపడ్డారు. తాజా దాడుల్లో కీవ్‌లోని పోలండ్ దౌత్య కార్యాలయం దెబ్బతిన్నట్లు ఉక్రెయిన్ వెల్లడించింది. పలు నివాస భవనాలు సైతం ధ్వంసమైనట్లు తెలిపింది. రష్యా 11 క్షిపణులను, 550 డ్రోన్లను తమపై ప్రయోగించిందని ఉక్రెయిన్ పేర్కొంది. వీటిలో 270 డ్రోన్లను, 2 క్షిపణులను కూల్చివేసినట్లు వెల్లడించింది.

నిషేధిత రసాయన ఆయుధాలతో దాడి

ఉక్రెయిన్‌పై రష్యా నిషేధిత రసాయన ఆయుధాలను ప్రయోగించినట్లు నెదర్లాండ్స్ ఇంటెలిజెన్స్ అండ్ సెక్యూరిటీ సర్వీసెస్ వెల్లడించింది. కీవ్ సైనికులను ఉక్కిరిబిక్కిరి చేసి చంపేందుకు మాస్కో వీటిని ఉపయోగిస్తోందని డచ్ రక్షణ మంత్రి రూబెన్ బ్రెకెల్‌మాన్స్ పేర్కొన్నారు. ఈ రసాయన ఆయుధాల కారణంగా ఉక్రెయిన్‌లో ముగ్గురు మరణించారని, దాదాపు 2,500 మంది గాయపడ్డారని ఆ దేశ ఆరోగ్యశాఖ అధికారుల నివేదిక తెలిపిందన్నారు. రష్యా ఈ రసాయన ఆయుధాలను విపరీతంగా ఉపయోగించడం ఇతర దేశాలకు హానికరమేనని చెప్పారు. ఈ క్రమంలో ఆ దేశంపై పలు ఆంక్షలు విధించాలన్నారు. దీనిపై రష్యా రక్షణ మంత్రిత్వశాఖ స్పందిస్తూ.. తాము ఎలాంటి రసాయన ఆయుధాలను ఉపయోగించలేదని స్పష్టంచేసింది.

యుద్ధం ఆపే ప్రసక్తే లేదు: పుతిన్



ఉక్రెయిన్‌తో యుద్ధం ఆపే ప్రసక్తే లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు రష్యా అధ్యక్షుడు పుతిన్ స్పష్టంచేశారు. గురువారం ట్రంప్‌తో గంట సేపు ఫోన్‌లో మాట్లాడిన పుతిన్ కాల్పుల విరమణకు రష్యా సిద్ధంగా లేదని తేల్చిచెప్పారు. క్రెమ్లిన్ ప్రతినిధి యూరీ ఉష్కోవ్ శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. “ఇరువురు నాయకులు యుద్ధం గురించి చర్చించుకున్నారు. తక్షణమే కాల్పుల విరమణ చేపట్టాలని ట్రంప్ సూచించినా, పుతిన్ తిరస్కరించారు” అని ఉష్కోవ్ తెలిపారు. మరోవైపు.. పుతిన్‌తో జరిగిన ఫోన్ సంభాషణపై ట్రంప్ నిరాశ వ్యక్తంచేశారు. “ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని పుతిన్ ఆపేలా లేరు. ఈ విషయంలో ఆయన పట్ల నేను తీవ్ర నిరాశ చెందాను” అని ట్రంప్ పేర్కొన్నారు.

వికలాంగుల సేవలో ‘దివ్య’ధామం



ఈటీవీ భారత్: అస్సాంలోని ఓ కుటుంబం దివ్యాంగులకు శాశ్వత ఆశ్రయం, వృత్తి శిక్షణ అందించడానికి తమ పూర్వీకుల నాటి రెండంతస్తుల ఇంటిని ‘దివ్య’ధామంగా మార్చేసింది. దిబ్రూగఢ్‌లోని ఖోవాంగ్ అథబారీలో గల ఈ ఇంట్లో సైలెన్ సైకియా, జోనారాణి ప్రశాంత జీవితాన్ని గడిపేవారు. ఈ దంపతులకు శారీరక వైకల్యంతో ఇద్దరు పిల్లలు పుట్టారు. కాలక్రమంలో తల్లిదండ్రులు మరణించాక వారిని చూసుకోడానికి ఎవరూ లేకుండా పోయారు. మొదట ఏదైనా ఆశ్రమంలో చేర్చుదామని బంధువులు భావించారు. ఆ తర్వాత మరోచోటుకు పంపడం ఎందుకని అదే ఇంటిని దివ్యాంగ వసతి భవనంలా మార్చేశారు. ‘ప్రేరణ ప్రతిబంధి’ అనే స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఇప్పుడు ఆ ఇల్లు ‘జీవన్ జోనా దివ్యాంగ్ పునర్ సంస్థాపన్ అరు ఉత్పాదన్ ప్రతిష్ఠాన్’గా మారిపోయింది. ఇందులో అస్సాంలోని ఏ ప్రాంత దివ్యాంగులైనా వచ్చి ఉండవచ్చు. ఉచిత ఆహారం, వైద్యం, వృత్తి శిక్షణ అందిస్తున్నారు.

హిమగిరుల్లో ‘రెడ్ స్ప్రైట్స్’



ఇంటర్నెట్ డెస్క్: హిమాలయాల్లో దక్షిణ టిబెట్ వద్ద ప్యూమోయాంగ్‌చు సరస్సు సమీపంలో గత మే నెల 19వ తేదీ రాత్రి విచిత్రమైన కాంతిరేఖలు దర్శనమిచ్చాయి. దాదాపు 105 ఎత్తైన దీపస్తంభాల్లా ఈ రేఖలు కనిపించాయి. వీటిని కొందరు ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లు తమ కెమెరాల్లో బంధించారు. ఈ చిత్రాలను ‘స్ప్రింగ్ నేచర్’ పత్రిక ప్రచురించింది. ఎత్తైన ప్రదేశాల్లో వచ్చే ఈ మెరుపులను ‘రెడ్ స్ప్రైట్స్’ అంటారు. వైరల్ అయిన ఈ చిత్రాలు దక్షిణాసియాలో వచ్చిన తుపాన్లలో అత్యధికంగా రెడ్ స్ప్రైట్స్ కనిపించిన ఘటనకు చెందినవిగా చైనాలోని యూనివర్సిటీ ఆఫ్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ పరిశోధకులు తేల్చారు. రెడ్ స్ప్రైట్స్ భూమికి దాదాపు 40 నుంచి 50 మైళ్ల ఎత్తులో ఏర్పడతాయి. ఇవి సాధారణ మెరుపుల్లా కాకుండా జెల్లీఫిష్ ఆకృతిలో ఎరుపు రంగులో తళుక్కున మెరుస్తాయి. కొన్నిసార్లు నీలిరంగులో దర్శనమిస్తాయి. మే 19వ తేదీ రాత్రి చైనాకు చెందిన ఆస్ట్రో ఫొటోగ్రాఫర్లు ఏంజెల్ యాన్, సుచాంగ్ డాంగ్ 105 రెడ్ స్ప్రైట్స్‌ను తమ కెమెరాల్లో బంధించారు. వీటితోపాటు ఘోస్ట్ స్పిరిట్స్‌గా అభివర్ణించే నాలుగు విచిత్రమైన ఆకుపచ్చ రంగు కాంతులను కూడా బంధించారు.

★ మేఘంపై నుంచి బలమైన మెరుపులు నేలను తాకినప్పుడు రెడ్ స్ప్రైట్స్ ఏర్పడతాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. గంగా పరీవాహక మైదాన ప్రాంతాల నుంచి టిబెట్ పీఠభూమి వరకు వ్యాపించిన 2,00,000 చదరపు కిలోమీటర్ల మేర భూభాగంలో పుట్టుకొచ్చే మెసోస్కేల్ కన్వెక్టివ్ కాంప్లెక్స్‌గా వ్యవహరించే తుపాన్లలో ఇలాంటివి కనిపిస్తాయి. ఈ రెడ్ స్ప్రైట్స్‌లో అత్యధికంగా +50 కిలో ఆంపియర్స్ విద్యుత్తు ప్రవహిస్తుంది. హిమాలయాల్లో వచ్చే తుపాన్లు కూడా ప్రపంచంలో అత్యంత సంక్లిష్టమైన ఎగువ వాతావరణ మెరుపులను సృష్టించగలవని ఈ పరిశోధన తేల్చింది.

‘రోజూ రూ.1.25 లక్షల ఆదాయం’

ఆ వీడియో నిజం కాదు: కేంద్రం

దిల్లీ: పెట్టుబడి పథకం పేరుతో సైబర్ నేరగాళ్లు కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నారు. అచ్చంగా ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతున్నట్లుగా డీప్‌ఫేక్ వీడియోలను సృష్టించి అమాయకులను దోచుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. సదరు వీడియో కింద ఇచ్చిన లింక్‌పై క్లిక్ చేయాలని పేర్కొంటూ మోసాలకు పాల్పడుతున్నారు. దీంతో ఈ తరహా వీడియోలపై కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. కేవలం రూ.21 వేలు పెట్టుబడి పెడితే ప్రతి రోజూ రూ.1.25 లక్షల ఆదాయం పొందేలా ఓ పథకాన్ని ప్రధాని మోదీ ప్రచారం చేస్తున్నట్లుగా ప్రసారం అవుతున్న వీడియోలు నకిలీవని కేంద్రం స్పష్టం చేసింది. ఈ మేరకు పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ విభాగం ‘ఎక్స్’లో పోస్టు పెట్టింది. ఇలాంటి పెట్టుబడి పథకమేదీ ప్రధాని మోదీ గానీ, కేంద్రం గానీ ప్రవేశపెట్టలేదని తెలిపింది. ఏ వేదికతోనూ వారికి సంబంధం లేదని తేల్చి చెప్పింది. ఈ తరహా డీప్‌ఫేక్ వీడియోల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

మమ్మల్ని మహాగఠ్‌బంధన్‌లో చేర్చుకోండి

ఆర్జేడీకి ఏఐఎంఐఎం లేఖ

పట్నా: బిహార్‌లో రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు ముందు మహాగఠ్‌బంధన్ కూటమిలో చేరేందుకు ఏఐఎంఐఎం సుముఖత వ్యక్తంచేసింది. ప్రస్తుతం మహాకూటమిలో ఆర్జేడీ, కాంగ్రెస్, వామపక్షాలున్నాయి. ఏఐఎంఐఎం రాష్ట్ర అధ్యక్షుడు, ఆ పార్టీకి ఉన్న ఏకైక ఎమ్మెల్యే అఖ్తరుల్ ఇమాన్ కూటమితో పొత్తు కోరుతూ ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్‌కి అధికారికంగా లేఖ రాశారు. ఏఐఎంఐఎంను చేర్చుకుంటే ఇండియా కూటమికి పడే ఓట్లలో చీలికను నివారించవచ్చని అన్నారు.

20 రోజుల తర్వాత.. టెహ్రాన్‌లో దిగిన తొలి విదేశీ విమానం

టెహ్రాన్: ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో అంతర్జాతీయ వైమానిక సేవలను నిలిపివేసిన ఇరాన్.. తాజాగా వాటిని పునరుద్ధరించింది. 20 రోజుల నిషేధం తర్వాత టెహ్రాన్‌లోని ఇమామ్ ఖొమేని అంతర్జాతీయ విమానాశ్రయంలో శుక్రవారం తొలిసారిగా విదేశీ విమానం దిగింది. ఈ మేరకు స్థానిక మీడియా వెల్లడించింది. అంతకు ముందు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) నుంచి ఫ్లైయింగ్ దుబాయ్ సంస్థకు చెందిన విమానం భారీ భద్రత నడుమ ల్యాండ్ అయినట్లు ఇరాన్ పౌర విమానయాన శాఖ వెల్లడించింది. ఇజ్రాయెల్‌తో ఇటీవల ఉద్రిక్తతలు చోటు చేసుకున్న నేపథ్యంలో తాజా పరిణామం.